ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2011 Q2 ఏప్రిల్ - జూన్ ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


**టిడిపిలో సంక్షోభం**
**పురంధరేశ్వరికి ఛాన్సుందా..?**
**సత్యసాయి దీనావస్థ-1-6**
**కడప బై ఎలక్షన్- 1-3**
**కిరణ్‌పై జీవకారుణ్యం - 1-4**
**ఇసుక స్మగ్లింగ్**
**జగన్నేం చేయాలి..?**
**క్యాఫ్ట్‌వాళ్లు ఏం చేయాలి? - 1-2**
**శభాష్ టిడిపి-1-3**
**కనొషేన్ టైమ్ 1-3**
**దుష్టశక్తి - 1-5**
**'నమస్తే తెలంగాణ' తీరు**
**జయపాల్ .. ఎందుకిలా?**
**ఇన్నాళ్లకు చదివారు, గోడమీద రాతని.**
**ఇసుక స్మగ్లింగూ, యితర స్పందనలూ...**
**సెగ తగిలిందా ? - 1-3**


**2011 ఏప్రిల్ 08** **ఎమ్బీయస్ : టిడిపిలో సంక్షోభం**

టిడిపిలో వచ్చిన సంక్షోభం 'టీ'డిపి కప్పులో తుఫాను కింద కొట్టిపారేశాయి పత్రికలు. నిజంగానే చంద్రబాబు చిటికెలో సమస్యను పరిష్కరించేశారు. వంశీమోహన్‌ను పిలిచి నాలుగు చివాట్లు పెట్టేసరికి ఆయన బహిరంగంగా క్షమాపణలు చెప్పి దేవినేని ఉమతో కలిసి పనిచేస్తానని హామీ యిచ్చేశారు.

ఇంత త్వరగా కథ ముగిసిపోతుందని హరికృష్ణ అనుకుని వుండరు. మా నాన్న స్థాపించిన పార్టీ కాబట్టి నందమూరి వంశం విధేయులు చాలామంది వుంటారని, వాళ్లు తమ వెంట నడిచి బాబుని అడలగొడతారని అనుకుని వుంటారు. పాపం అమాయకుడు! గాంధీగారి పేరును కాంగ్రెస్‌వాళ్లు వాడుకుంటారే తప్ప గాంధేయసిద్ధాంతాల ప్రకారం నడవరు, గాంధీగారి పిల్లల్ని నెత్తిన పెట్టుకోరు. అసలు వాళ్లెక్కడున్నారో కూడా ఎవరికీ తెలియదు.

ఇప్పుడు మన కళ్లముందు కదలాడే సోనియా గాంధీలు, రాహుల్ గాంధీలు - వీళ్లంతా పెట్టుడు గాంధీలు తప్ప, పుట్టు గాంధీలు కాదు. ఫిరోజ్ దారువాలా (దారువాలా అంటూ సారాయి అమ్మేవారని అర్థం) అనే పేరును మద్యం అంటేనే చిటపటలాడే గాంధీ భరించలేక ఆ 'దారువాలా తీసేసి మా యింటి పేరు పెట్టుకో నాయనా' అని ఫిరోజ్‌కి యిచ్చాడు. ఆయన సరేలే అన్నాడు. ఆ సంతానమే కాంగ్రెస్‌ను, తద్వారా మనల్ని ఏలుతోంది.

అదే విధంగా నారావారి కుటుంబమే నందమూరి పేరుమీద టిడిపిని, తద్వారా మనల్ని ఏలింది. ఏలాలని చూస్తోంది. మధ్యలో అసలైన నందమూరి కుటుంబం వారు వచ్చిపడితే ఎలా? టిడిపిలో నాయకులందరికీ ఎన్టీయార్ వాడుకోవడానికి పనికి వస్తాడు తప్ప అనుసరించడానికి కాదు. 'నా పార్టీ నాతోనే వచ్చింది, నాతోనే పోతుంది' అన్నాడాయన ఆశగా/అనుమానంగా/నిర్వేదంగా. 'పార్టీ వుంటుంది, తమరు పోవచ్చు' అన్నారు వాళ్లు.

'నేను నిలబెట్టిన దీపపు సెమ్మెలు వీరు' అనుకున్నాడాయన. వాళ్లు నిలిచారు, ఆయనే కొండెక్కిపోయాడు. ఆయన బతికుండగానే నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా వెలిగిన నెలలో ఇప్పుడు ఆ పార్టీలో వెలుగుతున్న మహిళామణులే తొడలు చరిచి పోట్లాటకు కవ్వించారు. వైస్రాయ్ టైము వచ్చేసరికి ఏకంగా చెప్పులే పడ్డాయి. ఆయన ఫోటో పెట్టుకుని గెలిచినవారు చచ్చిపోయేదాకా ఆయన

మొహం చూడలేదు. చచ్చాకా చూడలేదు – 2004 ఎన్నికలలో ఓడిపోయేదాకా!

మూలవిరాట్టు ముష్టెత్తుకుంటూ వుంటే ఉత్సవ విగ్రహాలు వచ్చి మా మాటేమిటి? అన్నాయట. ఆదిపురుషుడు అన్నగారికే బతికుండగానే దిక్కు లేకపోయింది. ఇప్పుడు వాళ్ల పుత్రరత్నాలకు, పౌత్రరత్నాలకు దివాణాలివ్వాలా? అదీ చంద్రబాబు మేధోశక్తితో సమకూర్చి పెట్టిన పార్టీ ఆస్తులు, ట్రస్టులు, కార్యకర్తలు.. అన్నీ! అమ్మ.. ఆశ అన్నారు టిడిపి నాయకులు. ఇప్పుడు ఉన్నతాసనాలలో వెలుగుతున్న వారందరూ 1995 బాబు కుట్రలో భాగస్వాములే కదా! బాబు హయాంలోనే నాలుగు రాళ్లు వెనకేసుకున్నవారు కదా! ఎన్టీయార్ ఏమైనా తిననిచ్చాడా? ఎన్నికల్లో నెగ్గి స్వంత డబ్బుతో ఊరేగితే పెద్ద గొడవ పెట్టేసేవాడు. 'అది కాంగ్రెస్ దుష్ట సంస్కృతి. మనకు హంగూ, ఆరాటేం కూడదు' అంటూ చేంతాడంత ఉపన్యాసాలు, ఉపదేశాలు.

బాబుగారిది ఆ టైపు కాదు. ఉదారవాది. రాజకీయాలు బాగా వంటపట్టించుకున్న మనిషి. మావగారు ఢిల్లీ గురించి కలలు కనే తరహా అయితే యీయన ప్రతి గ్రామంలోనూ తనవారంటూ మనుషుల్ని ఏర్పాటు చేసుకుని, కల్టివేట్ చేసుకునే మనిషి. అంతటి గ్రాస్‌రూట్ లెవెల్ నాయకుడు కాబట్టే ఎన్టీయార్‌ను మట్టి కరిపించగలిగాడు. మహా మహా ఎన్టీయారే బాబు దెబ్బకు గింగిరాలు తిరిగి ఇంట్లో కూర్చుని మళ్లీ జనంలోకి రాకుండా అట్నుంచి అటే వెళ్లిపోయాడు. ఇక వాళ్ల సంతానం అనగా ఎంత?

ఈ సంతానం అంటే టిడిపి నాయకులకే కాదు, మామూలు ప్రజలకే గౌరవం లేదు. వీళ్లేమైనా శ్రీరామ చంద్రుడి వంటి పిత ృవాక్య పరిపాలకులా? శ్రవణకుమారుడిలా తండ్రిని కావిడిలో పెట్టుకుని మోశారా? ఆ మాటకొస్తే ఆయనే మోశాడు వీళ్లందరినీ. తరతరాలపాటు కాలు మీద కాలు వేసుకుని, నోట్లో వేలు వేసుకుని కూర్చుని తిన్నా తరగనంత ఆస్తి కష్టపడి సంపాదించి యిచ్చాడు. దానికి బదులుగా వీళ్లేం చేశారు? వ ృద్ధాప్యంలో ఒంటరిని చేశారు. భార్యపోయి, ఒంటరిపక్షిగా వున్న తండ్రిని లక్ష్మీపార్వతి పాలు చేశారు. ఆవిడ అవకాశం దొరకబుచ్చుకుంది. దాంతో వీళ్లు మండిపడ్డారు. వదిలేయ్ అన్నారు. వదిలితే ఎన్టీయార్ ఎందుకవుతాడు? నా యిష్టం అన్నాడు.

అంతే వీళ్లు బావగారితో చేతులు కలిపారు. ఆయన యిస్తానన్న మంత్రి పదవికి ఆశపడ్డారు. చివరికి బాబు చేతిలో మోసపోయారు. పోనీ తండ్రిని చివరిదశలో వదిలిపెట్టామన్న పశ్చాత్తాపంతో అధికారం జోలికి పోకుండా తమ మానాన తాము వున్నారా? అబ్బే బాబు చూపించిన తాయిలాలకు ఆశపడి మళ్లీ ఆయన చెంతన చేరారు. ఇప్పుడు తాయిలం చాలలేదంటూ రచ్చకెక్కుతున్నారు. ఇటువంటివాళ్లమీద మామూలు ప్రజలకు గౌరవం ఏమైనా వుంటుందా? ఉండదని టిడిపి నాయకులకూ తెలుసు, అందుకనే హరిక ృష?ను వాళ్లు సపోర్టు చేయలేదు. వాళ్లకు కావలసినది వాళ్లకు అధికారంలోకి తీసుకుని వచ్చి, కావలసినవి సమకూర్చి పెట్టగల రాజకీయవేత్త. నందమూరి వంశంలో అటువంటి వేత్త ప్రస్తుతానికి కానరావటం లేదు. అందువలన బాబు వినా శరణం నాస్తి అనుకున్నారు. టిడిపిలోనే నిలిచారు.

అంతవరకూ బాగానే వుంది. కానీ యీ మాత్రం తిరుగుబాటైనా ఎందుకు రావాలి? మనకు తోచిన యీ నాలుగుముక్కలూ వంశీ, నానిలకు తట్టలేదా? హరిక ృష? అంటే ఆవేశపరుడు. జూనియర్ అయితే నిజంగానే కుర్రవాడు. ప్రస్తుతం 'శక్తి'హీనమై పోయిన తన కెరియరే చూసుకుంటాడా? రాజకీయాలే చూసుకుంటాడా? కానీ వీళ్లకేమైంది? అప్పటికప్పుడు రిజైన్ చేసేసి, దేవినేని ఉమ రాజీనామాను తిరస్కరించిన బాబు నిర?యాన్నే తప్పుపడతారా? ఆయ్‌ఉ, ఇదేమైనా టిడిపి అనుకున్నారా? కాంగ్రెస్ అనుకున్నారా?

ముగింపు యిలా వుండబోతోందని తెలిసినా బాబుకు ఓ లైట్ వార్నింగ్ యివ్వాలని ఎవరో ప్రయత్నించారని మాత్రం తెలుస్తోంది. ఎవరు వారు?

టిడిపి ఆవిరావేం నుండి కొందరు దానికి దన్నుగా నిలబడ్డారు. కాంగ్రెస్ అంటే అసహ్యం చేత కమ్యూనిస్టులను, ఆ తర్వాత జనతా పార్టీని ఆదరించబోయి, అవి గట్టిగా నిలబడలేకపోవడంతో నిరాశ చెంది 'ఈ జన్మకింతే, ఈ కాంగ్రెస్ వాళ్ల కుమ్ములాటలు చూస్తూనే తనువు చాలించవలసిందే' అనుకునే రోజుల్లో ఎన్టీయార్‌కి ఏం పుట్టిందో సినిమాల్లోంచి రాజకీయాల్లోకి దూసుకుని వచ్చారు. రావడం రావడం కూడా కొత్తరకమైన ఫిలాసఫీతో, రోజుకో కొత్త ఆలోచనతో వచ్చారు. రాష్ట్ర రాజకీయాల్లో అనేకమంది విద్యాధికులను, వెనుకబడిన వర్గాల వారిని లాక్కుని వచ్చారు. తెలుగు జాతి ఔన్నత్యాన్ని తెలుగువాళ్లకి చాటి చెప్పడంతో ఆగకుండా, జాతీయస్థాయిలో తెలుగువాళ్లకు ఓ గుర్తింపు తెచ్చారు. ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించారు. చెట్టుకొకరు, పుట్టకొకరుగా వున్న ప్రతిపక్షాలను ఒక్కతాటిపై నిలిపారు.

ఇవన్నీ తెలుగువాళ్లను మెప్పించాయి. కొన్ని వర్గాల వాళ్లను మరీ మెప్పించాయి. టిడిపికి గాఢాభిమానులు అయిపోయారు. అయినా ఎన్టీయార్ ఎన్నికలలో ఓడారు. మళ్లీ గెలిచారు. పార్టీ యంత్రాంగం మొత్తం చంద్రబాబు చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆయన అదను చూసి కూలదోశారు. పార్టీ మొత్తం హస్తగతం చేసుకున్నారు. మొదట్లో ఎన్టీయార్‌తో వుండిపోయినవారు కూడా ఆయన పోయిన తర్వాత గతిలేక బాబు వద్దకు వచ్చేశారు. టిడిపి అంటే బాబు తప్ప వేరెవరూ కారు అన్న స్థితికి వచ్చాక బాబు టిడిపి ఫిలాసఫీ అంతా మార్చేశారు. తనకు తోచిన రీతిలో పాలించారు.

దాంతో చాలా వర్గాలు టిడిపికి దూరమయ్యాయి. అయినా కొందరు టిడిపి గాఢాభిమానులు మాత్రం టిడిపిని వదలలేదు. టిడిపిపై ప్రేమ కంటె కాంగ్రెస్‌పై అసహ్యమే వారిని యిటువైపు వుంచింది. 2009లో బాబుకు భారీస్థాయిలో మద్దతు యిచ్చారు. ఆర్థికంగా, హార్దికంగా ఎంతో సాయపడి, వైయస్సార్‌ను గద్దె దింపు చాలన్నారు. కానీ బాబు వారిని నిరాశపరిచారు. చాణక్యుడనుకున్నవాడు

రాక్షసామాత్యుడిగా తేలాడు. ఎన్ని పథకాలు వేసినా, ఎవరితో పొత్తు కుదుర్చుకున్నా అవతలివాణ్ని కదపలేకపోయాడు. వైయస్సార్ పోయిన తర్వాత మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ ఏం లాభం? ఒక్కటంటే ఒక్కటి కూడా కలిసి రావడం లేదు.

వైయస్ పోయి దాదాపు రెండేళ్లు కావస్తోంది. కాంగ్రెస్ పరిస్థితి అధ్వాన్నంగా వుంది. కాంగ్రెస్ ముఖ్యమంత్రి బలంగా, స్థిరంగా వున్నాడని ఎవ్వరూ అనలేరు. ఇలాటి పరిస్థితుల్లో ప్రధాన ప్రతిపక్షం లాభపడుతుందని ఎవడైనా అనుకుంటాడు. కానీ చూడండి, టిడిపిలో గెలుపు ఛాయలేమైనా కనబడుతున్నాయేమో చూసి చెప్పండి. అబ్బే, కాగడా వేసి చూసినా కనబడటం లేదు. తెలంగాణా వ్యవహారాన్ని బాబు పూర్తిగా 'మెస్' చేసేసుకోవడంతో తెలంగాణా టిడిపి నాయకులు బాబును లక్ష్యపెట్టడం మానేశారు. ధిక్కరించారు. మొన్న అసెంబ్లీ సెషన్‌లో ఆయన పాట్లు పగవాడికి కూడా వద్దు అన్నట్టు అనిపించింది. తెలంగాణాకు సంబంధించినంత వరకు పార్టీపై ఆయనకు పట్టుపోయింది. తెరాసవాళ్లు నిమిషనిమిషానికీ బాబును అవమానించినా అడ్డుకునే తెలంగాణా టిడిపి నాయకుడు లేడు. 'చూడు వాళ్లు నన్ను ఏమంటున్నారో, అయినా మీకు చీమ కుట్టినట్టు లేదా?' అని బాబు తన అనుచరులకు ఫిర్యాదు చేసే రోజులు వచ్చాయి.

కాంగ్రెస్ వైఫల్యం తెలంగాణాలో తెరాసకు, ఆంధ్రప్రాంతంలో జగన్‌కు వస్తోందంటున్నారు తప్ప టిడిపి లాభపడుతుందని ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఇది తప్పకుండా బాబు వైఫల్యమే! బాబు వేసిన ఎత్తులేవీ ఫలించటం లేదు. రెండు కళ్ల సిద్ధాంతం హాస్యాస్పదం అయిపోయింది. పైగా యిటీవల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్‌తో కలిసి రాజకీయాలు చేయడం రోత పుట్టించింది. జగన్‌ను నిలవరించడానికే యిన్ని తంటాలు పడుతున్నాం అని చూపడంలో జగన్ బలవంతుడు అనే సందేశం యివ్వకనే యిస్తున్నారు. అసలు టిడిపి పుట్టిందే కాంగ్రెస్ వ్యతిరేకతతో. జగన్ అనే ఒక వ్యక్తిపై భయంతో బద్ధవిరోధి ఐన కాంగ్రెస్‌తోనే చేతులు కలిపితే యిక టిడిపి పార్టీ నడపడం దేనికి?

దేశజనాభాలో 60% మంది యువకులే అని ప్రణబ్ చెప్పారు. జగన్ యువకుడు కాబట్టి యువత అతనివైపు మొగ్గు చూపుతారు అని ఓ అంచనా. గతంలో ఎన్టీయార్‌ను, రాజీవ్ గాంధీని అధికారంలోకి తెచ్చింది యువతే! పాతికేళ్లగా రాజకీయాల్లో అవే మొహాలు చూసి చూసి విసుగుపుట్టి వుంటుంది కాబట్టి కొత్తవాళ్లు ఏమైనా ఉద్ధరిస్తారేమోనని ఆశ పుట్టి వాళ్లకు ఓటేసి చూస్తారు. ఎన్టీయార్ అందుకే అనేక కొత్త మొహాల్ని రాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. అప్పుడు టిడిపిలో చేరినవారు యిప్పటికి పెద్దవారై పోయారు, పాతబడిపోయారు. కొత్తవాళ్లెవరూ చేరలేదు. టిడిపి ద్వితీయశ్రేణిలో కూడా జగన్ వయసు వాళ్లు లేరు. పదేళ్లు సినీహీరోగా వుంటే 'అంకుల్ అయిపోయాడు, తీసేయ్' అంటున్నారు యువతులు. ఐదేళ్లు హీరోయిన్‌గా వుంటే 'ఆంటీ అయిపోయింది, తీసేయ్' అంటున్నారు యువకులు. అలాటివాళ్లు ఓట్లేసినపుడు మాత్రం చంద్రబాబులో, కిరణ్‌కుమార్‌లో యువకరక్తం ప్రవహిస్తోందంటే నమ్ముతారా? మా భావాలు అర్థం చేసుకునేవాళ్లు అక్కడెవరున్నారు? అని చూస్తారు.

ఈ విషయం బాబుకి తెలియక కాదు. అయినా ఆయన యువతరాన్ని తీసుకురాలేదు. భయం. 'ఒరులేయవి ఒనరించిన..' అన్నట్టు తాను ఒరులకు చేసినది, ఒరులు తనకు చేస్తారని భయం. ఆ రోజు ఎన్టీయార్ మూర?వృద్ధుడు. తను కొత్తతరం ఆశలను, దురాశలను అర్థం చేసుకునే యువకుడు. మరి యీ రోజు? తనకు షష్టిపూర్తి అయిపోయి రెండేళ్లయింది. ఆనాటి చంద్రబాబులా యింకోడు తయారవుతే తను ఎక్కడ తేలతాడు? అందువలన యువతరం నాయకుడెవరూ దరిదాపుల్లో రాకుండా దడి కట్టేసుకున్నారు. అయితే యువ ఓటర్లను ఆకట్టుకోనిదే పని జరగదు. అందుకే సినిమా వాళ్లను ఉపయోగించుకుంటున్నారు. వాళ్లు ప్రచారం చేసి వెళ్లిపోతే చాలని ఆయన ఉద్దేశం. చాలదని వాళ్ల అభిప్రాయం. అందుకే వచ్చింది గొడవ. ఇప్పటికి చల్లారింది. ఈ గొడవల్లో పురంధరేశ్వరి పేరు బయటకు వచ్చింది. ఆవిడకున్న ఛాన్సుల గురించి యింకో వ్యాసంలో.. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2011)**

**ఏప్రిల్ 10** **ఎమ్బీయస్ : పురంధరేశ్వరికి ఛాన్సుందా..?**

టిడిపిలో సంక్షోభం వెనుక పురంధరేశ్వరి స్క్రీన్ ప్లే వుందని, తన భర్తను నమ్మకద్రోహం చేసిన చంద్రబాబు పని పట్టడానికి యిప్పుడు హరికృష? ద్వారా తిరుగుబాటు బావుటా ఎగరేశారనీ మీడియా గాసిప్‌గా మొదలై, తర్వాత బాబు అనుయాయులు ఆవిణ్ని తూర్పారబట్టే వరకూ వెళ్లింది. ఆ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో నేను జోక్యం చేసుకోను, కుటుంబాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయను అని ఆవిడ అన్నా వీళ్లు వినటం లేదు. ఎందుకంటే దగ్గుబాటి యీ మధ్యకాలంలో తెగ పుస్తకాలు రాస్తున్నారు. సమైక్యవాదినని చాటి చెప్పుకుంటున్నారు. జూనియర్‌ను చిన్నప్పణ్నుంచి తక్కిన కుటుంబమంతా నిర్లక్ష్యం చేసినా మేమే ఆదరించి అప్పుడప్పుడు ఐస్‌ఫ్రూట్‌లు కొనిపెట్టామనీ, బాడ్మింటన్ ఆడించామనీ యిలాటి చిన్న విషయాల దగ్గర్నుంచీ ఆ మధ్య చెప్పుకున్నారు. ఇప్పుడైతే బాబు ఓట్లకోసం చేరదీస్తున్నాడు కానీ చిన్నప్పుడు మేమే అండగా నిలిచామని యావన్మందీ గుర్తించాలన్న ధ్వని అందులో వుంది. ఇప్పుడు హరికృష? బహిరంగంగా బావుటా ఎగరేశారు. చంద్రబాబు స్వయంగా ఫోన్ చేసినా జూనియర్ తీయలేదు. పైగా టిడిపిలో విభేదాల గురించి విలేకరులు అడిగినపుడు 'ఇవన్నీ మా నాన్ననడిగితే బాగుంటుంది' అన్నారు. ఈ కారణాల వలన టిడిపిలో ముఖ్యంగా బాబు అనుచరుల్లో ఒక సందేహం వచ్చేసింది – హరికృష? ద్వారా పురంధరేశ్వరి ఏదో కుట్ర చేసేస్తున్నారని. వాళ్లకున్న యిస్తోకు – జూనియర్ అనీ!

పురంధరేశ్వరి నిజంగా టిడిపిని చీలుస్తారా? ఆవిడకు ఆ ఉద్దేశం వుందా? చీల్చి ఏం చేస్తారు? కాంగ్రెస్‌లోకి పట్టుకెళ్లిపోతారా? కాంగ్రెస్‌లోకి పట్టుకెళితే టిడిపి అభిమానులు హర్షిస్తారా? సహిస్తారా? గత పాతికేళ్లగా టిడిపి అభిమానులు, కాంగ్రెస్ అభిమానులు స్పష్టంగా విడివిడిగా తెలుస్తున్నపుడు వీరంతా అటు వెళతారా? పట్టుకెళ్లి పురంధరేశ్వరి ఏం సాధిస్తారు? మంత్రి పదవా? ముఖ్యమంత్రి పదవా? అసలు పురంధరేశ్వరికి యిదంతా చేసే ఉద్దేశం వుందా? ప్రజల్లో ఆవిడ ఇమేజి ఎలా వుంది?

ఆఖరి ప్రశ్నకు మొదట సమాధానం చెపుతాను. యావన్మంది ఆంధ్రప్రజల సంగతి చెప్పలేను కానీ నా మట్టుకు నాకు ఆవిడపై గౌరవం వుంది. విద్యాధికురాలు. బహుముఖ ప్రజ్ఞాశాలి. నేను ఆవిడ కొన్ని ఉపన్యాసాలు విన్నాను. ఏ విషయం పైన అయినా సరే సాధికారికంగా మాట్లాడతారు. ఏదో సెక్రటరీ రాసింది ముక్కున పట్టేసి చెప్పినట్టుండదు. సబ్జక్ట్ తెలిసినట్టు మాట్లాడతారు. లేదా బాగా హోం వర్క్ చేసుకుని వచ్చి మాట్లాడతారు. సౌమ్యంగా కనబడతారు. ఈ నన్నపనేని, గంగాభవాని టైపు మహిళా నేత కాదు. ఇక ఆవిడ పరిపాలనా దక్షత గురించి మనకు ప్రత్యక్షానుభవం లేదు. కానీ మన్‌మోహన్, కపిల్ సిబ్బల్.. వీళ్లందరూ ఆవిడ గురించి గొప్పగా మాట్లాడతారు. అంటే కనీసం ఎబౌ ఏవరేజ్ అని అనుకోవచ్చు కదా. జాతీయపత్రికలలో కూడా ఆవిడ గురించి నెగటివ్ రిపోర్టులు ఎప్పుడూ రావు. ఇంగ్లీషులో కూడా చక్కగా మాట్లాడే నైపుణ్యం దానికి దోహదపడి వుండవచ్చు.

ఇక రాజకీయ చాతుర్యం గురించి – అది మనకు తెలియదు. కాంగ్రెస్ హవాలో కొట్టుకొచ్చారో, ఎన్టీయార్ కూతురని జనం ఓట్లేశారో, స్వయం ప్రతిభతో సాధించారో తెలియదు. కానీ నియోజకవర్గం మారినా ఆవిడ గెలిచారు. ఏది ఏమైనా ఆ క్రెడిట్ ఆవిడదే తప్ప, భర్తది కాదు. ఆయన బొత్తిగా లాభం లేదు. ఎన్టీయార్ ఫస్ట్ టెర్మ్‌లో తోడల్లుడితో పోటీలో ఎప్పుడూ వెనకబడి వున్నారు. ఆ తర్వాత ఘోరంగా జెల్లకాయ తినేశారు. బిజెపిలో కూడా ఆటి రాలేదు. ఆయనకు పుస్తకాలు రాయడంలోనే ప్రావీణ్యం వున్నట్టుంది తప్ప భార్యను చేయి పట్టుకుని ముందుకు తీసుకెళుతున్నారని అనలేం. అందువలన భర్త డైరక్షన్‌లో పురంధరేశ్వరి వెలుగుతున్నారని అనుకోవడం ధర్మం కాదు.

ఇప్పుడు నన్ను నేనే ప్రశ్నించుకుంటున్నాను – ఒకవేళ పురంధరేశ్వరి కాంగ్రెస్‌నుండి బయటకు వచ్చేసి విడిగా పార్టీ పెట్టి అసెంబ్లీ ఎన్నికలలో పోటీ పడితే ఓటేస్తానా? అని. జవాబు కూడా రెడీగానే తట్టింది. తప్పకుండా వేస్తాను (కొన్ని షరతులతో). ఎందుకంటే నేను ఒరిజినల్‌గా టిడిపి అభిమానిని. 2004 వరకు ఆ పార్టీకి ఓటేసినవాణ్నే. అయితే 2004 తర్వాత ప్రతిపక్షనేతగా బాబు వైఫల్యం, ఆయన హయాంలో జరిగిన ప్రగతి ఆర్ అదర్‌వైజ్ గురించి మీడియా తెరలు చీల్చుకుని స్టాటిస్టిక్స్ బయట పడడంతో నాకు ఆయనపై మోజు పోయింది. పోనుపోను ఆయన ప్లాన్లన్నీ దెబ్బ తినేస్తున్నాయి. ఒక సిద్ధాంతానికి కట్టుబడటం లేదు. కాంగ్రెస్‌ను అనుకరించాలన్న తాపత్రయం ఎక్కువై పోయింది. ఆ పద్ధతులే నచ్చితే కాంగ్రెస్‌కే వేస్తారుగా, యీ డూప్లికేట్‌కి ఎందుకు? పార్టీని కట్టుబాటులో వుంచలేకపోతున్నారు. ఇవాళ నాగం స్టేటుమెంటు చూడండి. అసెంబ్లీలో టిడిపి సభ్యుల ప్రవర్తన చూడండి. ఎన్టీయార్ కలలుగన్న విభిన్నమైన రాజకీయపక్షం యిదా?

బాబుపై భ్రమలు తొలగిపోయాయి కాబట్టి జగన్‌వైపు దృష్టి మరలింది. ఆయనకు ప్రజల ఆదరణ ఎంత వున్నా నేను మాత్రం మైక్రోస్కోపు కింద పెట్టి చూస్తున్నాను. ఈ అవినీతి ఆరోపణలు అవీ పెద్ద పట్టించుకోను నేను. ఆరోపణలు చేసేవాళ్లెవరూ సఛీలురు కారని అందరికీ తెలుసు. అవతలివాళ్లు ఓటుకి రెండు వేలు యిస్తే అటూ యిటూగా వీళ్లూ యిస్తున్నారు. అదంతా కష్టార్జితం అని మనం నమ్మాలా? సిఎం అవ్వాలని ఆశ పడ్డాడన్నది పెద్ద నేరం ఏమీ కాదు. (తండ్రి శవం పక్కన వుండగానే ప్రయత్నాలు మొదలు పెట్టడం అసహ్యకరమే అయినా ఆ పని అశోకుడి కాలం నుండి అందరూ చేసినదే) జగన్‌కి ఓ పాలసీ వుందా లేదా? కొత్త తరహా పాలన అందివ్వగలడా? లేదా అని చూస్తున్నాను. రెండు విషయాల్లో జగన్ నిరుత్సాహ పరిచారు. ఒకటి తెలంగాణా గురించి స్పష్టమైన విధానం ప్రకటించకుండా కాంగ్రెస్, టిడిపిలలా గోడమీద పిల్లిలా వున్నారు. ఈయన యింకేం ఆల్టర్నేటివ్?

రెండో విషయం – 2014 వరకు ప్రభుత్వం జోలికి రాను. నా పార్టీ మానిఫెస్టో తయారుచేసుకుంటాను, ప్రచారం చేసుకుంటాను అన్నారు. మంచిదే అనుకున్నాను. కానీ మొన్న ఎమ్మెల్సీ ఎన్నికలలో చేసిందేమిటి? ఈ రాజకీయ క్రీడలు చిన్నప్పటినుండీ చూస్తున్నవే కదా! ఈ బద్వేలు కమలమ్మ టైపు కుప్పిగంతులు ఎన్ని చూశాం? కాంగ్రెస్ పాలనతో విసిగి, టిడిపిపై ఆశలు నశించి తనవైపు చూస్తున్నారని జగన్ గ్రహిస్తే ప్రజలలో బలం పెంచుకునే ప్రయత్నం చేసేవారు. కానీ ఆయనకు తనవైపు నాయకులను తిప్పుకోవడంపైనే ఆసక్తి. ఏదో దీక్ష చేయడం, ఇంతమంది ఎమ్మెల్యేలు నా దగ్గరకు వచ్చారని ప్రచారం చేయడం. పక్కింటి వాడి ఎడ్రసు కనుక్కోవడానికి ఎవడైనా తన యింటికి వచ్చినా చాలు మర్నాడు సాక్షిలో వచ్చేస్తుంది. జగన్‌ను కలిసిన ఫలానా.. అని. అది చూసి కిరణ్ కడుపులో కలవరం పుట్టించానన్న ఆనందంతో జగన్ పొంగిపోవచ్చుగాక. కానీ నాబోటి వాడికి యిదంతా చికాకుగానే వుంది. ఈ నాయకులను గీత దాటించుకోవడానికి ఎంత ఖర్చవుతోందో, అదంతా పదవిలోకి వచ్చాక మన వద్ద ఎలా రాబడతారో అని గుబులుగా వుంది. ప్రజలలో బలం వుంటే చాలదా? ఎన్టీయార్ 1983 ఎన్నికలలో ఎంత ఖర్చు పెట్టారని ఆయన కాండిడేట్లు గెలిచారు?

నా బోటి ప్రజలు ఆశాజీవులు. ఉన్న పరిస్థితితో విసిగిపోయి, ఎవడైనా ఉద్ధారకుడు కనబడతాడా, తమను గట్టెక్కిస్తాడా అని చూస్తారు. రొటీన్ రాజకీయాలకు భిన్నంగా ఎవరైనా వస్తే దగ్గరకు చేరతారు. ఎన్టీయార్‌కు అలాగే ఓట్లేశారు. చిరంజీవి పార్టీ నిర్వహణ ఎంత అధ్వాన్నంగా వున్నా 17% ఓట్లేసి దన్నుగా నిలిచారు. జగన్ కూడా తను విభిన్నంగా వుంటానని ఆచరించి చూపితే

అటువంటి ఛాన్సు వుంటుంది. కానీ ఆయన చూపు అటు లేదు. మామూలు తరహా రాజకీయాల్లోనే మునిగి తేలుతున్నారు. వీటిల్లో ఆయన మునగవచ్చు, లేదా తేలనూవచ్చు. నాకు దానిపై వ్యాసాలు రాసే యింట్రస్టు వుంటుంది కానీ ఓటేసే ఇంట్రస్టు లేదు.

ఇక యిప్పుడు పురంధరేశ్వరి కనబడుతున్నారు. ఈవిడ కాంగ్రెస్‌లో వుంటే మంచి కాండిడేట్ కదాని ఓటేయవచ్చు. కానీ 2014కి యుపిఏ తిరిగి అధికారంలోకి వస్తుందో లేదో తెలియటం లేదు. ఎన్‌డిఏ వచ్చేట్టుగా వుంటే భర్త పాత పరిచయాల సహాయంతో బిజెపివైపు దూకుతారేమో తెలియదు. అలా కాకుండా ఆవిడ విడిగా వచ్చి పార్టీ పెట్టుకుంటే మాత్రం నా బోటివాళ్లు జై అంటారు. ఆవిడ చేయాల్సిన పనేమీ లేదు. 'ఎన్టీయార్ ఆశయాల నుండి పక్కకు జరగను' అంటే చాలు. అంటే సమైక్యవాదం, రైతు సంక్షేమం. ప్రజలకు ఏదో చేయాలన్న తపన. నూతన పథకాలు. యువతరానికి ఎక్కువ ప్రాధాన్యం. కొత్త తరహా రాజకీయాలు వగైరా. డబ్బు ప్రమేయం అతి తక్కువగా వుండాలి.

ముందే చెపుతున్నాను. ఒకవేళ ఆవిడ పార్టీ పెడుతూ ప్రస్తుతం టిడిపిలో వున్న నాయకులందరూ బాబును వదిలేసి తన వెంట వచ్చేస్తారని ఆశిస్తే మాత్రం తీవ్రంగా భంగపడతారు. వాళ్లెవరూ రారు. వచ్చినా ప్రమాదం. వాళ్లందరూ బాబు తరహా (అంటే డూప్లికేట్ కాంగ్రెస్) రాజకీయాలలోనే పండిపోయారు. అలాటి వాటిల్లోనే ఓ రకమైన స్మగ్ ఫీలింగ్, వెచ్చగా సుఖంగా వుండే భావన అనుభవిస్తున్నారు. చూడండి వాళ్లలో మెజారిటీ నాయకులందరూ 50 దాటినవారే. కొత్త తరాన్ని, కొత్త ఆలోచనలన్నీ దగ్గరకు రానీయటం లేదు. వాళ్లు బాబుని విడిచి యీవిడ దగ్గరకు రారు. వస్తే గిస్తే ప్రజలు రావాలి. పార్టీ పెట్టి ఓపిగ్గా, సమర్థవంతంగా నడపగలరన్న నమ్మకం వారికి కలగాలి. అది కలిగిందంటే చాలు, ఎన్టీయార్ కూతురన్న అభిమానం ఎలాగూ వుంది. వైయస్ కొడుకుని జగన్‌పై అభిమానం చూపుతున్న దానికి యిది బాలన్స్ అవుతుంది.

అయితే యీవిడమీద వెన్నుపోటులో కుట్రదారు ఆరోపణ ఒకటి వుంది. ఆ రోజు తండ్రిపై పోరాటానికి భర్తకు ఆరతి యిచ్చి, తిలకం దిద్ది పంపిదని మాటిమాటికి ప్రస్తావిస్తారు. అబ్బే, సమయానికి కర్పూరం లేక ఆరతి యివ్వలేదు, కాళ్లా వేళ్లా పడకపోయినా వద్దనే చెప్పాను అని యిప్పుడు యీవిడ అంటున్నా అది మనం నమ్మక్కరలేదు. అప్పుడు సవతి తల్లిమీద కోపంతో తండ్రికి బుద్ధి చెప్పాలన్న తాపత్రయంతో భర్తను ప్రోత్సహించి వుండవచ్చు. నిజానికి తొలిదశలో వీళ్లంతా కలిసి ఎన్టీయార్‌కు బుద్ధి చెప్పి, లక్ష్మీపార్వతి యింటికి పరిమితం చేసేట్లు చేస్తారని అనుకున్నారు. మధ్యలో హఠాత్తుగా సినారియో మారిపోయి ఎన్టీయార్‌ను దింపేయాలని తీర్మానం చేసేశారు. బాబు ముఖ్యమంత్రి, దగ్గుబాటి ఉపముఖ్యమంత్రి, హరికృష్ణ? మంత్రి.. యిలా పదవుల పందారం అయిపోయింది. తర్వాత బాబు వీళ్లందరికీ కాజా తినిపించడం వేరే కథ. కథ అలా మలుపు తిరుగుతుందని పురంధరేశ్వరి ఊహించారో లేదో తెలియదు.

ఒకవేళ ఊహించారనుకున్నా ఆవిణ్ని యిప్పుడు సమర్థించడానికి నాకు అభ్యంతరం లేదు. ఎందుకంటే ఎన్టీయార్ అభిమానించే నేను కూడా ఆయన రెండో టర్మ్ పరిపాలనను సమర్థించలేను. ఆయన లక్ష్మీపార్వతిని జీవితంలో ఆహ్వానించడం ఆమోదించవచ్చు కానీ పరిపాలనలోకి చొరబడనివ్వడం ఒళ్లు మండించింది. ఎంతసేపూ యిద్దరూ కలిసి ఊరేగడమే సరిపోయింది. ఆడంబరం అంటే ఒప్పుకోని ఎన్టీయార్ లక్ష్మీ పార్వతి అట్టహాసాన్ని భరించడమే కాదు, ప్రోత్సహించారు. నా లాగే ప్రజలందరూ విసిగిపోయారని అర్థమైంది – ఎప్పుడంటే గద్దె పోగొట్టుకున్న తర్వాత ఆయన తన కంచుకోట అయిన ఉత్తరాంధ్ర వెళ్లినా జనం రాకపోవడంతో! భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలు తొమ్మిదినెలలు తిరక్కుండా యిలా అయిపోయారంటే అదంతా ఎన్టీయార్ స్వయంకృతాపరాధమే! మామూలు ఓటరునైన నాకే అలా వుంటే చిన్నప్పటినుండి అభిమానించి, ఆరాధించిన తండ్రి అలా చేస్తే స్వంత కూతురు ఎలా భరించగలుగుతుంది? అందుకని తండ్రిపై కుట్రలో పాలు పంచుకుని వుండవచ్చు. ఎన్టీయార్ మరణం తర్వాతనే అందరికీ ఆయనపై జాలి కలిగింది. ఆవిడకూ కలిగివుండవచ్చు. తను అలా చేసి వుండకూడ దనిపించివుండవచ్చు.

ఏది ఏమైనా యీ విషయంగా తప్పుపట్టే అర్హత బాబు వెనక్కాల నడిచిన టిడిపి నాయకులకు అస్సలు లేదు. ఈవిడ వెనక్కాల వుండి ఆరతి యిచ్చివుండవచ్చు కానీ వాళ్లు ఏకంగా చెప్పులే వేశారు. కనీసం వేసేవారిని వారించలేదు, అంతటి అవమానానికి గురి చేసినందుకు ఎన్టీయార్‌ను ఓదార్చలేదు, క్షమాపణ చెప్పలేదు. అందువలన వాళ్లు కానీ వీళ్లు కానీ ఆ సంగతి ఎత్తకుండా వుంటేనే మర్యాద!

ఎన్నికలలో అనుకున్న చోట టిక్కెట్టు యివ్వకపోతే అలిగి కాంగ్రెస్‌లోంచి బయటకు వచ్చి పార్టీ పెడితే ప్రజాభిమానం చూరగొంటుందో లేదో చెప్పలేం కానీ ఎన్నికలకు రెండేళ్ల ముందే ఆవిడ రంగంలోకి డైరక్టుగా దిగి పార్టీ అంటూ పెట్టి శ్రమ పడితే ఆవిడ రాష్ట్ర రాజకీయాలకు కొత్త దిశ చూపగలదని నా నమ్మకం. ప్రజలలో మద్దతు పెరిగిన కొద్దీ యిప్పటివరకూ చంద్రబాబుకు మద్దతు నిలిచిన వర్గాలు ఆమెవైపు తిరిగితే ఆశ్చర్యపడనక్కరలేదు.

ఆవిడ తరఫున మనం యింతింత ప్లాన్లు వేసేస్తున్నాం కానీ అసలు ఆవిడకు యీ ఆలోచనలన్నీ వున్నాయో, లేదో! ఉన్న మంత్రిపదవిలో హాయిగా వుంటూ మన్ననలు పొందుతూ వుండక కొత్తగా పార్టీ పెట్టనేల? వీళ్లందరితో తలపడనేల? అని అనుకుంటూ కూడా వుండవచ్చు. అప్పుడు యిదంతా రాయడమూ వేస్టు. చదవడం యింకా వేస్టు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2011)**

**ఏప్రిల్ 12**

## ఎమ్బీయస్ : సత్యసాయి దీనావస్థ-1

సత్యసాయిబాబా గురించి కథనాలు పేపర్లలో తెగ వస్తున్నాయి. చదువుతున్నకొద్దీ బాధ వేస్తోంది. కోట్లాది ప్రజలకు మేలు చేసిన మహానుభావుడికి అంత్యదశలో యీ దురవస్థ ఏమిటని.

బాబా హాస్పటల్‌లో చేరిన మర్నాడే ఓ పుకారు వచ్చింది – బాబా అప్పటికే చనిపోయారని, యింకా బతికున్నట్టు ఆయన అనుచరులు నాటకాలాడుతూ, ఉగాదినాడు ఆయన సజీవసమాధిలోకి వెళ్లినట్లు పెద్ద అట్టహాసం చేయబోతున్నారనీ! ఈ సజీవసమాధి గోల ఎందుకంటే తను 96 ఏళ్లు బ్రతుకుతానని ఆ తర్వాత కరా?టకలో ప్రేమసాయిగా మూడో అవతారం ఎత్తుతాననీ (మొదటిది షిర్డీ సాయిబాబాట) బాబా చెప్పారట. ఇప్పుడు 86 ఏళ్లే కాబట్టి తక్కిన పదేళ్లు సజీవసమాధిలో వుంటారని భక్తులు అనుకోవాలని యిలా చేద్దామనుకున్నారట.

రాఘవేంద్రస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి యిలా కొందరు మహానుభావులు సజీవసమాధిలోకి వెళ్లారంటారు. యోగంలో, ధ్యానంలో సమాధి స్థితి వుంటుంది. శరీర కార్యకలాపాలను (మెటబాలిజమ్) కనీసస్థాయికి తీసుకుని వచ్చేసి దైనిక శారీరక అవసరాలు కూడా అవసరం పడని స్థితికి వెళ్లిపోవడం అన్నమాట. మంచుప్రాంతాల ఎలుగుబంట్లు శీతాకాలంలో యిలాటి స్థితికే వెళ్లిపోతాయి. 'హైబర్నేషన్' అంటారు. అది వాటికి ప్రకృతి యిచ్చిన వరం. ఇదేమో మానవుడు స్వయంకృషితో, సాధనతో సమకూర్చుకున్న స్థితి. ఈ ప్రక్రియతోనే హిమాలయాల్లో యోగులు వందలాది ఏళ్లు బతుకుతారని అంటారు.

వీరబ్రహ్మేంద్రస్వామి, రాఘవేంద్రస్వామి యోగిపుంగవులు. ఇటువంటి సాధన నిత్యం చేసివుంటారు. అందువలన వారికి సజీవసమాధి వీలుపడి వుండవచ్చు. సత్యసాయిది ఆ తరహా కాదు. రోజులో అనేక గంటలు మఠం వేసుకుని యోగసాధన చేసేందుకు ఆయనకు తీరిక లేదు. అనేకమైన లౌకిక వ్యవహారాలు చూసుకోవాలిసిన బాధ్యత ఆయనకుంది. లక్షలాది భక్తులను వివిధ ప్రాంతాలలో కలుసుకోవడం, తను చేపట్టిన సంక్షేమ కార్యకలాపాల తీరుతెన్నులు పర్యవేక్షించడం.. యిటువంటి ఎన్నో పనులు.

అందువలన సజీవసమాధి ఆయనవలన సాధ్యపడుతుందని అనుకోను. అయినా సత్యసాయి చుట్టూ వున్నవారు సజీవసమాధి నాటకం ఆడదామనుకున్నారని విన్నాను కాబట్టి మృతుడైన వ్యక్తిని ఏ వైర్‌వర్క్‌తో నడిపిస్తారా, యోగముద్రలో ఎలా కూర్చోబెడతారా చూద్దామని ఉగాది నాడు చాలా ఉత్సుకతతో టీవీముందు కూర్చున్నాను. ఉగాదినాడు ఏ వార్తా రాలేదు. ఇదంతా పుకారు అని తేలిపోయింది. ఐదారు రోజుల క్రితం మళ్లీ యింకో పుకారు – అంతా అయిపోయింది, ప్రధానమంత్రి, రాష్ట్రపతికి అనువైన సమయం చూసుకుని ఎనౌన్సు చేసేస్తారని. అదీ అబద్ధమే అని తేలింది.

ఇది రాసేనాటికి ఆయన సజీవంగానే వున్నారు. కోలుకుంటున్నారు. (గీతారెడ్డి ఆయన కళ్లు తెరిచి చూశారని కాబినెట్ మీటింగ్‌లో చెప్పారు) ఐసియులో వున్నారు కాబట్టి వైద్యపరిభాషలో పరిస్థితి విషమంగానే వుందని అంటున్నారు. ఆయన అలా వుండగా కథ ముగిసిందంటూ యిలా పుకార్లు పుట్టించడం అమానుషం. కానీ యిలాటి దుర్వార్తల వలన వ్యక్తి ఆయుష్షు మరింత పెరుగుతుందని అంటారు. ఆ విధంగా అయినా ఆయన ఆయుర్దాయం మరింత పెరగాలని నా ఆశ.

మీరనవచ్చు – ''86 ఏళ్ల వ్యక్తి ఎంతకాలం బతకాలని మీ ఆశ? ఇప్పటికే అస్వస్థులుగా వున్నారు కదా. ఇంకా బతకడం అంటే అవస్థే కదా. చేయవలసినంత ఉపకారం జనాలకు చేసేశారు.'' అని. ఒప్పుకుంటాను. కానీ నా ఆశ ఏమిటంటే – ఆయన ఆసుపత్రిలోంచి బయటకు రావాలి. తన గురించి, తన చుట్టూ వున్న వారి గురించి పేపర్లలో వచ్చినదంతా చదవాలి. అందులో నిజానిజాలు ఆయనకు ఒకవేళ తెలియకపోతే విచారించి తెలుసుకోవాలి. దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. ఇవన్నీ జరిగేదాకా భగవంతుడు ఆయనకు ఆయుర్దాయం, ఆరోగ్యం యివ్వాలని నా ఆశ.

ఆల్‌ఫ్రెడ్ నోబెల్ బతికుండగానే చనిపోయినట్టు వార్తలు వచ్చేశాయట. డైనమైట్ కనిపెట్టి అనేకమంది వినాశనానికి కారకుడైన వ్యక్తి మరణించాడు అని సంపాదకీయాలు రాశారట. బతికేవున్నాడు కాబట్టి చదువుకుని ఫీలయ్యాడట. 'రేపు నేను నిజంగా పోతే వీళ్లు నన్ను యిలాగే గుర్తుంచుకుంటారన్నమాట' అని. తన పేరు చెపితే మంచి విషయం ఏదైనా గుర్తుకు రావాలి అనుకుని భూరి విరాళంతో నోబెల్ బహుమతి ప్రారంభించాడు. ఇప్పుడు నోబెల్ అనగానే ప్రపంచస్థాయి బహుమతి గుర్తుకు వస్తుంది తప్ప డైనమైట్ కాదు.

సత్యసాయి ట్రస్టు అనగానే యిన్నాళ్లూ మనకు ఉచిత వైద్యం, విద్య, మంచినీరు ... యివన్నీ గుర్తుకు వచ్చేవి. కానీ ప్రస్తుతం గంజిలో వేసిన నిద్రమాత్రలు, సహాయకుల చేతిలో బందీ అయిపోయిన నిస్సహాయుడైన వృద్ధుని దీనవదనం గుర్తుకు వస్తున్నాయి. బాబా తిరిగి రావాలి. ఆరోగ్యవంతుడు కావాలి. ఈ ముద్ర చెరిపేసుకుని సర్వశక్తిమంతుడిగా నిష్క్రమించాలి.

బాబా ఆరోగ్యవంతుడై తిరిగి వచ్చాక ఆంధ్రజ్యోతి, సాక్షి చదివి పబ్లిగ్గా స్పందిస్తారని నేను అనుకోను. చిన్నప్పటినుండీ ఆయన గురించి మంచీ, చెడూ రెండూ చదువుతున్నాను. హిందూనేషన్‌లో ఆయన బాల్యచేష్టల గురించి రాసిన వ్యాసం నుండి, నరసింహయ్య, కోవూరు పుస్తకాల నుండి, యిటీవల కాలంలో 'విజయవిహారం'లో ధారావాహికగా వేసుకుంటూ వచ్చిన వ్యాసమాలిక దాకా .. చాలా చదివాను. వీటిలో వేటికీ బాబా సమాధానం యివ్వలేదు. ఆయన వీటిని తన ప్రసంగాలలో ఎప్పుడూ ప్రస్తావించలేదు. ఆయన భక్తులు కూడా ఆ యా పత్రికాధిపతుల కార్యాలయాల ఎదుట ధర్నాలు, ప్రదర్శనలు చేయలేదు. ''కోడలు దిద్దిన కాపురం''లో సత్యనారాయణ వేసిన దొంగబాబా పాత్ర చూస్తే సత్యసాయిబాబా గుర్తు వస్తారు. అప్పుడు సెన్సార్ అభ్యంతరం కూడా వచ్చింది.

దాని గురించి డివి నరసరాజుగారు తన 'తెర వెనుక కథలు'లో రాశారు.

2

సినిమాను సెన్సారు వాళ్లకు చూపించినపుడు ఎన్టీయార్ బావమరిది రుక్మాంగదరావు నిర్మాత ప్రతినిధిగా వెళ్లారు. షో కాగానే ఓ యిద్దరు సభ్యులు యిది బాబాకు అవమానం, సినిమా బ్యాన్ చేయాలి అని అరిచారు. ఆ సంగతి తెలిసి రామారావు మర్నాడు సెన్సారు ఆఫీసుకి తన ప్రతినిధిగా సినిమాకు రచయిత ఐన డివి నరసరాజుగార్ని దర్శకుడు యోగానంద్‌ను తోడిచ్చి పంపించారు. తనుగాని, తమ్ముడు త్రివిక్రమరావుగాని వెళితే ఔననో, కాదనో చెప్పాల్సి వుంటుంది. అదే వేరేవాళ్లయితే నిర్మాతను అడిగి చెప్తా అని సమయం తీసుకోవచ్చు. అదీ ఐడియా.

నరసరాజుగారు వెళ్లగానే సెన్సారు ఆఫీసరు డి రామలింగంగారు, ''ఇదిగో మెంబర్లు రాసి యిచ్చారు – సత్యనారాయణ పాత్ర సత్యసాయిబాబాను పోలి వుందిట. 'సమాజంలో సజీవుడైన ఒక వ్యక్తిని పోలిన పాత్ర సృష్టించి అపహాస్యం చేయకూడదు' అని సెన్సారు కోడ్ వుంది కదా దాని ప్రకారం వాళ్లు అభ్యంతరం తెలిపారు." అన్నారు.

అప్పుడు నరసరాజుగారు "పోలిక లేనేలేదు. మా పాత్ర పేరు నిత్యానందస్వామి. డ్రెస్ పైజామా, షేర్వాని. మనిషి ఒడ్డు, పొడుగులో పోలిక లేదు. మాట్లాడే దానిలో పోలిక లేదు. మాట తీరులో పోలిక లేదు. నడకలో పోలిక లేదు. ఉన్నదల్లా విగ్గులో పోలిక. అది ఎప్పటినుండో వస్తున్న మా సినిమా విగ్గు. ''బాలనాగమ్మ''లో మాయలమరాఠీ విగ్గు! ఎందరో విలన్లకు పెట్టిన విగ్గు. అది ఎవరి జుట్టునో పోలి వుందని మమ్మల్ని మానేయమంటే ఎలా?" అని వాదించారు.

"అయితే ఇవే వాదనలు రాసి యివ్వండి. బొంబాయి సెంట్రల్ సెన్సార్ బోర్డుకు పంపుతాను." అన్నారు రామలింగం గారు. పంపారు. వాళ్లు ఈ వాదనలు నచ్చి సినిమాకు క్లీన్ సర్టిఫికెట్ యివ్వమన్నారు. సినిమా రిలీజైంది. ఇదీ నరసరాజుగారు రాసినది.

1970 అక్టోబరులో ఎన్టీయార్ 200 వ చిత్రంగా మంచి పబ్లిసిటీతో రిలీజైంది. సెన్సార్ బోర్డులో బాబా భక్తులు గోల చేసినా బాబా మాత్రం పబ్లిగ్గా ఏమీ స్పందించలేదు. ఆ సినిమా రిలీజయ్యే హాళ్లముందు ప్రదర్శన అడ్డుకోమని తన భక్తులకు పబ్లిగ్గా గాని, ప్రైవేటుగా గాని ఆదేశాలు యివ్వలేదు. మా వూళ్లో ఆయన భక్తులు సినిమా ఫ్లాప్ అవుతుందని శాపనార్థాలు పెట్టుకున్నారు కానీ ఇంకేమీ చేయలేదు. పిల్లి మంత్రాలకు ఉట్లు తెగలేదు. సినిమా సూపర్ సక్సెసైంది.

ఆ తర్వాత కొన్ని పుకార్లు వచ్చాయి – ఈ అపచారం వలన రామారావుకు పళ్లు వూడిపోయాయని, అకాల వార్ధక్యం వచ్చిపడిందని.. యిలాటివి. అవేమీ జరగలేదు. పూలరంగడిలా వున్నాడు. మరో 100 సినిమాలు నటించి, రాజకీయాల్లోకి వచ్చి తెలుగువారి చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆ పాత్ర సృష్టించిన డివి నరసరాజుగారి కెరియర్ కూడా ఆ తర్వాత అప్రతిహతంగా సాగింది.

ఇంతకీ చెప్పవచ్చినదేమిటంటే బాబా తన విమర్శకులపై చేతబడులూ చేయించలేదు, కోర్టు కేసులూ పెట్టలేదు, భక్తులను ఉసికొల్పి కొట్టించనూ లేదు. అబ్రహాం కోవూరు ఓపన్‌గా ఛాలెంజ్ చేశారు. బెంగుళూరులో వుండే నరసింహయ్య (వైస్ ఛాన్సలర్‌గా చేశారు) గాలిలోంచి గుమ్మడికాయ సృష్టించి చూపమని ఎద్దేవా చేశారు. మెజీషియన్ పిసి సర్కారు (జూనియర్) ''ఆయన దగ్గరకు వెళితే ఆయన గాలిలోంచి శివలింగం తీసి యిచ్చాడు. నేను వెంటనే గాలిలోంచి రసగుల్లా తీసి యిచ్చాను. మా యిద్దరిదీ ఒకటే వృత్తి – ఇంద్రజాలం" అని పబ్లిగ్గా ఆయన దైవత్వాన్ని ప్రశ్నించాడు. సత్యసాయి ఆశ్రమంలో చాలా కాలం వున్న టాల్బోట్ అనే ఒకతను ఆయన లైంగికపరమైన అలవాట్ల గురించి చాలా అసహ్యంగా రాశాడు.

ఏమి రాసినా, ఏం చేసినా సత్యసాయి నుండి స్పందన మాత్రం శూన్యం. ఆయన తననుకున్నది చేస్తూ పోయారు. ఆయన భక్తులు కూడా యీ విమర్శలేమీ పట్టించుకోలేదు. శ్రీకృష్ణ?డికి కూడా జీవించివున్న కాలంలో అపవాదులు వచ్చిపడ్డాయి. ఇవీ అలాటివే" అని కొట్టి పారేశారు. సత్యసాయి వద్దకు వెళుతూనే వున్నారు. కానుకలు సమర్పిస్తూనే పోయారు. ఆయన వాటిని ట్రస్టు ద్వారా సమాజసేవకు వినియోగిస్తూనే వున్నారు. సత్యసాయి పేరిట ఎన్నో సత్కార్యాలు జరుగుతున్నాయి. ఎందరో పేదలకు ఉచితంగా విద్య అందుతోంది. వైద్యసహాయం అందుతోంది. అనంతపురం జిల్లాకు నీటి సదుపాయం కల్పించడం ఏ ప్రభుత్వం వలనా కాని పని ఆయన ఒక్కడి కారణంగా జరిగింది.

కానుకలు యివ్వడం ఒక యెత్తు. వేలాదిమంది తమ జీవితాల్నే బాబాకు అంకితం చేశారు. అది చాలా గొప్ప విషయం. వీళ్లంతా అల్లా టప్పా మనుషులు కారు. విద్యాధికులు. ఉన్నతోద్యోగులు. వ్యాపారవేత్తలు. వీళ్లంతా ఆయన సేవా కార్యక్రమాలలో స్వఛ్ఛంద సేవకులుగా పాల్గొంటూ ఎంతో నిజాయితీగా, ఎంతో అంకితభావంతో పనిచేస్తారు. ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు అయితే ఎలా నడుస్తుందో మనం చెప్పనక్కరలేదు. కానీ సత్యసాయి భక్తులు చేపట్టినవైతే సామర్థ్యంతో, లంచాల ప్రసక్తి లేకుండా సకాలానికి పూర్తవుతాయి. బాబా చూస్తున్నారు, బాగా చేస్తే ఆయన అభినందిస్తారు అన్న ఆలోచనే కాబోలు వాళ్లని నడిపిస్తుంది. వాళ్లలో వున్న శక్తిసామర్థ్యాలు, పరోపకారగుణం వంటివి వెలికిదీసి వాటిని ఉపయోగంలో పెట్టడంలోనే వుంది సత్యసాయి మహిమ.

మహిమ అంటున్నాను కాబట్టి నేను సత్యసాయిని భగవంతుడంటున్నానని, నేను ఆయన భక్తుణ్నని మీరు అనుకుంటారేమో.

ఇక్కడే నా అభిప్రాయాలు స్పష్టం చేసేస్తాను. నేను ఏ గాడ్‌మన్ (స్వామి, బాబా, మఠాధిపతి, ప్రవక్త, ఆచార్య...)నీ భగవంతుడితో సమానం అనుకోను. భగవంతుడికి మనం యిచ్చే నిర్వచనం ఏమిటి? సర్వకాలాలలో, సర్వావస్థలలో, సర్వశక్తిమంతుడై వుంటూ ఆదిమధ్యాంతాలు లేనివాడని...

వీళ్లెవరూ ఆ నిర్వచనానికి తూగరు. ఏసుక్రీస్తు కానీ మహమ్మద్ ప్రవక్త కానీ, బుద్ధుడు కానీ, శంకరాచార్యుడు కానీ.. ఎవరైనా సరే ఏదో ఒక సంవత్సరంలో పుట్టి మరొక సంవత్సరంలో గిట్టినవారే. స్థల, కాల, స్థితి పరిమితులకు లోబడి జీవించినవారే. అందుకే ఏసుక్రీస్తు తను దేవుని పుత్రుణ్నని చెప్పుకున్నాడు తప్ప దేవుణ్నని చెప్పుకోలేదు. మహమ్మద్ ప్రవక్తనని చెప్పుకున్నాడు తప్ప తనను ఆరాధించమని అడగలేదు. బుద్ధుడు అనారోగ్యంతో తీసుకుని చనిపోయాడు తప్ప స్టాప్‌బ్లాక్‌లో అంతర్ధానం అయిపోలేదు.

3

అయితే మనం వీరిని ఎందుకు ఆరాధిస్తున్నాం అంటే.. వీళ్లలో మనం అనుకునే దైవాంశ ఎక్కువగా వుంటుంది కాబట్టి. దైవాంశ అంటే మంచిగుణాలు అనుకుందాం. దానవాంశ అనుకుంటే దుర్గుణాలు అనుకుందాం. ప్రతి మనిషిలోనూ దైవాంశ, దానవాంశ రెండూ వుంటాయి. ఒక్కోప్పుడు ఒక్కోటి ప్రకోపిస్తూ వుంటుంది. కొంతమందిలో మొదటిది ఎక్కువ, మరికొంతమందిలో రెండోది ఎక్కువ. హిట్లర్ లాటివాడు దానవాంశ ఎక్కువగా కలిగిన మనిషైతే మదర్ థెరిసా దైవాంశ ఎక్కువగా కలిగిన మనిషి. ఈ దైవాంశ ఎక్కువగా వున్న మనుష్యులే బాబాలు, ఆచార్యులు, యోగులు అవుతారు. దైవం గురించి చెపుతూ, ప్రచారం చేస్తూ, మనలో మంచి గుణాలను పెంచుతారు. అంత మాత్రాన ఏకంగా దేవుళ్లు అయిపోరు. ఐన్‌స్టీన్ సిద్ధాంతం గురించి వివరించి అర్థమయ్యేట్లు చెప్పి ఆయనపై గౌరవం పెంచిన ఫిజిక్స్ టీచర్ ఐన్‌స్టీన్ అయిపోడు గదా!

మతప్రచారకులందరినీ మన హిందూమతంలో ఏదో ఒక దేవుడి అవతారం అనేస్తాం. ఇది హీబ్రూలలో వుందనుకోను. జ్యూయిష్ సినగాగ్‌లలో మోజెస్‌ను ఎవరూ పూజిస్తారని అనుకోను. కావాలంటే అతని పాత్రను హీరోగా పెట్టి 'టెన్ కమాండ్‌మెంట్స్' తీస్తారు గానీ... ఇక క్రైస్తవులలో సెయింట్‌హుడ్ యిస్తారు. అంటే అతను పవిత్రుడు అని ఒప్పుకుంటారన్నమాట. అంతకుమించి అతనే దేవుడు అనేయరు. మనం యీ విషయంలో కాస్త ఉదారంగా వుంటాం. బుద్ధుణ్ని విష?వు అవతారం అనేస్తాం, ఆదిశంకరుణ్ని శంకరుడి అవతారం అనేస్తాం, మధ్వాచార్యుణ్ని ఆంజనేయుడి/భీముడి అవతారం అంటాం. కొందర్ని దేవుడి అవతారం అనడానికి నోరు రాకపోతే దేవుడి తాలూకు వస్తువుల అవతారాలనడం కద్దు. వేణుగోపాలుని మువ్వే క్షేత్రయ్య అవతారం ఎత్తిందని, విష?వు ఖడ్గమే అన్నమయ్య అవతారం ఎత్తిందనీ.. యిలా. కాలం గడుస్తున్న కొద్దీ దైవత్వం ఆపాదించడం పెరిగిపోతూ వుంటుంది. త్యాగరాజుగారు సరస్వతీ దేవి అవతారం అంటాం, బాలమురళీకృష? గారు త్యాగరాజు అవతారం అంటాం, రేపు మరో బాలగాయకుడు బాగా పాడితే బాలమురళీ అంశ యితనిలో వుందంటాం.

వీటన్నిటిలో మనం గుర్తించవలసినదేమిటంటే ఆ సదరు మనిషిలో మనం దైవాన్ని/దైవత్వాన్ని దర్శిస్తున్నాం. ఆ విధంగా దర్శించడం తల్లి, తండ్రి, గురువు, ప్రాణం కాపాడిన వైద్యుని విషయంలో కూడా జరుగుతుంది. చదువు చెప్పి లౌకికమైన విషయాలు బోధపరచి బతకడానికి మార్గం చూపిన ఆచార్యుడు ఉపాధ్యాయుడు. ఆధ్యాత్మికపరమైన విషయాలను బోధపరచి బతుకుకు అర్థం చూపిన ఆచార్యులు – యిదిగో యీ గాడ్‌మెన్. అందరూ అభిమానింపదగినవారే, గౌరవింపదగినవారే. ఏ ఒక్కరూ తక్కినవారి స్థానం ఆక్రమింపజాలరు. కానీ వీరెవ్వరూ భగవంతుడు కానే కారు. మనం ఒక్కోప్పుడు ఆవేశంలో వాళ్లను భగవంతుడిగా కీర్తించవచ్చు. తా మునిగింది గంగ అనుకోవచ్చు కాస్సేపు, కానీ మునిగి గట్టెక్కాక చూస్తే గంగ కాదని తెలిపోతుంది కదా! అలాగే వీళ్లూ భగవంతుడు కాదన్న స్పృహలోకి త్వరగానే వచ్చేయాలి.

కొందరు మాత్రం రారు. అభిమాని స్థాయి నుంచి భక్తుడి స్థాయికి మారిపోయి తమకు నచ్చారు కదాని ఆ గురువులకు 'భగవాన్' అని, 'అవతార్' అనీ బిరుదులు తగిలించేస్తారు. భక్తుల్ని నొప్పించడం దేనికిలే స్వాములు వాటిని ఉంచేసుకుంటారు. వాటి ప్రచారానికి మౌనంగా సమ్మతిస్తారు. నడిచినంతకాలం అది బాగానే వుంటుంది ఒక్కోప్పుడు కొంప ముంచుతుంది. ఆయనే భగవంతుడైతే రోగాలు రావడం ఏమిటి? అన్న ప్రశ్న వస్తుంది. బుద్ధుడికి, ఆదిశంకరుడికి, యిలాటి భగవదాంశ వున్నవారికి రోగాలు వచ్చినట్టు పుస్తకాల్లో రికార్డు అయివుంది కదా అని యీ భక్తులు జవాబివ్వలేరు. ఎందుకంటే యీయన సాక్షాత్తు భగవంతుడాయె! విష?వు లక్ష్మీదేవి చేత నిరంతరం కాళ్లు పిసికించుకుంటుంటాడు కాబట్టి అదో రోగం అయివుండాలి అని వాదించాలన్న ఊహ పోదు. దాంతో కప్పగంతులు వేస్తారు – ''అబ్బే ఆయనకు రోగం ఎక్కడ? ఒక భక్తుడికి రోగం వస్తే దాన్ని నయం చేయడానికి తనపై ఆవహింపజేసుకుని, తనే బాధపడి..'' అని ఓ కహానీ చెప్తారు.

భక్తుడి రోగం గురించి మాట్లాడబోతే అది ఏకవచనంలో వుంటుందా స్వామీ? కోట్లాది భక్తులు, ఒక్కో భక్తుడికి సగటున రెండు, మూడు రోగాలు. బాబావారు ఇంకో పది జన్మలెత్తినా యీ రోగాలనుండి విముక్తులు కాలేరు. అందువలన ఆయన భగవంతుడే అయితే తనమీదకు తెచ్చుకుని బాధపడి, తక్కిన భక్తులకు దర్శనభాగ్యం దూరం చేసే బదులు ఆ రోగాన్నే హాంఫట్ అని మాయం చేస్తే సరిపోయేదిగా! ఇలాటి తర్కాలన్నీ వస్తాయి.

వీటన్నిటి కంటె మించిన ప్రశ్న – ఆయనే భగవంతుడైతే తన చుట్టూ జరుగుతున్న భాగోతాలను ఎందుకు అరికట్టలేదు? అని. తిరుపతిలో అనేక అక్రమాలు జరుగుతూనే వున్నాయి, అవి అందరికీ తెలుసు. అయినా వెంకటేశ్వరుడి మహాత్మ్యం గురించి ఎవరికీ సందేహాలు రావడం లేదు. మరి సత్యసాయి విషయంలో ఎందుకు రావాలి? అంటే అది అంతే. ఆయన శిలారూపంలో వున్న దేవుడు. వేరే ఎవరి కలలోకైనా వచ్చి తన ఆలోచనలు చెప్పాలి, ఇలా చేయి, అలా చేయవద్దు అని చెప్పి చేయించాలి. సత్యసాయి మనిషి. తనే స్వయంగా చెప్పగలరు.

అందుకే టిటిడి కంటె సత్యసాయి ట్రస్టు ప్రతిభావంతంగా పనిచేయగలిగింది. చాలా త్వరగా జనంలోకి చొచ్చుకుపోయింది. తన అనుచరులను ఆయన ఎంతో గాఢంగా ప్రభావితం చేయగలిగారు. వందలాది విదేశాలలో కూడా సత్యసాయి శాఖలు ఏర్పడ్డాయి. అది ఒక విశాల సామ్రాజ్యంగా ఏర్పడింది. మంది పెరిగిన కొద్దీ మంద కూడా పెరిగింది. రకరకాల మనుష్యులు వచ్చి చేరసాగారు. వీళ్లలో సఛ్ఛీలుర శాతం గణనీయంగానే వుండవచ్చు. కానీ దుర్మార్గుల శాతం కూడా తక్కువేమీ కాదు. అవినీతిపరులుగా, అక్రమార్జనాపరులుగా, దుర్మార్గులుగా, పన్ను ఎగవేతదారులుగా పేరుబడిన, ముద్రపడిన, కేసులు ఎదుర్కొంటున్న రాజకీయనాయకులు, సినిమాతారలు, పారిశ్రామికవేత్తలు బాబా వద్దకు వెళ్లి దర్శనం చేసుకోవడం చూస్తూనే వున్నాం. పుట్టపర్తికి వెళ్లడానికి ముందు, తర్వాత వారి ప్రవర్తనలో ఏ విధమైన మార్పూ వుండటం లేదు. ఆయన వద్దకు వెళ్లి పట్టుబట్టలు కట్టుకుని భజనలో పాల్గొంటారు. బయటకు వచ్చి సూట్లేసుకుని అర్ధనగ్న సుందరీమణులతో కలిసి ఫోటోలు తీయించుకుంటారు.

## 4

తిరుపతి దేవుడి దగ్గరా డిటో సమస్యే. ఆయనా మనుష్యుల్ని మార్చలేకపోతున్నాడు. బాబా పలకగలిగి, నోరారా ఉపదేశం యివ్వగలిగి మార్చలేకపోతున్నారు. ఆయన వద్దకు యింతమంది గొప్ప స్థాయి వ్యక్తులు వచ్చి మోకరిల్లడం వెనుక మర్మం ఏమిటో ఎవరికీ అర్థం అయ్యేది కాదు. బాబాను ఆశ్రయిస్తే ఆయన తన పలుకుబడి వుపయోగించి పనులు చేసిపెడతారని నేను చిన్నప్పటినుండీ వినేవాణ్ని. అంటే ఓ పారిశ్రామికవేత్తకు ఓ లైసెన్సు కావాలి. అది యిప్పించే ప్రభుత్వోద్యోగి బాబా భక్తుడు. ఆ యిండస్ట్రియలిస్టు వచ్చి బాబా శరణు వేడితే ఆయన ఆ అధికారికి ఓ మాట చెప్తారు. అలాగే ఆ అధికారి కి ఓ ప్రమోషన్ కావాలి. బాబా తన భక్తుడైన ఓ రాజకీయవేత్తకు చెప్తే ఆ పని అయిపోతుంది. ఆ రాజకీయవేత్తకు ఓ సినిమాతారతో పనిబడింది. ఆ తారా బాబా భక్తురాలే... ఇలా బాబా చుట్టూ వీరందరూ చేరి తమ తమ పనులు చేయించుకుంటున్నారు తప్ప మనుష్యుల్లో మార్పు రావటం లేదు.

వీళ్లే తమ బ్లాక్‌మనీ అంతా దాచుకోవడానికి ప్రశాంతి నిలయం వాడుకుంటున్నారని యిప్పుడు జ్యోతి రాస్తోంది. ఇది ఇండియన్ స్విస్ బ్యాంక్ అన్నాడట ఓ పెద్దమనిషి. ఈ వార్త అబద్ధమైతే బాగుండును కానీ నిజమైనా నేను ఆశ్చర్యపడను. ఇలాటివి జరుగుతాయి.

మద్రాసులో మాకు ఓ పంజాబీ కస్టమర్ వుండేవాడు. రకరకాల పేర్లతో మా దగ్గర ఫిక్సెడ్ డిపాజిట్‌లు వేసేవాడు. ఇంటిపేరు ముందుకు తెచ్చి ఓసారి, మధ్యపేరు ముందుకు తెచ్చి మరోసారి... యిలా. అప్పట్లో మరీ యింత పాన్ నెంబర్ల గోల వుండేది కాదు. డిపాజిట్లు వస్తున్నాయి కదాని మేం కిమ్మనేవారం కాదు. ఎప్పుడైనా బొత్తిగా పొడి అక్షరాలతో డిపాజిట్ ఓపెన్ చేయమంటే 'మరీ యింత అన్యాయమా?' అంటే ఆయన విసుక్కునేవాడు. ''పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో అయితే యీ గొడవే లేదు. అది మన గొడౌన్‌లాటిది. ఇన్‌కమ్‌టాక్స్ రెయిడ్ అవుతుందన్న భయం వుంటే మూటగట్టి అక్కడ పడేస్తే చాలు. తర్వాత వెళ్లి తీసుకోవచ్చు. ఎవరూ ఏమీ అనరు. ఏ రూల్సూ పాటించరు అని.''

అంటే వాళ్ల ఆడిటర్సు కూడా చూసీ చూడనట్టు ఊరుకుంటారన్నమాట. ఆర్‌బిఐ ఆడిటర్లు, ఎక్స్‌టెర్నల్ (స్వతంత్ర) ఆడిటర్లు వచ్చినపుడు మాత్రం ఆ వారం పదిరోజులు జాగ్రత్త పడతారేమో! పెద్దపెద్ద బిజినెస్ హౌసెస్ తమ తమ బ్యాంకులు ప్రారంభించింది యిందుకే. ఇప్పటికీ అనేక ప్రయివేటు బ్యాంకులు రూల్సు సరిగ్గా పాటించకుండా వీరికి సహకరిస్తాయి. గ్లోబల్ ట్రస్టు బ్యాంక్ మునిగింది అందుకే! ఇప్పుడు మార్గదర్శి గొడవ కూడా అదే కదా! డిపాజిటర్ల పేర్లు యిమ్మంటే మార్గదర్శి యిచ్చిందా? లక్షల రూపాయల డిపాజిట్ల రసీదులపై పొడి అక్షరాలతో పేర్లు వున్నాయిట. డిపాజిట్లు క్లోజ్ చేసేశాం కాబట్టి పేర్లు యివ్వలేం అనేశారు. పెద్ద తలకాయలందరూ (వాళ్లలో టిడిపి నాయకుల పేర్లు, కాంగ్రెస్ నాయకుల పేర్లు తప్పకుండా వుండి వుంటాయి) అక్కడ డబ్బు దాచుకున్నవారు కాబట్టే మార్గదర్శిని కాపాడుతూ వచ్చారు. ఇప్పుడు కోర్టు కారిడార్లలో కేసు తచ్చాడుతోంది. వైయస్సూ పోయారు. జగన్‌ను ఎదుర్కోవడానికి రామోజీ, కాంగ్రెస్ ప్రభుత్వం మధ్య సయోధ్య కుదురుతున్న సూచనలూ కనబడుతున్నాయి. ఎప్పుడో ఓ శుభముహూర్తాన మార్గదర్శి కేసు మూసేస్తారు. వీళ్ల పేర్లు బయటకు రావు.

ఈ రాజకీయనాయకులు, పారిశ్రామికవేత్తలు తమ బ్లాక్‌మనీ దాచుకోవడానికి యిలాటి సేఫ్ హేవెన్ గురించి చూస్తూనే వుంటారు. రాజకీయప్రత్యర్థులు వాళ్లమీద ఎప్పుడైనా ఐటీ దాడులు జరపవచ్చు. అదే కనక ఆధ్యాత్మిక ఆశ్రమంలో దాచుకుంటే చాలా భద్రం. ఐటీ అధికారులకు బాబామీద భక్తి వుంటుంది. లేకపోయినా వాళ్ల పై అధికారులకు వుంటుంది. ఒకవేళ ఎవడో మొండివాడు హత్తెరీ అంటే హిందూమతంపై దాడి, భక్తుల విశ్వాసాలపై దెబ్బ అని ఆ వూరివాళ్లను రెచ్చగొట్టవచ్చు. మీడియాలో కథనాలు రాయించవచ్చు. అందువలన వాళ్లు యిక్కడ దాచుకున్నారంటే అబ్బురం ఏమీ కాదు.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే ప్రశాంతినిలయంలో బ్లాక్‌మనీ దాచుకునే వ్యవహారం వుంది అని అనుకుంటేనే యిప్పుడు జరుగుతున్న వ్యవహారాల గురించి ఓ అవగాహన ఏర్పడుతుంది. విలాస్‌రావు దేశ్‌ముఖ్ ఆదరాబాదరాగా పరిగెత్తుకుని వచ్చింది అందుకే నంటున్నారు. కొందరు ఆయనలా రాకపోయినా కబుర్లు పెట్టవచ్చు. మాది మాకు యిచ్చేసి ఆ తర్వాత తక్కిన సంగతులు చూడండని. వాళ్లలో దేశంలోని అన్ని రంగాలలోని పెద్ద వాళ్లూ వుండి వుంటారు. ట్రస్టు సభ్యులు ఆ లెక్కల సెటిల్‌మెంట్లలో మునిగిపోయి వుండి వుంటారు. అందుకనే వాళ్లెవరూ సత్యసాయిని రక్షించే ప్రయత్నం చేయడం లేదు. చెప్పానుగా నాకు ఆయనపై గౌరవం తప్ప భక్తి లేదని ! అయినా నాకే శక్తి వుంటే ఆసుపత్రిలోకి దూసుకుని వెళ్లి హనుమంతుడిలా ఆయనను భుజాన వేసుకుని వచ్చి మా యింటికి తీసుకుని వచ్చి చికిత్స చేయించి ఇంత తిండి పెడదామని వుంది.

నాకే యిలా వుంటే దశాబ్దాలుగా ఆయన పాదపూజలు చేస్తూ అనేకరకాలుగా లబ్ధి పొందిన పెద్దతలకాయలకు ఎంత వుండాలి? ట్రస్టు సభ్యులు ఆర్నెల్లుగా ఆయన ఆలనాపాలనా చూడడం లేదని, నిద్రమాత్రలిచ్చి జోగొడుతున్నారని, మెడికల్ రికార్డులన్నీ మాయం చేశారనీ విన్నప్పుడు రక్తం సలసల కాగడం లేదా? లక్షలాది మందికి తిండి పెట్టిన ఆ మహానుభావుడు తిండిలేక అలమటిస్తున్నారని విన్నప్పుడు కడుపులోంచి దుఃఖం పొంగుకు రావడం లేదా? తన చేతిలో వున్న అధికారం, డబ్బు, పలుకుబడి ఏదో ఒకటి వినియోగించి చేయాలని అనిపించడం లేదా? కానీ వాళ్లెందుకు చేయటం లేదు? అన్న ప్రశ్న పుట్టినపుడు యిదే కారణమేమో అనిపిస్తోంది. ఇంతకంటె వేరే ఏదైనా కారణం మీకు తోస్తే చెప్పండి.

## 5

కారణం ఏమైనా కానీయండి ఎందుకిలా జరిగింది? అన్న ప్రశ్న తొలిచివేస్తోంది కదూ. అతిగా ధనం కానీ అధికారం కానీ పోగుపడితే యింతే అవుతుంది. డబ్బు బాగా కూడబెడితే స్వంత సంతానానికే భయపడాల్సి వస్తుందని భజగోవిందం అంటుంది. మొగలాయీ దర్బారు కుట్రలు చూడండి. బాదుషాగారు కాస్త జబ్బు పడితే చాలు, పట్టమహిషో, ప్రియమహిషో చెంతన చేరడం, తక్కిన వారందరినీ దూరంగా నెట్టేయడం, కిరీటానికి పోటీపడే యువరాజులకు కబురు అందకుండా చూడడం, విషప్రయోగాలు చేయడం.. యివన్నీ జరిగేవి. షాజహాన్ జైలుపాలు ఎందుకయ్యాడు? ఆయన చేసిన నేరం ఏమిటి? ఔరంగజేబు ఎక్కుదామనుకున్న సింహాసనం మీద ఆయన వుండిపోవడం, ఓ పట్టాన చావకపోవడం... అంతేగా! ఆగ్రాకోటలో బందీయై తను కట్టిన తాజ్‌మహల్‌ను చూసుకుంటూ కన్నుమూశాడు. చక్రవర్తిగా కాకుండా సామాన్యపౌరుడిగా వుంటే ఆయన బతుకు ఎంతో మెరుగ్గా వుండి వుండేది.

మనం అనేక జానపద సినిమాల్లో చూశాం. రాజుగారి రెండో భార్య తమ్ముడు సేనాపతియై అధికారమంతా గుప్పిట్లో పెట్టుకుంటాడు. చివర్లో రాజుగారు మేలుకుని "వీణ్ని బంధించండి" అంటే సైనికులు రాజుగార్నే బంధిస్తారు. ఎందుకంటే అప్పటికే సేనాపతి సైనికులందర్నీ లోబరుచుకుని వుంటాడు. చివరకు హీరో ప్రజల సహాయంతో కోటమీదకు దాడి చేసి సేనాపతిని చంపి రాజుగార్ని రక్షిస్తాడు.

ఇప్పుడు సత్యసాయి కథ అలాగే లేదూ! ప్రభుత్వం ట్రస్టు సభ్యులతో కుమ్మక్కయి పుట్టపర్తిలో 144 సెక్షన్ పెట్టి ఆపింది కానీ లేకపోతే భక్తులు యీ పాటికి ఆసుపత్రి గోడలు పగలకొట్టి, ట్రస్టు సభ్యుల తాట వల్చేసి సత్యసాయిని పట్టుకుని వెళ్లిపోయేవారు. సత్యసాయి తమ్ముడి భార్యను రానీయలేదట. ఎప్పటినుండో భక్తుడైన ఆదికేశవులునాయుణ్ని చూడనీయలేదట. బాబా బాడీ లాంగ్వేజ్ బాగా అర్థం చేసుకుంటాడని సత్యజిత్‌ను మాత్రం రానిస్తున్నారట. ఉలుకూ, పలుకూ లేక స్పృహలో లేని బాబా బాడీ లాంగ్వేజ్ ద్వారా ఏం చెపుతున్నారట? సత్యజిత్ ఏం గ్రహించేస్తున్నాట్ట?

అయినా పాత మెడికల్ రికార్డులు తిరగేయకుండా వైద్యం ఏమిటండీ? 86 ఏళ్లాయన. బిపి, సుగర్ వుండవచ్చు. కొన్ని యింజక్షన్లు పడకపోవచ్చు. ఓ సారి పాతవి చూసుకోరూ? అక్కడ జరుగుతున్నది వైద్యమా? లేక మరోటా? అన్నిటినీ గుప్పిట్లో పెట్టుకున్న ట్రస్టు సభ్యులు ఓ తెల్లకాగితం మీద ఎవరి సంతకాలూ లేకుండా ఆసుపత్రిలో చేరిన 15 రోజులకు ఓ ప్రకటన యివ్వడమా? లక్షల కోట్ల ఆస్తులకు, అన్నిటికీ మించి సత్యసాయి ప్రాణానికి జవాబుదారీ లేదా?

ఇందాకా రాజ్యాల గురించి చెప్పాను కదా, రాజకీయ నాయకుల సంగతి చూడండి. కరుణానిధికి ఒంట్లో బాగుండలేదు. పక్కన భార్య తిష్ట వేసి వుంటుంది. దయానిధి మారన్ వచ్చి ఏదైనా చర్చిద్దామంటే ఆవిడ అక్కణ్నుంచి కదలనే కదలదని కనిమొళి నీరా రాడియాతో చెప్పినట్టు టేపుల్లో వచ్చింది. ఈయన వెళ్లమని చెప్పలేదు. ఆయన కుటుంబం హోరాహోరీ కొట్టేసుకుంటున్నారు. ఈయన ఆపలేదు. దాని కారణంగా రేపు ఎన్నికలలో ఓడిపోయినా ఆశ్చర్యం లేదు.

అలాగే మాయావతి కాన్షీరామ్‌ను బంధించి వుంచింది. ఆయన రక్తబంధువులను కూడా దగ్గరకు రానీయలేదు. కాన్షీరామ్ నిస్సహాయంగా వుండిపోయారు. ఫయర్ బ్రాండ్ జార్జి ఫెర్నాండెజ్ యిప్పుడు అల్జీమర్స్ పాలయ్యాడు. అంతే దశాబ్దాలుగా దూరంగా వున్న భార్య లైలా, కొడుకు ఎక్కణ్నుంచో తేలి, ఆయనకు యిన్నాళ్లూ సేవ చేసిన సన్నిహితురాలు జయా జైట్లీని తరిమేసి ఆయన్ను పట్టుకుపోయారు. ఎందుకంటే ఆయన పేర కోట్లాది ఆస్తి వుంది. ఏం జరుగుతోందో ఆయనకు తెలిస్తేగా పాపం!

ఆధ్యాత్మిక సామ్రాజ్యాలూ యింతే. సిక్కుల శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ వుంది కదా. దాని పాలిటిక్స్ చెప్పనలవి కాదు. ఎందుకంటే దానికి కోట్లాది ఫండ్స్ వున్నాయి. వాళ్లు చెపితే ఓట్లు పడతాయి. ఆ డబ్బు, ఆ అధికారం అనుభవించాలంటే

కమిటీ సభ్యులు కావాలి. ఆ సభ్యులుగా ఎన్నిక కావడానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెడతారు. వాళ్లకు రాజకీయ నాయకుల మద్దతు వుంటుంది. కేరళలో చర్చిలూ అంతే. అవి కొన్ని రాజకీయపార్టీలను శాసిస్తాయి. వాటికన్‌లో గొడవలకు అంతే లేదు. ఎన్నో కథనాలు వింటాం. మక్కా, మదీనా లలో ఏం గొడవలు వున్నాయో ఎప్పుడూ పేపర్లో చదవలేదు. మన దేశంలో ఆచార్య రజనీష్‌ది చూశాం. ఆయన విదేశాల్లో చేరేసిన ఫండ్స్ గురించి జరిగిన గొడవల గురించి విన్నాం. హరేరామ హరేక ృష? బెంగుళూరు బ్రాంచ్‌లో కూడా గొడవ గురించి చదివాను. మాది అసలైనది అంటే మాదే అని తన్నుకున్నారట.

ఇవన్నీ ఆడంబరాలతో కూడినవి కాబట్టి యిలా వున్నాయి కానీ దివ్యజ్ఞాన సమాజం వంటి స్పిరిచ్యువల్ వాటిలో యిలాటివి వుండవు అనుకోకండి. అక్కడ ఇగో ప్రాబ్లెమ్స్ వస్తాయి. అనీబిసెంట్ జిడ్డు క ృష?మూర్తిని తీర్చిదిద్దింది. తర్వాత ఆయనపై హక్కుల కోసం క ృష?మూర్తి తండ్రి, అనీ బిసెంట్ కోర్టుల కెక్కారు. స్వామి చిన్మయానంద తన గురువుగారితో విభేదించి బయటకు వచ్చి ప్రత్యేక మిషన్ పెట్టుకున్నారు. చిన్మయ మిషన్‌లోంచి మనరాష్ట్రంలో ఇంకో గ్రూపు విడిపోయి మరోటి పెట్టుకున్నారు.

ఎక్కడైతే డొనేషన్లు వుంటాయో పరిస్థితి యిలాగే వుంటుంది. గతంలో గుళ్లకు గోపురాలకు ఆస్తులు వున్నపుడు ధర్మకర్తలు కావడానికి యిలాగే గొడవలు. భూములు అన్యాక్రాంతాలు అయిపోతాయి. నగలు మాయమై పోతాయి. తిరుపతి దేవుడివీ మాయమయ్యాయి కదా. చివరకి గుడికి కాగితాలపై వేలాది ఎకరాల ఆస్తి వుంటుంది మూలవిరాట్టుకి నైవేద్యం పెట్టే దిక్కు వుండదు. ఇప్పుడు సత్యసాయిబాబా అవస్థా అంతే కదా. ఆయనకు తిండి పెట్టకుండా, మత్తులో జోకొట్టి వుంచుతున్నారుట.

ఆయనకు యిలా జరగడం ధర్మమా? భావ్యమా? ఆయన వ్యక్తిగత బలహీనతలు నాకు తెలియవు కానీ మామూలుగా చూస్తే ఆయన ఒక మంచిమనిషి. మామూలుగా యీ లెవెల్ కాదు, ఇంతకంటె తక్కువ వున్న నార్త్ ఇండియా స్వామీజీలలో చాలామందికి విదేశీ భార్యలు, విదేశాలలో మకాం గట్రా వుంటుంది. ఈయనకు అలాటివి ఏవీ లేవు. భక్తులంతా ఫలానా దర్శనానికి యింత యిచ్చి తీరాలని నిబంధనలూ లేవు. ఈయనే వాళ్లకు యిచ్చాడు. ఆయన పేరు మీద ఎన్నో మంచి పనులు జరిగాయి. జరుగుతున్నాయి. నగర సంకీర్తనలు, వరదల్లో, కరువులో ఆదుకోవడాలు. స్కూళ్లు నడపడాలి. ఒకటా రెండా? బాబా ఎంతోమందిని పండితులను సత్కరించారు. ఎందరో మాన్యులను, సామాన్యులను సామాజిక సేవకు పురికొల్పారు.

## 6

ఇంతమందిని ఆయన ఎలా పురిగొల్పగలిగాడన్నది చాలా చిత్రమైన విషయం. ఆయన గొప్ప దార్శనికుడు కాదు. కొత్త సిద్ధాంతాన్ని ఏదీ ప్రతిపాదించలేదు. పాత విషయాలే చెప్పారు. అలా అని గొప్ప వక్తా కాదు. బహుభాషావేత్తా కాదు. హిందూమతమే గొప్పదంటూ మతాంతీకరణ చేయలేదు. అయినా అయినా ఎన్నో లక్షలమంది భక్తిని చూరగొన్నాడు. హైదరాబాదులోని సత్యసాయి నిగమాగమం ఆవిష్కరణ సమయంలో ఆయన యిచ్చిన బహుమతి ఎలా యివ్వగలిగారో డెక్కన్ క్రానికల్‌లో ఫోటోలతో సహా వచ్చేసింది. అయినా ఆయన భక్తులు చలించలేదు. ఆయన దేవుడనే నమ్మారు.

ఆయన చుట్టూ చీమల్లా సామాన్యులు చేరారు. వాళ్లు పెట్టిన పుట్టల్లో పాములు చేరాయి. క్రమంగా బాబానే కబళించే స్థాయికి పడగలెత్తాయి. సాక్షాత్తూ ఆయనమీదనే హత్యాయత్నం జరిగితే విచారణ జరపలేదు. బాబాను కోర్టుకి రమ్మనవలసి వుంటుంది, అది బాగుండదు, అని కేసు మూసేశాం అని కుంటిసాకు. పుట్టపర్తిలో అనేకమంది విదేశీయులు చచ్చిపోతున్నారు. దొంగ వీసాలు పుట్టిస్తున్నారు. ప్రశాంతి నిలయంలో ఎందుకింత క్రైమ్? బాబాకే రక్షణ లేని ప్రదేశం అది. ఇన్వెస్టిగేట్ చేయాలి. కానీ వీళ్లు చేయనివ్వరు. భక్తుల మనోభావాలు దెబ్బతింటాయి అని సాకులు చెప్తారు. ఇప్పుడేం చేస్తున్నారు? అంతా గప్‌చుప్. గట్టిగా అడిగితే భక్తుల మనోభావాలు.. అన్న పాస్‌వర్డ్ ఒక్కదానితో మన నోరు మూయిస్తారు.

బాబా పేరుమీద ఎంతోమంది నిస్వార్థంగా పనిచేస్తున్నారు. వారికోసమైనా బాబా మళ్లీ ఆరోగ్యవంతుడై రావాలి. తన వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. రామక ృష? మిషన్ చూడండి ఎన్నో ఏళ్లగా ఎంత సమర్థవంతంగా పనిచేస్తోందో! దానిలో కూడా వివాదాలు వుండివుండవచ్చు. కానీ తక్కువ స్థాయిలోనే వున్నాయి కాబోలు. బాబా తర్వాత కూడా ఆయన పేరు మీద సత్కార్యాలు కొనసాగాలంటే రామక ృష? మిషన్ స్ఫూర్తిని తీసుకోవాలి.

నా ఉద్దేశం అధికారమంతా కేంద్రీక ృతం కావడం చేతనే యీ చిక్కులొస్తున్నాయేమో. గ్రామస్థాయిలోనే సెల్ఫ్ గవర్నింగ్ యూనిట్స్‌లా తయారుచేసి గ్రామకమిటీలు ఏర్పాటు చేయాలి. ఈ ఐయేయస్‌లు, ఇండస్ట్రియలిస్టుల కంటె నిజాయితీగా గ్రామీణులు పనిచేస్తారు. బాబా కలకాలం సామాన్యుల గుండెల్లో నిలిచేలా చేయగలుగుతారు. ఇంతమందిని మంచి పనులకు పురికొల్పగలిగిన బాబాకు మనం సలహాలు యివ్వనక్కరలేదనుకుంటా. ఆయన ఆరోగ్యంగా తిరిగి వస్తే ఆయనే పరిష్కారం ఆలోచించగలుగుతారు.

ఈ కథలో నీతి ఏమిటి? స్వంత ఆసుపత్రిలో బాబా వైద్యం అందక, తిండి లేక అలమటించనేల? ఇది దారుణం కదా! నా ఉద్దేశం – దేవుడు మాచెడ్డవాడు. మనిషిని ఎదగనిస్తాడు. కానీ మధ్యమధ్యలో తన పరిమితులు తెలియపరుస్తాడు. తన స్థాయికి రానివ్వడు. ఎవరైనా చనిపోయాక దేవుడి లాటి వాడన్నా సహిస్తాడు. రాముడు బతికుండగా దేవుడని ఎవరూ అనుకోలేదు. అనలేదు. అనుకుని వుంటే చాకలివాడు నోరుపారేసుకునేవాడే కాదు. సుగ్రీవుడు “సీత ఎక్కడుందో నువ్వే చెప్పవయ్యా, మా వాళ్లని అన్నిమూలలకూ

పంపడం దేనికి?" అని దబాయించేవాడు. కృష?ణ్ని శిశిపాలుడు చడామడా తిట్టేసి ప్రాణాలమీదకు తెచ్చుకునేవాడే కాదు. ఎవరైనా పోయాక వాళ్లను దేవుడని మనం పూజించినా దేవుడు సరేలే అనుకుంటాడు. కానీ బతికుండగా దేవుడన్నామో, వాళ్లను వదిలిపెట్టడు.

మెహర్‌బాబా ఓ జ్ఞాని. బతికుండగానే అవతార్ అన్నారు. ఆయన మౌనదీక్షలోకి వెళ్లారు. పూర్తిజ్ఞానం సంపాదించి మౌనం భగ్నం చేసి లోకానికి సత్యాన్ని చాటి చెప్తానన్నారు. నోరు విప్పకుండానే దేవుడు తీసుకుపోయాడు. కంచి పరమాచార్యను నడిచే దేవుడన్నారు. ఓహో యిలా వుందా అనుకున్నాడు దేవుడు. జయేంద్ర సరస్వతిరూపంలో తలనొప్పి తెచ్చిపెట్టాడు. ఇప్పుడు తన ట్రస్టు సభ్యుల తీరు చూసి సత్యసాయి విరక్తి చెందినట్టుగానే ఆయనా చెందాడు. ఓ సారి ఒళ్లుమండి "నీ వ్యవహారం పీఠానికి తగినట్టుగా లేదని" తలవాచేట్లు చివాట్లు పెట్టారు. దాంతో జయేంద్ర తలకావేరి (కావేరి జన్మస్థలం) వద్దకు వెళ్లి కూచున్నాడు. గట్టిగా పట్టుబడితే పీఠం పరువు పోతుందని పాపం అలిగిన కుమారుణ్ని బుజ్జగించే తండ్రిలా పరమాచార్య ఆయన్ని పిలిపించి 'నీ యిష్టం వచ్చినట్టు చెయ్యి' అని దణ?ం పెట్టారు. అతి త్వరలోనే దేహం చాలించారు.

కల్కి భగవాన్ పేరుతో వెలిగే ఆయనకు కొడుకు గండం. ఈయన అలౌకికమైన భక్తి పేరుతో డబ్బు సంపాదిస్తే ఆయన శుద్ధ లౌకికమైన ప్రేమ సబ్జక్ట్‌తో సినిమాలు, ఆడియోల పేరుతో ఆ డబ్బు తగలేస్తాడు. కొడుకుని యీయన వదలలేదు, ఆమోదించలేదు. ఇప్పుడు సత్యసాయి. ఇన్నాళ్లూ బాగానే నడిపినా అంత్యదశలో పెటకం పెట్టాడు. అనుచరులను చూసి కృంగిపోయేట్లా చేశాడు. తన పేరుతో యింకెవరైనా చలామణీ అయితే గిట్టని తరహా వాసుదేవుని కాలంనుండీ చూడవచ్చు. పౌండ్రక వాసుదేవుడు కూడా దేవుడిలాగే నామాలు ధరించి శంఖచక్రాలు ధరించి నేనే ఒరిజినల్ వాసుదేవుణ్ని అని ప్రచారం చేసుకుంటూ వుంటే వాసుదేవుడు వెళ్లి సంహరించాట్ట.

నన్నడిగితే (అడగరనుకోండి) వీళ్లంతా దేవుణ్నని చెప్పుకోకుండా, భగవాన్ వంటివి తగిలించుకోకుండా వుంటే ప్రాణం సుఖంగా వుంటుందని.

వ్యాసం హెవీ అయిపోయింది కాబట్టి ఓ చమత్కార పద్యంతో ముగిస్తాను. భగవాన్ అనే పేరు పెట్టుకున్నాడు కాబట్టి అనుచరుల చేష్టలు చూసి సత్యసాయి చేష్టలుడిగి మానసిక అవస్థ పడుతున్నారని చెప్పుకున్నాం కదా! ఇలాటి బాధలు దేవుడికి కూడా తప్పలేదు అంటాడు మురారి ఓ కవి 'దారుభూతో మురారిః' అనే పద్యంలో –

ఏకాభార్యా ప్రకృతి ముఖరా చంచలా చ ద్వితీయా
పుత్ర స్త్వేకో భువన విజయీ మన్మథో దుర్నివారః
శేషశ్శయ్యా శయనముదధౌ వాహనం పన్నగారిః
స్మారం స్మారం స్వగృహ చరితం దారుభూతో మురారిః!!

తన యిద్దరు భార్యల్లో పెద్దామె జ్యేష' వాచాల (అతివాగుడు), చిన్నామె లక్ష్మి నిలకడ లేని చంచల. భువనాల్ని జయించే కొడుకు మన్మథుడు. ఎదురులేని వాడే కానీ మాట వినడు. తన పడుకున్నే పక్క పాము. పడకటిల్లు చూడబోతే సముద్రం, వాహనమేమో పక్షి ! ఇల్లు ఇలా వుంటే యెంత చిరాగ్గా వుంటుంది? నారాయణుడిది తలచుకొని, తలచుకొని యేవిరీ చేయలేక కొయ్యబారి (దారుభూతో) పోయాడట! విష?వు కొయ్యబారిపోయిన సందర్భమే ఏమైనా వుందా? అని అడకగకండి. పూరీ జగన్నాథుడు కొయ్యతో చేసిన మూర్తే కదా!

మురారి అనే ఓ సంస్కృత కవి మధ్యాహ్నం పడి నిద్రపోతూ వుంటే మేనమామ లేపి తిట్టాడట. అప్పుడు ఈ శ్లోకం చెప్పి మురారి తనను తాను సమర్థించుకున్నాడని చాటువు. అందువలన – దేవుడు మనిషిని ఏడిపిస్తే, మనిషి పద్యాలు రాసి దేవుణ్ని ఆటపట్టిస్తాడన్నమాట ! **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2011)**

**ఏప్రిల్ 18** **ఎమ్బీయస్ : కడప బై ఎలక్షన్– 1/3**

కడప బై ఎలక్షన్‌గురించి రాయమని చాలామంది కోరుతున్నారు. ఇప్పటికే ప్రతీ పేపరూ రోజువారీ న్యూస్‌లో 25% ఉపయెన్నికల గురించే వేస్తోంది. ఎవరెవరు నాయకులు వెళ్లారు, ఏం అంటున్నారు, ఎంతమంది నామినేషన్లు వేశారు, ఎంతమంది బైండోవరులో అరెస్టయ్యారు, ఎంత డబ్బు పట్టుబడింది.. అదేదో మనకు జీవన్మరణ సమస్య కింద చిత్రీకరిస్తున్నారు. ఆఫ్టరాల్ అక్కడున్నవి ఒక అసెంబ్లీ సీటు, ఒక పార్లమెంటు సీటు. అంతకుముందున్న వాళ్లే మళ్లీ నిలబడుతున్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ తరఫున, యిప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ తరఫున. అంతేగా తేడా?

రాష్ట్రాన్నంతా దోచి కడపకు పెట్టాడని వైయస్సార్‌పై మీకూ నాకూ కోపం వుండవచ్చు. కానీ దాని వలన లాభం పొందిన కడపవాళ్లకు వుండదు కదా! ఆ గుడ్‌విల్ వైయస్ పోయిన తర్వాత జరిగిన ఒక్క ఎలక్షన్‌కు కూడా పనికిరాకుండా పోతుందా? నెవర్. అందునా వైయస్ భార్య, కొడుకు నిలబడుతున్నపుడు..! మెజారిటీ ఎంత వస్తుందో చెప్పలేం కానీ గెలుపు మాత్రం ఖాయం. ఇది అందరికీ తెలుసు. అయినా కాంగ్రెస్‌వారు కాబినెట్‌లో పాతికవంతుమందిని అక్కడే మోహరిస్తున్నారు. రాష్ట్రంలో వేరే సమస్యలే లేనట్టు! విజయమ్మగారు అసెంబ్లీ ఎన్నికలో నెగ్గితే పెద్ద అరిష్టం దాపురించేటట్టు !జగన్ పార్లమెంటుకి వెళితే అఫ్జల్ గురు టైపులో దాడి చేసేసేటట్టు !!

రాష్ట్రరాజకీయమంతా జగన్ చుట్టూ పరిభ్రమించేట్టుగా చేశారు కాంగ్రెస్‌వారు, టిడిపివారు. "సాక్షి" గ్రూపులో జగన్నామ స్మరణ ఎలాగూ తప్పదు. ఇక వేరే ఏ పేపరు చూసినా, ఏ ఛానెల్ చూసినా అక్కడా జగన్ గురించే, మరో విధంగా ! అంత తిన్నాడు, యింత తిన్నాడు, వాళ్లను చంపించాడు, వీళ్లను చంపించాడు యిలా చెప్పి చెప్పి మనల్ని చంపుతున్నారు. ఏం చెప్తారు? ఎన్నాళ్లు చెప్తారు? చెప్పినందువలన మార్పేదైనా వచ్చిందా? మొన్న ఉండవల్లి మాచక్కగా చెప్పారు. జగన్‌పై ఆరోపణలు కోర్టులో నిలవవు. ఎందుకంటే అవి స్కాండల్స్ కావు. బిజినెస్ వ్యవహారాలు. సాక్షిలో పెట్టుబడి పెట్టినవాళ్లు బినామీలు కారు, ప్రముఖులు మేం పెట్టలేదని అనరు. ఎందుకు పెట్టావని అడిగితే నా యిష్టం పొమ్మంటారు. వాళ్ల నాన్న స్థానానికి, ఆ పెట్టుబడులు లింకు వున్నదనేది వాస్తవం కావచ్చు. కానీ అది పట్టుబడే నేరం కాదు.

ఇప్పుడు నేను ఓ ప్రభుత్వాధికారిని అనుకోండి. నా వలన మేలు కలిగిన ఓ వ్యాపారస్తుడు లంచం యివ్వబోతే నేను పుచ్చుకోలేదు. అది క్రైమ్ కాబట్టి. అతను నాకు ఫేవర్ చేద్దామనుకుని నా డొక్కు కారును నాలుగు లక్షలు పెట్టి కొంటాడు. నేను రైట్ రాయల్‌గా సేల్ ఎగ్రిమెంటు రాసి మరీ డబ్బు తీసుకుంటాను. ఆ డొక్కు కారు లక్ష కూడా చేయదు, నాలుగు లక్షలు ఎందుకిచ్చావ్? అని ఎవడైనా కోర్టులో అడిగినా "నాకు ఆ నెంబరు సెంటిమెంటు, లేదా కలర్ సెంటిమెంటు" అంటాడు వ్యాపారస్తుడు. జడ్జిగారు శిక్ష వేయగలడా? నష్టాల్లో వున్న రామోజీరావుగారి కంపెనీలో షేరు 5 లక్షల చిల్లర పెట్టి కొంటే ఎందుకు కొన్నావని ఎవరైనా అడగగలిగారా? ఇవన్నీ పేపర్లలో పేజీలు నింపుకోవడానికే తప్ప అంతిమంగా శిక్ష పడదని అందరికీ తెలుసు. ఆ మాత్రం ప్లానింగ్ లేకుండా పాలిటిక్స్‌లో దిగుతారా?

జగన్ గురించి తెగ రాసి రాసి అతనిపై జాలి పెంచారు. గతంలో ఇందిరా గాంధీ విషయంలో యిలాగే వ్యవహరించి జనతా పార్టీ తప్పు చేసింది. పట్టించుకోకుండా వుంటే అంత ప్రభావం వుండేది కాదేమో! సిపిఐ, సిపిఎంవాళ్లు చూడండి, ఎప్పుడూ ఏదో ఒకటి ఆందోళన చేస్తూనే వుంటారు. అయినా ఎవరూ పట్టించుకోరు. ఏ ప్రభుత్వ కార్యాలయం ముందో కూర్చుని ఝండాలేసుకుని, ధర్నా చేస్తూ వుంటే ఆగి దేనికోసం చేస్తున్నారు అని కూడా అడగరు. అలాగే జగన్ ఓదార్పుకి పోయినపుడు సరేలే అని వూరుకుని వుంటే పోయుండేది. 'వెళ్లడం తప్పు, వాళ్లనే రమ్మనాల్సింది, వెళ్లినా చేతులూపాల్సింది కాదు, బుగ్గలు నిమరాల్సింది కాదు, అసలు అవతలివాళ్లు చచ్చిపోనే లేదు, పోయినా వైయస్ పోయిన నెల్లాళ్లకు పోతే వైయస్ గురించే పోయాడని ఎలా అనగలం?' – ఇలా లాజిక్‌లు లాగి లాగి అతన్ని హీరో చేశారు.

ఇప్పటిదాకా జగన్ చేసిన ఘనకార్యం ఒక్కటీ లేదు. కానీ తెల్లారి లేస్తే – జగన్ ఎవర్ని కలిశాడు, జగన్‌ను ఎవరు కలిశారు, జగన్‌ను కాంగ్రెస్‌వారు ఏమన్నారు? టిడిపివారు ఏమన్నారు? దానికి అతని వర్గీయులు ఏం సమాధానం చెప్పారు? జగన్ ఎంత బొక్కేశాడు? ఎలా బొక్కేశాడు? దేశంలోనే కాదు ప్రపంచంలోనే యితని కంటె అవినీతిపరులున్నారా? లేదా? ఇదే డిస్కషన్. వీళ్ల అదావుడి ధర్మమాని స్కూలు పిలకాయల నుండి, మూలనున్న ముసలమ్మ దాకా జగన్ పేరు పాకిపోయింది, మంచిగానో, చెడుగానో అది వేరే విషయం. ఫ్రీ పబ్లిసిటీ అయితే యిచ్చారు కదా. అతనో పెద్ద లీడరు అయిపోతున్నాడు కదా. తెల్లారి లేస్తే కాంగ్రెస్, టిడిపి యిద్దరూ కలిసి ముక్తకంఠంతో జగన్‌ను తిడుతున్నారు.

ఇంత అవినీతిపరుడు జగన్‌ను విలేఖరులు కానీ, ప్రజలు కానీ ఎలా సహిస్తున్నారన్నది చంద్రబాబుగారికి అర్థం కావటం లేదు. ఆయన అసహనం చూపిస్తున్నారు. ప్రజలు అనేకం సహిస్తారని ఆయన గుర్తించాలి. తమ ప్రియతమ నాయకుడు ఎన్టీయార్‌ను వెన్నుపోటు పొడిచినా బాబును ఏమీ అనలేదు. మళ్లీ ఎన్నుకున్నారు. నా పాఠకులలో చాలామందికి నాపై కోపం వస్తుంది కానీ మళ్లీ చెప్పక తప్పదు –అవినీతికి ప్రజలు యిమ్యూన్ అయిపోయారు. రేపు తమిళనాడు ఎన్నికల ఫలితాలు వచ్చాక చూడండి. డిఎంకె, ఎడిఎంకెలకు వచ్చిన ఓట్లు కలిపి చూస్తే ఓ 60% వుంటాయి. వీళ్లందరూ అవినీతిని సహించినట్టే లెక్క. ఎందుకంటే డిఎంకె, ఎడిఎంకెలకు యిద్దరికీ అవినీతి యిమేజే! ఎవ్వరూ తీసిపోలేదు.

2

ఇప్పుడు అక్కడ ధనం ప్రవహిస్తోంది అని పెద్ద న్యూస్. అదేదో మనకు కొత్తయినట్లు ! ఇక జగన్ ఎన్నికల గుర్తు అది మరో న్యూస్. సీలింగ్ ఫ్యాన్ ఔట్‌డేటెడ్ అయిపోయింది, దానికి ఉరేసుకోవాలి, యివన్నీ సిల్లీగా లేవూ...! అన్నిటికన్నా సిల్లీ వైయస్ వారసత్వం గురించి. మొన్నటిదాకా వైయస్‌ను శుభ్రంగా తిట్టిపోసిన డియల్ ఈ రోజు వైయస్‌ను తిట్టలేదని బుకాయిస్తున్నారు. డియల్ అంటే 'డిపాజిట్ లేని' అని అంబటి రాంబాబు అన్నారు గానీ 'దిక్కు లేని' అని వుంటే బాగుండేది. ఎందుకంటే డియల్ అభ్యర్థిగా నిలబడకుండా వుండడానికి ఒంటికాలిపై నిలబడ్డారు. కానీ పట్టుకొచ్చిన ప్రతీవాడూ జారుకోవడంతో చివరకు తప్పలేదు. ఇక అప్పణ్నుంచి వైయస్ గురించి మాట్లాడినదంతా వెనక్కి తీసుకోవడం ప్రారంభమైంది.

కాంగ్రెస్ నాయకులకు ఈ వైయస్‌ను ఏం చేయాలో తోచకుండా వుంది. స్వంతం చేసుకోవాలా? వదిలేయాలా? కాస్సేపు యిదీ, కాస్సేపు అదీ. స్వంతం చేసుకునే మూడ్‌లో వున్నపుడు జగన్ వైయస్ బొమ్మ వాడుకోకూడదంటూ ఎలక్షన్ అధికారులకు ఫిర్యాదు చేసేవరకూ వెళ్లిపోయారు. అదేం తమాషానో! బోసు, అంబేద్కర్, కామరాజ్ నాడార్.. వీళ్లంతా కాంగ్రెస్ వదిలి వెళ్లిపోయి వేరే

పార్టీలు పెట్టుకున్నవాళ్లే. అయినా కాంగ్రెస్ వాళ్ల బొమ్మలు హాయిగా వాడేస్తూ వుంటుంది. టిడిపి ఎన్టీయార్‌ను తరిమేసి వేరే గ్రూపు పెట్టేసుకుని తమదే అసలైన టిడిపి అని స్పీకర్ చేత అనిపించేసింది. ఎన్టీయార్‌ది వేరే పార్టీ అయిపోయింది. ఇప్పుడు ఎన్టీయార్ బొమ్మలేని టిడిపి పోస్టర్ లేదు. వీళ్లంతా వాడుకోగా లేనిది వైయస్ బొమ్మను జగన్ వాడుకుంటే తప్పేముందో! వైయస్‌దేముంది, ఆ పథకాలన్నీ సోనియావే అన్నారు యిప్పటిదాకా. ఇప్పుడు వైయస్ మహానుభావుడంటున్నారు. ఉపయెన్నికలవగానే శంకరరావు, డియల్, వి హనుమంతరావు అండ్ కో ఎలాగూ పాత పాటే పాడతారు.

ఈ వైయస్ యాంగిల్ చాలదన్నట్టు బిజెపి యాంగిల్ పట్టుకొచ్చారు. కడపలో లక్షకుపైగా వున్న ముస్లిము ఓట్లు జగన్‌కు పడకుండా బిజెపి బూచి చూపిద్దామనుకున్నారు. బిజెపి-జగన్ కుమ్మక్కు కారణంగానే బిజెపి కాండిడేట్‌ను పెట్టలేదంటున్నారు. జగన్ నుండి స్పష్టమైన ఆన్సర్ వచ్చింది. పులివెందులలో వెయ్యి ఓట్లు, కడపలో 7 వేల ఓట్లు వున్న బిజెపితో పొత్తు పెట్టుకోవాల్సిన నాకేముంది? అని. పాయింటే కదా! అయినా వీళ్లు పాట వదిలిపెట్టకపోతే వ్యంగ్యంగా చెప్పాడు, బిజెపి ముస్లిములకు 10% రిజర్వేషన్ కల్పించినపుడు పొత్తు విషయం చూదాం అని. దానిలోని వెటకారం, అబ్సర్డిటీ యివాళ రాజకీయంలోకి వచ్చినవాడికైనా తెలుస్తుంది. కానీ వీళ్లు ఏమీ తెలియనట్టు అదిగో చూశావా, మనసులో కోరిక ఎలా బయటపడిందో అంటున్నారు.

ఈ బిజెపి బూచిని పెద్దది చేసి చూపించడంలో టిడిపి అభిమాన పత్రికలు ముందున్నాయి. కాంగ్రెస్, టిడిపి సరేసరి. కానీ ఎవరి ఐడియాయో తెలియదు కానీ, యిది పరమ చెత్త ఐడియా. ఎందుకంటే బిజెపి మాట ఎత్తి టిడిపి-బిజెపి సంబంధాలను ముస్లిములకు అనవసరంగా గుర్తు చేశారు. 2004 ఎన్నికలలో ఓడిపోయేదాకా టిడిపి బిజెపితో అంటకాగింది కదా. ఢిల్లీ గద్దె వెనక చక్రాన్ని టిడిపి సైకిల్ చక్రం తిప్పినంత సునాయాసంగా బాబు తిప్పారు కదా. గుజరాత్‌లో అల్లర్లయినప్పుడు కూడా బాబు బిజెపితో బంధం తెంపుకోలేదు. అవన్నీ యిప్పుడు కడప ముస్లిం ఓటర్లకు గుర్తు చేయడం దేనికి?

బిజెపి, వరల్డ్ బ్యాంక్ లోను, గాలి జనార్దనరెడ్డి అక్రమ మైనింగ్.. యివేమీ అక్కడ ఇష్యూస్ కానే కాదు. వైయస్ బొమ్మ, పథకాలు.. యివే అక్కడ నడుస్తాయి. వైయస్‌కు జై అంటావా, అనవా? ఇదే ఇష్యూ. ఉండవల్లి చెప్పినట్టు పోయాక వైయస్ బలం వెయ్యింతలైంది. ఆ టానిక్‌తోనే జగన్ నడుస్తున్నారు. వైయస్‌ను రోజూ తిట్టి తిట్టి శంకరరావు అండ్ కోలు జగన్‌కు ఆ టానిక్ అందిస్తున్నారు. బతికున్నవాడితో పోరాడడం ఓ పద్ధతి. చచ్చిపోయినవాడితో ఏం పోరాడతాం? చచ్చినవాడి కళ్లు చారెడు అంటారు. చచ్చిపోయిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఘనవిజయాన్ని కట్టబెట్టారు తమ వారసులకు. వైయస్‌కు ఆ పని చేతకాదంటారా? జగన్, విజయమ్మల విజయం ఖాయం.

లేటెస్టు వార్తలేమిటంటే చంద్రబాబు మీటింగులకు జనం బాగా వస్తున్నారట. కొంపదీసి మనం మూడోస్థానానికి వచ్చేయం గదా అన్న భయం పట్టుకుందట కాంగ్రెస్‌కు. వచ్చినా నేను ఆశ్చర్యపడను. ఎందుకంటే అక్కడ మొదట్నించీ కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లు వుంటాయి కదా. అవి యిప్పుడు కాంగ్రెస్‌కు ఎందుకు పడతాయి? కాంగ్రెస్ ఓటర్లలో కూడా వైయస్ పైన అభిమానం వుండి, జగన్ తీరు నచ్చనివాళ్లు చూస్తూ చూస్తూ వైయస్‌ను దారుణంగా తిట్టే డియల్‌కి వేయలేరు కదా ! మధ్యేమార్గంగా టిడిపికి వేయవచ్చు. తటస్థులు చాలామంది వుంటారు వారికి కూడా డియల్ భాష నచ్చకపోవచ్చు. చూడండి మొన్న సాక్షి పేపరును వరి?ంచిన విధానం. డాక్టరయి వుండి పబ్లిగ్గా ఎంత అసభ్యకరమైన పదాలు వుపయోగించారో చూడండి. వాళ్లకీ టిడిపి అంది వస్తుంది. నిజంగా కాంగ్రెస్ మూడో స్థానానికి వస్తే కిరణ్‌కు మూడినట్లే. అసమ్మతి పుంజుకుంటుంది. అది తప్పించాలనే కిరణ్ యిన్ని ఎత్తుజిత్తులు వేస్తున్నారు.

వాటిలో ఓ చిన్న ప్రయత్నం జగన్, విజయలక్ష్మి పేర్లతో డమ్మీలను నిలబెట్టి ఓట్లు చీల్చడం. ఎన్ని బోగస్ జగన్‌లను, విజయమ్మలను నిలబెట్టినా అనవసరమే. ఓటర్లు అంత తెలివి తక్కువ వాళ్లు కారు. కాంగ్రెస్‌కు తొలి ఎన్నికల గుర్తు - కాడీ జోడెద్దులు. ఇందిరా గాంధీ కాంగ్రెస్‌ను చీల్చినపుడు ఆ గుర్తు పాత కాంగ్రెస్‌కు పోయి, ఇందిరకు ఆవూ దూడా వచ్చింది. జనాలు కన్‌ఫ్యూజ్ అయి పాతగుర్తుకే వేస్తారనుకున్నారు. వాళ్లేమీ కన్‌ఫ్యూజ్ కాలేదు. చక్కగా ఆవుదూడాకే వేశారు. 1977 ఎన్నికల తర్వాత ఇందిరా గాంధీని ఇందిరా కాంగ్రెస్‌నుండి తరిమేశారు. 1978 ఆంధ్ర, కర్నాటక ఎన్నికల టైముకి ఇందిర పార్టీకి హస్తం గుర్తు యిచ్చారు. ఆంధ్రలో వెంగళరావు సిఎం, పార్టీ గుర్తు ఆవుదూడ. 'హస్తం గుర్తు జనాల్లోకి వెళ్లదు, ఇందిర సానుభూతి పరుల ఓట్లు కూడా కన్‌ఫ్యూజన్‌వలన అటే పడతాయి' అనుకున్నారు. పడలేదే! చక్కగా హస్తానికే వేశారు.

అప్పుడే అలా వుంటే ప్రచార సాధనాలు యిబ్బడిముబ్బడిగా పెరిగిన యీ రోజుల్లో ఓ ఎన్నికల గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతసేపు? అందువలన యింతమంది డమ్మీ వాళ్లను నిలపడం అనేది పిల్లాటలు. ఏదో వందల ఓట్ల తేడాలో గెలుపోటములు వుంటాయంటే యివి పనికి వస్తాయి. ఇప్పుడు అక్కడున్న ప్రశ్న జగన్ గెలుస్తాడా లేదా అన్నది కాదు. మెజారిటీ ఎంత అనేదే? అది లక్షల్లో వుంటుంది. అప్పుడు యీ డమ్మీలు ఎన్ని వందల ఓట్లు తెచ్చుకుంటే ప్రభావితం చేయగలరు?

3

జగన్ రెండు లక్షల మెజారిటీ కంటె ఎక్కువ స్థాయిలో నిజంగా గెలిస్తే మరి యీ ఉపాయాలన్నీ ఏమైనట్లు? ఈ మంత్రులంతా ఏం చేయగలిగినట్లు? ప్రభుత్వం పరువు పోయినట్టు కాదా? కాదు, ఆఫ్టరాల్ యిది ఒక ఉపయెన్నిక మాత్రమే అంటారు డియస్,

కిరణ్, డియల్ ఎక్స్ట్రా. అదేదో యిప్పుడే అనేసుకుని ఊరుకుంటే పోయి వుండేది కదా. ఒక్కసారి చరిత్ర తిరగేద్దాం.

జనతాపార్టీ అధికారంలోకి వచ్చాక ఇందిరా గాంధీ పని అయిపోయింది అనుకున్నారు. ఆవిడ 1977 ఎన్నికలలో రాయబరేలీలో రాజ్‌నారాయణ్ చేతిలో ఓడిపోయింది మరి. అప్పుడు చిక్‌మగుళూరులో ఒక ఇందిరా అభిమాని రిజైన్ చేసి ఉపయెన్నిక తెప్పించాడు. ఈవిడ వెళ్లి నిలబడింది. కన్నడ భాష రాదు, ఏమీ రాదు. ఆవిణ్ని అక్కడ ఓడించేసి రాజకీయ సమాధి కట్టేయాలని చరణ్‌సింగ్ యిత్యాదులు తెగ ప్రయత్నించేరు.

ఆవిణ్ని పట్టించుకోకండి, గెలిచినా ఒక సీటే కదా అని మొరార్జీ తన సహచరులకు నచ్చచెప్పినా వాళ్లు వినలేదు. ఆయనకు ఒళ్లు మండి ప్రచారానికి వెళ్లలేదు. ఫెర్నాండెజ్ తెగ తిరిగేశాడు ఇందిరాను ఓడించేయాలని. వీరేంద్ర పాటిల్ అని పాత కాంగ్రెస్ నుండి జనతాకి వచ్చిన నాయకుడు ఇందిరా గాంధీకి గట్టి పోటీ నిచ్చాడు. పెద్ద పెద్ద జనతా నాయకులందరూ దిగడంతో చిక్ మగుళూరు ఎన్నికపై చచ్చేటన్ని డిస్కషన్స్ చేశారు. వీళ్లు ఎంత గింజుకున్నా ఇందిరా గాంధీ 70 వేల మెజారిటీతో గెలిచింది. ఈ పబ్లిసిటీ వలన అది అందరి మెదళ్లలో రిజిస్టరైంది. ఇందిరా ఆన్ ది వే బ్యాక్ టు పవర్ అని హెడింగ్ పెట్టేసి పేపర్లు రాశాయి. 1980 నాటికి ఆ జోస్యం ఫలించింది కూడా. తమాషా ఏమిటంటే ఈ వీరేంద్ర పాటిల్ వెళ్లి కాంగ్రెస్ ఐ లో కలిశాడు.

ఎమ్జీయార్‌ను డిఎంకెలోంచి తీసేశాడు కరుణానిధి. దిండిగల్ అసెంబ్లీ సీటుకి ఉపయెన్నిక వచ్చింది. ఎమ్జీయార్ కాండిడేట్ నిలబడ్డాడు. ఎలాగైనా ఓడించి ఎమ్జీయార్‌ను ఫినిష్ చేసెయాలని కరుణానిధి పట్టుబట్టాడు. సైన్యాన్నంతా మోహరించాడు. అంతేకాదు, ఎమ్జీయార్ ప్రధానబలం అంతా సినిమానే కాబట్టి అక్కడే చావుదెబ్బ కొట్టాలనుకున్నాడు. ఎమ్జీయార్ అప్పట్లో ''ఉలగం సుట్రుమ్ వాలిబన్'' (లోకం చుట్టిన యువకుడు) అనే పేరుతో ఓ భారీ సినిమా – తన ద్విపాత్రాభినయంతో, ముగ్గురు హీరోయిన్లతో, విదేశీ లొకేషన్స్‌తో తన డైరక్షన్‌లో తీశాడు. అది ఫెయిలయిందంటే అతను ఆర్థికంగా విపరీతంగా నష్టపోతాడు. సినిమా నటుడిగా పరువుప్రతిష‘లు పోతాయి. – ఇన్నాళ్లూ డిఎంకె అభిమానులే అతన్ని నటుడిగా నిలబెట్టారనీ, వాళ్లు లేకపోతే యితని సినిమా చూసే దిక్కేలేదనీ ప్రచారం జోరుగా సాగిపోతుంది.

అందువలన ఆ సినిమాను ఎలాగైనా రిలీజ్ చేయించి హిట్ చేయించాలని ఎమ్జీయార్, రిలీజే కాకుండా చూడాలని, రిలీజైనా గోల చేసి ఫెయిల్ చేయించాలని కరుణానిధీ విపరీతంగా ప్రయత్నించారు. తమిళ రక్షణ సమితి అనే ఓ సంస్థ ఏర్పరచి ఆ సినిమా రిలీజ్ కావలసిన హాలు వద్ద నిరసన ప్రదర్శనలు చేయించాడు కరుణానిధి. ఎమ్జీయార్ మలయాళీ కాబట్టి అతని సినిమాలు తమిళనాడులో ఆడకూడదని ఈ సమితి వారి డిమాండ్.

కట్ చేస్తే – దిండిగల్ ఉపయెన్నికలో ఎమ్జీయార్ కాండిడేట్ బ్రహ్మాండంగా నెగ్గాడు. ''ఉలగం..'' సూపర్ డూపర్ హిట్ అయింది. కరుణానిధి వెనక్కాల వుండి యితన్ని తిట్టినవాళ్లు ఒకరొకరూ యిటు రావడం మొదలెట్టారు. తర్వాతి ఎన్నికలలో కరుణానిధిని ఎమ్జీయార్ ఓడించాడు. ఎమ్జీయార్ బతికున్నంత కాలంలో కరుణానిధి మళ్లీ సిఎం కాలేకపోయాడు. సిఎం అయ్యాక కూడా ఎమ్జీయార్ పెట్టిన పార్టీ చేతిలో ఎన్నికలలో ఓడిపోయాడు. ఈ సారి బహుశా ఓడిపోబోతున్నాడు.

ఇన్ని చూసినవాణ్ని కాబట్టి రేపు జగన్ గెలిచి కాస్త వెలుగులోకి వస్తే మైసూరా రెడ్డి కాని డియల్ కానీ యిద్దరూ కానీ వచ్చి జగన్ పార్టీలో చేరినా నేను కళ్లు తిరిగి పడను. చిరంజీవి కాంగ్రెస్ కండువా వేసుకుని, కాంగ్రెస్ టోపీ పెట్టుకుని చెమటలు కక్కుకుంటూ రాష్ట్ర సరిహద్దులు దాటి ప్రచారం చేస్తాడని 2009 కి ముందు ఎవరైనా చెప్తే మీరు నమ్మి వుండేవారా? కడపలో కాంగ్రెస్ పక్షాన పెద్ద లీడర్‌గా వుండి బాబును బిగ్‌బాస్ అని ఆరోపించిన మైసూరారెడ్డి యీరోజు టిడిపి అభ్యర్థిగా నిలబడతాడని 7,8ఏళ్ల క్రితం అనుకున్నామా?

ఈ ఉపయెన్నికకి యింత ప్రాముఖ్యత యిచ్చి వుండకపోతే అసలు పోలింగ్ శాతమే పెద్దగా వుండదు, జగన్ ఎలాగూ గెలుస్తాడు కదాని. అతని మెజారిటీ కూడా అంత వుండదు. కానీ యిప్పుడు లైఫ్ అండ్ డెత్ క్వశ్చన్ చేశారు. ఏ రెండున్నర లక్షల మెజారిటీయో వచ్చిందనుకోండి 'జగన్ శకం ప్రారంభమైంది' అని మీడియా రాయడం మొదలెడుతుంది. అవును కాబోసు అనుకుంటూ నాయకులు అటు పరుగులు పెడతారు. కిరణ్ గద్దె ఊగ నారంభిస్తుంది.

యుద్ధంలోకి దిగేముందే బలాబలాలు చూసుకోవాలి. అనువుకాని చోట అధికుల మనరాదు. రేపు పోచారం శ్రీనివాసరెడ్డి నియోజకవర్గంలో ఉపయెన్నిక జరుగుతుంది. కాంగ్రెస్, టిడిపి యిదే స్థాయిలో సైన్యాలను మోహరిస్తాయా? (మొన్న తెలంగాణా ఉపయెన్నికలలో డియస్ స్థానంలో తప్ప వేరే చోట పెద్ద ఉత్సాహమే చూపలేదు.) ఫలితాల సంగతి ఊహించగలిగిననపుడు ప్లే డౌన్ చేయాలి. ఒక్క ఎసెంబ్లీ సీటుతో, ఒక్క పార్లమెంటు సీటుతో జగనేం చేయగలడు? అన్నట్టు ప్రవర్తించాలి. కానీ వీళ్లు యిప్పుడు దీని ఒక్కదానితో ప్రపంచ చరిత్ర తిరగరాసేటంత బిల్డప్ యిస్తున్నారు. అనుభవిస్తారు.

ఇంతేకాదు యింతకంటె పిచ్చి ఐడియాలున్నాయట కాంగ్రెస్ దగ్గర ! ఇప్పుడు షోకాజ్ నోటీసు యిచ్చిన ఎమ్మెల్యేల చేత రిజైన్ చేయించి ఉపయెన్నికలు పెట్టించి ప్రచారానికి జగన్‌ను కడపలోనే పరిమితం చేస్తారట. దాంతో జగన్ రాష్ట్రంతా తిరగలేడట. అదంతా సేఫ్టట. జగన్ యిప్పటికిప్పుడు రాష్ట్రమంతా కలియతిరగవలసిన పనేముందసలు? ఉపయెన్నికలలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ నెగ్గితే అప్పుడు ఆ పార్టీ ఎంత అప్‌బీట్ మూడ్‌లో వుంటుందో ఆలోచించండి. అది గెలిచే గ్రూపు కిందా, కాంగ్రెస్ ఓడే గ్రూపు కిందా అందరికీ గోచరిస్తుంది. గెలిచే గ్రూపు మీదే అందరికీ మోజు. కాంగ్రెస్ మనను గట్టెక్కించలేదు అన్న భయం పుడితే అందరూ

జగన్‌వైపే చూపు సారిస్తారు. అది కాంగ్రెస్‌కు ఎంత నష్టం! సాధ్యమైనంతవరకు యిటువంటి పరిస్థితి రాకుండా ఎలాగోలా నెట్టుకురావాలి. కానీ జగన్ వ్యతిరేకులు కాంగ్రెస్ హై కమాండ్‌ను ఊదరగొట్టేస్తున్నారు. హై కమాండ్ కళ్లు తెరిచేవరకూ పరిస్థితి బాగుపడదు.

మన కబుర్లకు ఉపయెన్నికల గురించి యింత చాలు. ఇంతకంటె ఏం రాసినా వేస్టే! **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2011)**

## మే 02 ఎమ్బీయస్ : కిరణ్‌పై జీవకారుణ్యం – 1

ఆజాద్‌గారు వచ్చారు, వెళ్లారు. మాట్లాడింది తక్కువ, విన్నది ఎక్కువ. తెలంగాణా గురించి తేల్చమని, జగన్ అనుయాయులపై చర్య తీసుకోమని వేర్వేరుగా చెప్పినా, అందరూ ముక్తకంఠంతో ఫిర్యాదు చేసినది మాత్రం – కిరణ్ వ్యవహారశైలి పైననే. ఎవరికీ అందుబాటులో వుండరనీ, ఎవరితోనూ సంప్రదించరనీ, అందరినీ కలుపుకుపోవడంలో విఫలమయ్యారనీ... యిలాటివే.

జగన్‌ను ఎదగనీయకుండా చేయడంలో విఫలమయ్యారనే ప్రధానమైన ఆరోపణ హై కమాండ్ మనసుకు బాగా పట్టే మాట. రేపు కిరణ్‌పై చర్య తీసుకున్నా, ఆ కారణమే చాలా అనువుగా తోస్తుంది. ఎందుకంటే వాళ్లకు బొత్తిగా మింగుడు పడని అంశం – జగన్ గెలుపు. హై కమాండ్‌కి బెంగాల్‌లో, అసాంలో గెలుస్తామని తెలుసు. కేరళలో ఛాన్సు వుందని తెలుసు. తమిళనాడులో మొదట్లో కాస్త అటూ, యిటూగా అనుకున్నా మధ్యలోకి వచ్చేసరికి తెలిసిపోయి వుంటుంది, నెగ్గే ఛాన్సు లేదని. బొత్తిగా సింగిల్ డిజిట్‌కు దిగిపోతామని అనుకోవచ్చు కానీ అధికారం చేజారుతుందని మాత్రం అర్థమయ్యే వుంటుంది. కానీ సోనియాను పేరు పెట్టి విమర్శిస్తూన్న యీ 'కుర్రకుంక' యిలా రికార్డు మెజారిటీతో గెలవడం బొత్తిగా జీర?ించుకోలేని విషయం. దానికి ఎవరో ఒకర్ని బలి చేయకపోతే మనసు శాంతించదు.

నిజానికి జగన్‌కు యింత మెజారిటీ తెప్పించవారెవరు చెప్పండి – కాంగ్రెస్‌వారు కాకపోతే. జగన్ రాజీనామా చేసి తనూ, తల్లీ నిలబడతామనగానే 'సో వాట్...?' అని వూరుకుంటే పోయుండేది. ఎవరో కోన్‌కిస్కాయిని పేరుకి నిలబెట్టి పట్టించుకోకుండా వుంటే జగన్ ఎలాగూ గెలుస్తాడు కదాని వూళ్లో జనం పోలింగ్‌కే వచ్చేవారు కారు. పోలింగ్ శాతం తగ్గేది. జగన్ కూడా 'డూ ఆర్ డై' ఫైట్ చేసి వుండేవారు కారు. విజయమ్మగారు వేసవి ఎండలో రోడ్లమీద తిరిగి ఓట్లకోసం అభ్యర్థించేవారు కారు. సింపతీ పెరిగేది కాదు. అప్పుడు యింత మెజారిటీలు వచ్చేవి కావు. మహా అయితే సగం వచ్చేవేమో.

కానీ కాంగ్రెస్ ఏం చేసింది? జగన్ అనే ఒక అవినీతిపరుడు ఎంపీ అయితే ఆకాశం కూలిపోతుందని, భూమి క్రుంగిపోతుందని ప్రచారం చేసింది. ఆ వేడుకేదో చూద్దామని కాబోలు కడప జనం నెగ్గించి చూశారు. ఇప్పుడేమైంది? ప్రళయాలు ఏమైనా వచ్చాయా? రావని మాకు ముందే తెలుసు అంటున్నారు కాంగ్రెస్ వారు – యిప్పుడు...బొక్కబోర్లా పడ్డాక ! ఈ తెలివి అప్పుడేమైందట? అసలు ఉపయెన్నిక ప్రకటించగానే జగన్‌ను ఎదుర్కొనే కాండిడేట్‌ను ముందే వెతికి పెట్టుకోకపోవడం కిరణ్ పొరబాటు అని యిప్పుడందరూ ఆయన్ని తప్పు పడుతున్నారు. మీరే ఆయన స్థానంలో వున్నారనుకోండి. ఎవర్ని సెలక్ట్ చేసి జేబులో పెట్టుకుంటారో చెప్పండి చూద్దాం. బుద్ధి వున్న రాజకీయనాయకుడు ఎవడూ కడపలో వైయస్ భూతంతో తలపడడు. చచ్చినవాడి కళ్లు చారెడు అని మనకు సామెతే వుంది.

ఇవాళ నా ఆర్టికల్స్ చదివేవాళ్లు పెద్దగా లేకపోయినా, నా పుస్తకాలు అమ్ముడుపోకపోయినా రేపు నేను చస్తే, నా స్మారక సభలో 'ప్రసాద్‌గారికి పద్మశ్రీ యివ్వకపోవడం అన్యాయం. ఆయన తెలుగువాడిగా పుట్టడం మన అదృష్టం, ఆయన దురదృష్టం. ఆయన రచనలన్నీ ప్రభుత్వమే తన ఖర్చుతో ముద్రించి, తక్కువ ధరలో ప్రజలకు అందించాలి' అని కనీసం ఒకడైనా అని తీరతాడు. ('ఆయన పుస్తకాలు మార్కెట్లో వున్నవే అమ్ముడుపోవడం లేదు, యింకా కొత్తవి ఎందుకు బాబూ?' అని సభలో వున్న పుస్తకాలషాపు వాడు గొణుక్కున్నా సరే). నేను బతికుండగా షేక్‌హ్యాండ్ యిస్తే అందుకోవడానికి సంకోచించే పెద్దపెద్దవాళ్లు నా శవానికి నమస్కారాలు పెట్టేస్తారు. ప్రస్తుతం నేనేం చేయలేనన్న ధైర్యంతో నాకు యివ్వాల్సిన బాకీలు ఎగ్గొట్టినవారు నేను ఛస్తే మాత్రం హడిలి ఛస్తారు. దెయ్యమై తిరుగుతున్నానని నా వారసులు పుకారు పుట్టిస్తే చాలు, పరిగెత్తుకుంటూ వచ్చి బాకీ తీర్చేస్తారు. ఇవాళ నేను తలకాయ దువ్వుకున్నా, దువ్వుకోకపోయినా పట్టించుకోరు. చచ్చిన మర్నాడు వచ్చి వినండి. నేను ఎంత షోగ్గా దువ్వుకునేవాణ్నో, దువ్వుకున్నాక దువ్వెన శుభ్రం చేసి గూట్లో ఎలా పెట్టేవాణ్నో, మంచినీళ్లు తాగాక మూతి ఎలా తుడుచుకునేవాణ్నో, కళ్లజోడు కోసం ఎలా వెతుక్కునేవాణ్నో.. వేయేల, నా గురించి ప్రతీదీ ఓ ముచ్చటే ! నేను తప్ప యీ సృష్టిలో వేరే యెవరూ యిలా చేయరన్నంత 'జోష్'తో చెప్పుకుంటారు అవేళ.

నా బోటి సామాన్యుడే చచ్చాక యింత బలాన్ని సంతరించుకుంటే వైయస్ వంటి నేత ఎంత సమకూర్చుకుంటాడు చెప్పండి. బతికున్న ఇందిరా గాంధీ సంపాదించలేనన్ని పార్లమెంటు సీట్లు చచ్చిపోయిన ఇందిరా గాంధీ తన కొడుక్కి సంపాదించి పెట్టింది. అంతెందుకు సోనియా పేరు చివర 'గాంధీ' అని లేకపోతే ఆవిడ అపాయింట్‌మెంట్ల గురించి పేపర్లో చదివ్తేవాళ్లమా? రాహుల్ 'గాంధీ' కాకపోతే అతని అమూల్ బేబీయో, ఫారెక్స్ బేబీయో చర్చించ్తేవాళ్లమా? పెళ్లయిందో లేదో కనుక్కునేవాళ్లమా?

ఎక్కడో ఢిల్లీవాళ్లను అనుకోవడం ఎందుకు? ఎన్టీయార్ కూడా చచ్చిపోయాకనే కదా చంద్రబాబుగారికి ఆప్తుడయ్యాడు ! ఆయన

బతికేవుంటే టిడిపి భవనానికి ఎన్టీయార్ భవన్ పేరు పెట్టేవారా? ఆయన పేర ట్రస్టులు వుండేవా? జూనియర్ పెళ్లి శుభలేఖలో హరికృష్ణ? ఆయన ఫోటో వేయించేవారా? పోయాక ఆయన పిల్లలందరూ ఆయన ఫోటోలు యిళ్లల్లో తెగ తగిలించేస్తున్నారు కానీ బతికుండగా రమ్మనమని అనలేదే ! అని వుంటే ఆంధ్రప్రదేశ్ చరిత్రే మరోలా వుండి వుండేది. ఆంధ్రప్రదేశే ఏం ఖర్మ ! దేశచరిత్రే మారేదేమో, ఎన్టీయార్ వెంట తెలుగుదేశం వుండి వుంటే ఆయనే యునైటెడ్ ఫ్రంట్ తరఫున ప్రధానమంత్రి అయి వుండేవారేమో.

ఏతావాతా దీనివలన తేలేదేమిటంటే మనకు బ్రహ్మాండమైన యిమేజి రావాలంటే మనం చనిపోవాలి. వైయస్ ఆ పని చేశారు. అదీ రాష్ట్రప్రభుత్వం తరఫున ప్రజలకోసం చేపట్టిన కార్యక్రమానికి వెళుతూ చేశారు. ఎన్నికలలో ఓటమో, గెలుపో బాధ్యత నాది అని సవాల్ చేసి రాష్ట్రంలో, కేంద్రంలో యుపిఏ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించి అప్పుడు చేశారు. మరి అలాటివాడి పవర్ ఎంత వుంటుందో ఊహించండి.

## 2

అణుశక్తిని అటూ యిటూ వాడవచ్చు. ఎలా వాడుకోవాలో ముందే తేల్చుకోవాలి. వైయస్ పవర్‌ను ఎలా వాడాలో జగన్‌కు స్పష్టత వుంది. ఈ నాటి యీ మెజారిటీలో మేజర్ షేర్ వైయస్ స్మృతిదే! ఆ తర్వాతే జగన్ డబ్బు, దక్షతా, ఎన్నికల ప్రణాళికా, క్యాడరూ, వగైరా, వగైరా. కాంగ్రెస్‌కు మాత్రం వైయస్ వారసత్వం విషయంలో స్పష్టత లేదు. అది కంఠాభరణమో, గుదిబండో యింకా తేల్చుకోలేదు. కాస్సేపు రాష్ట్రంలో అన్ని అనర్థాలకూ కారణం వైయస్సంటారు, మరి  కడప ఎన్నికలు వచ్చేసరికి అబ్బే వైయస్ మా వాడే. జగన్ అతని ఆస్తులకు వారసుడు కానీ సిద్ధాంతాలకు వారసులం మేమే అంటారు. అసలు వైయస్‌ను అంతటివాణ్ని చేసింది మేమే అంటారు.

ఇంకాస్సేపటికి పథకాలు సోనియావి, అవినీతి వైయస్‌ది అంటారు. మరి అవినీతికి పాల్పడితే సోనియా ఏం చేసింది అంటే దానికి సమాధానం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ వాళ్లంతా కూర్చుని 'ఈ వైయస్ భూతం కారెక్టరు ఏమిటో తేల్చుకుందాం. అది పనులు చేసిపెట్టే అల్లావుద్దీన్ అదుతేదీపం తాలుకూ భూతం లాటిదా? లేక జాలరివాడు తెరిచిన జాడీలోంచి బయటకు వచ్చి మింగేస్తానని బెదిరించిన భూతం లాటిదా? మనం ఓ మాట అనుకుని అది జనాలకు చెపుదాం' అనుకుంటే మంచిది.

రష్యాలో లెనిన్ పాలన అయిపోయాక ఆయన వారసుడిగా స్టాలిన్ వచ్చాడు. లెనిన్ కంటె భిన్నమైన పాలన, అయినా లెనిన్‌ను తిట్టలేదు. గౌరవిస్తూనే తన పంథాలో తను వెళ్లాడు. స్టాలిన్ తర్వాత కృశ్చేవ్ వచ్చాడు. 'స్టాలిన్ పరమ నియంత, దుర్మార్గుడు. రష్యాను తగలేశాడు. మేం యిప్పుడు అధికారంలోకి వచ్చాం కాబట్టి రష్యాను ఉద్ధరిస్తాం' అని ఉపన్యాసం యిస్తున్నాడు ఓ సభలో. "అతనంత నియంత అయితే మరి అప్పుడు నువ్వేం వూడబొడిచావట?" అని సభలోంచి ఎవడో అరిచాడు.

వెంటనే కృశ్చేవ్ "ఎవరక్కడ?" అని అరిచాడు. అరిచినవాడు కిక్కురుమనలేదు. "ఎవరది నన్ను ధిక్కరించి మాట్లాడినది? పోలీసులేం చేస్తున్నారు?" అని హుంకరించాడు కృశ్చేవ్. పోలీసులు ఆ కేక వచ్చినవైపు కదిలారు. అరిచినవాడు అణిగిపోయి, జనం కాళ్లమధ్యలో దూరిపోయాడు. కృశ్చేవ్ చెయ్యెత్తి పోలీసులను ఆగమన్నాడు. "అరిచినవాడు ఇప్పుడేం చేస్తున్నాడో నేనూ స్టాలిన్ టైములో అదే చేశాను" అన్నాడు. జనాలకు అర్థమైంది. చప్పట్లు కొట్టారు. స్టాలిన్ టైములో జరిగినదాని గురించి కృశ్చేవ్‌ను నిలదీయడం మానేశారు. కృశ్చేవ్ స్టాలిన్‌ను విమర్శిస్తూనే పోయాడు తప్ప మధ్యలో నెత్తి కెత్తుకోలేదు. స్టాలిన్ అభిమానులుంటారు, వాళ్ల ఓట్లు పోతాయని తెలిసినా కూడా తను మారలేదు.

అలాగే వైయస్ పాలనను వ్యతిరేకించదలచుకుంటే కాంగ్రెస్ ఆ పని నిక్షేపంలా చేయవచ్చు. పివి పాలనను వాళ్లు ఎలా పరిగణిస్తున్నారో చూస్తున్నాంగా. కరుణానిధిని యిప్పటిదాకా మోశారు, ఇప్పుడు 'డిస్‌ఓన్' చేయడానికి ఉవ్విళ్లూరుతున్నారు. అలాగే 'వైయస్ కూడా మాకు తలకాయనొప్పి తెచ్చిపెట్టాడు. నమ్మి సోనియా అధికారం అప్పగిస్తే దాన్ని అడ్డుపెట్టుకుని కోట్లు సంపాదించుకున్నాడు. పాపం సోనియా మోసపోయారు' అని చెప్పేసుకుని భారం దింపేసుకోవచ్చు. తప్పులేదు.. నమ్మినవాళ్లు నమ్ముతారు, నమ్మనివాళ్లు వాళ్ల పాపాన వాళ్లే పోతారు. కానీ కాంగ్రెస్‌కు ఆ ధైర్యం లేదు. తెలంగాణా అంశాన్ని నానబెట్టి నానబెట్టే కదా యింత పెద్ద బూచిని చేసింది.. అలాగే వైయస్‌ని కూడా.

జగన్‌ను దూరం చేద్దామని గట్టిగా అనుకున్నాక వైయస్‌తో పనిలేదనుకున్నారు, వైయస్‌ను తిట్టిన ఘనత తప్ప వేరే ఏ క్వాలిఫికేషనూ లేని శంకర్రావును, డియల్‌ను మంత్రులను చేశారు. కడపలో కాండిడేట్ అవుతానని కలలో కూడా అనుకోని డియల్ మరీ రెచ్చిపోయారు. అలాటిది హఠాత్తుగా తనే కాండిడేట్ కావడంతో గొంతుకి వెలక్కాయ అడ్డుపడింది. గతంలో జగన్‌ను తప్ప వైయస్‌ను తిట్టలేదని చెప్పుకుని తప్పించుకోబోయారు. ఎవరు నమ్ముతారు? ఆయన స్వంత నియోజకవర్గంలోనే జగన్‌కు మెజారిటీ వచ్చిందంటేనే తెలుస్తోంది అయ్యగారి ప్రతాపం. ఎన్నికలు జరిగాక నోరు లేవటం మానేసింది. ఆస్తులు రాసిస్తారేమోనని మేం ఎదురు చూడటం లేదు సార్ అని విలేఖరులు చెప్పేదాకా ఆయన బయట కనబడరేమో! డిపాజిట్‌కూడా దక్కని స్థాయి మనిషి అంత లెవెల్లో మాట్లాడే అవసరం వుందా? అని అనిపిస్తోంది కదా! వీళ్లు బతికున్న వైయస్‌తోనే పోట్లాడలేకపోయారు. చచ్చిపోయిన వైయస్‌తో పోట్లాడి గెలవగలరా?

కరీంనగర్ ఉపయెన్నికలో వైయస్ కాబినెట్ మోహరించినట్టే నేనూ యిప్పుడు మోహరించాను. అప్పుడూ సెక్రటేరియట్‌లో పని

స్తంభించింది, యిప్పుడూ స్తంభించింది– అని కిరణ్ పోలిక తెచ్చుకుంటున్నారు. కరెక్టే. కరీంనగర్ ఉపయెన్నిక తర్వాత పాఠాలు ఏమీ నేర్చుకోలేదా? అప్పటి తెలంగాణా సెంటిమెంటు (తర్వాతి ఉపయెన్నికలో అది ధామ్మని పడిపోవడం వేరే విషయం) ముందు మహా మహా వైయస్సే ఏమీ చేయలేకపోయారని గ్రహించినపుడు, యిప్పుడు మళ్లీ చావు సెంటిమెంటుతో పోరాడదామని చూడడంలో ఏ వివేకం వుంది? ఇది పాలపొంగని, దీనితో పాలకోవా తయారవదని ఎన్నికల ముందు తెలియదా? కోట్లు కోట్లు ఖర్చుపెట్టాక, నెల్లాళ్లు పరిపాలన పడుక్కోబెట్టాక తెలిసి వచ్చిందా? వైయస్ బతికివుండగా రెండు లక్షల మెజారిటీ కూడా తెచ్చుకోలేక పోయిన జగన్‌ను అయిదున్నర లక్షల మెజారిటీ హీరోగా తయారుచేయడం పొరబాటు కాదా?

ఈ పొరబాటును కిరణ్ నెత్తిన రుద్దేయాలని చూడడం తప్పని నా వుద్దేశం. ఈ ప్లానింగంతా హై కమాండ్‌దే. జగనేముంది ఆఫ్టరాల్ అని రాహుల్ అండ్/ఆర్ సోనియా అనుకోబట్టే కథ యింత దూరం వచ్చింది. వైయస్ బతికుండగా ఏదో మనకూ చేశాడు, మనం అతనికి చేశాం. ఆ చాప్టర్ అయిపోయింది. వైయస్ బొమ్మ నిమజ్జనం చేసేసి, మన బొమ్మ తడాఖా చూపిద్దాం అనుకున్నారు వాళ్లు. ఇప్పుడు అసాంలో కాంగ్రెస్ మూడోసారి అధికారంలోకి వచ్చిందంటే అక్కడ తరుణ్ గొగోయ్ ప్రతిభ అని మీరూ నేనూ అమాయకులం కాబట్టి అనుకుంటాం. కానీ ఢిల్లీవారు కాదంటారు. సోనియా, రాహుల్ యిచ్చిన స్ఫూర్తివలననే నెగ్గారంటారు. మరి ఆ స్ఫూర్తి పాండిచ్చేరిలో పనిచేయలేదేం అని అడిగితే కన్నెర్ర చేస్తారు. 'వెళ్లు మా పేరు చెప్పి, ఓట్లు సంపాదించేసి, జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించేయ్' అని అభయముద్ర పడతారు. ఏడిశారులే, మీకంత సీన్ లేదని రాష్ట్రనాయకులు మనసులో అనుకున్నా పైకి అనలేక అంతకంటె మహద్భాగ్యం వుందా? అంటారు.

3

హై కమాండ్ అలా ఆర్డర్లేస్తున్నపుడు కిరణ్ ధైర్యంగా 'ఇదంతా నడిచే వ్యవహారం కాదు మేడమ్' అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పేస్తే పోయెగదా అంటాం మనం. ఎందుకంటే మనం కిరణ్ స్థానంలో లేము కాబట్టి. ఏదైనా ఉద్యోగానికి అప్లయి చేసినపుడు రెస్యూమె ఎలా తయారుచేస్తాం చెప్పండి. మాకు అది వచ్చు, యిది వచ్చు, మేం పొడిచేస్తాం, అదరగొట్టేస్తాం, చచ్చేదాకా మీ కంపెనీలోనే పడి వుంటాం – యిలా ఎన్నో అతిశయోక్తులతో తయారుచేస్తాం.

అలాగే ఆయనా తన రెస్యూమె తయారుచేసి పట్టుకెళ్లాడు 'ఈ రోశయ్యగారికి జగన్‌ను నిలవరించడం రావటం లేదు, నేనైతే కఠినంగా వ్యవహరించి అటు తెలంగాణాను, యిటు జగన్‌ను హ్యేండిల్ చేసేస్తాను. మీకు ఏ తలనొప్పీ లేకుండా చేస్తాను' అని. ఇతను అంతటివాడే సుమా అని చిదంబరంగారు సర్టిఫై చేశారట. రాయలసీమ, రెడ్డి, యువరక్తం యిలాటి అంశాలు సరిపోయాయి. జగన్‌కు సమ వుజ్జీ యితనే అన్నారు. ముద్ర కొట్టి పైనుంచి మనకు తోసేశారు.

ఈ రోజు కిరణ్ చేతకానివాడు, అహంభావి, టీమ్ లీడర్‌షిప్ గుణాలు లేవు అని అంటే మరి అవేళ ముద్ర కొట్టినవాణ్ని ఏమనాలి? ఏది యిత్తడో, ఏది పుత్తడో తెలియని శుంఠ అనుకోవాలా? ఇతనికి శిక్ష పడితే అతనికీ (లేదా ఆమెకు) శిక్ష పడాలిగా ! కానీ పడదు. ఎందుకంటే పార్టీ అధినాయకత్వం తన తప్పు తను ఎప్పుడూ ఒప్పుకోదు. వినాయకచవితి నాడు గుంజీలు తీసి, మొట్టికాయలు వేసుకున్నట్టు పార్టీ ప్లీనరీ సమావేశంలో 'ఫలానా కాండిడేట్‌ను ఎంపిక చేయడం తప్పే' అని ఎప్పుడూ లెంపలు వేసుకోరు.

ఆ లెంపలేసే పని జనాలు చేపడతారు. అవకాశం రాగానే ఎడాపెడా వాయించేస్తారు. ఇప్పుడు సిపిఎంకు బెంగాల్‌లో, కేరళలో వాయించారు చూడండి.. అలాగ. మొన్నటిదాకా ఎత్తుగుర్రం మీద సవారీ అవుతున్న కారత్‌గారు ఇప్పుడు 'మాది సమిష్టి బాధ్యత. సమీక్షించుకుని సరిదిద్దుకుంటాం' అంటున్నారు. ఏం, పంచాయితీ ఎన్నికలలో దెబ్బతిన్నపుడు, పార్లమెంటు ఎన్నికలలో దెబ్బ తిన్నపుడు దిద్దుబాటు చర్యలు ఎందుకు చేపట్టలేదు బాబూ?

ఇప్పుడు కాంగ్రెస్సూ అంతే. తమిళనాడులో డిఎంకెతో పొత్తు పెట్టుకుందామని వాదించిన వాళ్లందరినీ పట్టుకుని ఓ ఉతుకు ఉతికేయాలి. వాళ్ల పోస్టులు అటూ యిటూ మార్చేసి కొంతకాలం వనవాసానికి పంపాలి. అలా ఉతకదలిస్తే మొదటి పిండబడేది మన ఆజాద్ గారే. ఆయనే తమిళనాడుకి ఇన్‌చార్జి. అక్కడ చేసిన నిర్వాకం కింద పెట్టుకుని మన రాష్ట్రానికి వచ్చి పరిస్థితిని అధ్యయనం చేసేసి హై కమాండ్‌కు చెప్తారట. స్థానిక పరిస్థితులు సరిగ్గా అంచనా వేయగల ప్రజ్ఞే వుంటే మరి తమిళనాడు అలా అఘోరించిందేం? పొత్తుదారుతో గీచి గీచి బేరాలాడి 65 స్థానాలు తెచ్చుకున్నాం, అది కూడా ఏ యే స్థానాలు కావాలో మేమే ఎంచుకున్నాం అని గొప్పలు చెప్పుకున్నారు. చివరకు ఏమైంది? చేతి గుర్తులో ఐదువేళ్లు కదాని ఐదు సీట్లు దక్కాయి. తమిళనాడు ఎసెంబ్లీలో అంత తక్కువ సీట్లు ఎప్పుడూ తెచ్చుకోలేదు కాంగ్రెస్.

మరి దానికి వధ్యశిల ఎక్కవలసినది ఎవరు? డిఎంకెతో పొత్తు పెట్టుకుందామని నిర?యించిన సోనియమ్మ దగ్గర్నుంచి కాంగ్రెస్ అధినాయకులందరూ ఎక్కాలి. కానీ ఎక్కుతున్నారా? తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగబాలును ఒక్కణ్నీ బలి వేసేసి న్యాయం జరిపేసినట్టు ఫీలై పోతున్నారు. కావాలంటే యిక్కడ కూడా డి శ్రీనివాస్‌ను ఒక్కణ్నీ మార్చేసి ఉపయెన్నిక తదనంతర దిద్దుబాటు చర్యలు చేపట్టేశాం అని సిలబస్ పూర్తయిన తర్వాత చప్పట్లు కొట్టేసినట్లు కొట్టేయమను.

మధ్యలో కిరణ్‌ను ఎందుకు మార్చాలి? ఉపయెన్నికలలో సాధారణంగా ప్రతిపక్షం వాళ్లు గెలుస్తూంటారు. అలా గెలిచినా ప్రతీసారీ ముఖ్యమంత్రి మారిపోతాడా? గట్టిగా మాట్లాడితే విజయలక్ష్మిగారు గెలిచినందుకు కిరణ్‌ను మార్చాలంటే పార్లమెంటు స్థానానికి జగన్ గెలిచినందున ప్రధానమంత్రిని కూడా మార్చేయాలి.

ఈ ఎన్నికలతో బాటు జరిగిన వివిధ రాష్ట్రాలలోని ఉపయెన్నికలలో కాంగ్రెస్ ఓడిపోయింది. అక్కడంతా పిసిసి ప్రెసిడెంట్లను మారుస్తారా? అక్కడెక్కడా మార్చనపుడు యిక్కడ డియస్‌ను మాత్రం ఎందుకు మార్చాలి? ఆయనేమైనా జగన్‌ను ఓడించి తీరతానని ఛాలెంజ్ చేశాడా? పట్టించుకోకండి బాబూ అని చిలక్కి చెప్పినట్టు చెప్తూ వచ్చాడు. విన్నారా? ఈ డియల్, ఆ వీరశివారెడ్డి ఛాలెంజ్‌ల మీద ఛాలెంజ్‌లు. ఆస్తులు రాసిచ్చేస్తామని. అయినా నాకు తెలియక అడుగుతాను – ఇలా ప్రకటించడం బెట్టింగ్‌కింద రాదా? ఓపెన్‌గా బెట్టింగ్ చేస్తే నేరం కాదా? శిక్ష పడదా? ఇక శంకర్రావు, విహెచ్, పాల్వాయి వెరయిటీ వెరయిటీ జీవులందరూ కలిసి రోజుకొహటి కూసి ఎలక్షన్ కాంపెయిన్‌ను కంపు కంపు చేయలేదా?

వారిపై డియస్‌కు గాని, కిరణ్‌కు గాని కంట్రోలుందా? వారెవరైనా స్టేటుమెంటు యివ్వబోయేముందు కిరణ్‌కు చూపించి యిస్తున్నారా? అసలు వైయస్‌స్మృతిపై మా స్ట్రాటజీ యిది అని హై కమాండ్ ఎప్పుడైనా కిరణ్‌కు, స్థానిక నాయకులకు స్పష్టంగా చెప్పిందా? నా ఉద్దేశంలో చెప్పి వుండదు. చెప్పి వుంటే అందరూ అదే ధోరణిలో మాట్లాడివుండేవారు. కాస్సేపు హీరోగా, కాస్సేపు విలన్‌గా, కాస్సేపు మా వాడని, కాస్సేపు కాదనీ యింత కన్‌ఫ్యూజింగ్‌గా వుండేది కాదు వ్యవహారం. స్పష్టంగా చెప్పకపోవడానికి కారణం – ఏం చేస్తో మంచిదో వాళ్లకూ తెలియదు. ఇదో ప్రయోగం చేసి చూశారు. చీదేసింది. తప్పులేదు. వచ్చేసారి యింకో వైపునుంచి నరుక్కు వస్తారు. కానీ యీ లోపున టెస్ట్‌ట్యూబ్‌దో, గ్యాస్ బర్నర్‌తో తప్పనకూడదు. ప్రయోగాలు చేయకపోతే సంగతులు ఎలా బోధపడతాయి? అంతెందుకు ఎక్కడో కూచున్న సోనియా సంగతి వదిలేయండి. నిత్యం గ్రామస్థాయిలో నాయకులతో టచ్‌లో వున్నాననే చంద్రబాబుగారి ప్రయోగం మాత్రం బొక్కబోర్లా పడలేదా?

## 4

బాబు మాత్రం జగన్ యీ లెవెల్లో నెగ్గుతాడని ఊహించారా? ఊహించి వుంటే తెలంగాణా ఉపయెన్నికలలో పోటీ చేసినట్టు చేసామంటే చేశాం, వున్నామంటే వున్నాం అన్నట్టు పైపైన ప్రచారం చేసి వూరుకునేవారు. కానీ ఆయన యితను మార్జినల్‌గా గెలుస్తాడు, కాస్త అడలగొడదాం, తెలంగాణాలో ఎలాగూ క్యాడర్ పోతోంది, యిక్కడైనా నిలుపుకోవాలి అనుకుంటూ భారీగా దిగారు. అసెంబ్లీ మాట ఎలావున్నా, పార్లమెంటు స్థాయిలో పెద్ద లీడర్‌నే పోటీకి దింపారు. ఖర్చుకి వెనకాడలేదు. అన్నిటికన్నా ముఖ్యం ప్రచారానికి వెనుదీయలేదు.

మీడియా ఆయనకు ఎప్పుడూ అనుకూలంగానే వుంది. ఇప్పుడైతే యిహ చెప్పనే అక్కరలేదు. రోజూ జగన్ అవినీతి గురించి కథనాలే. ఆ ముస్లిం ఓట్లు కాదు కానీ, జగన్–బిజెపి కలిసిపోతున్నాయి బాబోయ్ అంటూ టిడిపి, కాంగ్రెస్ కలిసికట్టుగా హోరెత్తించేశాయి. దానికి ఆధారం ఏమీ చూపించలేదు. బిజెపి అక్కడ పోటీ చేయలేదు అన్న ఒక చిన్న పాయింటు తప్ప ! ఈ ప్రచారాన్ని అచ్చేసినవాళ్లయినా నమ్మారో లేదో తెలియదు కానీ ముస్లిములు మాత్రం అస్సలు నమ్మలేదు. గంపగుత్తగా జగన్‌కే ఓట్లేశారు. 2004 దాకా బిజెపితో ఊరేగింది టిడిపియే అన్న విషయం మీరూ నేనూ మర్చిపోవచ్చు కానీ వాళ్లు మర్చిపోరుగా ! అందువలన బిజెపితో పొత్తు పెట్టుకుని జగన్ భ్రష్టుడైపోయాడు అని టిడిపివారు ప్రచారం చేస్తూ వుంటే వాళ్లు పగలబడి నవ్వుకుని వుంటారు.

సరే చంద్రబాబు ప్రచారంలో లోటేమీ చేయలేదు. అన్ని విధాలా పోటీ పడ్డారు. కడపజిల్లాలో తన క్యాడర్‌ను నమ్ముకున్నారు. తీరా చూస్తే ఏమైంది? డిపాజిట్లు కూడా దక్కలేదు. టిడిపి అనుకూల మీడియా తెగ రాసింది – చంద్రబాబు ప్రచారానికి వస్తున్న స్పందన చూస్తూంటే రెండవ స్థానం టిడిపికే దక్కేట్టుంది అని. పోనీ కడప పార్లమెంటు ఎన్నికలో అయితే ఏమో అనుకోవచ్చు, ఎందుకంటే అక్కడ మైసూరా రెడ్డి గట్టి కాండిడేట్ కాబట్టి. కానీ పులివెందులలో కూడానా !? ఏదీ వైయస్ వివేకానంద రెడ్డిని మించి బిటెక్ రవికి ఎక్కువ ఓట్లు వస్తాయని రాయడమా !?

ఫైనల్‌గా ఏమైంది? విజయలక్ష్మికి వచ్చిన ఓట్లలో దాదాపు 10% ఓట్లు వచ్చాయి టిడిపికి. వివేకానందకు వచ్చినదాంట్లో దాదాపు మూడో వంతు ! గ్రౌండ్ రియాలిటీ యింత దారుణంగా వుంటే బాబు వీళ్లను ఎందుకు దించినట్టు? తను కాళ్లరిగేలా తిరిగిందెందుకు? గాలిలో మార్పును ఎందుకు పసిగట్టలేక పోయారు?

జరిగినదేమిటంటే మీడియాచేత తనే రాయించి, తనే చదువుకుని, తనే నమ్మేసి ఒక రకమైన సెల్ఫ్‌హిప్నాసిస్‌లో పడిపోయారు బాబు. దాంతో మనలాటి సామాన్యులకు గోచరించిన గోడమీద రాత (రైటింగ్ అన్ ద వాల్) కూడా ఆయనకు నీటి మీద రాతలా కనిపించింది. జగన్ జగ్గర్‌నాట్ కాదని, ఈనాడు కార్టూన్‌లలో జగన్ చుట్టూ కనబడే గళ్ల బనీను జగ్గూభాయ్ అనీ అనుకున్నారు. తప్పులేదు, రాజకీయవేత్త అన్నాక కలలు కనాలి. ఎప్పటికప్పుడు యిదిగో యీ మూఢం వెళ్లగానే సింహాసనం మనదే అని తన వీపు తనే చరుచుకుంటూ వుండాలి. ఎన్నికల ఏనుగు ఎప్పుడొచ్చి దండేస్తుందోనని మెడ సారించి వుంచాలి.

నేననేది కడప విషయంలో బాబు ప్రయోగం కూడా దెబ్బతింది కదా, ఆయన తనను తాను దండించుకున్నారా? పోనీ కడప జిల్లా

టిడిపి అధ్యక్షుణ్ని పీకేసారా? పార్టీ క్యాడర్‌కు పాఠాలు చెప్పారా? లేదే ! లెటజ్ మూవ్ ఆన్, ఇంకో ఎలక్షన్ రాకపోతుందా, అప్పుడు తడాఖా చూపించకపోతామా అన్న ధోరణిలో అలా 'ముందుకు పోతున్నారు.' కాంగ్రెస్‌వాళ్లూ చేయవలసినది అదే. స్థానికంగా వున్న చంద్రబాబే ఈ భూకంపాన్ని గుర్తించలేకపోయినప్పుడు ఎక్కడో ఢిల్లీలో వున్న మనమెలా గుర్తిస్తాం అనుకుని ఓదార్చుకుని ఉపయెన్నికల కారణంగా కిరణ్‌ను పీకేయకూడదు. కాదూ కూడదూ పీకాలనుకుంటున్నారా పీకవచ్చు. లేకపోతే హై కమాండ్ పీకకు చుట్టుకుంటుంది. ఒక్కసారి కిరణ్‌ను ఉరేసేస్తే ఇక ఉపయెన్నికల సమీక్షకు ఎవరూ పోరు. వాళ్ల పొజిషన్ సేఫ్.

సిఎంను తీద్దామనుకున్నా శాస్త్రోక్తంగా పీకేయాలి. శాంతిభద్రతల వైఫల్యం వంటి మంచి నికార్సయిన కారణం వెతకాలి. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు పగలగొట్టినపుడు మంచి కారణం దొరికింది. కానీ అప్పుడు ప్రభుత్వమే కావాలని అది జరగనిచ్చిందని నా కనుమానం. జూన్ తర్వాత ఎండలు కాస్త తగ్గాక తెలంగాణా ఉద్యమం ఎలాగూ ఉధృతం అవుతుంది. అప్పుడు రాస్తారోకోలు, ఎరెస్టులు, ఎరెస్టులు చేసినందుకు నిరసనలు తప్పవు. ఓ పెద్ద నాయకుణ్ని ఎవరినైనా అరెస్టు చేయించి దానివలన గొడవ ప్రజ్వరిల్లితే అదిగో వైఫల్యం అని పేరు చెప్పి కిరణ్‌ను దింపేయవచ్చు.

ఇంకో ఫస్ట్‌క్లాస్ కారణం – పరిపాలనలో ప్రతిష్టంభన. మొన్న తెలంగాణా ఉద్యోగుల ఉద్యమంలో పీకేసి వుండవచ్చు. ఛాన్సు మిస్సయ్యారు. ఫర్వాలేదు. ఎస్సయి పరీక్షల రూపంలో మరో కారణం రాబోతోంది. ఫ్రీ జోన్ గొడవలో అందరూ మళ్లీ పనులు మానేసి తొక్కుడుబిళ్ల ఆటలాడవచ్చు. యాక్షన్ తీసుకునేందుకు ఉద్దేశించిన జీవో పాస్ కానేలేదు. అందువలన కిరణ్ చర్య తీసుకోలేరు. తీసుకోలేదు కాబట్టి నువ్వు అసమర్థుడివి అని చెప్పి హై కమాండ్ పీకేయవచ్చు. అయితే యిలాటి మంచి కారణాలు దొరికేవరకూ హై కమాండ్ ఓపిక పట్టాలి.

ఉపయెన్నికలో ఓటమి కారణంగా చీఫ్ మినిస్టర్లను మార్చడం మాత్రం మహా రిస్కీ. ఇలా మారుస్తూ పోతే జగన్ యిదే బాగుందని తన వర్గం ఒక్కో ఎమ్మెల్యేను రిజైన్ చేయించడం, ఉపయెన్నిక తెప్పించడం, అధికారపార్టీ కాండిడేట్‌ను ఓడగొట్టడం, సిఎంను మార్పించడం.. యిదో ఆటగా పెట్టుకుంటాడు. ఇటు పక్క తెరాస కూడా యిదే గేమ్ ఆడిందంటే వచ్చే మూడేళ్లలో అరడజను ముఖ్యమంత్రులు మారతారు. సోనియాకు 'అపూర్వ సహస్ర శిరఛేద చింతామణి' అనే బిరుదు యిచ్చేస్తారు జనం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2011)**

**మే 06** **ఎమ్బీయస్ : ఇసుక స్మగ్లింగ్**

డిఎంకె ఎందుకు ఓడిపోయిందో ఎనాలిస్‌లు చదువుతూంటే ఇసుక స్మగ్లింగ్ కూడా ఓ కారణమని ఓ చోట వచ్చింది. ఉలిక్కిపడ్డాను. డిఎంకె యిరుక్కున్న 2 జి స్పెక్ట్రమ్ చాలా కాంప్లికేటెడ్ వ్యవహారమనీ, దానిలోని తిరకాసులు సామాన్యుడికి అది అర్థం కాదనీ, అందునా అది తమ హయాం నుండే కాదు, ఎన్‌డిఏ హయాం నుండీ నడుస్తోందని తన వాక్చాతుర్యంతో కరుణానిధి ప్రజల్ని నమ్మించేస్తారనీ, అందువలన దాని ప్రభావం ఎన్నికలపై పెద్దగా వుండదనీ చెపుతూ వచ్చారు ఎన్నికల విశ్లేషకులు. యుపిఏ ప్రభుత్వం కూడా రాజాను ముందుగా బలివేసినా కనిమొళిపై ఎన్నికల తర్వాతే కేసు మోపారు. ఆ పాటికి పడాల్సిన ఓట్లు ఎలాగూ పడి వుంటాయన్న ధీమాతో. డిఎంకె కూటమికి, ఎడిఎంకె కూటమికి బరాబరిగా సీట్లు వస్తాయని చాలామంది అన్నారు. ఎడిఎంకె కూటమి ముందంజలో వుందని అంటూనే ఆఖరి నిమిషంలో డిఎంకెకే ఛాన్సు వుందేమో అని మనలో సందేహం కూడా నాటారు. తీరా ఫలితాలు వచ్చాక దిమ్మ తిరిగిపోయింది. ఎందుకిలా అంటే డిఎంకె అవినీతి 2 జితో ఆగలేదుట. మేక్రో లెవెల్ నుండి మైక్రో లెవెల్ దాకా పాకిపోవడంతో ప్రజలు భరించలేని స్థితి వచ్చింది. మైక్రో లెవెల్లో జరిగిన అవినీతిలో యిసుక స్మగ్లింగ్ ఒకటి.

"దశావతారం" సినిమాలో పెరుమాళ్ విగ్రహాన్ని ఇసుకలో కప్పి పెడితే ఇసుక స్మగ్లర్లు వచ్చి ఎత్తుకుపోవాలని చూడడం, దాన్ని ఓ దళిత లీడరు వచ్చి అడ్డుకోవడం అనే సీను పెట్టారు. ఆ సినిమా చూసినప్పుడు యిసుక స్మగ్లింగ్ యింత పెద్ద యిస్యూ అని నేననుకోలేదు. సినిమా అంతా కమలహాసన్ "నేను ఎన్ని రకాల వేషాలు వేయగలనో చూడండొహొ" అని చాటి చెప్పడానికి కథ తిప్పుతూ పోయాడనే అనుకున్నాను. విదేశీయులు ముగ్గురు, సిక్కు ఒకడు పోగా, తమిళనాడులోనే రకరకాల భాషలు ఎలా వుంటాయో చూపించడానికి 6 పాత్రలు పెట్టుకున్నాడు కమలహాసన్. శతాబ్దాల నాటి తమిళం మాట్లాడే వైష?వ బ్రాహ్మడు, సంభాషణలో ఇంగ్లీషు ఎక్కువగా చొరబడే నేటి చదువుకున్న తమిళుడు సైంటిస్టు, తమిళనాడులో స్థిరపడి తెలుగుయాసతో తమిళం మాట్లాడే బలరాం నాయుడు, తమిళం, ఉర్దూ కలిపి మాట్లాడే ముస్లిమ్ పొడుగు కుర్రాడు, చిదంబరం ప్రాంతపు అయ్యంగార్ భాష మాట్లాడే ముసలమ్మ... యివి కాక దక్షిణ తమిళనాడునుండి తిరునల్వేలియాసలో మాట్లాడే దళితక్రిస్టియన్ పాత్ర ఆరోది.

తెలుగు డబ్బింగ్‌లో యీ యాసలన్నీ ప్రస్ఫుటంగా తెలియవు కానీ తమిళనాడు వాళ్లకు ఆ న్యువాన్సెస్ (సున్నితమైన తేడాలు) తెలుస్తాయి. ఆ వెరైటీ కోసం కమలహాసన్ ఎప్పుడూ తపిస్తాడు. "మైకేల్ మదన్ కామరాజ్"లో తమిళం, మలయాళం కలిపి మాట్లాడే పాలొట్ బ్రాహ్మల తమిళుల యాస, "అపూర్వ సహోదరగళ్"లో కారు మెకానిక్‌గా మద్రాసులో మాట్లాడే నాసిరకం తమిళభాష – యిలా ఒక్కో ప్రాంతం యొక్క ప్రత్యేకత కనబరుస్తాడు కమలహాసన్ తన పాత్రల ద్వారా. అలాటి వెతుకులాటలో సృష్టించినదే – "దశావతారం"లో దళిత క్రిస్టియన్ పుణ్యకోటి పాత్ర అనుకున్నాను. అతన్ని త్యాగమూర్తిగా చూపించాలి కాబట్టి కొంతమంది విలన్లు,

డబ్బు ఆశ చూపడం, అతని అనుచరులే డబ్బుకి లొంగిపోవడం యిదంతా కథ పెట్టారు. కానీ యిసుక స్మగ్లింగే ఎందుకు పెట్టాలి? ధాన్యం దాచేయడం అవీ చాలా ఏళ్లగా చూపిస్తున్నారు కాబట్టి యిదో వెరైటీగా వుంటుందని పెట్టారనుకున్నా తప్ప పెద్దగా దృష్టి సారించలేదు.

ఇప్పుడు డిఎంకె ఓటమికి కారణాల్లో ఒకటి అని తెలిశాక చూడబోతే ఏళ్ల తరబడి చాలా కథే నడుస్తోంది. తమిళనాడునుండి కేరళకు యిసుక రవాణా కావడం, తమిళనాడు దక్షిణాది జిల్లాల్లో ఎక్కువ (తిరునల్వేలి అక్కడిదే). కేరళ నుండి యిసుక స్మగ్లింగ్ అయిందట – ఎక్కడికో మరి ! పాండిచ్చేరి నుండి మాల్దీవ్స్‌కు ఓడల్లోనే పట్టుకెళ్లారట. ఇసుక అక్రమ రవాణాను నిషేధిస్తూ తమిళనాడు చట్టం చేసింది కానీ పాండిచ్చేరి చేయలేదుట. కావేరి నదీ పరివాహక ప్రాంతంలో కూడా నదీతీరం నుండి ఎడ్లబళ్లు వెళ్లి ఇసుక తీసుకుని వచ్చి సమీపంలో వున్న గ్రామాల్లో కుప్ప పోస్తాయి. వాటిని లారీల ద్వారా తరలిస్తారు.

మొన్న ఎలక్షన్లలో యిసుక అక్రమ రవాణా వలన రాష్ట్రం 500 కోట్లకు పై బడి నష్టపోయిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఏవిటో కొన్ని కొన్ని చదివి ఇమ్యూన్ అయిపోతాం. ముంబయికి ఆడపిల్లల అక్రమ రవాణా, పర్మిట్ లేకుండా బియ్యం రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్, గ్రానైట్ తరలింపు, యినుప ఖనిజం తరలింపు... కొద్దికాలం పోయేసరికి మనల్నే ఎవరైనా రవాణా చేసేసినా ఒళ్లు తెలియని స్థితికి వచ్చేస్తామేమో!

తిరునల్వేలి జిల్లాలో అంబాసముద్రం నియోజకవర్గంలో స్పీకరు అవుదియప్పన్ ఓడిపోయారు. దానికి కారణం వేలాది బండివాళు డిఎంకె నాయకులపై తిరగబడడమేట. ఎడ్లబండి తోలే ఒకతను విలేఖరులకు చెప్పాడట – "ఇక్కణ్నుంచి కేరళకు ఇసుక అక్రమ రవాణా అవుతూంటుంది. ఆ వ్యాపారం తాము తప్ప వేరే ఎవరూ చేయకూడదని డిఎంకె నాయకుల పంతం. అందుకని మామీద కేసులు పెట్టి జైళ్లలో తోశారు. ఇప్పుడు కసి తీర్చుకున్నాం" అని.

అక్రమార్జన ఎక్కడైతే వుందో పోటీ ఎలాగూ వస్తుంది. మోనోపలీ గురించి కొట్లాడతారు. అక్రమ రవాణా ఆపడానికే డిఎంకె ప్రభుత్వం యిసుక చట్టం తెచ్చిందనుకున్నా, స్థానిక నాయకులు దాన్ని అడ్డం పెట్టుకుని వ్యాపారప్రత్యర్థులను దెబ్బ తీశారన్నమాట. మధ్యలో నలిగేవాళ్లు బడుగుజనం. ఈ కేసులో బండివాళ్లు దొరికారు. జైలు కెళ్లారు. ప్రజాస్వామ్యం దేశంలో యింకా వుంది కాబట్టి పాఠం చెప్పేందుకు వాళ్లకు ఛాన్సు దొరికింది, చెప్పేశారు. డిఎంకె ఓడిపోయిందన్న వార్త వస్తూండగానే అధికారులు ఇసుక స్మగ్లింగ్‌ను అరికడుతున్నారట. నదీతీరాల్లో లోతుగా కందకాల్లా తవ్వేసి ఎడ్లబళ్లు వెళ్లలేకుండా చేస్తున్నారట. సరే, ఈ ఎడిఎంకె ఎలా నడుపుతుందో తర్వాత చూద్దాం కానీ, ప్రస్తుతానికి దశావతారం సినిమా రచయితను అభినందించకుండా వుండలేకపోతున్నాను – ఇసుక స్మగ్లింగ్ వంటి సామాజిక సమస్యను చక్కగా సినిమాకథలోకి యిమిడ్చి రసవత్తరంగా తీర్చిదిద్దినందుకు. దురదృష్టమేమిటంటే నేను ఆ ప్రాంతాల్లో నివసించటం లేదు కాబట్టి రచయిత చాకచక్యాన్ని అప్పుడు గుర్తించలేకపోయాను. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2011)**

**మే 10** **ఎమ్బీయస్ : జగన్నేం చేయాలి..?**

కిరణ్‌గారు ఢిల్లీ వెళ్లి జగన్‌ను అరికట్టే ఉపాయాలు నేర్చుకుని వస్తారనుకున్నాం. కాబినెట్‌లో జగన్ కోవర్టులున్నారని, వాళ్ల పని బట్టాలని కొందరు నాయకులు ఆజాద్‌కి చెప్పారట. బాహాటంగా జగన్ వెంట తిరుగుతూ దమ్ముంటే అనర్హత వేటు వేయండి అని కాలరు ఎగరేసేవాళ్ల మెడలు వంచాలని చెప్పారట. ఉపయెన్నికల రిజల్ట్ చూశాక హై కమాండ్‌కి అంత ధైర్యం వున్నట్టు తోచడం లేదు. వీళ్లపై వేటు వేసినకొద్దీ ఉపయెన్నికలు పెరుగుతాయి. వాటిలో నెగ్గకపోతే వున్నవాళ్ల నైతికస్థయిర్యం దెబ్బ తింటుంది. ఎందుకొచ్చిన గొడవ అనుకుని వుంటారు. సాక్షాత్తూ సోనియా అధికారాన్నే ఛాలెంజ్ చేసిన జగన్‌ను వదిలేస్తే ఎలా అని జగన్ వ్యతిరేకుల విలవిల. ఆ మాటకొస్తే కాకా వెంకటస్వామి సోనియాను తక్కువ తిట్టారా? నోటి కొచ్చినట్టు తిట్టిపోశారు. అయినా ఆయనపై చర్య తీసుకున్నారా? ఎంతోమంది నాయకులు కట్టుదప్పి మాట్లాడుతున్నారు. వాళ్లందరిపైన చర్యలు తీసుకోవడమే లేదు. తెలుగు నాయకులకు నోటిదురద ఎక్కువ అనుకుని సోనియా దులిపేసుకుంటున్నారేమో !

జగన్ ఉపయెన్నికలలో ఘన విజయానికి కాంగ్రెస్ హై కమాండ్ తప్పుడు స్ట్రాటజీ ఎలా కారణమో శనివారం ఆంధ్రజ్యోతిలో 'అదిత్య' రాశారు. వైయస్ మరణం తర్వాత పార్టీలో నాయకత్వపు లోటును పూడ్చటానికి ప్రయత్నించకుండా, దానికి బదులు వైయస్ నామస్మరణ చేయవలసిందిగా పార్టీ శ్రేణులను ఆదేశించడం హై కమాండ్ మొదటి తప్పు అన్నారు. నా ఉద్దేశం – పార్టీ నుండి అలాటి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. అప్పటి మూడ్ బట్టి నాయకులు వైయస్‌ను కీర్తించారు. హై కమాండ్ ఏమీ చేయలేక వూరుకుంది. వైయస్ లెగసీని వదుల్చుకుందామని అప్పటికే హై కమాండ్ అనుకుంది. అందుకని జగన్‌ను దగ్గరకు రానివ్వలేదు. వైయస్‌ను నోరారా తిట్టిపోస్తున్న అనేకమందిని హై కమాండ్ వారించలేదు. కొద్దికాలం పోతే ప్రజలు వైయస్‌ను మర్చిపోతారనుకుంది.

అంతలో డిసెంబరు 9 చిదంబరం ప్రకటన వచ్చింది. రాష్ట్రమంతా అల్లకల్లోలమైంది. వైయస్ వుండి వుంటే యిలాటి ప్రకటన వచ్చేది కాదు, రాష్ట్రంలో యీ తరహా సంక్షోభం వచ్చేది కాదు అని వైయస్ వ్యతిరేకుల దగ్గర్నుంచి అందరూ అనుకున్నారు. ఆ విధంగా వైయస్‌ను జనం మర్చిపోకుండా చూసినది కూడా హై కమాండే. తెలంగాణా అంశం లాగానే జగన్ అంశాన్ని కూడా నానబెట్టి నానబెట్టి విస్తరింపజేసింది హై కమాండే. వైయస్ జగన్ పేరు చెప్పి బ్లాక్‌మెయిల్ చేసిన మంత్రులపై కఠినచర్య తీసుకోకుండా

రోశయ్యను బలహీన పరచినదీ హై కమాండే. ఉప ఎన్నికలు వచ్చేసరికి వైయస్ కున్న పాప్యులారిటీ వేడి బాగా తాకడంతో డియల్ దగ్గర్నుంచీ అందరూ వైయస్‌ను పొగిడారు. అది తప్పంటారు ఆదిత్య.

వైయస్‌ను కీర్తించి, జగన్‌ను తిట్టడం వర్కవుట్ కాలేదంటారు. జగన్ యింత ఆస్తి సంపాదించాడంటే వైయస్ అధికారం అడ్డుపెట్టుకునే కదా, వైయస్ నీతిపరుడు, జగన్ అవినీతిపరుడు అంటే ఎలా పొసుగుతుంది? అని ఆదిత్య వాదన. వైయస్ కూడా అవినీతిపరుడే అని హై కమాండ్ చెప్పేయాలని ఆయన ఆరాటం. 'జగన్ తప్పు చేసి వుంటే కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్ చర్య ఎందుకు తీసుకోవడం లేదు?' అని జనం అడిగితే కాంగ్రెస్ నాయకులు జవాబు చెప్పలేకపోయారన్నారు. మరి అలాగే 'వైయస్ అవినీతి పరుడంటే మరి సోనియా చూస్తూ ఏం చేసింది? డిఎంకె రాజా మీద యాక్షన్ తీసుకున్నట్టు తీసుకుని జైలులో పెట్టించలేదేం?' అని కూడా అడగరూ? అందువలన జగన్‌ను అవినీతిపరుడని వ్యక్తులనాలి తప్ప హై కమాండ్ అనలేదు. అంటే మాత్రం జగన్ బట్టి వైయస్, వైయస్ బట్టి సోనియా అందరూ అవినీతిపరులుగా తేలతారు.

జగన్‌ను తిట్టిపోయడానికి ప్రత్యర్థులు ఉపయోగిస్తున్న అస్త్రం అవినీతి. అది కాంగ్రెస్ హై కమాండ్ వుపయోగించలేదు. తరువాతి అస్త్రం – వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి కోసం ఆశపడ్డాడు అని. సోనియా, రాహుల్ ఆ మాట గట్టిగా అనలేరు. ఈ రోజు వాళ్లు అక్కడ వున్నారంటే దానికి కారణం వారి రాజకీయ వారసత్వమే. ఇలాటి పరిస్థితిలో ప్రజలకు జగన్ బూచి చూపించడం ఎలా? సోనియా అహంకారం – కడప ఆత్మగౌరవం నినాదం ఉపయెన్నికలో బాగా పనిచేసింది. రేపు తెలుగు ఆత్మగౌరవం అంటాడు. ఆత్మగౌరవానికి లోటేమి రాలేదని హై కమాండ్ చెప్పగలదా? ఆ స్టేటుమెంటు కూడా ఢిల్లీ నుండి ఆజాద్ గారు వచ్చి యివ్వాల్సిందే. ఇక్కడందర్నీ డమ్మీలుగా చేసి ఢిల్లీ రాజ్యం ఏలుతోందని స్పష్టంగా కనబడుతోంది. ఆత్మగౌరవం నినాదం మళ్లీ పనిచేసినా చేయవచ్చు.

తెలంగాణా సమస్య, జగన్ సమస్య రెండూ కలిపి పరిష్కరించే మార్గం కోసం హై కమాండ్ వెతుకుతూండవచ్చు. కిరణ్‌ను తీసేస్తారని పుకారు వచ్చింది. కానీ ప్రత్యామ్నాయం ఎవరు చెప్పండి? నా ఉద్దేశం అతన్ని మారిస్తే యిద్దరే అతని స్థానంలో రాగలరు. ఒకరు కెసియార్. తమ పార్టీలో చేర్చేసుకుని "తెలంగాణా అంశం మాకు వదిలేయి. రాష్ట్రం మొత్తం నీ చేతిలో పెడుతున్నాం. నీ ప్రాంతం బాగుచేసుకో. ఆంధ్రప్రాంతంలో జగన్ ఎదగనీయకుండా చూడడమే నీ ఎజెండా" అనవచ్చు. లేదా జగన్‌ను పార్టీలో చేర్చేసుకుని "తెలంగాణాలో కూడా విస్తరించి నీ బలం చూపుకో. మమ్మల్ని ధిక్కరించకు" అనవచ్చు. ప్రస్తుతానికి రెండూ అసాధ్యమైన విషయాలలాగే అనిపించవచ్చు. జగన్ సోనియాను తిట్టాడు కదా అంటే కెసియారూ తిట్టారు. అయినా ఆహ్వానిస్తున్నారా లేదా? అతన్నే ఆహ్వానించగా లేనిది, జగన్‌ను పిలవడంలో వింతేముంది? జగన్ తెలంగాణాలో బలం పుంజుకుంటున్నకొద్దీ హై కమాండ్ ఆదరానికి పాత్రుడు కావచ్చు. లేదా అతన్ని శత్రువుగానే చూస్తూ వుంటే ఆగ్రహానికి గురి కావచ్చు.

హై కమాండ్ ఆఫర్ యిస్తే మాత్రం జగన్ వెళ్లి చేరతారా? ప్రస్తుతం చూస్తే చేరరనే అనిపిస్తుంది. ఎందుకంటే ఆయన మంచి కాక మీద, కసిమీద వున్నట్టు తోస్తుంది. కానీ ఒంటి చేత్తో పార్టీ నడిపించడం మాటలు కాదు. ఎన్నికలు నడుస్తూండగానే కొందరు ఎలా వూగిసలాడారో చూశారుగా. రాష్ట్రమంతా కడప కాదు. అన్నిచోట్లా కాండిడేట్లు జగన్‌లు కారు. ముక్కోణపు పోటీలో ఎవరు గెలుస్తారో, ఎవరు గెలవరో చెప్పడం చాలా కష్టం. కాంగ్రెస్ పార్టీ అండన చేరితే పార్టీ నిర్మాణం అంది వస్తుంది. ఓటర్లలో గందరగోళం వుండదు. జగన్ ప్లస్ కాంగ్రెస్ కాంబినేషన్ టిడిపిని నిలవరించగలదు. ఇది జరగాలంటే సోనియా, జగన్ యిద్దరూ అహంకారాలు దిగమింగి చెరో అడుగు ముందుకు వేయాలి. ఎవరు వెనకడుగు వేసినా బండి ముందుకు సాగదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలనుండి కాంగ్రెస్ ఏం పాఠాలు నేర్చుకుందో తెలిస్తే దాన్ని బట్టి మనం వూహలు చేయవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2011)**

## మే 11      ఎమ్బీయస్ : క్యాష్టవాళ్లు ఏం చేయాలి? – 1

తెలంగాణాపై నిర?యం మళ్లీ వాయిదా పడిందని పేపర్లు ఘోషిస్తున్నాయి. 2013 వరకు దాని జోలికి పోరని, ఆట్టే మాట్లాడితే రెండో ఎస్సార్సీ అంటారనీ రాశాయి. మొదటిసారి చదివితే అబ్బే అబద్ధం అనిపించింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణాపై ఏదో ఒక నిర?యం తీసుకుని తీరతామని చెప్తూ వచ్చారు కదా.. యిదా ఆ నిర?యం? ఏదీ వాయిదా వేద్దామన్న నిర?యం చెప్పడానికా మూణ్నెళ్ల సమయం అడిగినది ! ఏడిచి నట్టుంది.

ఇవతల మేమంతా ఏదో ఒకటి తేలిపోతుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నాం. ఢిల్లీవాళ్లు చూద్దాంలే అంటున్నారు. రెండో ఎస్సార్సీ అని అంటే దానిమీద మంచో చెడో రియాక్టవుతాం. అదీ లేదు. "తెలంగాణ పై మా నిర?యంలో ఎటువంటి మార్పూ లేదు" అని చిదంబరంగారు గంభీరంగా ప్రకటించారు. అంటే 'మేం గో.పి.లుగానే వుంటాం. గోడ దిగం' అని అర్థమన్నమాట. ఇంకా అఖిలపక్షం, 8 పార్టీలు (పీఆర్పీ మాయమైపోయింది స్వామీ) పిలుపులు, పేరంటాలూ అంటున్నారు.

వచ్చిన చిక్కేమిటంటే కాంగ్రెస్ గోడ దిగేదాకా టిడిపి కూడా దిగదు. బాబు గారు రెండు కళ్ల సిద్ధాంతం మానరు. ఒక వెర్షన్ ప్రకారం మన యువనేతగారు కూడా సీనియర్ల పంథాలోనే నడిచే లక్షణాలు కనబరుస్తున్నారు. "నాది రెండు చెవుల సిద్ధాంతం, ఇరుప్రాంతాల వాదనలూ వినాలి కదా" అంటాడేమో. ఎలా ఎటు చూసినా మనకు పిల్లులే. బిజెపి, సిపిఐ, సిపిఎం వంటి చిన్నపార్టీలు (మన రాష్ట్రం సంబంధించినంత వరకు) పిల్లులు కాకపోయినా చిట్టెలుకల్లాటివి. తీసి పారేయండి. ఇక తెరాస ఒక్కటే ఒకే వాదనతో

నిలబడ్డ ఓ పాటి పెద్ద పార్టీ. ఈ పిల్లుల మధ్య పులిలా తిరగగలుగుతోందంటే కారణం – రెండు నాలుకలతో మాట్లాడకపోవడం !

ఎందుకిలా జరగాలి? ఈ సందిగ్ధపరిస్థితి వలన రాష్ట్రంలో ఏదీ సరిగ్గా సాగడం లేదు. పెట్టుబడి పెట్టేవాడికి స్పష్టమైన అవగాహన వుండదు. అనిశ్చిత భవిష్యత్తు అంటే అందరకూ చికాకే. ఎన్నేళ్లు యిలా లాగుతారు? ఓ పక్క చూస్తే తెలంగాణా వచ్చేస్తుందేమోనన్న ఆశతోనే కదా నాగం గాని, జూపల్లి కానీ అంత ముందుకు వెళ్లిపోతున్నారు ! తెలంగాణా యిప్పట్లో రాదని తెలిస్తే ఎవ్వటనా ముందుకు వచ్చేవారా?

డిసెంబరు 9 ప్రకటనకి ముందు తెలంగాణా గురించి గట్టిగా మాట్లాడినది తెరాస ఒక్కటే. ఏదో బిజెపి కాస్త కాస్త. కాంగ్రెస్ ఎంపీలలో మధు యాష్కీ, సర్వే సత్యనారాయణ, కేకే.. యిలా గుప్పెడుమంది. టిడిపిలో అయితే గట్టిగా మాట్లాడినవారే లేరు. దేవేందర్ గౌడ్ ప్రహసనం తర్వాత అందరూ చప్పబడ్డారు. కానీ డిసెంబరు 9 తర్వాత అందరికీ ఆశ పుట్టింది, తెలంగాణా వచ్చి మనమంతా లీడర్లయిపోతామని. భయం పుట్టింది, కాస్తయినా హంగామా చేయకపోతే బస్సు మిస్సయిపోతామని, ఎదుటివాళ్లు తన్నుకుపోతారని.

ఇక అక్కణ్నుంచి ప్రతీవాడు లీడరే, ప్రతీవాడూ త్యాగమూర్తే. తెల్లారిలేస్తే ఆంధ్రప్రాంతీయులపై విరుచుకుపడడమే పని. మాట వెనక్కి తీసుకున్నందుకు, అనవసర తాత్సారం చేస్తున్నందుకు హై కమాండ్‌ని తిట్టే ధైర్యం లేక "సమైక్యవాదులు హై కమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు, తప్పుదోవ పట్టిస్తున్నారు, ఇక్కడ తమ పెట్టుబడులు పోతాయన్న భయం కొద్దీ కుట్రలు పన్నుతున్నారు" అంటూ వాళ్లనే నిందించడం. తాము యిప్పటిదాకా తెలంగాణాకు ఏం చేశామో చెప్పడం మానేసి, ఆంధ్రవాళ్ల వలననే చేయలేకపోతున్నాం అని తిడుతున్నారు.

నాగం గారు గతంలో తెలంగాణా నిర్వచనాన్ని వెక్కిరిస్తూ "ఏం ఆంధ్రయో, ఏం తెలంగాణాయో, నా పిల్లలు ఆంధ్రలో చదువుకున్నారు. వాళ్లు ఆంధ్రా, నేను తెలంగాణాయా?" అన్నట్లుగా పేపర్లలో వచ్చింది. ఇప్పుడు బాబును ఆంధ్రులు పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. జూపల్లి సరేసరి, రెచ్చిపోతున్నారు. దేవాదాయశాఖ కాకుండా మంచి మంత్రిత్వం ఏదైనా యిచ్చి వుంటే ఏం చేసేవారో ఏమో! తెరాస ఎలాగూ బెదిరిస్తోంది. జూన్ తర్వాత బీభత్సమే అని. వీళ్లంతా కలిసి తెలంగాణాను, రాష్ట్రాన్ని ఎంత అల్లకల్లోలం చేస్తారో ఏమో. ఇలా జరుగుతుందని హై కమాండ్ వూహించలేదా? మరి వాళ్ల దగ్గరున్న ఏ మంత్రదండంతో యీ విపత్తుని ఆపుతారా? లేక ఆపడం మానేసి పోతే పోనీ అని వూరుకుంటారా?

అసలెందుకు వాళ్లు తెలంగాణా ఎంపీల, క్యాష్ట్‌వాళ్ల బెదిరింపులను పట్టించుకోవడం లేదు? వీళ్లు సపోర్టు విత్‌డ్రా చేస్తే ప్రభుత్వం పడిపోతుంది కదా. ఆ భయం లేదా? వీళ్లు తెలంగాణా యివ్వాలని పట్టుబట్టినపుడు ఆజాద్‌కానీ, హై కమాండ్ కానీ వీళ్లను ఒకటే అడుగుతుంది – "ఆంధ్రప్రాంతంలో జగన్ ఎలాగూ ఎసరు పెట్టాడు. తెలంగాణా యిస్తే అక్కడ పోవడం ఖాయం. కనీసం తెలంగాణాలోనైనా గెలుస్తామా? లేక తెరాసకే ఘనతంతా కట్టబెడతామా?" అని. వీళ్లు "ఇచ్చి చూడండి. వంద సీట్లు తెస్తాం." అంటారు తప్ప ధైర్యంగా నమ్మేటట్లు చెప్పలేకపోతున్నారనుకుంటా. ఎందుకంటే యిలా క్లెయిమ్ చేసేవాళ్లు స్వయంగా వెయ్యి ఓట్లు కూడా తెచ్చుకోలేనివారు. 'హై కమాండ్ ద్వారా తెలంగాణా యిప్పించాం, అందుకని మమ్మల్ని గెలిపించండి' అన్న ఏకైక స్లోగన్‌తో వాళ్లు ముందుకు వెళ్లాలి.

కాళ్లా వేళ్లా పడి రాష్ట్రం తెప్పించడం వేరు, రాష్ట్రాన్ని వృద్ధి చేయడం వేరు. ఇప్పటిదాకా కాంగ్రెస్ ఎంపీలు ఏం అఘోరించారో తెలుసు కాబట్టి వృద్ధి చేయడానికి వీరు పనికిరారు అనుకోవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఇంగ్లండు ప్రధానిగా వున్న చర్చిల్ హిట్లర్ కూటమి ఓటమికి, మిత్రసైన్యాల గెలుపుకి కారకుడయ్యాడు. ఇంగ్లండు ప్రజలంతా యుద్ధసమయంలో చర్చిల్‌కు అండగా నిలిచారు. యుద్ధం అయిపోయింది. పునర్నిర్మాణం ప్రారంభమైంది. చర్చిల్ ఎన్నికలలో నిలబెడ్డాడు. ప్రజలు ఓడించి యింటికి పంపించారు. నీ పాత్ర అయిపోయింది. యుద్ధానంతరం దేశాన్ని మళ్లీ పట్టాలపై తేవడానికి లేబర్ పార్టీ నాయకుడు అట్లీయే సరైనవాడు అన్నారు. అలాగ 'తెలంగాణా అంటూ వచ్చేశాక యీ కాంగ్రెస్‌వాళ్లను పట్టుకుని వేళ్లాడ్డం దేనికి? వాళ్లు ఢిల్లీ విమానం పట్టుకుని వేళ్లాడుతూ మన గోడు వినరు' అని తెలంగాణా ప్రజలు అనుకోవచ్చు. ఈ ఆలోచన హై కమాండ్‌కి వచ్చి వుందనుకోండి. 'తెలంగాణా యిస్తే నాకేంటి లాభం?' అనుకుని యివ్వకుండా వూరుకున్నారనుకుందాం.

2

ఇంకోలా ఆలోచిద్దాం. 'ఇవ్వకపోతే నాకేంటి నష్టం?' అనుకుని చూస్తే..? కిరణ్ ప్రభుత్వంపై ఎంత అసంతృప్తి వున్నా ఇప్పటికిప్పుడు పడిపోదు. టిడిపివారు అవిశ్వాస తీర్మానం పెట్టరు. ప్రభుత్వాన్ని పడగొట్టేటంతమంది ఎమ్మెల్యేలు జగన్‌వైపు వెళ్లరు. తెరాస, బిజెపి కలిసినా అవిశ్వాసం పెట్టలేరు. ఇంకెందుకు తీరి కూచుని కూర్చున్న కుర్చీ కాళ్లు నరుక్కోవడం? తెలంగాణ వుద్యమం వలన రాష్ట్రంలో 2014 వరకు శాంతిభద్రతల సమస్య వుంటే వుండనీ గాక, పెట్టుబడులు రాకపోతే రాకపోనీయ్ గాక, ప్రజలు పరస్పర విద్వేషంతో రగులుతూండనీ గాక, మన ప్రభుత్వం వున్నంతవరకూ యిబ్బంది లేదు కదా.. యిదే వాళ్ల ఆలోచన. ప్రజల వరకూ చింత లేదు. ఇక తెలంగాణా ఎంపీలు, ఎమ్మెల్యేల వరకూ ఏంచేస్తారా అన్న భయమైనా వుండాలిగా...

నా వుద్దేశంలో అది వాళ్లకు లేదు. వీళ్లు ఏమీ చేయలేనివారో, చేయనివారో అయి వుంటారు. కాంగ్రెస్‌లోనుండి బయటకు వెళ్లి కొట్లాడే ధైర్యం వాళ్లకు లేదు. ఎందుకంటే బయటకు వెళితే తెరాసలోనే చేరాలి. తెరాసలో కెసియార్ కింద పనిచేయడం ఢిల్లీ వాళ్ల కంటె పనిచేయడం కంటె అన్యాయం. ఇంతా చేసి కెసియార్ ఎన్నికల్లో టిక్కెట్టు యిస్తారో లేదో తెలియదు. 2009 ఎన్నికలప్పుడు చూశాంగా.. పార్టీలో ఎప్పణ్నుంచో వున్నవాళ్లను వదిలేసి రాత్రికి రాత్రి ఎక్కణ్నుంచో వచ్చినవాళ్లకి యిచ్చారు. 2001లో ఆయన ఉద్యమం మొదలుపెట్టినపుడు వెంట వున్న పెద్దనాయకులలో ఆయన కుటుంబసభ్యులు తప్ప వేరెవరూ మిగలలేదు. ఆయన చేసేదానికి లాజిక్ అడగకూడదు. ఆయన నంది అంటే నంది, పంది అంటే పంది. ఆయన ఏమన్నా సరేననడానికి ఆయన క్యాడర్ సిద్ధంగా వుంది. వత్తాసు పలకడానికి జాక్ వుంది, టీవీ ఛానెల్ వుంది, రేపు పత్రిక వుండబోతోంది.

అందువలన వీళ్లు కాంగ్రెస్‌లో వుండే కొట్లాడాలి. కొట్లాడాలంటే శక్తి, ఆసక్తి రెండూ వుండాలి. సమైక్యవాదులకు హై కమాండ్ వద్ద క్లౌట్ (పట్టు) వుందని, అందుకే వాళ్ల మాట చెల్లుతోందని వీళ్లందరూ అంటారు. అవి వీళ్ల దగ్గర ఎందుకు లేదు? వాళ్లు గడుసరులు, వీళ్లు అమాయకులు అనుకోవడానికి లేదు. ఎందుకంటే వీళ్లూ రాజకీయాల్లోకి వచ్చి అతితక్కువ సమయంలో ఆస్తులు గడించినవారే. నా అనుమానం వీళ్లు పైకి ఏం చెప్తున్నా లోపల మాత్రం ప్రత్యేకరాష్ట్రం గురించి అంత శ్రద్ధ లేదని !

ఒకవేళ వీళ్ల పెట్టుబడులన్నీ హైదరాబాదులో రియల్ ఎస్టేటుమీద పెట్టారనుకోండి. రాష్ట్రం విడిపోతే హైదరాబాదు మార్కెట్ పడిపోతుందని అందరికీ వున్నట్టే వీళ్లకూ భయం అనుకోండి. అప్పుడు విడిపోకపోతే మంచిదనుకుంటారుగా. అఫ్‌కోర్స్ విడిపోతే ఓ లాభం వుంది. వీళ్లకు మంచి మంచి పదవులు వస్తాయి. ఎందుకంటే ఆంధ్రప్రాంతీయులతో పంచుకోవలసిన అవసరం యిక వుండదు. పదవే వస్తే యిప్పుడున్న ఆస్తులకు రెట్టింపు సంపాదించుకోవచ్చు. అలాటప్పుడు తెలంగాణా రాష్ట్రం కోసం గట్టిగా పట్టుబట్టవచ్చుగా. కానీ దానికి ముందు తాము అధికారంలోకి రావాలి.

నా అనుమానం – వీళ్లకు అధికారంలోకి వస్తామన్న నమ్మకం గట్టిగా లేదని. హై కమాండ్‌కున్న సందేహాలే వీళ్లకూ వున్నాయి – రాష్ట్రవిభజన లాభం తెరాసకే దక్కుతుందని ! అందువలన వస్తుందో రాదో తెలియని అధికారం కోసం చేతిలో వున్న ఆస్తుల విలువ పడగొట్టుకోవడం దేనికి? పైగా వీళ్లందరూ తమ పిలకలు హై కమాండ్‌కి అప్పగించి కూర్చున్నారని అనిపిస్తుంది నాకు. జానారెడ్డి, జీవన్ రెడ్డి ఎంత హంగామా చేశారు, గుత్తా సుఖేందర్ రెడ్డి ఎంత మాట్లాడారు? సడన్‌గా అందరూ సైలెంట్ అయిపోయారు. మధు యాష్కీ కూడా గతంలో వున్నంత మిలిటెంట్‌గా లేరు.

కడప ఉపయెన్నిక తర్వాత తెలంగాణా నుండి కూడా జగన్ పార్టీలో నాయకులు చేరుతూండడంతో వీళ్లకు తెరాస భయంతో బాటు జగన్ భయం కూడా పట్టుకుందట. జగన్ పార్టీ తమ లాగే తటస్థంగా వుంటే ఫర్వాలేదు. కానీ యివాళ్టి పేపరు చూస్తే మరోలా వుంది."సమైక్యవాదానికే జై. కానీ కేంద్రం ప్రత్యేకరాష్ట్రం యిస్తే మేం అడ్డుకోము" అనే లైన్ తీసుకుంటారట. అదే తీసుకుంటే తెలంగాణాలోని సమైక్యవాదులకు జగన్ ఓ ఆశాకిరణంలా వుంటాడు. ఎందుకంటే అంత గట్టిగానైనా యిప్పటివరకూ ఎవరూ చెప్పలేదు. ఆ మేరకు కనీసం 25% ఓట్లయినా జగన్‌కు పడతాయి. కొన్ని ఓట్లు యిలా పోయి, కొన్ని తెరాసకు పోయి, కొన్ని టిడిపి వర్గాలకు పోయి.. యిలా అన్ని పోతే కాంగ్రెస్‌వాళ్లు గెలవడం ఎలా?

అయినా తెలంగాణా ఉద్యమనాయకుల్ని చూడండి. ఒకరిపై మరొకరు ఎంత దుమ్మెత్తి పోసుకుంటున్నారో! తెరాస అయితే మరీ అన్యాయం. తెలంగాణాలో వాళ్లు, బిజెపి తప్ప వేరే ఏ రాజకీయ పార్టీ ఉద్యమించకూడదని స్టాండ్ తీసుకున్నారు. ఎవరు చేసినా వాళ్ల జెండా కిందే చేయాలిట. వందల ఓట్లు కూడా తెచ్చుకోలేని గద్దర్, విమలక్క చేయగా లేనిది లక్షలాది ఓట్లు తెచ్చుకుని, తమ ప్రాంతపు ఓటర్లకు ప్రాతినిథ్యం వహిస్తున్న టిడిపివాళ్లు మీటింగులు పెట్టుకోకూడదని అనడానికి వీరెవరు? టిడిపి జెండా పెట్టుకోకూడదని శాసించడానికి వీరెవరు? ఎవరి పార్టీ క్యాడర్ వారికి వుంటుంది. ఎవరి ఎజెండా వాళ్లకు వుంటుంది. మీ ఉద్యమానికి ద్రోహం చేయనంతకాలం మీరు వారి జోలికి వెళ్లనవసరం లేదు. స్వాతంత్ర్యోద్యమంలో కాంగ్రెస్‌తో పాటు మరో పది పార్టీలు పోరాడాయి. తమది పెద్దది కాబట్టి అందరూ తమ జెండా కిందే పోరాడాలని కాంగ్రెస్ అనలేదు. ఈ కేసులో తెరాస కాంగ్రెస్, టిడిపిల కంటె చిన్న పార్టీ కూడా! ఈ ప్రయత్నాలన్నీ ఉద్యమాన్ని బలహీనపరిచేవే కానీ దోహదపడేవి కావు.

సమైక్యవాదులు కూడా హంగామా చేయడం లేదు కదా అనవచ్చు మీరు. వాళ్లు ఎప్పుడూ పాసివ్‌గానే వుంటున్నారు. ప్రత్యేకవాదులు ఏదైనా యాక్ట్ చేస్తే రియాక్టవుతున్నారు తప్ప వాళ్లంతట వాళ్లు ప్రొ-యాక్టివ్‌గా లేరు. కెసియార్ అన్నారుగా సమైక్యవాళ్లది ఉద్యమం కాదు, ప్రతిస్పందన మాత్రమే నని. పైగా డిసెంబరు 9 తర్వాతి నుండి వాళ్లు కోరుకుంటున్నట్టే నడుస్తోంది. రాష్ట్రం యింకా సమైక్యంగానే వుంది. విభజనపై నిర?యం వాయిదా పడుతూనే వుంది. అందువలన వాళ్లెందుకు ఆందోళన పడాలి? ఆందోళన చేయాలి? చేయవలసినది ప్రత్యేకవాదులే. అయినా వాళ్లు చేయటం లేదంటే దానికి అర్థం – నేను అనుమానించినదే కావాలి.

నా ఇన్‌ఫరెన్స్ తప్పు అని ఒప్పుకుంటా – తెలంగాణా కాంగ్రెస్ వాదులు ఏదైనా డ్రాస్టిక్‌గా, రాడికల్‌గా (తీవ్రంగా చేస్తే) ! వాళు చేయదలచుకుంటే యిదే సమయం. ఇప్పుడు మౌనంగా వున్నారంటే అర్థం – వాళ్లకు చిత్తశుద్ధి లేదనే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2011)**

**మే 13** **ఎమ్బీయస్ : శభాష్ టిడిపి-1**

ఇన్నాళ్లకు టిడిపివారు తెగించి కరీంనగర్‌లో సభ పెట్టారు. సభ విజయవంతం అయిందా లేదా,సభకు ఎంతమంది వచ్చారన్నది అనవసరం. అసలు సభ అంటూ పెట్టారు, అదే విజయం. పెడితే డొక్క చించేస్తాం, డోలు కట్టేస్తాం అంటే బెదిరిపోకుండా సభ పెట్టి చూపించారు. డొక్కేం చినిగింది? మహా అయితే కొంతమందికి లాఠీ దెబ్బలు పడ్డాయి, కొన్ని కార్ల అద్దాలు పగిలాయి, కొన్ని కోడిగుడ్లు చితికాయి. రేవంత్ రెడ్డి మైకు లాక్కున్నారు. సో వాట్? ఆయనా గవర్నరుగారిది లాక్కున్నాడు. కుర్చీ పడేశాడు. చెల్లుకి చెల్లు. ఆయన అప్పుడు బోర విరుచుకున్నాడు, యిప్పుడీ కుర్రాడు విరుచుకోవచ్చు. అప్పుడు అసెంబ్లీ నడిచింది, ఇప్పుడు సభ నడిచింది. అదీ తెరాస కంచుకోటలో ! వాళ్లు అణిచి పారేద్దామనుకున్న టిడిపి ఆధ్వర్యంలో !!

నేను తెలంగాణ టిడిపి వాదాలకు సమర్థకుణ్ని కాను. కానీ వాళ్ల ప్రజాస్వామ్య హక్కులకు సమర్థకుణ్ని. వాళ్లు అనుకున్నది వాళ్లను చెప్పనివ్వాలి. అది మనం వినవచ్చు, వినకపోవచ్చు, విని ఏడిశావులే అనవచ్చు. కానీ 'నువ్వు చెప్పకూడదు' అని నోరు నొక్కేస్తా నంటే ఎలా? సభ పెట్టడానికి ముందస్తు షరతులు పెడితే ఎలా? మీ పార్టీ తెలంగాణాకు అనుకూలంగా తీర్మానం చేస్తే తప్ప సభ పెట్టడానికి వీల్లేదు అని శాసించవచ్చా? 'మీ పార్టీ ఎజెండాలో ఫలానాది పెట్టు, లేకపోతే టీవీలో యాడ్స్ యివ్వడానికి వీల్లేదు, సభల్లో మాట్లాడడానికి వీల్లేదు' అని అనవచ్చా? లక్షా తొంభై మీటింగులు జరుగుతాయి. ధ్యానం చేస్తే చాలు రాజకీయ ప్రక్షాళన జరిగిపోతుంది అంటుంది ఓ పార్టీ. ముస్లిములు బాగుపడితే చాలు దేశమంతా బాగుపడుతుంది అంటుంది మరో పార్టీ. ముస్లిములు వదిలివెళ్లిపోతే దేశమంతా బాగుపడుతుంది అంటుంది యింకో పార్టీ. భూములన్నీ పంచేస్తే చాలు అంటుంది యింకో పార్టీ. పోయినవాళ్లను స్మరిస్తే చాలు, బంగారు రాష్ట్రం వెలుస్తుంది అంటుంది మరో పార్టీ. ఎవడి గోల వాడిది.

ఓటరన్నవాడు అన్నీ వింటాడు. వాడి విచక్షణ ఉపయోగించి వాడు ఓటేస్తాడు. ఓటరుకి యిది చెప్పకూడదనడానికి అనడానికి మధ్యలో నువ్వెవరివి?? వాడు ఏమారిపోతాడేమోనన్న భయమా ? అదేమీ అక్కరలేదు. వాడు పార్టీలనే ఏమార్చగల గడుసరి ఘనపాఠి. ఇలా అడ్డుకుంటూ పోతే నీకే జెల్లకాయ కొట్టి వినోదించగల తుంటరి. నువ్వు వూరుకో. గోడమీద పిల్లులను ఎలా సత్కరించాలో వాడే చూసుకుంటాడు. ఉద్యమానికి కట్టుబడి వున్నవాడెవడో, ఆ కట్టుబడి ఎప్పుడెప్పుడు వుంటోందో, ఎప్పుడెప్పుడు వ్యూహాత్మక మౌనంలోకి జారుకుంటోందో అన్నీ గమనిస్తాడు. పాఠం చెప్పవలసి వచ్చినపుడు చెప్పేస్తాడు. మళ్లీ మామూలుగా ఏమీ తెలియనివాడిలా తన పని తాను చూసుకుంటూ వుంటాడు. నువ్వు వాడి పాత్ర వేసేద్దామని చూడక.

'ఈ ఉద్యమం నాది. ఎవరైనా చేస్తే నా జెండా కిందే చేయాలి. ఆ జాక్ నాది. నా మ్యాన్ ఫ్రైడేనే అక్కడ పెట్టాను. నా ఆదేశాలన్నీ అమలు చేయించడానికి వాడుకుంటాను' అన్న గర్వం వద్దు. రేపు వాళ్లే మీకు ఎదురు తిరగవచ్చు. వాళ్లే ఎందుకు మీ పార్టీలోనుండే ఓ గ్రూపు విడిపోయి పై చేయి సాధించవచ్చు. ఈ రోజు మీరు విధిస్తున్న ఆంక్షలు ఆ రోజు మీపై వాళ్లు విధిస్తే....? అప్పుడు నొప్పి తెలుస్తుంది. కానీ ఏం లాభం? టూ లేట్ !

మనకు బాగా కోపం వచ్చినపుడు – అంటే అనుకున్న టైముకి రైలో బస్సో రానప్పుడు, ట్రాఫిక్ జామ్ అయిపోయినప్పుడు, అలగా జనం రోడ్ల పక్కన బతికేస్తూ నానా కశ్మలం చేసేస్తూన్నపుడు – మనం తరచుగా అనే మాట. "మనకు ప్రజాస్వామ్యం పనికిరాదండి. డిక్టేకర్‌షిప్ రావాలి. సైన్యం వచ్చి వీళ్లందరినీ కాల్చి పారేయాలి..!" ఆ క్షణంలో మనం ఆలోచించం – సైన్యం వాళ్ల కాల్చడంతో ఆగదని ! అధికారమదం తలకెక్కాక అది ఏమైనా చేస్తుంది. పిల్చుకుని వచ్చిన మననే కాల్చేస్తుంది. ఇతరదేశాల్లో చూస్తున్నాం, రాజకీయనాయకులు బాధ్యతారాహిత్యంతో ప్రవర్తిస్తారు. ఒకరితో మరొకరు కలవరు. కనీసం సర్దుకుని మిశ్రమ ప్రభుత్వం ఏర్పాటు చేయరు. అప్పుడు అరాచకం ఏర్పడుతుంది. అదే అదనుగా సైన్యం రంగప్రవేశం చేసి అధికారాన్ని హస్తగతం చేసుకుంటుంది. వారికి ఓ నియంత లీడరుగా వుంటాడు. రాజకీయనాయకులందరినీ జైల్లో పడేసి, కాస్త పరిస్థితులను మెరుగుపరుస్తుంది. ప్రజలంతా జేజేలు కొడతారు.

ప్రజలు మద్దతు లభించింది కదాని నియంతలు పొగరుబడతారు. ఎవరైనా విమర్శిస్తే సహించలేరు. తీసుకెళ్లి జైల్లో పడేయడమో, కాల్చేయడమో చేస్తారు. ప్రజలు యిది చూసి కూడా సహిస్తారు. ఎందుకంటే మొత్తం మీద చూస్తే నియంతృత్వంలో తమకు మేలు ఎక్కువగా జరుగుతోంది కదాని. ప్రజలు తిరగబడకపోవడంతో నియంతల ధైర్యం పెరుగుతుంది. పోనుపోను తమ కుటుంబానికే, తమ ఆశ్రితులకే అన్నీ కట్టబెట్టి సైన్యాన్ని ఖుషామత్ చేస్తూ పబ్బం గడుపుకుంటారు. ఈ క్రమంలో ప్రజల గురించి పట్టించుకోరు. వాస్తవ స్థితి వివరించబోయిన మీడియాను, మనుష్యులను కాల్చి పారేస్తూంటారు. అమెరికా వంటి ఓ అగ్రరాజ్యం అడుగులకు మడుగులు ఒత్తుతూ వాళ్లు అడిగినవి చేస్తే చాలు, వాళ్లు వీళ్ల జోలికి రారు. ఇక యిష్టారాజ్యం, భరతుడికి పట్టం. సద్దాం, హోస్నీ ముబారక్, కల్నల్ గడాఫీ, బర్మా నియంతలు, పాకిస్తాన్ నియంతలు.. ఎవరిని చూసినా యిదే కథ. వాళ్లను వదిలించుకోవడానికి 40, 50 ఏళ్లు పడుతుంది. అప్పుడైనా సాధారణ పరిస్థితి నెలకొంటుందని నమ్మకం లేదు. తమను ఏ మాత్రం నియంత్రించబోయినా సైన్యం కొత్త పాలకులను దింపేయడానికి చూస్తుంది. ఇవన్నీ చూసి కూడా నియంతృత్వపు పోకడలు సమర్థిస్తే అంతకంటె బుద్ధి తక్కువ మరొకటి వుండదు.

ఢిల్లీకి వెళ్లిన తెలంగాణా నాయకులు కొందరు వినిపించే వింత వాదన ఏమిటంటే "ఆంధ్రప్రాంతంలో వేర్పాటువాదులు క్షేమంగా తిరగగలుగుతున్నారు. కానీ సమైక్యవాదుల తెలంగాణాలో అలా తిరగగలిగే పరిస్థితి లేదు. అందువలన తెలంగాణా యిచ్చేయాలి..."

ఇదే నిజమైతే దీని అర్థం ఆంధ్రప్రాంతంలో ప్రజాస్వామ్యం వుంది, తెలంగాణాలో లేదు. దీన్ని బట్టి తెలంగాణా ప్రాంతీయులందరమూ తల వంచుకోవాలి. మన కంటె ముందు ప్రభుత్వం తలవంచుకోవాలి.

2

ఎవరైనా పౌరుడు తను అనుకున్నది పైకి చెప్పడానికి రాజ్యాంగం హక్కు నిచ్చింది. దాన్ని వినియోగించుకోకుండా మనం అడ్డుపడితే ఎలా? ఆంధ్రప్రాంతంలో విజయవాడలో బిజెపివారు సభ పెట్టి ప్రత్యేకఆంధ్ర నినాదం వినిపిస్తే కొందరు సమైక్యవాదులు వచ్చి సభను భగ్నం చేశారు. అప్పుడు దానిని ఖండించినవారిలో నేనొకణ్ని. అదే విధంగా చక్రవర్తి అనే ఎన్నారై సమైక్యవాదం గురించి పుస్తకం రాసి హైదరాబాదులో సభ పెడితే దాన్ని మీడియావారు, యితరులు కలిసి భగ్నం చేస్తే ఖండించినవారిలో కూడా వున్నాను.

మన ఖండనల వలన వాళ్ల బుద్ధి మారిపోతుందని కాదు, కానీ మన వంతు పాత్ర మనం పోషించాలి కదా అనిపిస్తుంది. మనం రాజువెనక్కాల నిలబడే వేల సంఖ్యలో వుండే సైన్యంలో ఓ వూరూ, పేరూ లేని మనిషి మాత్రమే అనుకోండి. అయినా మనకుండే ప్రాధాన్యత మనకుంటుంది. మనమే లేకపోతే రాజుగారికి సైన్యమే లేదు. సైన్యమే లేకపోతే ఆయన రాజెలా అవుతాడు? ఒంటరిగా కత్తిపట్టుకుని నిలబడితే ఆయనకు విలువ వుంటుందా?

అందువలన మన అభిప్రాయమూ ముఖ్యమే. మనం అందరం ప్రజాస్వామ్యానికే నిలబడదాం. ఎవడికి కావలసినది వాళ్లు చెప్పుకోనిద్దాం. వాళ్ల భావాలు మనకు నచ్చకపోతే మీటింగుకి వెళ్లనే వద్దు. అప్పుడు వాళ్లే మన దగ్గర ఇంకో మీటింగు పెట్టరు. గుడారం ఎత్తుకుని వేరే చోటికి పోతారు. అక్కడా అంబ పలకకపోతే అప్పుడు పంథా మార్చుకుంటారు. ఆ విధంగా బుద్ధి చెపుదాం.

కానీ తెరాసవారి ఐడియా యిది కాదు. సమైక్యవాదులు వచ్చి ఏదైనా వినిపిస్తే ప్రజలు మారిపోతారేమోనని భయం. తాము చెప్పేవి అబద్ధాలు అనుకుని పోతారేమోనని బెదురు. వీళ్ల బాధ మనం అర్థం చేసుకోగలం. వీళ్లు సమైక్యవాదులనే కాదు, ప్రత్యేకవాదులను కూడా రానివ్వడం పోవడం మాత్రం చిత్రంగా వుంటుంది. ప్రత్యేకవాదులలో బిజెపివారు సభ పెడితే ఫర్వాలేదంటారు. కానీ టిడిపివారు పెట్టకూడదట. ఏం? వాళ్లు తమ పార్టీలో మొదట పోట్లాడి రాష్ట్రవిభజనకై మళ్లీ తీర్మానం చేయించి అప్పుడు రావాలిట. వాళ్ల యిబ్బందులు వాళ్లకుంటాయని ఎందుకు ఆలోచించకూడదు? వాళ్లు పార్టీ ఫోరంలో తీర్మానం కోసం అడిగారనుకోండి "2009లో తీర్మానం చేసి ఏం బావుకున్నాం? సమైక్యవాదానికి నిలబడిన వైయస్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్‌కే తెలంగాణాలో ఎక్కువ ఓట్లు వచ్చాయి కదా. ముఖ్యంగా తెలంగాణాలో కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకవాదులందరూ ఓడిపోయారు కదా" అనవచ్చు నాయకుడు, సమైక్యవాదులు.

"2009 మాట వదిలిపెట్టండి. డిసెంబరు 9 తర్వాత పరిస్థితి మారిపోయింది. అందరూ విభజనకోసమే అల్లాడుతున్నారు." అని వీళ్లు (అంటే టిడిపిలో తెలంగాణా కోరేవారు) అన్నారనుకోండి.

"మాకేం నమ్మకం లేదు." అంటారు వాళ్లు.

"లేదు ప్రజలంతా విభజనకోసమే వెర్రెక్కిపోతున్నారు. కావాలంటే మీటింగు పెట్టి చూపిస్తాను. జనం ఎంతమంది వచ్చారో, ఎంత వుత్సాహంగా వున్నారో చూద్దురుగాని. దాంతో మీరే మనసు మార్చుకుంటారు" అని అన్నారనుకోండి వీళ్లు.

ఇలాటి సినారియోలో తెరాస వాళ్లు మీటింగులు పెట్టనీయకపోతే ఎలా? వాళ్లు వాళ్ల పార్టీ నాయకత్వాన్ని ఒప్పించడం ఎలా? నిజానికి మీటింగులు జరిగి, జనాలు అటే మొగ్గు చూపుతున్నారని తోచి టిడిపి రాష్ట్రవిభజనకు జై అనేసిందనుకోండి. ఉద్యమానికి ఎంత లాభం చెప్పండి. తెలంగాణాలో బలమైన క్యాడర్ వున్న పార్టీయే అలా అంటే కాంగ్రెస్ యిరకాటంలో పడిపోతుంది. ఒప్పుకోక తప్పుకోదు. ఒకవేళ కాంగ్రెస్ ససేమిరా అంటోందనుకున్నా టిడిపి, తెరాస, బిజెపి, సిపిఐ బలాలు కలిపితే సగం కంటె ఎక్కువ ఎమ్మెల్యేలు ప్రత్యేక రాష్ట్రానికి మద్దతు యిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది కదా. ఈ తెరాస యిది జరగనీయకుండా అడ్డుపడుతోందంటే అర్థం ఏమిటి? టిడిపి ఉద్యమంలో చేరడం యిష్టం లేదా? గతంలో జాక్ నుండి కాంగ్రెస్ తనంతట తానే వెళ్లిపోయినా కూడా టిడిపివాళ్లు వెళ్లం వెళ్లం అని చూరు పట్టుకుని వేళ్లాడుతూంటే తెరాసే కదా జాక్ కన్వీనర్ ద్వారా టిడిపిని బయటకు తోసేసినది !

ఇప్పుడు ఒక సందేహం వస్తుంది. తెరాసకు టిడిపి నాయకత్వం ఉద్యమంలో చేరడం యిష్టం లేదా? లేదా నాయకులు వ్యక్తిగతంగా యిష్టం లేదా? అని. దేవేందర్ గౌడ్ టిడిపినుండి బయటకు వచ్చేశాక కూడా తెరాస ఆయన్ను వాటేసుకోలేదు. ఇప్పుడు నాగంను ఏం చేస్తారో తెలియదు. ఆహ్వానం పలుకుతున్నాం అని పైకి అంటున్నా, ఆయన హోదాకు తగిన పదవి యిస్తారో లేక నోటితో సరేనంటూనే చేత్తో లేదంటారో తెలియదు. టిడిపి నాయకుడు ఎవరైనా సరే, కనీసం వాళ్ల జిల్లాలో వరకైనా వెనక్కాల మందీ మార్బలం, ధనబలం వున్నవారే. వారితో పోలిస్తే ఉద్యమం వూపులో కొట్టుకుని వచ్చిన తెరాస నాయకులు బలహీనులే.

అందుకే ఉపయెన్నికలు వచ్చినప్పుడల్లా సగం మందే గెలుస్తూ వచ్చారు. కెసియార్ టిక్కెట్టు యివ్వకపోయినా, బయటకు నెట్టేసినా దిక్కుతోచక వెళ్లి సంఘాలు, సమాజాలు పెట్టుకున్నారు తప్ప వేరే పార్టీ పెట్టుకుని గట్టి పోటీ యివ్వలేకపోయారు. తన నాయకులు యిలా వున్నారు కాబట్టి టిడిపి నుండి వచ్చినవారు డామినేట్ చేస్తారన్న భయం కూడా తెరాసకు వుందేమో. ఎలా చూసినా తెరాసకు టిడిపి పొడ, టిడిపివారి పొడ గిట్టదనే అనిపిస్తుంది. కాంగ్రెస్‌ను తిట్టలేరు కాబట్టే తిట్టడానికి ఎవరో ఒకరు కావాలి కాబట్టి టిడిపిని

వాడుకుంటున్నారు. వాళ్ల యాత్రలను, మీటింగులను అడ్డుకుంటున్నారు.

ఇలా చేసి ఏం సాధిస్తారు? నిజానికి మెహబూబాబాద్ రాకుండా జగన్‌ను నిరోధించి వీళ్లు బావుకున్నదేమిటి? ఆ దాడిని ఎదుర్కోవడం వలననే నాబోటి వాళ్లకు సడన్‌గా జగన్ నచ్చేశాడు. అప్పుడు తెరాసకు కాంగ్రెస్ హై కమాండ్ అండగా నిలిచింది అందుకే వాళ్లు ముఖాముఖీ తలపడనివ్వకుండా జగన్‌ను దారిలోనే ఆపేశారు. ఇప్పుడు కూడా టిడిపి తన కార్యక్రమం ప్రకటించగానే పాత ట్రిక్కులే వేయబోయారు. విద్యార్థి సంఘాలు అడ్డుకుంటాయని, జాక్‌లు అడ్డుకుంటాయని... ఎవరేం చెప్పినా వాటి వెనుక ఎవరున్నారో అందరికీ తెలుసు.

3

ఈ సారి ప్రభుత్వం మాత్రం టిడిపిని ఏం చేయగలరో చేసుకోండని వదిలేసింది. టిడిపి, తెరాస – ఎవరి సత్తా వాళ్లు చూపించారు. తెరాస వాళ్లు కార్లు అడ్డుకోగలిగారు. టిడిపి ఎమ్మెల్యే అనుచరులు బడితెలతో తెగబడ్డారు. ఏదో విధంగా మీటింగు ముగిసింది. ఇక్కడ మరో విషయం చెప్పి తీరాలి. టిడిపి వాళ్ల ప్రయత్నాలను భేష్ అంటున్నాను కానీ వారి ప్రలాపాలను కాదు. కొత్త వైష?వుడికి పంగనామాలు ఎక్కువన్నట్టు వీరు తాము అరివీరతెలంగాణావాదు లనిపించుకోవాలనే తాపత్రయంలో తెరాస వారిని మించి సమైక్యవాదులను, ఆంధ్రప్రాంతీయులను తిడుతున్నారు, యింకా తిడతారు. అది మనం ఆమోదించనక్కరలేదు. కానీ తమ ప్రజాస్వామ్యపు హక్కులను చాటుకునే యీ ప్రయత్నాన్ని మాత్రం హర్షిద్దాం.

ప్రస్తుతం టిడిపివారు తెగ సంతోషపడుతున్నారు. ఏదోలా సభ జరపగలిగినందుకు గర్వపడుతున్నారు. దీని తర్వాతది రంగారెడ్డి లోట. ఆ తర్వాతది తెరాస రెండో కంచుకోట వరంగల్‌లోట. సంతోషం. ఎలాగోలా పదిమంది వచ్చినా సభ జరిపామనిపించుకుంటే చాలు, ఆ తర్వాత ఖమ్మం లాటి వాటిలో దివ్యంగా జరిపించుకోవచ్చు. అప్పుడు వాళ్లకు అనిపిస్తుంది – అయ్యో యీ పని ఎప్పుడో చేసి వుండాల్సింది అని. తెలంగాణాలో కాంగ్రెస్‌వారి అండ చూసుకుని తెరాసవారు వాళ్లను ఓ ఆట ఆడించారు. ఇన్నాళ్లకయినా వాళ్లు ఉస్కో అంటే ఉస్కో అన్నారు (ప్రస్తుతం నాయకులందరూ తమ వ్యాఖ్యలను కుక్కల చుట్టూనే తిప్పుతున్నారు. పిచ్చికుక్కలనీ, ఊరకుక్కలనీ, నేను కాటేస్తే నా కాటుకి రాబిస్ టీకా పనికి రాదనీ..' యిలా.. అందుకని – టు బి యిన్ ట్యూన్ విత్ దెమ్ – ఉపయోగించాను తప్ప ఎవర్నీ కించపరచాలని కాదు) అందుకని వారిని శభాష్ అంటున్నాను.

ఇప్పుడు హరికృష? అంటున్నారుట – కరీంనగర్ సభల్లాటివి చేయించమని ఎప్పణ్నుంచో చంద్రబాబుకి చెప్పాను, విన్నాడుకాదు అని. బాబుగారి స్ట్రాటజీ ఏమైనా యిప్పటికే టిడిపికి చాలా డామేజి జరిగింది. ఆయన మారాలి. ఈ విషయం మీద మే 28, శనివారం నాడు ఆంధ్రజ్యోతి రాధాకృష?గారు 'ఆదిత్య' పేరుతో బ్రహ్మాండమైన ఆర్టికల్ రాశారు. ఆర్టికలంతా కోటబుల్ కోట్సే ! మొత్తమంతా అండర్‌లైన్ చేసుకోవచ్చు. నాకు చాలామంది మెయిల్స్ రాస్తూ వుంటారు – 'మీకేదో బుర్ర వుందనుకున్నాను. పోయి పోయి వాళ్లనీ వీళ్లనీ సమర్థిస్తారేమిటి? చంద్రబాబువంటి ఫస్ట్‌క్లాసయిన కాండిడేట్ ఎదురుగా పెట్టుకుని ! ఆయనకు ప్రత్యామ్నాయం లేదు. రాష్ట్రభవిష్యత్తు ఎల్‌ఐసి సింబల్‌లా ఆయన చేతుల్లోనే భద్రం. రాష్ట్రం బాగుపడాలని మీకేమాత్రం వున్నా ఆయనను పల్లెత్తు మాట అనవద్దు. అన్నారంటే మీరు కమ్మ వ్యతిరేకి అన్న నా సందేహం బలపడిపోతుందంతే..' అని.

వారందరికీ పేరుపేరునా ప్రాధేయపడుతున్నాను – బాబుగారు ఎంత సమర్థుడైనా య్వారం ఎక్కడ దెబ్బ తింటోందో తెలుసుకోవాలంటే జ్యోతిలో 'బాబు మారితేనే పార్టీకి భరోసా' అనే యీ ఆర్టికల్ చదవండి అని. క్లుప్తంగా కొన్ని విషయాలు చెపుతాను – 'ఎన్టీయార్ వుండగా ఆయన అనుమతితో బాబు పర్యవేక్షణలో పార్టీ వ్యవహారాలు సాగేవి. ఈ రోజు అటువంటి వెసులుబాటు లేకుండా బాబు తనంతట తానే చేసుకున్నారు...ఎన్టీయార్ వయసుమీరిన మేధావులను థింక్‌ట్యాంక్‌గా వాడుకుంటూ, కొత్తతరాన్ని పాలిటిక్స్‌లోకి తెచ్చారు.. ఇప్పుడు వాళ్లందరికీ 60 యేళ్లు దాటాయి. అయినా వాళ్లనే యింకా కొనసాగిస్తున్నారు తప్ప బాబు కొత్త చిగుళ్లను రానివ్వటం లేదు...

'ప్రధాని అయ్యేటంత సమర్థత వున్న బాబు రాష్ట్రప్రజల విశ్వసనీయత పొందలేకపోవడమేమిటి? ఎన్టీయార్ వుండగా 'మాకు ఎన్టీయార్ వున్నాడు' అని ధైర్యం క్యేడర్‌కు వుండే యిప్పుడు 'బాబు వున్నాడు' అని లేకపోవడమేం? నిజానికి అభ్యర్థులకు ఎన్నికల వ్యూహరచనలో గాని, ఆర్థికసహాయంలో గాని బాబు ఎప్పుడూ ముందుంటారు. ఎన్నికలలో ధన ప్రమేయానికి బాబే ఆద్యుడు. (ఇప్పుడు అదే ఆయన కొంప ముంచుతోంది) తన కాబినెట్‌లో ఎందరో మంత్రులకు ఆయన ఆర్థికసాయం చేశారు. నాగంకు గత ఎన్నికలలో మూడున్నర కోట్లు యిచ్చారు. కొడాలి నానికి పదికోట్లు యిచ్చారు. కానీ ఎవరికీ బాబుపై విధేయత వుండదు. పిల్లి సుభాష్ బోస్‌కు వైయస్సార్ రెండు కోట్లు సాయం చేస్తే ఆయన ఆ కృతజ్ఞతతో జగన్ వైపు వెళ్లిపోయారు. మరి బాబు అనుచరులకు ఆ పాటి ఫీలింగ్ కూడా లేకపోవడమేం?

'బాబు మనసు విప్పి ఆత్మీయంగా మాట్లాడడం అలవర్చుకోవాలి. రాజకీయ అవసరాలే కాకుండా వ్యక్తిగత సంబంధాలకు ప్రాధాన్యత యివ్వాలి. అవసరం లేకపోతే ఎవరినీ పలకరించడు అన్న అపవాదు తొలగించుకోవాలి. పార్టీకోసం వ్యక్తిగత ఆస్తులు అమ్ముకున్న కార్యకర్తలున్న ఘనత టిడిపిది. వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించేవారిని దగ్గరకు రానీయకుండా ఎన్‌టిఆర్ ఆ రోజుల్లో

నిభాయించుకోగలిగారు. బాబు అధీనంలోకి పార్టీ వచ్చాక ఆ ఆశయాలకు దానికి దూరమయ్యారు. సామాన్యప్రజలు పార్టీకి దూరం అయ్యారు. ముఖ్యమంత్రిగా వున్నపుడు కొన్ని నిర?యాలు తీసుకోవడానికి కఠినంగా వ్యవహరించిన బాబు పార్టీ అధినేతగా ద ృఢసంకల్పంతో వ్యవహరించలేకపోతున్నారు. నిర?యాలు తీసుకోవడంలో పిరికితనం కనిపిస్తోంది.

'వ్యక్తులను మేనేజ్ చేస్తూ రాజకీయాలు నడిపిన బాబుకు యిప్పుడు ఆ లక్షణమే శాపంగా మారింది. ఏ యిద్దరు టిడిపి నాయకులు కలిసినా ముందుగా తమ నాయకుణ్నే నిందిస్తూ సంభాషణ మొదలుపెడతారు. పార్టీ నాయకులు బాబును నమ్మరు, బాబు నాయకులను నమ్మరు, ప్రజలు యిద్దరినీ నమ్మరు. బాబుకు శ్రేణులకు మధ్య బంధం బలపడి, పరస్పర విశ్వసనీయత పెంచుకోవాలి. బాబు రాజకీయప్రయోజనాలను పక్కన బెట్టి అయినా రాష్ట్రప్రయోజనాలకై పోరాడాలి. ఆయన రైతు వ్యతిరేకి, విశ్వసనీయత లేని వ్యక్తి అని ప్రజల్లో నాటుకుపోయింది. దీనినుండి బయటపడడానికి తక్షణం కృషి చేయాలి.'

ఇదీ ఆయన ఆర్టికల్ సారాంశం. సీనియర్ జర్నలిస్టు కాబట్టి చాలా విషయాలు తెలిసున్న వ్యక్తి కాబట్టి పేర్లను, అంకెల్ని ఉ దహరించగలిగారు. అవేమీ తెలియకపోయినా నేను ఎప్పుడూ యిదే తరహాలో వాదిస్తూ వచ్చాను. గట్స్ వున్నవాడినే ప్రజలు ఆరాధిస్తారు. ఎన్టీయార్ సాహసం చూసే దాసోహం అన్నారు. ఇప్పుడు జగన్ ఢిల్లీని ఎదిరిస్తే ఓహో అంటున్నారు. రికార్డు మెజారిటీతో గెలిపించారు. బాబు చాలా తెలివిగా సేఫ్‌గా ప్లే చేస్తున్నాను అనుకుంటున్నాను అంటూ ఎటూ కాకుండా చెడుతున్నారు. ఆయన నిజంగా సమైక్యవాది అయితే ఆ విషయం బాహాటంగా చెప్పాలి. గుంభనంగా వుండి సాధించేది ఏముంది? బొద్దూడని తెలంగాణా ఉద్యమకారుడు కూడా బాబును చూస్తే హేళనగా మాట్లాడతాడు – మనసులో ఓ మాట, పైకి యింకో మాట అని. టీవీ చర్చల్లో టిడిపి నాయకుల్ని తక్కినవాళ్లందరూ ఆట పట్టిస్తారు. మీరు ఏం చెప్పినా మేం నమ్మం, మీ నాయకుడు చెప్పాలి అంటూ. బాబేమో నోరు విప్పరు.

అదేమిటో, కాంగ్రెస్ వాళ్లని అనేవాళ్లు తక్కువ. దే సమ్‌హౌ గెట్ ఎవే. గట్టిగా అడుగుతూంటే యిది యుపిఏ తేల్చాలి అంటున్నారు యిప్పుడు. లేటెస్ట్‌గా న్యూస్ చూడండి. రెండో ఎస్సార్సీట. టైమ్స్ ఆఫ్ ఇండియావాళ్లు శుక్రవారం హెడ్‌లైన్స్‌లో క్లియర్‌గా యిచ్చేశారు. (వాళ్లు తెలంగాణా విషయంలో యిస్తున్న ముందస్తు సమాచారం సాధారణంగా కరక్టుగా వుంటోంది) తెలంగాణా యిప్పట్లోరాదు. మమతా బెనర్జీ 2014లో బెంగాల్‌నుండి సాధ్యమైనంతమంది ఎక్కువ ఎంపీలను తెస్తేనే యుపిఏ నిలుస్తుంది. తెలంగాణా యిస్తే గూరా?లాండ్ సమస్య వస్తుంది. సిపిఎం దాన్ని యిస్యూ చేసుకుని, మమతాను దెబ్బ కొడుతుంది. అందువలన మమతా ఒప్పుకోవటం లేదు. తెలంగాణా రైలు కలకత్తాలో ఆగిపోయింది' అని. ఇంత న్యూస్ వస్తున్నా కాంగ్రెస్‌వాళ్లను తెరాస వాళ్లు తిట్టడం లేదు.

కానీ టిడిపిని మాత్రం వేపుకు తినేస్తున్నారు. మహానాడులో యిలా అనలేదు, అలా అనలేదు అంటూ. అంటే కాంగ్రెస్‌కున్న భాగ్యం టిడిపికి లేదన్నమాట. అది గుర్తెరిగి చంద్రబాబు దానికి తగ్గట్టుగానే వుండాలి. "అవును, రాష్ట్రం విడిపోవడం మాకు యిష్టం లేదు" అని ఖచ్చితంగా చెప్పాలి. "మా యిష్టాయిష్టాలతో ప్రమేయం ఏముంది?" అని యివాళ బాబు అన్నా, రేపు జగన్ అన్నా శు ద్ధ తప్పు. వరికి అదనపు మద్దతు ధర కేంద్రం ఎంత నిర?యిస్తే అంతే వుంటుంది అని తెలిసినా 200 యియ్యి, 300 యియ్యి అంటున్నారా లేదా? అలాగే యిదీనూ. ప్రపంచంలో ప్రతీ సమస్యమీద అభిప్రాయం చెప్పి దీని దగ్గర దాటేస్తే నువ్వు అతి తెలివితేటలు ప్రదర్శిస్తున్నావు అని చెప్పుకున్నట్టే. ప్రజలకు సరిగ్గా యిదే నచ్చదు.

తెలంగాణా అంశం ఒక్కదానిమీదే కాదు, ఉచిత విద్యుత్ గురించి, మరో దాని గురించి, అన్నిటి మీదా స్వంత అభిప్రాయం వెలిబుచ్చగలగాలి. అది ఎలా అమలు చేయగలరో చెప్పి ఒప్పించాలి. కాంగ్రెస్ ఏది చేస్తే అదేం చేస్తాం అంటే ఎవరు మన్నిస్తారు? హీరోకున్న వాల్యూ డ్యూప్‌కు వుండదు కదా! స్వాతి కున్న సర్క్యులేషన్ దాన్ని అనుకరించే వీక్లీలకుండదు కదా ! 2009లో ఆల్ ఫ్రీ బాబు అని అనిపించుకున్నపుడే బాబు యిమేజి మాసిపోయింది. ఎలాగైనా అధికారంలోకి రావాలనే తపనతో ఏది పడితే అది ప్రామిస్ చేస్తున్నారు అనుకుని అవతల వైయస్ 'నేను యింతే చేయగలను' అని స్పష్టంగా చెపితే ఆ మాట నమ్మారు. వైయస్ పోయినా టిడిపి ఎదగలేకపోవడం, నాయకత్వ లోపమే ! దీన్ని సవరించుకుంటే టిడిపిని మరింత శభాష్ అందాం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2011)**

## మే 18 ఎమ్బీయస్ : కనొషేన్ టైమ్ – 1

చంద్రబాబుగారు తప్పులు ఒప్పుకునే మూడ్‌లో వున్నారు. ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారంటారు. లెఫ్ట్‌తో యాయన సావాసం చాలాకాలంది. అందుకే వాళ్ల లక్షణాలు వంటపట్టినట్టున్నాయి. కమ్యూనిస్టులు చేసే పనులన్నీ చేసేస్తారు. వాటిల్లో మీకూ నాకూ లాజిక్ కనబడక యిదేమిటని అడిగితే అంతర్జాతీయ ద ృక్పథం, సామ్రాజ్యవాదుల కుట్ర, గతితార్కిక భౌతికవాదం వంటి పెద్దపెద్ద మాటలు ఉపయోగించి మనల్ని హడలేస్తారు. మనం గాబోసు అని వూరుకుంటాం. తీరా చూస్తే ఐదారేళ్లు, కొండొకచో రెండు, మూడు దశాబ్దాలు గడిచాక పొలిట్ బ్యూరో సమావేశం పెట్టుకుని అప్పుడు "గతంలో మేం చేసినవన్నీ చారిత్రాత్మిక తప్పిదాలు" అని ఓ డిక్లరేషన్ యిస్తారు. అంటే మనకు యీ రోజు తట్టినది వాళ్లకు పదేళ్ల తర్వాత సబబుగా తోస్తుందన్నమాట.

బాబుగారు కూడా మహానాడు వేదికగా చేసుకుని మూడు క్షమాపణలు చెప్పారు – కొన్ని వర్గాలకు బాధ కలిగించినందుకు, ఉ ద్యోగులను కష్టపెట్టినందుకు, బిజెపితో సావాసం చేసినందుకు. ఆ తర్వాత ఎబియన్ ఆంధ్రజ్యోతి టీవీలో మాట్లాడుతూ విదేశీయుల

పొగడ్తల అగడ్తలో పడి తన మార్గమే కరక్టనుకుని పార్టీని నిర్లక్ష్యం చేశానని కూడా ఒప్పుకున్నారు.

మొదటగా బాధపడిన వర్గాల గురించి చెప్పుకుందాం. 'వ్యవసాయం దండగని నేననలేదు. కిట్టుబాటు కావడం లేదు. రైతులు కూడా వాళ్ల పిల్లల్ని ఐటీలోకి పంపి డబ్బు సంపాదించుకుంటున్నారు అన్నాను' అని చెప్పుకున్నారు. సెల్ఫ్ ఎంప్లాయిడ్ ఐన వ్యక్తి ఎంప్లాయిడ్ కావడం ప్రగతికి సూచకం కాదు. వ్యవసాయం కిట్టుబాటు కాకపోతే వేర్‌హౌసెస్ పెంచడం, పల్లెల్లో ఆగ్రో యిండస్ట్రీస్ పెట్టడం వంటివి చేయాలి తప్ప ఉద్యోగాలకు తరమకూడదు. మనుష్యులున్నంతకాలం, జనాభా పెరుగుతున్నంతకాలం తిండిగింజల అవసరం పెరుగుతూనే వుంటుంది. వ్యవసాయం ప్రాధాన్యత పెరుగుతూనే వుంటుంది. అయితే రైతుల నడ్డి ఎందుకు విరుగుతోంది? నకిలీ విత్తనాల వలన, ఎరువుల కొరత వలన, పంట చేతికి వచ్చే సమయానికి ధర పడిపోవడం వలన, కిట్టుబాటు ధర వచ్చేవరకూ స్టాక్ చేసి వుంచే సాధనాలు, వుంచగలిగిన ఆర్థిక స్తోమత లేకపోవడం వలన...!

ఇవన్నీ పరిపాలనకు సంబంధించిన వ్యవహారాలు. ఇవి చేయక, చేయలేక.. మీ పిల్లలికి కంప్యూటర్ నేర్పించి గుమాస్తాలుగా, టెలిఫోన్ ఆపరేటర్లుగా పంపి బతకండి అనడం ఏం విజ్ఞత? ఉద్యోగి తన పొట్ట మాత్రమే నింపుకోగలడు. వ్యవసాయం సజావుగా జరిగేట్టు చూస్తే ఒక కుటుంబమే దాని మీద బతికేస్తుంది. ఎంట్రప్రెనార్‌షిప్‌ను ప్రోత్సహించడమే దేశానికి కావలసినది. జలగం వెంగళరావుగారి వద్దకు ఉద్యోగం కోసం వస్తే తిట్టేవారట. కావాలంటే పాన్‌షాపు పెట్టుకుంటానను, కిరాణాకొట్టు పెట్టుకుంటానను, కాటేజీ యిండస్ట్రీ పెట్టుకుంటానను, పెద్ద ఫ్యాక్టరీ పెడతానను – సాయం చేస్తా. ఉద్యోగాల కోసం రావద్దు అని. అది కరక్ట్ ఎప్రోచ్ అని నా ఉద్దేశం.

ఇక వర్షాలు రాలేదు కాబట్టి ఆ వర్గాలకు ఏం చేయలేకపోయా రనుకోవడం బాగాలేదు. అన్నీ సవ్యంగా నడిచి నెలకు మూడు వానలు కురిస్తే మీ ఘనత ఏముంది? వర్షాలు పడని రాజస్థాన్‌లో ఏం చేస్తున్నారు, వర్షాపాతం తక్కువన్న రోజుల్లో మధ్యప్రదేశ్‌లో ఏం చేస్తున్నారు? ఇవన్నీ గమనించి డ్రై ల్యాండ్ ఫార్మింగ్, మెడిసినల్ ప్లాంట్స్ వేయించడం.. యిలాటివి చేయించి వుండాల్సింది. నాకు వ్యవసాయం గురించి పెద్దగా తెలియదు కాబట్టి ఎక్కువగా రాయలేను కానీ వీటిల్లో నిపుణులు వుంటారు. వారి సలహాలు తీసుకుని కష్టకాలంలో కూడా గట్టెక్కించి వుంటే టిడిపికి యీ పరిస్థితి వచ్చి వుండేది కాదు.

తర్వాత విద్యుత్ చార్జీలు పెంచడం విషయంలో బాబు చాలా దూకుడుగా వెళ్లిపోయారు. సంస్కరణలు చేపట్టాలి నిజమే కానీ మరీ అన్నీ ఒకేసారా !? కరువుకాలం నడుస్తోందని తెలుసు కదా, గ్రామాల్లో ఆర్థికవ్యవస్థ కుప్పకూలి సైకిళ్ల మీద తిరిగి జాకెట్టు గుడ్డలమ్ముకునేవాడు సైతం లబోదిబో మంటున్నాడని తెలుసు కదా, ఊరికే కరంటు చార్జీలు పెంచేస్తే ఎలా? తెలంగాణాలో సహజమైన నీటివనరులు తక్కువ. బోర్లు వేసి నడుపుకోవాలి. బోర్లు నడవాలంటే కరంటు కావాలి. ఆ కరంటును ప్రియం చేసి పెట్టారు బాబు. అదీ అతి తక్కువ వ్యవధిలో యింకా యింకా పెంచుకుంటూ పోయారు. తెలంగాణా రైతులందరికీ మండిపోయింది.

అదే అదనుగా అదే సమస్యపై కెసియార్ బయటకు వచ్చారు, తెరాస పార్టీ పెట్టారు. బాబు అప్పుడైనా విషయం గ్రహించవలసినది. సర్దుబాటు చర్యలు చేపట్టవలసినది. నిజమే ఆయన చేసిన సంస్కరణల వలననే తర్వాతి కాలంలో వైయస్ ఉచిత విద్యుత్ యివ్వగలిగారు. కానీ సంస్కరణల బరువు ఒకేసారి మన నెత్తిన పడేస్తే ఎలా? క్రమక్రమంగా కొద్దిపాటి డోసుల్లో యివ్వాలి తప్ప...! ప్రతిపక్షాలే కాదు, ఆయన పార్టీ సభ్యులూ చెపుతూ వచ్చారు. కానీ బాబు ఎవరి మాటా వినలేదు.

ఇక ఉద్యోగి వర్గాలకు చెప్పిన క్షమాపణ గురించి – ఉద్యోగి వర్గాలకే కాదు, బాబు అనగానే అందరి కళ్లముందూ ఆడేది – తర్జని ! 'నేను సహించను, మీ పద్ధతి భరించను, జాగ్రత్త' అని చూపుడువేలుతో హెచ్చరిస్తున్నట్లు, బెదిరిస్తున్నట్లు వున్న రూపమే కళ్లకు కడుతుంది. నిజమే ఆయన కష్టజీవి, తెలివైనవాడు, సమర్థుడు. కానీ మనల్ని అలా బెదిరించేస్తూంటే మనకేం నచ్చుతాడు? గతంలో మొరార్జీ దేశాయ్ కూడా యింతే. ఆయనను గౌరవిస్తాం తప్ప ఆత్మీయంగా వాటేసుకోం. కడుపున పుట్టిన కొడుకునే ఈ రోజుల్లో అదలించలేం. బుజ్జగించి పనులు చేయించుకుంటున్నాం. అలాటిది ఉద్యోగులను డొక్క చించుతా, డోలు కడతా అంటే వాళ్లకు ముచ్చటగా వుంటుందా?

అవినీతి పనులు చేయనంతవరకు, ఎంత అసమర్థవంతంగా వున్నా తమను కదిపేవారు ఎవరూ లేరని ప్రభుత్వోద్యోగికి బాగా తెలుసు. బాబు చివాట్లు వేస్తున్నపుడు ఈ శరీరం మనది కాదు, యీ చెవులు మనది కాదు అని అనేసుకుంటే చాలు, బతికేయవచ్చు అన్న పద్ధతిలో వుండేవారు ఉద్యోగులు.

## 2

అందునా ఈనాడు చూస్తే ఉద్యోగులకు మరీ మండిపోయేది. 'బాబు ఫలానా ఉద్యోగిని మెచ్చుకున్నారు' అని ఎప్పుడూ రాసేవారు కారు. 'బాబు ఉద్యోగులను ఉరుకులు, పరుగులు పెట్టి పని రాబట్టారు, మందలించారు, కళ్లు ఎ్ర చేశారు, నిలదీశారు' అనే రాసేవారు. ఏదైనా పొరబాటు జరిగిందనుకోండి. 'ఉద్యోగులు బాబును తప్పుదోవ పట్టించారు' అని తప్పు ఉద్యోగుల మీద తోసేసేవారు తప్ప తప్పు బాబుది అని అనేవారు కారు. బాబు క్రమశిక్షణ ఉద్యోగులు వాళ్ల పాలిట శిక్షగా అనుకున్నారు. అందుకనే బాబు ఓడిపోగానే పండగలు జరుపుకున్నవారు ఉద్యోగి వర్గాలే అంటే అతిశయోక్తి కాదు. బాబు యిప్పుడు వారికీ క్షమాపణ చెప్పేశారు.

ఇంకో క్షమాపణ – రాజకీయపరమైనది. బిజెపితో చేతులు కలిపినందుకు క్షమించమన్నారు. అంతకుముందు జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పేరోజుల్లో బాబు నేషనల్ ఫ్రంట్‌తో చేతులు కలిపారు. పదవులు తీసుకున్నారు. వాళ్లు నీరసించగానే బిజెపివైపు తిరిగిపోయారు. ఇది ఎన్టీయార్ ఆశయాలకు అనుగుణంగా వుందా లేదా అని తర్కించలేదు. బిజెపిని నిలబెట్టి రాష్ట్రానికి కావలసిన నిధులు తెచ్చుకున్నారు. అప్పటికి అది రాజకీయ అవసరం. ఏదో తంటాలు పడ్డారు. ఆ మాట కొస్తే కమ్యూనిస్టులు కూడా ముస్లిం పార్టీలతో కేరళతో పొత్తు యిప్పటికీ పెట్టుకుంటున్నారు. ఆంధ్రలో ఓ సారి కాంగ్రెస్‌తో, మరోసారి టిడిపితో పొత్తు పెట్టుకున్నారు. అలాగే తెరాస కూడా. విపి సింగ్ ప్రభుత్వాన్ని ఓ పక్కనుండి బిజెపి, మరో పక్క నుండి లెఫ్ట్ కొమ్ముకాసి నిలబెట్టాయి. మాయావతి ఓ సారి బిజెపితో, మరోసారి ఎస్పీతో మార్చిమార్చి పొత్తు పెట్టుకుంది. ప్రజలు యివన్నీ పట్టించుకోవడం మానేశారు.

ఇప్పుడు బాబు అర్జంటుగా బిజెపితో పొత్తుపై క్షమాపణలు ఎందుకు చెప్పుకున్నట్లు? ముస్లిం ఓట్ల గురించా? అంటే కమ్యూనల్‌గా ఆలోచిస్తున్నట్లేగా ! ముస్లిం ఓట్లంటే అంత భయమా? కడప ఉపయెన్నికలో జగన్–బిజెపి కలిసిపోయారని తెగ ఊదరగొట్టినా మీ మాటలు వాళ్లు నమ్మలేదే ! మీకు డిపాజిట్ కూడా దక్కనీయకుండా చేశారే ! ఇప్పుడు నమ్ముతారా? తమిళనాడులో కరుణానిధి తన ప్రభుత్వాన్ని ఎమర్జన్సీ పీరియడ్‌లో రద్దు చేసి పడేసిన ఇందిరా గాంధీతో దరిమిలా పొత్తు పెట్టుకున్నారు. హిందూమతాన్ని యీసడించే పద్ధతి మార్చుకోకుండానే బిజెపితో పొత్తు పెట్టుకున్నారు. అయినా ఆయనకు వచ్చే ముస్లిం ఓట్లు వస్తూనే వుంటాయి. ఇవన్నీ రాజకీయ అవసరాలు అని ఓటర్లు ఎప్పుడో గ్రహించారు.

బాబు బిజెపితో ఊరేగిన రోజుల్లో కూడా రాష్ట్రంలో ముస్లింలపై అత్యాచారాలు జరగలేదు. వారిని పక్కకు నెట్టేయలేదు. అలాటప్పుడు ముస్లిములు ఏదో బాధపడిపోయారని యీయన అనుకోవడం దేనికి? దానికి క్షమాపణ చెప్పుకోవడం దేనికి? దీనివలన అనవసరంగా బిజెపితో కయ్యం తెచ్చుకోవడం కాకపోతే బావుకునేది ఏముంది? ప్రస్తుత పరిస్థితి చూస్తే యుపిఏ పరిస్థితి నానాటికీ దిగజారిపోతోంది. లెఫ్ట్ యిప్పట్లో కోలుకునేట్టు లేదు. ఒక్క ఎడిఎంకె నెగ్గగానే తృతీయఫ్రంట్ రెక్కలు విప్పుకుంటుందని అనుకోవడం అత్యాశ. అవసరం పడితే బాబు బిజెపికి మద్దతు యిచ్చే పరిస్థితి వస్తుందేమో ! తొందరపడి వాళ్లను అస్పృశ్యులుగా ప్రకటించడం దేనికి? వాళ్లను ఎప్పుడో ఓ సారి కౌగలించుకున్నదానికి యిప్పుడు ప్రాయశ్చిత్తకర్మలు చేసుకోవడం దేనికి?

ఇక పొగడ్తల అగడ్త గురించి చెప్పుకుందాం. బాబు స్వయంగా చెప్పుకున్నారు. బిల్ క్లింటన్, టోనీ బ్లెయర్, వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంటు మెచ్చుకోవడంతో నాదే కరక్టు పద్ధతనుకున్నాను, పార్టీ నాయకుల మాటలు పట్టించుకోలేదు, పార్టీని పట్టించుకోలేదు – అని. ఒక స్టేజి దాటాక మన చుట్టూ పొరలు కప్పేవాళ్లు తయారవుతారు. అసలు మనకే స్వతసిద్ధంగా నార్సిసిజం వుంటుంది. (ఈ పదం వినే వుంటారు – గ్రీకు పురాణాల్లో నార్సిసియస్ అనేవాడు కనబడతాడు. అతడు నీటిలో తన ప్రతిబింబాన్ని చూసి వీడెవడో అందంగా వున్నాడనుకుని వాడితో ప్రేమలో పడతాడు. చివరకి వాణ్ని కలుసుకోవాలని నీటిలో వురికి చచ్చిపోతాడు. తనను తనే ప్రేమించుకోవడం ఆత్మహత్యాసదృశం అని నీతి)

మనం ఏం చేసినా మనకు గొప్పగానే అనిపిస్తుంది. దానికి తోడు బయటివాడు వచ్చి ఓహొహొ మహాప్రభో అంటూ వుంటే యింకేముంది మెగాలోమానియాక్ అయిపోతాం (మనమే అందరికంటె గొప్ప అని దిగివచ్చామనీ అనుకోవడం). ఇదివరకు హిట్లర్, ముస్సోలినీ యిలాగే అనుకున్నారు. వాళ్లు నియంతలు కాబట్టి అది చాలాకాలం చెల్లిపోయింది. కానీ ప్రజాస్వామ్యంలో ఆ పప్పులు ఉడకవ్. ఇందిరా గాంధీ అలాగే అనుకుంది. ఎమర్జన్సీలో నియంతలా వుంది కాబట్టి 'ఇందిరా ఈజ్ ఇండియా' అనిపించుకుంది. ఎమర్జన్సీ ఎత్తేశాక ప్రజాస్వామ్యం వచ్చాక ప్రజలు ఇందిర ఇందిరే, ఇండియా ఇండియాయే అని చాటి ఎత్తి కుదేశారు.

ఎన్టీయార్ కూడా మెగాలోమానియాకే. ఈ మధ్య కావూరి సాంబశివరావు ఒక యింటర్వ్యూలో అన్నారు. 'ఎన్టీయార్ ఆత్మగౌరవం గురించి అంత మాట్లాడతారు కానీ ఎదుటివాడి గౌరవం గురించి పట్టించుకోరని.' సినిమారంగంలో మాట ఏమో కానీ రాజకీయరంగంలో తాను రాజకీయాల్లోకి తెచ్చిన ఎమ్మెల్యేల గురించి ఆయన అదే చేశారు. ఎమ్మెల్యేలేమిటి, మంత్రులనే పట్టించుకోలేదు. ఒక్క కలంపోటుతో కాబినెట్ మొత్తం రద్దు చేసేసి ఊరు వెళ్లిపోయారు. అవతలివాడు ఎలా ఫీలవుతాడో అని ఆలోచించలేదు. "పార్టీ నాతోనే పుట్టింది, నాతోనే పోతుంది" అనుకున్నారు, పైకి అన్నారు. పోయిందా? లేదే ! ఆయన దరఖాస్తుల్లా తీసిపారేసిన ఎమ్మెల్యేలే గడసానులై ఆయన్ని యింటికి పంపారు. బాబు కూడా అధికారంలో వున్నపుడు పాతికేళ్లు పాలిస్తా అన్నారు. ప్రజలు పాలించనివ్వలేదు.

బాబు ఇప్పుడు ప్రతిపక్షంలో వున్నారు. వారసత్వం సమస్య వచ్చింది. జగన్ యువనాయకుడిగా ఎదుగుతున్నారు కాబట్టి, కిరణ్‌ని కూడా యువతరానికి ప్రతినిధి అంటున్నారు కాబట్టి, తెరాసలో హరీశ్, కెటిఆర్ వంటి (కంపారటివ్‌లీ స్పీకింగ్) యువకులున్నారు కాబట్టి టిడిపిలో కూడా యువనాయకత్వాన్ని తెస్తారని అనుకుని 'అతడు ఎవడు?' అని మీడియా ఊహాగానాలు చేస్తోంది. లోకేశా? జూనియరా? ఎవరు? అని అడుగుతున్నారు. వారసత్వ సమస్య లేవనెత్తినందుకు బాబు ఆశ్చర్యపడుతున్నారు. "ఇప్పుడు అవసరం ఏమొచ్చింది? నేను ఫిజికల్లీ డబుల్ ఫిట్‌గా వున్నాను, మెంటల్లీ మూడురెట్లు ఫిట్‌గా వున్నాను" అంటున్నారు. ఇదేనండీ బాబూ సమస్య ! ఫిట్‌నెస్ వున్నా ఉద్యోగంలో 58 ఏళ్లో, 60 ఏళ్లో రాగానే ఇదే బాబుగారు మనల్ని దిగు దిగు నాగన్నా అని దింపేస్తారు. తన వద్దకు వచ్చేసరికి మాత్రం కండ చూడు, గుండె చూడు అంటారు.

అద్వానీగారు యిలా అనుకునే బిజెపిలో యువనాయకత్వం లేకుండా చేశారు. ఇన్నాళ్లకు యువకుడంటూ (అద్వానీతో పోలిస్తే) నితిన్ గడ్కరీని తీసుకుని వచ్చి పెట్టారు. ఆయన చర్చల్లో కుర్చీలో కూర్చుంటే కుర్చీమీద మనకు జాలి వేస్తుంది. లేచేటప్పుడు యీయనమీద జాలి వేస్తుంది. గబుక్కున వెళ్లి చెయ్యి అందిద్దామా అనిపిస్తుంది. ఇదీ యువనాయకత్వం. వాజపేయిగారు బొత్తిగా నిలబడలేకపోతున్నారు గానీ లేకపోతే ఆయన్నే తీసుకుని వచ్చి రథం మీద కూర్చోబెట్టేసేవారు. బిజెపిలో తక్కిన నాయకులందరూ అద్వానీని, వాజపేయిగారినీ పూజించడం ఎప్పుడో మానేసి వుంటారు. భజగోవిందంలో చెప్పారు – అవసరానికి మించిన డబ్బువుంటే కొడుకునుండి కూడా ప్రమాదం వుంటుందని. డబ్బు మేట వేసుకుని మీరు ఏళ్లూ, పూళ్లూ బతికేస్తూ వుంటే కొడుక్కి మండిపోదూ? ఈయన ఎప్పుడు చస్తాడు? మన కెప్పుడు యిస్తాడు? మన షష్టిపూర్తినాడు బహుమతిగా యిస్తాడా? ఇక మనం ఏం అనుభవించగలం? అని.

షాజహాన్ చేసిన నేరం ఏమిటి చెప్పండి? ఔరంగజేబు అనుకున్నదాని కంటె ఎక్కువనాళ్లు బతకడం, బతికినన్నాళ్లూ సింహాసనం వదలకపోవడం. దానికి ఫలితం ఏమిటి? శేషజీవితం జైల్లో గడపడం. అందుకే హిందూ సంప్రదాయం చెప్తుంది – ఒక వయస్సు వచ్చాక రాజ్యాన్ని పిల్లలకు అప్పగించేసి, వానప్రస్థానికి వెళ్లిపోమని. లేకపోతే నీ ప్రాణానికే ముప్పు అని చెప్పకనే చెప్తున్నారన్నమాట. ఎన్టీ రామారావు కూడా రాష్ట్రాన్ని తనకు అప్పగించేసి, జాతీయ రాజకీయాల్లోకి వెళ్లిపోయివుంటే చంద్రబాబు ఆయన్ని దింపేసేవారు కారు. ఆ మానసిక క్షోభ భరించలేక రామారావు వెంటనే చనిపోయి వుండేవారు కారు.

రామారావు ముఖ్యమంత్రి పదవికి, పార్టీ అధ్యక్షపదవికి అంటిపెట్టుకుని వుండడమే ఆయన చేసిన పొరబాటు. ఇప్పుడు బాబు కూడా అదే చేస్తున్నారు. 'నేను బాగానే వున్నాను, మా అబ్బాయి వ్యాపారంలో బాగానే వున్నాడు. జూనియర్ సినిమాల్లో బాగానే వేసుకుంటున్నాడు. నాకు కాలో, చెయ్యో వంగిన తర్వాత మా అబ్బాయికి వ్యాపారంలో బోరు కొడితేనో, జూనియర్‌కు సినిమా ఛాన్సులు అయిపోతేనో యిటు రావచ్చు. అప్పటిదాకా వున్న ఏర్పాటు నిక్షేపంలా కొనసాగించవచ్చు' అనుకుంటున్నారు.

రామారావు కొత్తనీరు, కొత్త ఆలోచనలు, కొత్త వ్యక్తులు అంటూ అనేకమంది కొత్తవారిని రాజకీయాల్లోకి ఆకర్షించారు. బాబు పంథాయే వేరు. అదే ఎర్రన్నాయుడు, అదే యనమల, అదే గోరంట్ల, అదే దేవేందర్, అదే ఎర్రబెల్లి.. ఇదంతా బాబు ఏం చెప్తే దానికి తలవూగించే బ్యాచ్. కొత్తవాళ్లని తెస్తే వాళ్లు చిన్నంతరం, పెద్దంతరం లేకుండా బడబడా వాగేయవచ్చు – ఇలా ఎందుకు చేయకూడదు? అని అడిగే సాహసం చేయవచ్చు. అమ్మో, అనుకుంటారు బాబు.

ఆయన్ని ఎవరూ ఏమీ అడగకూడదు. పార్టీ అధ్యక్షుడు ఆయనే, ప్రతిపక్ష నాయకుడూ ఆయనే. రేపు అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రీ ఆయనే. అసలు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఒకరే కావడం అనేది తప్పుడు కాన్సెప్ట్. ఎవరికైనా చెక్ వుండాలి. ఫ్యాక్టరీ యాజమాన్యానికి యూనియన్ చెక్ పెట్టినట్టు, భర్తకు భార్య చెక్ పెట్టినట్టు, ఎప్పుడూ కౌంటర్ ఫోర్స్ వుండాలి. ఉంటేనే వ్యవస్థ బలపడుతుంది. కమ్యూనిస్టుల్లో అది బాగా మేన్‌టేన్ చేస్తారు. ఓ సారి నంబూద్రిపాద్ ఏదో చేస్తే ఆయన పార్టీ ఆయనను తప్పు పట్టింది. ఆయన ఒప్పుకున్నాడు. అదేమిటి? అంటే మరి నేను ముఖ్యమంత్రిగా అందర్నీ శాసిస్తాను. నేనేదైనా తప్పు చేస్తే సవరించేందుకు, శాసించేందుకు పార్టీ వుంది. వారి మాట వినకపోతే ఎలా? అన్నారు. టిడిపిలో ఎన్టీయార్ రెండు పదవులూ అనుభవించారు. అప్పుడు పార్టీలో ఆయనకు సెకండ్ లైన్‌లో బాబు వున్నారు. ఇప్పుడు బాబుకి సెకండ్ లైన్ ఎవరూ లేరు. ద్విపాత్రాభినయం చేస్తున్నారు, అదీ స్వీయదర్శకత్వంలో. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే కూడా ఆయనదే. ఇక అవతలివాడు వేలు పెట్టడు.

ఇక్కడో మాట చెప్పాలి. నాకు కొంతమంది ఔత్సాహిక సినిమా డైరక్టర్లు తగులుతూంటారు. 'కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం' నాదేనండి. నిర్మాత గురించి వెతుకుతున్నా అంటారు. అన్నీ మీరే చేయడం దేనికి, కొన్ని వేరే వాళ్లకు అప్పగించవచ్చు కదా అని అడిగితే "అబ్బే లేదండి, కథ నేనే రాసుకున్నాను. పాత్రలన్నీ నా మనస్సులో సెట్ అయిపోయి వున్నాయి. ఇంకోళ్లకు అప్పగిస్తే వాళు సరిగ్గా అర్థం చేసుకోలేరు" అంటారు. "కథ మీరే రాసుకున్నారంటే, మీరు స్వయంగా కథకులా? ఇంతకుముందు కథలు ఏమైనా రాసారా?" అని అడిగితే "అబ్బే మామూలు కథలు రాయలేదండి. సినిమా కథ రాసుకున్నాను." అంటారు. "మాటలంటున్నారు, పోనీ యింతకుముందు నాటకాలూ అవీ...?" అని అడిగితే

"అబ్బే అదేం లేదండి. ఐ యామ్ కట్ ఔట్ ఫర్ సినిమా. నాకు సినిమాలంటే పేషన్ వుంది. పేషన్ వుంటే తక్కినవన్నీ దానంతట అవే వచ్చేస్తాయి. నేను యుయస్‌లో చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి వచ్చి చేద్దామనుకుంటున్నాను. మా పేరెంట్స్ వద్దంటున్నారు. స్టడీ లోన్ తీరకుండా ఎట్టా అంటున్నారు"

"మీకంత ఆత్మవిశ్వాసం వుంటే మీ కథను ఎవరికైనా పెద్ద డైరక్టరుకి చెప్పి కన్విన్స్ చేయవచ్చు కదా! మీరు హాలీవుడ్ గ్రేట్స్ చూడండి, గొప్ప హిందీ సినిమాలు చూడండి. అవన్నీ టీమ్ వర్క్సే. కథ ఒకరిది, ట్రీట్‌మెంట్ మరొకరిది, సంభాషణలు ఇంకోరివి. స్క్రీన్‌ప్లే, డైరక్షన్ ఒక్కరు చేసినవాళ్లు వున్నారు కానీ చేయనివాళ్లే ఎక్కువ. ఇంతా చేసి ఎడిటర్ చేతికి అప్పగించి మీ యిష్టం అంటారు. మీతో యిబ్బంది ఏమిటంటే – మీ కథతో, డైలాగ్స్‌తో మీరు మీ సాటి టెక్నీషియన్లనే కన్విన్స్ చేయలేరు. ఇక ప్రేక్షకులను ఏం కన్విన్స్ చేస్తారు?" అంటాను.

"బాలచందర్‌ను చూడండి. భారతిరాజా, భాగ్యరాజా, పాండ్యరాజా, తేజ...యిలా ఎంతోమంది అన్నీ వాళ్లే చేసుకున్నారు. వాళ్లే

నాకు ఆదర్శం." అంటారు వాళ్లు.

బాలచందర్ సినిమాల్లోకి వచ్చేముందు అనేక నాటకాలు రాసి, గ్రిప్ సంపాదించుకున్నారు. భారతిరాజా, భాగ్యరాజా అసిస్టెంటు డైరక్టర్లుగా ప్రఖ్యాతుల వద్ద పనిచేసి మెళకువలు తెలుసుకున్నారు. అన్నీ వాళ్లే చేసుకున్నవారి సినిమాలు మొదట్లో నాలుగైదు హిట్ అయినా తర్వాత ఎక్కువకాలం నిలదొక్కుకోని సందరాలూ చూస్తాం. ఇవన్నీ యీ ఉత్సాహవంతులు వినిపించుకోరు.

తమాషా ఏమిటంటే బాబుగారి వంటి సీజన్డ్ పొలిటీషియన్ కూడా ఈ ఔత్సాహికుల్లాగానే ప్రవర్తిస్తారు. టిడిపిలో అన్నీ ఆయనే. "నేను యిచ్చిన స్టేటుమెంటుకే విలువ. తక్కినవాళ్లు ఏం మాట్లాడినా పట్టించుకోకండి" అంటారు. అందుకే టిడిపిలో స్థానిక నాయకులు ఏమీ చేయరు. చేసినా బాబు మెచ్చరని తెలుసు. అందుకని ఆయన్నే చేయనీ అని కాళ్లు బారచాపి కూర్చుంటారు. ఎన్నికలలో కూడా 'బాబుగారు వచ్చి ఉపన్యాసం యిస్తారు, నిధులు సమకూరుస్తారు' అని గట్టుమీద కూర్చుంటారు. బాబు వచ్చి నెత్తిమొత్తుకుని 'నాతో బాటు మీరూ కష్టపడకపోతే ఎలా'? అంటూ ఈ భారాన్నంతా మోస్తూ తిరుగుతారు. కష్టం యీయనది, సుఖం వాళ్లది. రోజుకి 18 గంటలు పనిచేసి బాబుగారు సాధిస్తున్నదేమిట్రా అంటే సహచరులను స్వీయప్రకాశం లేకుండా చేయడం. చివరికి పార్టీ దెబ్బ తింటే అందరూ కలిసి బాబునే నిందిస్తారు. ఇదీ ఆయన దుస్థితి. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2011)**

**జూన్ 05** **ఎమ్బీయస్ : దుష్టశక్తి – 1**

చంద్రబాబు నాయుడుగారు యిటీవల తప్పులు ఒప్పుకుంటున్నా, 1995 ఆగస్టులో తను చేసిన దానికి మాత్రం క్షమాపణ చెప్పలేదు. "ఎన్టీయార్ నాకు పిల్లనిచ్చిన మామగారు, నాకు గురువు, దైవం. అయినా దుష్టశక్తి కారణంగా ఆయనను పదవినుండి దింపి పార్టీని, తద్వారా రాష్ట్రాన్ని కాపాడుకోవలసి వచ్చింది. అప్పుడు నా వెంట 200 మంది ఎమ్మెల్యేలున్నారు. అంతా ప్రజాస్వామికంగానే జరిగింది. ఆ రోజు అలా చేశాం కాబట్టే యిప్పటికీ పార్టీ నిలిచి వుంది" అని చెప్పుకున్నారు. ఆయన ఉదహరించిన దుష్టశక్తి ఎవరో అందరికీ తెలుసు. అందుకే లక్ష్మీపార్వతి మర్నాడే "ఆ దుష్టశక్తివి నువ్వే. అత్తగారిని పట్టుకుని అంత మాట అంటావా? మహిళల పట్ల నువ్విచ్చే గౌరవం యిదేనా?" అని దులిపేశారు. బాబు ఎప్పటిలాగానే స్పందించలేదు. అసలు ఆయన యీ పదహారేళ్లూ ఎప్పుడూ దాని గురించి మాట్లాడలేదు. ఇప్పుడే నోరు విప్పారు.

బాబుకు వెన్నుపోటు అనే మాటను పర్యాయపదం చేసేశారు ఆయన ప్రత్యర్థులు. బాబు గురించి ఏ ప్రస్తావన వచ్చినా 'పిల్లనిచ్చిన మావగారికి ద్రోహం చేసిన..' అంటూ మొదలెడతారు. అసెంబ్లీలో ఈ మాట రాకుండా ఒక్క రోజు కూడా నడవదు. వీళ్లకు పద్యాలు రావు గానీ లేకపోతే "గయోపాఖ్యానం"లోని 'అల్లుడా రమ్మని పిలువ..' పద్యం అందుకునేవారే ! ఇది వినివిని విసుగెత్తిపోయాం. రాజకీయాల్లో నిన్న కళ్లు తెరిచినవాడు సైతం బాబు అనగానే హేళనగా వెన్నుపోటు ప్రస్తావన తెస్తారు. ఆ నాటి సంఘటనలో బాబును తప్పు పట్టాలా? పడితే ఏ మేరకు పట్టాలి? అన్న విషయం చర్చించడానికే యీ కబుర్లు. ఇవి 16 యేళ్ల క్రితం సంఘటనలే. పాఠకులలో చాలామందికి గుర్తుండే వుంటుంది.

అయినా ఎందుకు చెప్తున్నానంటే పోను పోను నిజాలను మసిపూసి మారేడుకాయ చేసేస్తూంటారు. చరిత్రను తనకు అనువుగా మలిచేసు కుంటూ వుంటారు. ఫెమినిస్టులు కొందరు లక్ష్మీపార్వతిని అన్యాయమై పోయిన వ్యక్తిగా చిత్రీకరిస్తున్నారు. ఎన్టీయార్ ఒక మహిళకు ప్రాముఖ్యత యివ్వడంతో అసూయగ్రస్తులైన మగవాళ్లు ఆమెకు కష్టాలు కలిగించారని వ్యాసాలు వచ్చాయి. "విజయవిహారం" మాసపత్రికలో లక్ష్మీపార్వతి తన కథంతా రాసుకుని వచ్చారు. తనెంత అమాయకురాలో, బాబు ఎంత దుర్మార్గుడో రాసుకుపోయారు. ఇప్పటికీ చర్చావేదికలలో ఆవిడ అటువంటి ఇమేజే యిస్తారు. ఇక బాబు అయితే ఆనాటి సంఘటనల గురించి పెదవి విప్పలేదు. ఇన్నాళ్లకి విప్పార్రా అనుకుంటే "నా పక్షాన 200 మంది ఎమ్మెల్యేలు వున్నారప్పుడు" అని చెప్పేసుకుంటున్నారు. 1994 ఎన్నికల్లో టిడిపి గెలిచినదే 216 సీట్లు. 1996 జనవరిలో ఎన్టీయార్ పోయేనాటికి ఆయన పక్షాన వున్నది 41 మంది ఎమ్మెల్యేలు. ఇక 200 మంది బాబు వెంట ఎలా వుంటారు? అంటే నిజం అనేది ఎక్కడో మధ్యన వుందన్నమాట!

ఆనాటి సంఘటనల గురించి "ఇండియా టుడే" సంచికలలోంచి ఎత్తి రాస్తున్నాను. ఎందుకంటే చరిత్ర యిలాగ మలుపు తిరగబోతోంది అని అవి రాసేనాటికి ఆ రిపోర్టర్లకు తెలియదు కదా. అప్పటి పరిస్థితి రాశారు. నేను ఆ పేపర్ కటింగ్స్ భద్రపరుచుకున్నాను కాబట్టి ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే చరిత్రను సరైన కోణంలో చూడగలుగుతున్నాను. అది మీతో పంచుకుంటున్నాను.

1983లో ఎన్టీయార్ ముఖ్యమంత్రి అయ్యారు. 1984లో ఆయన భార్య బసవతారకం మరణించారు. ఆ తర్వాత మూడేళ్లకు 1987లో లక్ష్మీపార్వతి ఆయన కుటుంబంలో ప్రవేశించారు. తెలుగుచలనచిత్ర జగత్తుకు రామారావు చేసిన క ృషిపై సిద్ధాంత వ్యాసాన్ని రాస్తానంటూ ఆయన యింటికి రాకపోకలు సాగించారు. 1989 ఎన్నికలలో రామారావు అనూహ్యంగా ఓడిపోయారు. రామారావు 11 మంది సంతానం (7గురు కుమారులు, 4గురు కుమార్తెలు) ఆయనను పట్టించుకోవడం మానేశారు. పట్టెడన్నం పెట్టడానికి కూడా ఆయనను యింటికి పిలిచిన పాపాన పోలేదుట. ఆయన ముఖ్యమంత్రిగా వుండగా గండిపేటలో ఆశ్రమానికి ప్రతి ఆదివారం కుటుంబసభ్యులందరినీ రమ్మనేవారు. ఎవరైనా రాకపోతే సంజాయిషీ కోరేవారు. అలాటి పరిస్థితి తిరగబడింది. ఒక పక్క పరాభవం, మరో పక్క ఒంటరితనం ఆయనను క ృంగదీశాయి. తోడుకోసం అన్వేషించేట్లు చేశాయి. సరిగ్గా ఆ సమయంలో

లక్ష్మీపార్వతి ఆయనకు తటస్థపడ్డారు.

ఆమెను దుష్టశక్తిగా అభివరి?స్తున్న ఎన్టీయార్ కుటుంబసభ్యులు తామే ఆ దుష్టశక్తికి తమ తండ్రిని బలి యిచ్చారని ఒప్పుకోవాలి. ఈ రోజు ఎన్టీయార్ నా దైవం, గురువు అని చెప్తున్న బాబు కూడా ఆ రోజు యింటికి పిలిచి మావగార్ని భద్రంగా చూసుకోవలసినది. అప్పుడు దుష్టశక్తి నీడ ఆయనపై పడేది కాదు. కానీ వారి కుటుంబ వ్యవహారాలు ఎటువంటివో మనకు తెలియవు. ఎన్టీయార్ చాలా భాగం ఆస్తి సంతానం మధ్య పంచేసి, కొంత తన పేర పెట్టుకున్నారు. ఆస్తిపంపకాలలో తమకు అన్యాయం జరిగిందని సంతానం ఫీలయ్యేరేమో తెలియదు. ఫీలయినా బహిరంగంగా అప్పుడూ చెప్పలేదు, ఇప్పుడు అస్సలు చెప్పరు. ఏది ఏమైనా డబ్బయ్యేళ్ల ముసలాయనను కొడుకులు గాని, అల్లుళ్లు గాని యింటికి తీసుకుని వెళ్లి పెట్టుకోలేదు. ఒంటరిగా వదిలేశారు. ఇప్పటికైనా ఎన్టీయార్ పేర ఎవార్డులు యిస్తున్నది లక్ష్మీపార్వతి గానీ ఆయన సంతానం కాదు.

అల్లుళ్లు అని ఎందుకు చేర్చానంటే ఎన్టీయార్ సినీమా కెరియర్ వలన కొడుకులు బాగుపడితే రాజకీయజీవితం వలన అల్లుళ్లు బాగుపడ్డారు. రెండో అల్లుడు డా॥ దగ్గుబాటి వెంకటేశ్వరరావు పార్టీలో మొదటినుండీ వున్నారు. మూడో అల్లుడు చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ ద్వారా మంత్రిగా పనిచేసి 1983 ఎన్నికలలో శాసనసభకు పోటీ చేసి ఓడిపోయి, ఛాలెంజ్ చేసిన మావగార్నే బతిమాలుకుని వచ్చి పార్టీలో చేరారు. దగ్గుబాటి కంటె ఆలస్యంగా పార్టీలో చేరినా చురుకుతనంతో పార్టీలో చొచ్చుకుని పోయారు. ఎన్టీయార్ మొదటి ఏలుబడిలో అల్లుళ్లిద్దరూ రెండు క్యాంపులు నడిపేవారు. ఎన్టీయార్ యిద్దర్నీ బాలన్స్ చేస్తూ వుండేవారు. మావగారు గద్దె పై నుండగా సింహాసనం వెనుక చక్రం తిప్పిన అల్లుళ్లు ఆయన పరాజయం తర్వాత ఒంటరిగా ఎందుకు వదిలేశారో తెలియదు. దానికి ఎన్టీయార్ స్వభావం కూడా కారణమైతే కావచ్చు.

2

ఏది ఏమైనా ఆయనకు హఠాత్తుగా పక్షవాతం వచ్చినపుడు ఆయన యింట్లో లక్ష్మీపార్వతి ఒక్కరే వున్నారు. ఆయనకు సపర్యలు చేశారు. మళ్లీ శారీరకంగా, మానసికంగా కోలుకునేట్లు చేశారు. ఆయనలో కృతజ్ఞతాభావం కలిగింది. ఆమెకు తన జీవితంలో స్థానం యివ్వాలని నిశ్చయించుకున్నారు. సెప్టెంబరు 1993లో ఇండియా టుడేకు యిచ్చిన యింటర్వ్యూలో ఆయన చెప్పారు – "నేను, పక్షవాతానికి, రెండుసార్లు అపస్మారక స్థితికి గురి కావలసి వచ్చింది. నా కుడిభాగం బాగా దెబ్బ తింది. నా కుడిచేయి బొటనవేలు, చూపుడువేలు మొద్దుబారిపోయాయి. నేను తీవ్రంగా జబ్బుపడినప్పుడు నా పక్కనుండి సేవ చేసిన వ్యక్తి లక్ష్మీపార్వతి. ఆమె నా జీవితాన్ని కాపాడారు."

అప్పటికి ఎన్టీయార్ వయసు 71. లక్ష్మీపార్వతి వయసు 38. ఆమె అప్పటికే వివాహితురాలు. భర్త హరికథా విద్వాంసుడు వీరగంధం సుబ్బారావు (ఆయనే యీవిడను హరికథా కళాకారిణి చేశారు) ద్వారా కొడుకును కన్నారు. భార్యాభర్తలిద్దరూ కలిసి అభిమానులమంటూ ఎన్టీయార్‌కు చేరువయ్యారు. క్రమేపీ ఆమె భర్తను విడిచి ఎన్టీయార్‌కు సన్నిహితురాలు కావడంతో భర్త ఎన్టీయార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు – "ఆయన నన్ను మోసం చేశారు. ఆయనలో దురాలోచన లేకపోతే ఆమెను మందలించి మా సంసారం నిలబెట్టేవారు" అని వాపోయారు. లక్ష్మీపార్వతి సుబ్బారావుకి విడాకులు యిచ్చి ఎన్టీయార్‌ను వివాహమాడడానికి సిద్ధమయ్యారు.

ఎన్టీయార్ ఆమెతో అనుబంధం కొనసాగించి వుండవచ్చు. కానీ ఆయన విమర్శలకు తట్టుకుని పెళ్లాడడానికి నిశ్చయించుకున్నారు. తను సన్యాసం తీసుకున్నానని ఆయన ప్రకటించుకున్నారు. కాషాయం కట్టుకుని తిరిగారు. సర్వసంగ పరిత్యాగిని, నా దగ్గరేముంది బూడిద అన్నారు. అలాటివాడు 70 ఏళ్ల వయసులో మళ్లీ పెళ్లాడతానంటే ప్రజలు నవ్విపోతారని టిడిపి వర్గాలకు భయం. ఎన్టీయార్ సినిమావాడిగానే వుంటే ఫరవాలేకపోయేది. ప్రజాజీవితంలో వుంటూ, సంఘసంస్కర్తగా పేరు తెచ్చుకుంటూ మరొకరి భార్యను, విడాకులు యిప్పించి పెళ్లి చేసుకోవడం, కూతురు వయసున్న దాన్ని (33 ఏళ్లు చిన్న) చేసుకోవడం స్కాండలస్ అనుకున్నారు.

పైగా ఎన్నికలు దగ్గర్లో వున్నాయి. అందువలన ఆయన అనుచరులు వద్దని అడ్డుపడ్డారు. కుటుంబం సంగతి సరేసరి. తమ అంతస్తులో ఏ మాత్రం సరితూగని వ్యక్తి మారుటితల్లిగా రావడం భరించలేకపోయారు. ఎందరు ఏం చెప్పినా ఎన్టీయార్ వినలేదు. తను నటించిన "మేజర్ చంద్రకాంత్" సినిమా శతదినోత్సవ వేడుకలలో తను ఆమెను పెళ్లిచేసుకోవడం గురించి ప్రకటించేశారు. చంద్రబాబు ఆ ప్రకటనకు అడ్డుపడబోయారు కానీ సాధ్యం కాలేదు. పార్టీ సభ్యులు మొదట్లో నివ్వెరపోయినా తర్వాత ప్రశంసలు కురిపించారు. కుటుంబం వదిలివేయడంతో పాపం ఒంటరితనం, అనారోగ్యం భరించలేక చేసుకున్నాడు అనుకున్నారు. ఈ ఆమోదం చూసి లక్ష్మీపార్వతి సమర్థకుడైన మోహన్‌బాబు రామారావు ద్వితీయకల్యాణాన్ని షూట్ చేసి తన సినిమాకు జోడించి కొత్త ప్రింట్లు విడుదల చేశారు.

పెళ్లి సందర్భంగా టిడిపి రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి "సంఘ సంస్కరణలో యిదొక భాగం. మా నాన్నగారు 85 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకున్నారు. 87 ఏళ్లకు పిల్లలు కలిగారు" అని వెల్లడించారు. అయితే తనకు అటువంటి ఆలోచనలేవీ లేవని రామారావు వెంటనే ఖండించారు. 'ఇది అందరూ అనుకునే ప్రేమ కాదు. 71 ఏళ్ల వయసులో నేనిలాంటి వాటికి అతీతుడిని' అని చెప్పుకున్నారు. కానీ లక్ష్మీపార్వతి రామారావు ద్వారా పిల్లలు కనబడానికి ప్రయత్నించారని యిప్పుడు అందరికీ తెలిసిన విషయం.

పుట్టబోయే కుర్రవాడు జగదేకవీరుడు అవుతాడని జ్యోతిష్కులచేత చెప్పించడం, గైనకాలజిస్టుల చేత తగిన ఏర్పాట్లు చేయించుకోవడం అన్నీ బయటకు వచ్చేశాయి. అవన్నీ వ్యక్తిగత విషయాలు కాబట్టి వాటి జోలికి పోనవసరం లేదు. ఒక్కటి మాత్రం గమనించాలి. లక్ష్మీపార్వతి ఆశయం రామారావుకి సేవచేసి తరించడంతో ఆగిపోలేదు. రాణిగా, రాజమాతగా వెలగాలని మాత్రం శతథా ప్రయత్నించారు.

సెప్టెంబరు 1993లో లక్ష్మీపార్వతి వివాహానికి మద్దతు పలికిన రేణుకా చౌదరి ఆ తర్వాత జూన్ 1994 వచ్చేసరికి ప్రత్యర్థిగా మారిపోయారు. 1984లో నాదెండ్ల ఎన్టీయార్‌ను కూలద్రోసినప్పుడు ఆయన కారుపై చెప్పు విసిరి రేణుకా చౌదరి ఎన్టీయార్ దృష్టిని ఆకర్షించారు. ఆయన 1985 హైదరాబాదు మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో పార్టీ టికెట్ యిచ్చి ఆమెను కార్పోరేటర్‌ను చేశారు. తన చురుకుతనం, మొండితనం, వాగ్ధాటితో రేణుక ముందుకు ముందుకు సాగిపోయారు. ఆమెను ''పార్టీలో ఒకే ఒక మొగాడు'' అని కీర్తించారు ఎన్టీయార్. పాణ్యం ఉపయెన్నికలో కోట్ల విజయభాస్కరరెడ్డికి ప్రతిగా నిలబడమంటే ఆవిడ సై అన్నారు. కడప జిల్లాలో ఎన్నికల ప్రచారానికి కూడా వెళ్లారు. అందుకే ఎన్టీయార్ ఆమెను రాజ్యసభ ఎంపీ చేశారు.

1994లో కర్నూలులో ఓ సభలో తనకు సమవయస్కురాలైన రేణుక ఎన్టీయార్‌ను ప్రశంసిస్తూ ఓ నటించిన చిత్రాల పేర్లతో కవితా గుచ్ఛాన్నే అల్లి ఉపన్యసించడం లక్ష్మీపార్వతికి నచ్చలేదని వార్తలు వచ్చాయి. పైగా రేణుకకు చంద్రబాబుతో వ్యాపారబంధాలున్నాయి. బాబుకి సంబంధించిన భువనేశ్వరి కార్బయిడ్ ఫ్యాక్టరీ నష్టాల్లో నడుస్తూండగా రేణుక కుటుంబం దాన్ని కొనుగోలు చేసి ఆయనను బయట పడేసింది. ఈ కారణాల వలన లక్ష్మీపార్వతికి రేణుక రుచించడం మానేశారు. కర్నూలు లోకసభ స్థానం ఉపయెన్నిక ప్రచారం సందరరేగా ఆవిడా, రేణుక బహిరంగంగానే వాదించుకున్నారు.

ఏది ఏమైతేనేం, రేణుకను పార్టీలోంచి బయటకు పంపాలని లక్ష్మీపార్వతి నిశ్చయించుకున్నారు. దానికి కారణం వెతికారు. టిడిపి ఖైరతాబాద్ శాఖ కార్యవర్గసభ్యులలో కొందరిపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించవలసినదిగా మే 15 న ఎన్టీయార్ గోరంట్ల బుచ్చయ్య చౌదరిని పంపారు. ఈ గోరంట్ల లక్ష్మీపార్వతికి అత్యంత విధేయుడు. తన ప్రాంతానికి సంబంధించిన సమావేశంలో తనకు పాత్ర లేకుండా చేసినందుకు రేణుక అమితకోపంతో ఆ సమావేశానికి వచ్చి అధ్యక్షత వహించే హక్కు నీ కెక్కడిది అని గోరంట్లను నిలదీశారు. ఎన్టీయార్ ప్రతినిధిగా వచ్చాను అన్నారు గోరంట్ల. ''వాడెవడు నిన్ను యిక్కడకు పంపడానికి?'' అన్నారు రేణుక. అది ఆవిడ స్టయిల్. అంతకు రెండేళ్ల క్రితం సారా వ్యతిరేక ఉద్యమంలో నెల్లూరులో మాట్లాడుతూ రేణుక ''సారాను వ్యతిరేకించడంలో విఫలమైతే ఎన్టీయార్‌నైనా సవాలు చేస్తా'' అన్నారు. ఎన్టీయార్ దాని విషయమై నోటీసు జారీ చేయగానే యీవిడ వివరణ యిచ్చార గొడవ సమసి పోయింది.

3

కానీ యిప్పుడు ఎన్టీయార్‌ను శాసిస్తున్నది లక్ష్మీపార్వతి. అందువలన దీన్ని పెద్దది చేశారు. రేణుకను వివరణ కోరాలని అనుకున్నారు. ఆ విషయం తెలిసి దుబాయిలో ఇఎన్‌టి సర్జన్ వద్దకు వెళ్లిన రేణుక తాను వచ్చి వివరణ యిస్తానని ఫోన్‌లో ఎన్టీయార్‌కు చెప్పారు. అయినా ఆమె వచ్చేలోపునే జూన్ 19 న ఎన్టీయార్ ప్రెస్‌మీట్ పెట్టి రేణుకను క్షమాపణ కోరబోతున్నామని, వారం గడువని ప్రకటించేశారు. దాంతో వ్యవహారం బిగిసింది. రేణుక విలువ ఎరిగిన పార్టీ నాయకులు సయోధ్యకు ప్రయత్నించారు. జూన్ 26 న రేణుక యింటికి కోడెల, ఎం.వెంకటేశ్వరరావు, అశోక్ గజపతిరాజు వెళ్లి నచ్చచెపుతూండగానే యివతల గాలి ముద్దుకృష?మ నాయుడు (ఈయన మరో లక్ష్మీపార్వతి వీరాభిమాని. చిత్తూరుజిల్లాలో చంద్రబాబుతో విరోధించి, దగ్గుబాటి వర్గంలో వుంటూ దరిమిలా బాబును చెక్ చేయగల శక్తి లక్ష్మీపార్వతికే వుందని తెలిసి ఆమె పక్షాన చేరారు) పార్టీ అధికార ప్రతినిధి హోదాలో రేణుక బహిష్కరణను ప్రకటించారు. ఈ విషయంలో ఫోన్‌లో ఎవరో చెప్పగానే సయోధ్య టీము మొహం వేలాడేశారు.

ఏమిటీ తొందర అని అడిగితే అంతకు క్షమాపణ గడువు ముగియడానికి రెండు రోజులకు ముందు బియస్‌పి నేత కాన్షీరామ్‌తో రేణుక కలిశారు అన్నారు. టిడిపిలో తనకు తలెత్తిన సమస్య గురించి మాట్లాడడానికి రేణుక నా వద్దకు వచ్చారని కాన్షీరామ్ ప్రకటించారు. రేణుక పశ్చాత్తాపం వెలిబుచ్చినట్లయితే ఎన్టీయార్ వద్దకు మధ్యవర్తిత్వం నెరపగలనని లక్ష్మీపార్వతి ప్రకటించడంతో వివరణ కోరకుండా క్షమాపణ కోరిన ఎన్టీయార్ పంతానికి మూలకారణం ఎవరో అందరికీ తెలిసిపోయింది. రేణుకకు మద్దతు తెలుపుతూ పోస్టర్లు, పార్టీ వ్యవహారాల్లో లక్ష్మీపార్వతి పాత్రను విమర్శిస్తూ కరపత్రాలు దర్శనమివ్వడంతో ఎన్టీయార్ మరీ బిగుసుకుపోయారు. రేణుకను బహిష్కరించేశారు.

దీనితో రేణుక మండిపడ్డారు. ''భార్యను ముఖ్యమంత్రి చేయడానికే ఎన్టీయార్ యిదంతా చేస్తున్నారు. రానున్న కొద్ది నెలల్లో రామారావు ఓ అదుపు తప్పిన ఏనుగులా పార్టీ కార్యకర్తల ప్రజాస్వామిక ఆకాంక్షలను తొక్కివేసి, యిష్టమొచ్చిన రీతిలో ప్రవర్తించవచ్చు.'' అన్నారు. దీన్ని ఖండిస్తూ లక్ష్మీపార్వతి ''ఎన్టీయార్ భార్యగానే తప్ప వేరే పాత్ర నాకు అక్కరలేదు. అంతకంటె ఆయన ఏమీ కోరనూలేదు, అనుకోనూ లేదు. ఎన్నికలలో పోటీ చేసే ఆలోచనే లేదంటున్నాను. ఆ ఆలోచన మా యిద్దరికీ లేదు'' అన్నారు. (ఇది ఎంతవరకూ నిజమో కాదో తర్వాతి ఘటనలు చెప్పాయి) ''కౌరవవినాశనానికి దుర్యోధనుడి చెంత చేరిన శకుని పాత్రను లక్ష్మీపార్వతి పోషిస్తున్నారు'' అన్నారు అప్పుడు కాంగ్రెస్ మంత్రిగా వున్న హరిరామజోగయ్య. ఇవన్నీ ఇండియా టుడే జూలై 1994 సంచికలో వివరంగా

వచ్చాయి.

సినీనటి జయప్రద పార్టీలోచేరి ఎన్నికల ప్రచారం చేసినా ఫలం మాత్రం శూన్యమైంది. దానికి కూడా లక్ష్మీపార్వతే కారణమని చెప్పుకున్నారు. ఏది ఏమైనా లక్ష్మీపార్వతి లేదులేదంటున్నా పార్టీలో ఆమెకు ప్రాధాన్యత పెరిగింది. ఆమె ఆశ్రిత గణంలో ప్రముఖులు – దాడి వీరభద్రరావు, ముద్దుకృష?మ నాయుడు, యనమల రామకృష?డు, ఇంద్రారెడ్డి (నేటి హోం మంత్రిణి సబితా ఇంద్రారెడ్డి భర్త అప్పట్లో టిడిపిలో ప్రముఖ నాయకుడు), మోహనబాబు యిత్యాదులు. ఈ పరిస్థితుల్లో 1994లో ఎన్నికలు వచ్చాయి. ఎన్టీయార్ చైతన్యరథంపై బయలుదేరారు. గతంలో ఆయన ఒంటరిగా వెళ్లేవారు. ఈ సారి లక్ష్మీపార్వతిని వెంటబెట్టుకుని వెళ్లారు. ఆమె ఆయనను అడుగడుగునా ప్రభావితం చేశారు. రామారావు తన ప్రచారాన్ని హైదరాబాదునుండి ప్రారంభిద్దామనుకుంటే, ఆమె లేదు గుంటూరునుండి ప్రారంభిద్దామన్నారు. దానికి కారణం – అది తన స్వంత జిల్లా అనే కాదు, ఆ జిల్లాకు చెందిన నన్నపనేని రాజకుమారి కాంగ్రెస్ చీఫ్ విప్‌గా వుంటూ లక్ష్మీపార్వతి మొదటివివాహం కథాకమామీషుపై యాగీ చేశారు. ఆమెను ఎలాగైనా దెబ్బ తీయాలని పార్వతి పంతం.

ద్వితీయవివాహానికి ముందు ఎన్టీయార్ చైతన్యరథం ప్రసంగాలలో నాటకీయత వున్నా హుందాతనానికి లోటు వుండేది కాదు. లక్ష్మీపార్వతి పక్కన వచ్చి చేరాక ఆయన చెలరేగిపోయారు. కాకీ డ్రస్సు మానేసి, రంగురంగుల డ్రెస్‌లు వేసేవారు. తన సభలకు హాజరయ్యే ఆడవారిని చూపుతూ ఆమెతో "ఏమండీ వదినగారూ! మరదళ్లతో మాట్లాడండి" అనేవారు. ఆమెది కమ్యూనిస్టు కుటుంబం అని చెపుతూ "ఇంతవరకు కమ్యూనిస్టులతో నాకు మైత్రి వుండేది. ఇప్పుడు చుట్టరికం ఏర్పడింది. వారు నాకు బావలు అవుతారు." అనేవారు. ఇక లక్ష్మీపార్వతి అయితే చెప్పనే అక్కరలేదు. "నందమూరి చందమామ", "నిప్పులాంటి మనిషి" అని కీర్తించడం, ఆయన హిట్‌చిత్రాల పేర్లతో స్తోత్రపాఠం చేయడం, ఇద్దరూ ఒకరినొకరు మెచ్చుకోవడం, కలిసి డాన్సుల్లాటివి చేయడం అంతా ఓ నాటకంలా వుండేది.

అవి మీకూ నాకూ నచ్చలేదు కానీ గ్రామీణులు మాత్రం విరగబడి వచ్చి చూసేవారు – తారకరాముడు వరించి నెత్తిన పెట్టుకున్న భామ ఎలా వుంటుందో చూడడానికి ! వాళ్లను చూసి రామారావు మరింత ఉత్సాహపడి పోయేవారు. మాటలు తత్తరపడేవి. ఆయన ఏఫ్రోడైజియాక్స్ (కామోద్దీపనాలు) వాడడం బట్టే దుష్ఫలితాలు కలిగి పదేపదే మతిమరుపులోకి జారి మాటలకోసం తడుముకుంటున్నారని అనుకునేవారు. ఆ సమయంలో లక్ష్మీపార్వతి ఆదుకుని వేరే టాపిక్‌లోకి తీసుకెళ్లిపోయేవారు. ఇక రామారావు ఆమెను చూసి పొంగిపోయేవారు. "లక్ష్మీ, చూశావా, యీ నిరుపేదల, ఆడపడుచుల వ్యథ ! నేను లేకపోయినా నీవే వారిని ఆదుకోవాలి." అని షాద్‌నగర్‌లో ప్రకటించి, తన అధికారానికి వారసులెవరో తెలియపరచారు. ఇది అల్లుళ్లకు ఆందోళన కలిగించింది. పార్టీలో నేనే నెంబర్ టూ అని బాబు ప్రకటించుకుంటే రామారావు బహిరంగంగా చివాట్లు పెట్టారు. "నేను దీన్ని ఖండిస్తున్నా" అని ప్రకటించారు. దీనిపై ఈనాడు శ్రీధర్ ఓ కార్టూన్ వేశారు. విజయవేదికపై మొత్తం మూడు స్థానాలను ఎన్టీయార్, పార్వతి ఆక్రమించుకుని, బాబును తన్ని తగిలేస్తున్నట్లు వుంటుంది.

## 4

1994 ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ 294 స్థానాల్లో పోటీ చేసి 26 గెలుచుకుంది. టిడిపి 251లో పోటీ చేసి 216 గెలుచుకుంది. ఇద్దరి మధ్యా 10% ఓట్లశాతం వుంది. టిడిపి గెలుపు ఘనత నాదే అనుకున్నారు లక్ష్మీపార్వతి. ఆవిడ విజయలక్ష్మి అని, పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చిన మహాశక్తి అనీ ఆమె అనుయాయులు కీర్తించారు. నిజానికి టిడిపికి అంతటి ఘనవిజయం కలగడానికి ఒక కారణం – కాంగ్రెస్ దుష్పరిపాలన, అంతర్గతమైన కుమ్ములాటలు. ఎన్టీయార్ అధికారంలో లేని ఐదేళ్లలో కాంగ్రెస్ ముగ్గురు ముఖ్యమంత్రులను మార్చింది. వైయస్ నిరంతర అసమ్మతివాదిగా వుండి అందరికీ చికాకులు తెచ్చిపెట్టారు. ఇటీవల వైయస్సే చెప్పుకున్నారుగా – '1994 ఎన్నికలలో నా ప్రత్యర్థులను ఓడించడానికి సకలయత్నాలు చేశాను. ఓడించాను. కానీ దాని వలన నేనూ నష్టపోయాను.' అని. కాంగ్రెస్‌వారే ఒకరి నొకర్ని ఓడించుకుని, టిడిపిని గెలిపించారు. కానీ అది తన విజయంగా భావించారు, లక్ష్మీపార్వతి. రామారావూ అదే అనుకున్నారులాగుంది. మళ్లీ ముఖ్యమంత్రి కాగానే ఆమెను నెత్తిన పెట్టుకుని ఆమె చెప్పినట్టల్లా ఆడేరు. ఆ రోజుల్లో లక్ష్మీపార్వతి ఎలా వెలిగారో చెప్పడానికి మార్చి 1995 నాటి ఇండియా టుడేలో "పగ్గాలు పట్టిన పట్టమహిషి" అనే వ్యాసాన్ని ఆధారం చేసుకుంటున్నాను.

1994 డిసెంబరులో ఎన్నికలు కాగానే పార్వతి యిచ్చిన ప్రకటన – "రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. నా లక్ష్యం నెరవేరింది. ఇక తిరిగి సాహిత్య ఆధ్యాత్మిక వ్యాసంగాల్లోకి మళ్లుతాను. నేను ఆధ్యాత్మిక వాతావరణంలో పెరిగినదాన్ని. నాలో తాత్విక చింతనే తప్ప భౌతికసుఖాలపై ఆపేక్ష లేదు.". కొద్ది నెలల్లోనే ప్లేటు ఫిరాయించారు. "స్వచ్ఛమైన పాలన అందించడంలో ముఖ్యమంత్రికి సహకరిస్తాను" అన్నారు ఫిబ్రవరి నాటికి. అందరూ ఆమెను 'వదినగారు', 'మేడమ్‌గారు' అంటూ సంబోధించడమే. సెక్రటేరియట్‌కు వెళ్లలేదని తప్ప భర్త ఎక్కడుంటే అక్కడు ఆమె వెళ్లిపోయేవారు. సభలు, సమావేశాలు వేటినీ వదిలిపెట్టలేదు. రామారావుతో 50 ఏళ్లకు పై బడి కాపురం చేసిన బసవతారకం గారు ఎప్పుడూ యిలా కనబడలేదు. కానీ యీ ద్వితీయకళత్రం మాత్రం ఎక్కడ పడితే

అక్కడకు రావడమే కాదు, ఇన్విటేషన్లలో పేరు, ఫోటో వేయించుకునేవారు. సభానిర్వాహకులు ఆమెకు పట్టుచీరల రాసులు కానుకగా యిచ్చుకునేవారు. ఫస్ట్ టర్మ్‌లో దుర్నిరీక్ష్యుడిగా భాసించిన రామారావు ఆమె రాకతో సెకండ్ టర్మ్‌లో పూర్తిగా మెతక మనిషి అయిపోయారు. సూట్‌కేసులతో ఆయన యింటి మెట్లు ఎక్కడానికి సాహసించని వారు, యిప్పుడు ఆమెను ఎప్రోచ్ కా నారంభించారు.

కొందరు మంత్రులు, అధికారులు ఆమె చుట్టూ చేరి భజన చేసేవారు. ఆమె వాళ్లకు ఫేవర్స్ చేసేవారు. వారిలో మోహన్‌బాబు ఒకరు. ఒక మురికిపేటపై ఆయన కన్నేశారని, ఆయనకోసం అక్కడున్నవారిని ఖాళీ చేయించారని ఆరోపణలు వచ్చాయి. తనకు ఏ అధికారహోదా లేకపోయినా పార్వతి అక్కడకు వెళ్లి ప్రత్యామ్నాయ స్థలాలను చూపిస్తానని వాళ్లకు హామీ యిచ్చేశారు. ఆమె ఉపన్యసించడానికి పోలీసు జీప్‌లోని లౌడ్‌స్పీకర్‌ను యిచ్చారు పక్కనున్న నగర పోలీస్ కమిషనర్ వి.అప్పారావు ! రూల్సుకి వ్యతిరేకంగా వ్యవహరించినది ఈయన ఒక్కరే కాదు. విజయవాడ, వైజాగ్ పోలీస్ కమీషనర్లు కూడా ఆమె ఒక్కతే వెళ్లినపుడు స్వాగతం చెప్పారు.

ఇక సాంస్కృతిక సంఘాలయితే చెప్పనే అక్కరలేదు. జనవరిలో ఓ సమాజం వారు జయలలిత చేత ఆమెకు ''ఈ ఏటి మేటి మహిళ''గా అవార్డు యిప్పించారు. హైదరాబాదులో ఆ ఆటోమొబైల్ షోరూంను ఆవిడ చేత ప్రారంభం చేయించారు. ప్రొటోకాల్ ప్రకారం ఆవిడకు బందోబస్తు అదీ చేయకూడదు. అందువలన ఉత్తుత్తినే నలుగురు మంత్రులు తోడుగా వెళ్లారు. ఎన్నికల విజయం తర్వాత మొక్కుతీర్చుకోవడానికి పార్వతి తిరుమలకు వెళితే హోం మంత్రి, విద్యామంత్రి, మరో 10 మంది ఎమ్మెల్యేలు వెంట వెళ్లారు. ఆవిడ నడిచిన బాటలో 200 మంది పోలీస్ కానిస్టేబుల్స్ మోహరింపును సమర్థించుకోవాలిగా మరి! గట్టిగా అడిగితే మంత్రులకోసం తెప్పించాం అంటారు. సాంకేతిక విద్యాశాఖ మంత్రి దేవినేని నెహ్రూ విజయవాడలో ఫిబ్రవరిలో పరిపాలనా వ్యవస్థలో మహిళల పాత్ర అనే అంశంపై గోష్టి'కి ప్రారంభోత్సవం ఆమెచే చేయించారు. అక్కడే ఓ బాలిక సజీవదహనం కేసులో కేసు దర్యాప్తును తిరగతోడాలని ఆమె స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు.

ఇవన్నీ ఎన్టీయార్ చూస్తూ ఎలా వూరుకున్నారన్న ప్రశ్న రావచ్చు. 1983లో గెలిచినపుడు ఎన్టీయార్ విజయోత్సవాలు వద్దన్నారు. అలాటిది 1994లో గెలిచినపుడు 1995 జనవరిలో జిల్లా యూనిట్ల అధ్యక్షులు కలిసి తనను, భార్యను సన్మానిస్తే సై అన్నారు. వాళ్లు ఆయనకు సువర? గండపెండేరాన్ని, ఆమెకు స్వర? కంఠాభరణాన్ని బహూకరించారు. దీనికోసం కార్యకర్తల నుండి విరాళాలు సేకరించారు. ఇంత దారుణంగా మారిపోయారు ఎన్టీయార్. ఆయనా, ఆవిడా రోజూ సాయంత్రం అయ్యేసరికి రవీంద్రభారతిలో ఏదో సమావేశంలో ప్రత్యక్షం. ఆవిడ ఆయన్ని పొగడడం, ఆయన ఆవిణ్ని పొగడడం. దుర?ంగా వుండేది. ఎన్టీయార్ స్వతహాగా ఆడంబరాలకు దూరంగా వుండేవారు. ఇప్పుడు మారిపోయారు. పైగా తన కంటె ఆవిడకు ఎక్కువ ప్రాధాన్యత యిస్తూంటే చూస్తూ వూరుకునేవారు. ఇద్దరూ ఒక్క రోజుకైనా ఏదైనా వూరు కెళ్లి విమానంలో తిరిగి వస్తే చాలు. బేగంపేట ఎయిర్‌పోర్టునుండి వాళ్ల యింటి దాకా బ్యానర్లు – ''ఆంధ్రుల అభిమాన వదిన నందమూరి లక్ష్మీపార్వతికి స్వాగతం'' అని. పది బ్యానర్లలో 7 బ్యానర్లు యీవిడ గురించే !

ఇదంతా చూస్తూ వుంటే మామూలు వాళ్లం మనకే మంట పుడుతుంది. అప్పటికి పదేళ్లగా నా బొందో అని పనిచేసిన పార్టీ కార్యకర్తలకు ఎలా వుంటుందో వూహించండి. ముఖ్యంగా అప్పటిదాకా చక్రం తిప్పిన అల్లుళ్లకు ! అందునా చంద్రబాబుకు ! పైగా ఈవిడకు అధికారం ఎంత తలకెక్కిందంటే ''చంద్రబాబుకు ఆర్థిక శాఖ యిచ్చేటప్పుడు ప్రణాళికా శాఖను మినహాయించాలని నిర?యించాం'' అని జర్నలిస్టులతో చెప్పారు. ఈవిడెవరు నిర?యించడానికి? ఏ అధికారంతో నిర?యించింది? అని బాబు ఏమిటి, మనమే అనుకుంటాం. యనమల రామకృష?డు ఆమెకు విధేయుడు కాబట్టి స్పీకరు పదవికి ఆమెయే సూచించారు. దెబ్బకి ఆయన స్పీకర్ అయిపోయారు. ఈవిడ అన్ని నిర?యాలలో కలగజేసుకునేదని, తనకు డబ్బు యిచ్చినవారికి అనువుగా నిర?యాలు మార్పించేదని బాగా ప్రచారంలోకి వచ్చింది. ఎన్టీయార్‌పై తిరుగుబాటు చేసినవారందరూ చెప్పిన మాట ఒక్కటే – 'మేం ఏదైనా చెపితే పెద్దాయన సరేనని తల వూపేవారు. తీరా చూస్తే మర్నాడు పొద్దున్నకి నిర?యం మారిపోయేది. దీనికంతా ఆవిడే కారణం'' అని. దీనికి తోడు ఆమె సోదరుడు శంకర పిచ్చయ్య పార్టీ టిక్కెట్ల పంపిణీకి, ముఖ్యమైన పనులు చేసి పెట్టడానికి డబ్బు తీసుకున్నాడనే ఆరోపణలు వచ్చాయి.

## 5

ఈ విధంగా పార్వతి అత్యాశకు పోయి, రాత్రికి రాత్రి చక్రం తిప్పేయబోయి బోర్లా పడ్డారు. ఎన్టీయార్ సంతానానికి ఈమె ప్రభ యిలా వెలిగిపోవడం అస్సలు రుచించలేదు. వాళ్లు యీమెను సవతితల్లిగా ఆమోదించలేదు. తారకరామా థియేటర్ పునః ప్రారంభోత్సవానికి ఆయన్ని పిలుస్తూ ఆవిడ తోడు లేకుండా రమ్మనమని చెప్పారు. ఆయన సరేనని ఒక్కరే వెళ్లారు. సంతానం అసంతృప్తికి ప్రతినిధిగా హరికృష? నిలిచారు. తండ్రిని ఎదిరించారు. ఇటువంటి పరిస్థితుల్లో బాబు తిరుగుబాటు చేశారంటే తప్పేమైనా కనబడుతోందా? నా కైతే కనబడలేదు. నాకే కాదు, ఎన్టీయార్‌ను మళ్లీ తలకెత్తుకున్న ప్రజలకు కూడా కనబడలేదు. అందుకేనేమో, సింహాసనం పోగొట్టుకున్నాక ఎన్టీయార్ తనకు కంచుకోట వంటి ఉత్తరాంధ్రకు వెళ్లి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించబోతే వినే నాథుడే కరువయ్యాడు. ప్రజలు పట్టించుకోలేదు. నాదెండ్ల తిరుగుబాటు చేసినపుడు వెంట నడిచినది జనసముద్రమైతే

యిప్పుడు కాలువంత జనం కూడా లేకపోయారు.

ఇది రామారావును తీవ్రంగా బాధించింది. ఆయన ఎప్పుడూ ప్రజలను నమ్ముకున్నారు. ప్రజలు తనతో వున్నంతకాలం తను ఎమ్మెల్యేలను పట్టించుకో నక్కరలేదనుకున్నారు. కానీ ఆ ప్రజలే తనను శిక్షించారనుకోవడంతో ఆయన దర్పం, అహం దెబ్బతిన్నాయి. చిత్రసీమను శాసించి, రాజకీయరంగంలో పెనుమార్పులు తెచ్చిన రారాజు జీవితపు అంత్యదశలో నిరాశానిస్పృహలతో మరణించారు. ఆయన హఠాన్మరణం ప్రజలను కలచివేసింది. అపరాధభావనకు గురి చేసింది. అందుకే ఆయన అంత్యక్రియలకు జనం అంతలా విరగబడ్డారు. ఎమోషన్స్‌ను పక్కన బెట్టి చూస్తే రామారావు చేసినది పొరబాటే. ఆయన ద్వితీయ వివాహం చేసుకున్నందుకు ఎవరూ తప్పుపట్టలేదు. ఆమోదించారు. కానీ ఆమెను ఆయన రాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. అదీ సరే ననుకున్నారు. కానీ అధికారం కల్పించారు, పరిపాలనలో వేలు పెట్టనిచ్చారు. అది తప్పు. అలుసు తీసుకుని ఆమె చెలరేగిపోయింది. అందుకే ఆమెకు అంత శిక్ష పడింది. ఎంతో ఎత్తుకి ఎదిగి హఠాత్తుగా అధఃపాతాళానికి పడిపోయారు. మళ్లీ లేవలేదు, లేవలేరు.

చంద్రబాబు ఆగస్టు కుట్రను ఎలా అమలు చేశారో దగ్గుబాటి వివరంగా రాశారు. అందుచేత దాని జోలికి పోవడం లేదు. అయితే యిప్పుడు బాబు 200 మంది తన వెంట వున్నారని చెప్పడం మాత్రం అసత్యం. ఆయనకు కోర్ గ్రూపు కొంత వుంది. తక్కినవాళ్లందరూ ఊగిసలాటగాళ్లే. ఈనాడు హంగామా చేసి బాబు వెనక్కాల చాలామంది వున్నారని బిల్డప్ యిచ్చింది. దానికి కారణం ఏమిటో రామారావు చెప్పుకున్నారు. ముఖ్యంగా రామారావు చేసిన బ్లండర్ ఏమిటంటే – అసెంబ్లీ రద్దు చేస్తానని అనడం! గెలిచి 9 నెలలు కాకుండా మళ్లీ ఎలక్షన్లు అంటాడేమిటి యీ పిచ్చాడు అనుకుని తటస్థంగా వున్న ఎమ్మెల్యేలందరూ బాబు వైపుకి వచ్చేశారు. అసెంబ్లీ రద్దు చేయమని రామారావుకి తప్పుడు సలహా యిచ్చినవారెవరో యిప్పటిదాకా బయటకు రాలేదు. బాబు తాలూకు మనిషే కొంతకాలం ఆయన క్యాంప్‌లో వుండి ఆయన చేత పొరబాట్లు చేయించి తర్వాత యివతలికి వచ్చేరేమో !? పంచతంత్రంలో "కాకోలూకీయం" చదివితే యిలాటి ఘట్టాలు అనేకం ఎదురవుతాయి.

యనమల రామక ృష?డు స్పీకర్‌గా వుండి చాలా వివాదాస్పదమైన నిర?యం తీసుకుని బాబుకి చాలా సహాయం చేశారు. తమాషా ఏమిటంటే ఆయన లక్ష్మీపార్వతి మనిషిగా చెలామణీ అయ్యారు. ఏ దశలో యిటు మారారో, అప్పటిదాకా రామారావుకి ఎటువంటి సలహాలు యిచ్చారో తెలియదు. ఏది ఏమైతేనేం టిడిపి చీలిపోయింది. నేషనల్ ఫ్రంట్ అయోమయంలో పడింది. తన చైర్మన్ ఎన్టీయార్ వైపుండాలా? ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా అయిన బాబువైపు వుండాలా? తెలియక కొట్టుమిట్టులాడింది. వాళ్ల సమస్య తీర్చివేస్తూ జనవరి 1996లో ఎన్టీయార్ హఠాత్తుగా పోయారు. అప్పటికి ఆయన వర్గంలో 41 మంది ఎమ్మెల్యేలున్నారు. క్రమేపీ లక్ష్మీపార్వతి నుండి అందరూ దూరంగా జరిగారు. ఆమెసామర్థ్యంపై ఎన్టీయార్‌కు ఎంత నమ్మకం వున్నా చరిత్ర చాటి చెప్పింది – ఆమెలో రాజకీయ సమర్థత లేదని, పరిపాలనాదక్షత గురించి చెప్పనే అక్కరలేదు. ఇవేమీ లేకపోయినా అత్యాశకు పోయింది కాబట్టే ఆమెను నాడు రజనీకాంత్, నేడు బాబు దుష్టశక్తి అన్నారు.

ఆ దుష్టశక్తి ప్రభావం చేతనే ఎన్టీయార్ తన అనుచరుల, కుటుంబ సభ్యుల, హితైషుల మాట వినలేదు. అందుకే నా ఉద్దేశంలో ఆగస్టులో చంద్రబాబు చేసినది రాజకీయంగా సరైనదే. నైతికంగా కాకపోవచ్చేమో ! రామారావుకి యింకా ఎక్కువ సమయం యివ్వాల్సింది అనడం యిప్పుడు యీజీ. తర్వాత జరిగిన సంఘటనలలో బాబు చర్యలు సమర్థనీయాలు కావు. ఎన్టీయార్‌ని తీసేయడానికి దుష్టశక్తిని అడ్డుపెట్టుకున్నారు బాగానే వుంది. మరి తన సాటి కుట్రదారులను తోసేయడానికి కారణం ఏమిటట? తోడల్లుడు దగ్గుబాటిని ఆరువారాలు తిరక్కుండా లక్ష్మీపార్వతి శిబిరంలోకి తోలారు. హరిక ృష?కు జెల్లకాయ కొట్టి ఆయన చేత "బాబుది యూజ్ అండ్ త్రో పాలసీ" అనిపించుకున్నారు.

ఎన్టీయార్ విధానాలు నచ్చినవారు కూడా ఆయన నియంత పోకడలను భరించ లేకపోయేవారు. బాబు పార్టీని హస్తగతం చేసుకున్నపుడు 'కలక్టివ్ లీడర్‌షిప్' వుంటుంది అనుకున్నాం. కానీ అది మిథ్యే అయింది. బాబే పార్టీ అధ్యక్షుడు, బాబే ముఖ్యమంత్రి. బాబుదే ఫైనల్ డెసిషన్. తక్కిన అందరికీ గ్రహణం పట్టించి ఆయన పూర?చంద్రుడిలా వెలిగారు. ఎన్టీయార్‌ను కూలదోయడానికే ఆయన కుటుంబం పనికి వచ్చింది. తర్వాత రాజకీయాలకు, బాంధవ్యానికి సంబంధం లేదని నీతులు చెప్తున్నారు. ఆయన రాజకీయాల్లో పైకి వచ్చినదే బాంధవ్యం చేత ! ఎన్టీయార్‌పై బతికుండగా ప్రేమ కురిపించలేదు. పెరియార్ ద్వితీయ వివాహంతో విభేదించి బయటకు వచ్చేసి పార్టీ పెట్టిన ఆయన శిష్యుడు అణ్నాదురై తన 1967 నాటి తన ప్రభుత్వం పెరియార్‌కు అంకితం అని ప్రకటించగానే పెరియార్ ఖుష్ అయిపోయారు. అన్నాదురైను క్షమించేశారు. బాబు అలాటి జెస్చర్స్ కనబరచలేదు. ఎన్టీయార్ చచ్చిపోయారని ఖరారు అయ్యాకనే ఆయనను కీర్తించడం మొదలుపెట్టారు.

ఇదీ చంద్రబాబూ–దుష్టశక్తీ గాథ. ఇదంతా చూస్తే 'దుష్టశక్తి' వలన నష్టపోయినవాళ్లు చాలామంది (దుష్టశక్తితో సహా) వున్నారు కానీ, లాభపడినది మాత్రం బాబే అనిపిస్తుంది. లేకపోతే ఆయన ముఖ్యమంత్రి కావడం యిప్పట్లో అయ్యేది కాదు. వచ్చిన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకున్నారు. అందుకని ఊరికే రాపాడించడం అనవసరం. ఇకనైనా చంద్రబాబును వెన్నుపోటు దారుడని పిలవడం మానేస్తే మనకు తలకాయనొప్పి తగ్గుతుంది. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2011)**

**జూన్ 14** **ఎమ్బీయస్ : 'నమస్తే తెలంగాణ' తీరు**

కెసియార్ ఎన్నాళ్లనుండో చెప్తూ వచ్చిన 'నమస్తే తెలంగాణ' పత్రిక సోమవారం ఆవిష్కరణ సభ జరిగింది. మంగళవారం నాటి సంచిక కొన్నాను. యాడ్స్ అవీ విపరీతంగా వున్నాయి కాబట్టి అంచనా కట్టలేకపోయాను. బుధవారం సంచిక కూడా చదివి యిది రాస్తున్నాను. మంగళవారం ప్రతిపై సంపుటి 1 సంచిక 21 అని వుంది. దీనికి ముందు 20 సంచికలు ఎప్పుడు వేశారో తెలియదు. పత్రికకు పబ్లిషర్, ప్రింటర్, ఓనర్‌గా దివకొండ దామోదర్ రావు పేరు వుంది. సిఇఓగా కట్టా శేఖర్‌రెడ్డి అన్నారు. (ఈయన సీనియర్ జర్నలిస్టు. మొన్నటిదాకా మహాటీవీలో వున్నారు. అడ్మినిస్ట్రేటివ్ సైడ్ వచ్చినట్టున్నారు) సంపాదకుడు మరో సీనియర్ జర్నలిస్టు అల్లం నారాయణ. వస్తోంది వస్తోందని చాలాకాలంగా చెప్తున్నారు కాబట్టి ఎలా వుంటుందాని ఉత్సుకతతో చూడబోయాను. ఇంకా స్టెబిలైజ్ కాలేదు కాబట్టి అప్పుడే వ్యాఖ్యానించలేము. అయినా ఫస్ట్ ఇంప్రెషన్స్ కొన్ని వుంటాయి కదా..

తక్కినభాషలలో దినపత్రికల మాట ఏమో కానీ ఈనాడు ధర్మమాని తెలుగు దినపత్రికల సాంకేతిక విలువలు చాలా ఉన్నతంగా వుంటాయి. వాళ్లని చూసి ఇంగ్లీషు పత్రికలు కూడా దదుస్తాయి. ఈనాడు మెయిన్‌పేజీల్లో కలర్ పేజీలు పెట్టింది కాబట్టి "హిందూ" హైదరాబాద్ ఎడిషన్ కలర్ పేజీలు వేస్తోంది. తక్కినచోట్ల లేకపోయినా. ఇక "సాక్షి" వస్తూ వస్తూనే అన్ని పేజీలు కలర్‌లో తెచ్చింది. వాళ్లను చూసి "ఈనాడు" అన్ని పేజీలూ కలర్ చేసింది. ఇటువంటి పోటీవాతావరణంలో వెలువడిన ఈ దినపత్రిక వాటికి భిన్నంగా ఆంధ్రభూమి, సూర్య వంటి దినపత్రికలకు కజిన్‌లా వుంది. కలర్‌పేజీల నిష్పత్తి "ఆంధ్రజ్యోతి"లా వుంటుందనుకుంటాను కానీ పేపరు క్వాలిటీ జ్యోతి కంటె తక్కువగానే కనబడుతోంది. మూడు రూపాయిలు పెట్టి కొంటున్నాం కాబట్టి యింకా ఎక్కువ ఆశిస్తాం కదా. ప్రధానమైన యిబ్బంది ఫాంట్ సైజ్ చిన్నగా వుండడం. పాఠకుల నుండి వచ్చే ఫీడ్‌బ్యాక్ బట్టి యివన్నీ మార్చుకుంటారేమో !

ముఖ్యంగా నేను చూసినది భాష విషయం ఎలా వుంటుందా? అని. రాజ్ టీవీ, యిప్పటి టి-ఛానెల్‌లోలా అంతా మామూలుగా మాట్లాడేసి చివర్లో 'వచ్చిన్రు' అన్నట్టు వుంటుందా అని చూశాను. అదేం లేదు, మామూలు పత్రికల భాషలోనే వచ్చింది. చదువుకోవడానికి హాయిగా వుంది. ఏ జిల్లా దైనా సరే మాండలికం చదవడం మహా కష్టం. పేపరంతా అలా వుందంటే బోరు కొట్టేసేది. ఏదో సంబరం అనే చోట మాత్రం సంబురం అంటున్నారు. కానీయండి. అదో ముచ్చట. 'సౌరంభం' అనే కాప్షన్ కూడా వాడారు. నాకు అర్థం తెలియదు. ఏది అచ్చతెనుగు రూపమో మనకు ఏదీ తెలియదు. పత్రికల్లో, సినిమాల్లో ఏది అలవాటు చేస్తూ వచ్చారో దానికే అలవాటు పడ్డాం. పత్రికల్లో వివిధ విభాగాలకు పేర్లు పెడతారు కదా. సాధారణంగా తెలుగు, ఇంగ్లీషు పెడతారు. వీళ్లు ఉర్దూ కూడా పెట్టారు - జిందగీ, ఖేల్, దునియా అని. బిజినెస్ పేజీకి బిజీ మార్కెట్ అని, ఫాస్ట్ ట్రాక్ బిజినెస్ న్యూస్ అనీ పెట్టారు. తక్కిన పత్రికల్లాగే జిల్లా ఎడిషన్ కూడా వుంది. హైదరాబాదు కాక మరో ఆరు జిల్లాలనుండి ఎడిషన్స్ వెలువడుతున్నాయి.

ఏ పత్రికైనా బతికేది యాడ్స్ మీదే. తెరాసచేత రోజూ తిట్లు తినే "ఆంధ్ర పెట్టుబడిదారులు" అందరూ యాడ్స్ యిచ్చి యీ పత్రికను ప్రోత్సహించారు. జిఎంఆర్, సుబ్బరామిరెడ్డి, మేకపాటి, మాక్సివిజన్, స్టార్ హాస్పటల్స్, కేర్ హాస్పటల్స్ ... యిలా చాలామంది కనబడ్డారు. కొన్ని కంపెనీల వాటాదారులు ఎవరో తెలియదు. లగడపాటి యాడ్ గురించి వెతికాను. రేపోమాపో వచ్చినా ఆశ్చర్యం లేదు. మంగళవారం పత్రికకు మంచి మెటీరియలే దొరికింది. గులాం నబీ తెలంగాణ యిప్పట్లో తేలదని చెప్పడం, రెండోది పిసిసి అధ్యక్షపదవి కోస్తా నాయకుడికే కట్టబెట్టడం. హ్యాపీగా రాసుకున్నారు. బుధవారం అంతటి న్యూస్ దొరకలేదు. అందువలన 'ఆంధ్రా పోలీస్, అంధేరా ప్రమోషన్స్', తెలంగాణ ఖాకీలకు తీరని అన్యాయం అనే కథనాన్ని బ్యానర్ హెడ్‌లైన్‌గా వాడుకున్నారు. రెండో స్థానంలో గులాం నబీ వ్యాఖ్యల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలపై పార్టీ శ్రేణులు, తెలంగాణ ప్రజలు ఆగ్రహంతో వున్నారని రాసిన కథనం ! న్యూస్ అంతా 'టీన్యూస్' అనే న్యూస్ ఏజన్సీకి క్రెడిట్ యిస్తున్నారు. కార్టూన్లు మృత్యుంజయవి.

ఇలాటి పత్రికలకు యుఎస్‌పి యే బలం. విశాలాంధ్ర పత్రికను సిపిఐ వాళ్లు అందరూ కొంటారు. కానీ సిపిఐ కానివాళ్లు కొనరు. వాళ్లు మామూలు పత్రికలా అన్ని పార్టీల వార్తలూ వేస్తే దాని వీరాభిమానులు అడ్డుపడతారు. ఈ పత్రికలో కూడా అలాటి మొగ్గు( టిల్ట్) చూపించక తప్పదు. సోమవారం పత్రిక ఆవిష్కరణ తెలంగాణా అమరవీరుల కుటుంబాలచే చేయించారు. వారి కథనాలు మంగళవారం లోపలి పేజీల్లో వేశారు. ఆ రోజే జయశంకర్‌తో యింటర్వ్యూ ఫుల్‌పేజీ వేశారు. ఆయన దాశరథిని ఎన్టీయార్ అవమానించడంచేత హృదయభారంతో చనిపోయారని కొత్త వాదన మొదలెట్టారు. ఆస్థాన పదవులు అలంకరించిన అనేకమందిని ఎన్టీయార్ అధికారంలోకి వస్తూనే తీసేశారు. వారిలో దాశరథి ఒకరు. (బాలమురళీకృష్ణ?తో సహా అనేకమంది వున్నారు) అంతేగాని పగబట్టి దాశరథిని తీసేయలేదు. బుధవారం పత్రిక కవర్‌పేజీపై కోదండరాం వున్నారు.

బుధవారం నాటికి నటరాజ రామకృష్ణ? మరణవార్త వచ్చింది. ఆయనపై తెలంగాణా ముద్ర కొట్టేశారు. ఆయన తల్లి తెలంగాణ వారు కావడం, పేరిణి నృత్యం కాకతీయులది కావడం కలిసి వచ్చింది. ఆయన తండ్రి కోస్తావారని, ఆయన తన నాట్యానికి ఆంధ్రనాట్యం అని పేరు పెట్టి ప్రాంతాలకు అతీతంగా నాట్యకళను ప్రచారం చేసారని చాలా సౌకర్యంగా విస్మరించారు. జిహెచ్ఎంసి అధికారిణి ఒకామె తమను నిందిస్తోందని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఫిర్యాదు చేశారట. ఆమె ఆంధ్రా అధికారిణి అనీ వీరిని 'పనికిరానివారు, దద్దమ్మలు, మీకెందుకు తెలంగాణ' అని బెదిరిస్తోందని వార్త రాశారు. ఇంకో వార్త - నమస్తే తెలంగాణా స్టిక్కర్ పెట్టుకున్న ఓ కిరాయిదారుని ఆంధ్రా ఇల్లుగలాయన ఖాళీ చేయమన్నాట్ట. అతను మే 1 కి ఖాళీ చేస్తానని చెప్పి తండ్రి అనారోగ్యం వలన చేయలేకపోయాడట. ఇల్లుగలాయన అతన్ని కొట్టాడట.

తక్కిన న్యూస్ కవరేజిలో వాటిల్లో తక్కిన పత్రికలలాగానే వుంది. ఎక్కువా కాదు, తక్కువా కాదు. ఆదివారం అనుబంధం చూస్తే కొంత అవగాహన వస్తుంది. అది చూసి ఏదైనా ప్రత్యేకంగా రాయబుద్ధవుతే మళ్లీ రాస్తాను. లేకపోతే ఇది చాలు ! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2011)**

**జూన్ 19** **ఎమ్బీయస్ : జయపాల్ .. ఎందుకిలా?**

జాతీయవాదం గురించి జయపాల్ రెడ్డి మాట్లాడిన మాటలు అందర్నీ ఉలిక్కిపడేట్టు చేశాయి. జయపాల్ రెడ్డి జాతీయవాది కాదని నా ఉద్దేశం కాదు. కానీ దాని గురించి చెప్పడానికి ఆయన ఎంచుకున్న సమయం, వేదికే ఆశ్చర్యం గొలిపాయి. జయపాల్‌గారు మేధావి, నిజాయితీపరుడు, సమర్థుడైన పరిపాలకుడు... యిలా అనేక మంచి లక్షణాలు వున్నాయి. కానీ యిలాటివాళ్లు ఎన్నికలలో గెలవలేరు. మామూలు ప్రజలు యీ సుగుణాలు పట్టించుకోరు. అందువలన ఆయన ఎప్పుడూ విన్నింగ్ సైడే వుండవలసి వస్తుంది. ఏ పార్టీ ప్రభ వెలుగుతోందో చూసుకుని అటువైపు వుండవలసి వస్తుంది. ఆయన ఎటు వెళతానన్నా వాళ్లు ఆహ్వానిస్తూనే వుంటారు – ఆయన ప్రతిభాపాటవాలు తెలుసు కాబట్టి.

జనతా పార్టీలో వుండి ఇందిరా, రాజీవ్‌లను ముప్పుతిప్పలు పెట్టిన జయపాల్ యీనాడు రాజీవ్ భార్య నడుపుతున్న కాంగ్రెస్‌లోనే అంత ప్రముఖమైన స్థానంలో వున్నారంటే విచిత్రంగా వుంటుంది. పార్లమెంటులో ఆయన విసిరిన ఒక చెణుకు నేను ఎప్పటికీ మర్చిపోలేను. బోఫోర్సు కుంభకోణంలో కమీషన్ల డబ్బు లోటస్ అనే కంపెనీ పేరుతో వున్న బాంక్ ఎక్కవుంటుకి వెళ్లింది అని బయటకు వచ్చేసింది. ఆ ఎక్కవుంటు ఎవరిది అన్నదానిపై చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌వాళ్లు బిజెపి వాళ్లను "మీ పార్టీ చిహ్నం కమలం కదా, లోటస్ అంటే కమలమే. అది మీ పార్టీ వాళ్లదే అయి వుంటుంది" అని ఆరోపణ చేశారు. అప్పుడు ప్రతిపక్షంలో వున్న జయపాల్ లేచి నిలబడి "రాజీవ్ అనే సంస్కృతపదానికి ఇంగ్లీషులో అర్థం లోటస్" అని ప్రకటించారు. బోఫోర్స్ కేసులో దోషిగా నిలబడ్డది రాజీవ్ అని అందరికీ తెలుసు. సభంతా చప్పట్లతో మారుమ్రోగిపోయింది. ఆయనకు ఆ సమయానికి సరిగ్గా రాజీవ్ పదానికి అర్థం తోచటం ఆయన పాండిత్యప్రకర్షకు, సమయసూర్తికి ఓ చిన్న ఉదాహరణ.

తెలంగాణా అంశం విషయంలో జయపాల్ గురించి మాట్లాడుకుంటున్నాం కాబట్టి దాని గురించే ద ృష్టి కేంద్రీకరిద్దాం. సమైక్యవాదులందరికీ అనుమానం – డిసెంబరు 9 ప్రకటన జయపాల్ డ్రాఫ్టు చేసినదే అని. తెలంగాణ యివ్వకపోతే రాష్ట్రంలో కొంప మునిగిపోతుందని ఆయనే కాన్వాస్ చేస్తున్నారని తెలంగాణా వాదులందరికీ ఆయన గాడ్‌ఫాదర్‌గా వుంటూ వెనక్కాలే వుండి చక్రం తిప్పుతున్నారని అందరూ అంటూ వుంటారు. ఓ పెద్దమనిషిగా కేంద్రంలో ఆయన మాట అందరూ మన్నిస్తారు. పైగా ఆయనకు రాష్ట్ర రాజకీయాలకు వెళ్లే ఉద్దేశం లేదు కాబట్టి స్వార్థచింతన లేకుండా వాస్తవపరిస్థితిని చెప్తారని అనుకుంటారు. ఆ ఎడ్వాంటేజి తీసుకుని ఆయన తెలంగాణా యిచ్చితీరాలని వాళ్లకు బ్రెయిన్ వాష్ చేస్తున్నారని సమైక్యవాదులు అనుకుంటూ వచ్చారు. కేకే కూడా యిదే పనిలో వున్నా, కేకే కంటె జయపాల్‌కి సంయమనం ఎక్కువ కాబట్టి, ఆయనకు మెరుగైన యిమేజి వుంది కాబట్టి ఆయన మాట ఢిల్లీ పెద్దలు వింటారన్న నమ్మకంతోనే తెలంగాణావాదులు కూడా ఆయన యింటిచుట్టూ తిరుగుతున్నారు.

డిసెంబరు 9 ప్రకటన అదావుడిగానే వెలువడింది. తెలంగాణా ఉద్యమకారులు కూడా ఎదురుచూడనంత వేగంగా, చర్చలూ, సంప్రదింపులూ లేకుండా కేంద్ర ప్రభుత్వం కమిట్ అయిపోయింది. ఇక ఆ తర్వాత నుండి అక్కణ్నుంచి జాగ్రత్తగా అడుగులు వెనక్కి వేసుకుంటూ రావడమే కనబడుతోంది. ఇంత ముఖ్యమైన ఆ ప్రకటనను జయపాల్‌యే డ్రాఫ్ట్ చేశారని అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. ప్రణబ్ ఊళ్లో వుండి వుంటే ఆయనే డ్రాఫ్ట్ చేసి వుండేవారు. ఆయన చేస్తే యిలాటి కమిట్‌మెంట్ లేకుండా ఎన్నో మడతపేచీలతో రాసి వుండేవారు. అందువలననే జయపాల్ హస్తాన్ని అందరూ వూహించారు. దానికి తగ్గట్టుగానే జయపాల్ కూడా ఆనందాతిరేకంతో "నేను తెలంగాణా గురించి తెరవెనుక ఎన్నాళ్లగానో చేసిన క ృషికి ఫలం యిది" బాపతు స్టేట్‌మెంట్ యిచ్చారు. (అవేళ నేనన్నది వేదవాక్కు ఏమీ కాదు అని మాట దాటేశారు. పైగా ఆయన చెప్పడం డిసెంబరు 9 ప్రకటన యుపిఏ ఆధ్వర్యంలోని కేంద్రం చేసిందట, కాంగ్రెస్ కాదట. మరి సోనియా బర్త్ డే కానుకగా ఎందుకు ప్రచారం చేశారు? అలా అంటూనే యిప్పుడు తెలంగాణపై నిర?యం తీసుకోవలసినది కాంగ్రెస్ హై కమాండ్‌ట. మళ్లీ వాళ్లెందుకు? ఏకంగా యుపిఏనే అంటే పోలా?)

డిసెంబరు 9 తర్వాత తెలంగాణ వచ్చేస్తోందన్న నమ్మకం ప్రబలడంతో ప్రతీవాళ్లూ తెలంగాణ రైలెక్కేశారు. అందరూ డ్రైవింగ్ సీటుకోసం పోటీపడసాగారు. వెనకనుండి చక్రం తిప్పానని చెప్పుకున్న జయపాల్ మాత్రం ఆ ఉబలాటం ప్రదర్శించలేదు. రోశయ్యగారిని నియమించేముందు, తర్వాత కూడా సోనియా జయపాల్‌ను సిఎంగా వెళ్లమని అడిగారట. "తెలంగాణ గురించి మీ అభిప్రాయం స్పష్టంగా తేల్చిచెపితేనే వెళతాను" అన్నారట జయపాల్. అది వాళ్లే తేల్చుకోలేదు. అందుకని యాయనా సిఎంగా రాలేదు. ఆయనకు తెలుసు – తను ఎటువంటి ఆశలు రేకెత్తించారో, అవి నెరవేరకపోతే ప్రజాగ్రహం ఎలా వుంటుందో ! హై కమాండ్ అనేక కారణాలు చెపుతూ తెలంగాణాపై నిర?యం వాయిదా వేస్తూ వచ్చింది. ఓపిక హరించిన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు జయపాల్ నాయకత్వాన్ని నమ్ముకోవడం మొదలెట్టారు. ఆయనపై మోరల్ ప్రెషర్ తేవడం ప్రారంభించారు. తెలంగాణ ఎన్‌జివోలు వెళ్లారు. కుర్చీలో కూర్చోమన్నా కూర్చోలేదు. నీవు తప్ప మాకెవరూ దిక్కులేదు. నువ్వు నాయకత్వం వహించేదాకా వదిలిపెట్టం అన్నారు. ఆయనేదో సర్ది చెప్పి

పంపించారు.

ఇక కేకే దిగారు. వాళ్లింటికి వెళ్లడం, మంతనాలు సాగించడం ఎప్పుడూ వున్నదే. ఈ సారి మాత్రం కొత్త యెత్తు యెత్తారు. జయపాల్ రంగంలోకి దిగి చెడుగుడు ఆడేయబోతున్నారని వార్తలు సృష్టించి వదిలారు. కేకేయో మరొక తెలంగాణ ఉద్యమకారులో గాని టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఓ వార్త నాటారు. (ప్లాంటింగ్ ఏ న్యూస్‌కి తెలుగన్నమాట) జయపాల్ కాంగ్రెస్‌లోనుండి బయటకు వచ్చేసి తెలంగాణ కాంగ్రెస్ పేరుతో ఓ పార్టీ పెట్టేస్తారు. తెలంగాణా ప్రాంతానికి చెందిన లెజిస్లేటర్లు, పార్లమెంటు సభ్యులు అందరూ ఆ పార్టీలో చేరి జయపాల్ నేతృత్వంలో పనిచేసేసి అటు తెరాసను, యిటు టిడిపిని దునుమాడేస్తారు. వీళ్ల పీడ వదిలిపోవడంతో అప్పుడు కాంగ్రెస్ అధిష్టానం హమ్మయ్య యిప్పుడు ప్రత్యేకరాష్ట్రం యిచ్చినా తెలంగాణలో మనకే లాభం అనుకుని రాష్ట్రం విభజించేస్తుంది. వెంటనే జయపాల్ బృందం జై కాంగ్రెస్ అంటూ కాంగ్రెస్‌లో చేరిపోతారు. టైమ్స్ ఆఫ్ ఇండియా రాయగానే మర్నాడు తెలుగు పేపర్లు కొన్ని పల్లవి అందుకున్నాయి.

ఇలాటి కథనాల వలన జయపాల్ అవుననో, కాదనో చెప్పాల్సి వుంటుంది. కాదంటే తెలంగాణకు పెద్దదిక్కుగా వున్న పేరు మటాష్ అయిపోతుంది. తెలంగాణా గురించి పదవికూడా త్యాగం చేయడానికి సిద్ధపడని స్వార్థపరుడిగా ముద్ర పడుతుంది. అందువలన దిక్కులేక, మరో మార్గం తోచక ఆ ప్లాను ప్రకారం బయటకు రావాలి. లేదా కాంగ్రెస్‌లో వుంటూనే కేకే స్టయిల్లో 'తెలంగాణ యివ్వకపోతే కాంగ్రెస్ అడుక్కు తింటుంది, రాజీనామా విసిరి పారేస్తాను' వంటి ప్రకటనలు యిస్తూ వుండాలి. ఈ విధంగా జయపాల్‌ను యిరుకున పెట్టి కేకే తన మార్గానికి తెచ్చుకుందామనుకున్నారు.

ఈ మధ్యే హైదరాబాదులో ఓ మీటింగులో కేకే, జయపాల్‌ను "జయపాల్, యిప్పటికైనా నువ్వు ఏదైనా చేయాలి" అనడం, జయపాల్ "కేశవరావ్, నువ్వు కాస్త తగ్గాలి. నా పరిధిలో నన్ను చేసుకోనివ్వాలి" అనడం జరిగింది. ఈ టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం తర్వాత జయపాల్‌పై సహజంగానే ఒత్తిడి పెరిగినట్టుంది. మీరే ముందుండి నడిపించాలి అంటూ.

కానీ జయపాల్ వ్యక్తిత్వం ఎటువంటిదో మనం చూడాలి. ప్రత్యేక తెలంగాణ వస్తే బాగుండునని ఆయనకు మనస్సులో వుంటే వుండవచ్చు. కానీ దానివలన ఆయనకు వచ్చే లాభం ఏమిటి? సిఎం కావాలన్న కోరిక ఆయనకు లేదు. అలాటి పదవుల్లో పరిపాలన తక్కువ, రాజకీయం ఎక్కువ. జయపాల్ రాజకీయాలు పూర్తిగా వంటబట్టించుకున్న వ్యక్తికాదు. అనుచరగణాన్ని పెంచిపోషించలేదు. ఆయన నిజంగా పార్టీలోంచి బయటకు వచ్చేస్తే ఆయన వెంట యిద్దరు, ముగ్గురు ఎంపీలు కాదు కదా, యిద్దరు ముగ్గురు లెజిస్లేటర్లు కూడా రారు. ఆయన ఎవరికీ పెద్దగా ఒరగబెట్టినది లేదు. అందువలన ఆయనకోసం రిస్కు తీసుకునే వారు ఎవరూ లేరు.

2014 పార్లమెంటు ఎన్నికలలో నెగ్గుతానా లేదా అని ఆయన చూసుకోవాలి కదా. 2009 ఎన్నికలలో ఆయన నెగ్గిన చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో చాలాభాగాలు హైదరాబాదు సిటీ, పరిసరప్రాంతాల్లోవే. అక్కడ ప్రత్యేకవాదం బలంగా లేదని ఆయనకూ తెలుసు. 2009లోనే మూడు అసెంబ్లీ సిగ్మెంట్‌లలో కాంగ్రెసే గెలిచింది. ఆయన గెలుపే గ్యారంటీ లేనపుడు తక్కినవాళ్లను ఎలా గెలిపించగలరు? బెస్ట్ పార్లమెంటేరియన్‌గా ఎవార్డు తెచ్చుకున్నా యీయనను ప్రజానాయకుడిగా ఎందరు అంగీకరిస్తారు? ఇవన్నీ ఆయనకీ తెలుసు కాబట్టే తటపటాయింపు. ఏదో ఒక పెద్ద పార్టీ గొడుగున కాలక్షేపం చేయగలరు గానీ, స్వంతంగా పార్టీ పెట్టి వీళ్లందరితో వేగలేరు. ఆయన వెనకేసిన నిధులూ లేవు. పారిశ్రామిక వేత్తలకు చేసిన ఉపకారాలూ లేవు. ఇప్పుడు కొత్త పార్టీకి విరాళాలంటూ ఎవరి దగ్గరకు వెళతారు?

అందువలన టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన వార్తకు ఆధారం లేదనీ, కాంగ్రెస్‌లోనుండి బయటకు వచ్చి తెలంగాణా ఉద్యమానికి నాయకత్వం వహించే వుద్దేశం బొత్తిగా లేదని ఆయన చాటి చెప్పాలి. దీనివలన ఆయనను మొదట్లో కాస్త తిట్టుకుంటే తిట్టుకోవచ్చు కానీ యిక ఆయనపై ఆశలు పెట్టుకోరు. ఢిల్లీ వెళ్లినా, హైదరాబాదు వెళ్లినా జనాలంతా వచ్చి కూర్చుని బతిమాలడాలు, బెదిరించడాలూ వుండవు. అందువలన ఆయన బొత్స ప్రమాణస్వీకారం వేదికను వుపయోగించుకుని తన మనసులో మాట చెప్పారు. కాంగ్రెస్ జాతీయవాదాన్ని నమ్ముకుందని, ప్రాంతీయవాదాన్ని, ఉపప్రాంతీయవాదాన్ని ప్రోత్సహించదని చెప్పారు. దానిపై సహజంగా రియాక్షన్ వచ్చింది. ఈయన తను బిజెపిని దృష్టిలో పెట్టుకుని మాట్లాడానని చెప్పారు.

మనం దాన్ని నమ్మనక్కరలేదు. జయపాల్ కేకే లాగ అడావుడిగా, ఆవేశంగా, గందరగోళంగా మాట్లాడే వ్యక్తి కాదు. ప్రతీమాట ఆచితూచి, ఆగి ఆగి మాట్లాడతారు. ఆయన బ్రహ్మానందరెడ్డికి స్పీచ్ మేకర్‌గా పనిచేశారంటారు. ప్రతీపదానికి ఎంత విలువ వుంటుందో, ఎంత బరువు వుంటుందో ఆయనకు బాగా తెలుసు. తెలుగు, ఇంగ్లీషు భాషలపై మంచి పట్టుంది. అటువంటి వ్యక్తి ఆషామాషీగా, శ్రోతలకు అర్థం కాని రీతిలో, తికమకపెట్టే రీతిలో చెప్తారని అనుకోవలసిన పని లేదు. బిజెపిని తిట్టాలంటే ఒక కర్ర ఎప్పుడూ అందుబాటులో వుంటుంది – మతతత్వవాద పార్టీ అని. అవినీతి గురించి ఎక్కువ మాట్లాడుతోంది కాబట్టి దాని వీక్‌స్పాట్ కర్నాటక పట్టుకుని ఉతకవచ్చు. ప్రాంతీయం, ఉపప్రాంతీయం అనడం దేనికి? బిజెపి జాతీయ పార్టీయే కదా. చిన్న రాష్ట్రాలు వాళ్ల సిద్ధాంతం. దాని గురించి తిట్టే పని లేదు. జయపాల్ ప్రాంతీయవాదం పేరు చెప్పినది 'కాంగ్రెస్ జాతీయవాదానికే నిలబడుతుంది, దానినే నేనూ అవలంబిస్తాను' అని చెప్పడానికే. కాంగ్రెస్‌ను అభిమానించే విద్యార్థులు ఎవరూ లేరని తెలిసే, నేను విద్యార్థినైతే కాంగ్రెస్‌లో చేరతాను అని కూడా చేర్చారు. జయపాల్ అంత తేలిగ్గా, చులాగ్గా ఎప్పుడూ మాట్లాడరు. ఇలా కప్పగంతులు వేయరు. మాట వెనక్కి తీసుకున్నారంటే గట్టి కారణమే వుండాలి.

జయపాల్ యీ ప్రకటన చేశాక చాలా రియాక్షన్ వచ్చింది. నాగం, జూపల్లి, గీతా రెడ్డి అందరూ విరుచుకుపడ్డారు. తెలంగాణా న్యాయవాదులు ఆయన యింటిమీద పడ్డారు. తెరాసవారు సరేసరి. ఇన్ని జరుగుతున్నా జయపాల్ తను ప్రత్యేకవాదానికి నిలబడుతున్నాను అనే ప్రకటన చేయలేదు. సందిగ్ధస్థితిని కొనసాగిస్తున్నారు. ఇదంతా చూస్తే హై కమాండ్ తమ మనోభావాన్ని యీయన చేత చెప్పించిందన్న అభిప్రాయం కలుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణపై ఏదో ఒకటి తేల్చేస్తాం అన్నారు. తీరా చూస్తే ఆజాద్ గారు వచ్చి అంతా మొదటినుండీ విని 'తెలంగాణ సమస్య క్లిష్టమైనది, రాత్రికి రాత్రి తేలదు' అన్నారు. రాత్రికి రాత్రి తేలదు కానీ కానీ ప్రాసెస్ అంటూ సంకురాత్రికి మొదలుపెడితే శివరాత్రికి తేలుతుంది. అసలు మొదలుపెట్టకుండానే కూర్చుంటే ఎలా? మన్‌మోహన్ ఎపాయింట్‌మెంట్ యిచ్చారు కానీ వీళ్లు 44 నిఎంఎలు మాట్లాడితే (ఊళ్లో తిరిగే పరిస్థితి లేదు డైలాగులే తప్ప కొత్తగా చేర్చింది ఏమీ లేదు) ఆయన 1 నిఎంఎలో సమాధానం చెప్పాడట. కోర్ కమిటీకి చెప్తాను లెండి అని.

ఇక ప్రణబ్‌గారు రేపు పిలవబోతున్నారు. గూరా?ల్యాండ్ ఫార్ములానే వీళ్లముందు పెట్టి వీళ్ల స్పందన తెలుసుకుంటారని అందరూ అనుకుంటున్నారు. అదే నిజం కావచ్చు కూడా. ఆ ప్రతిపాదన వినగానే వీళ్లు ఎగిరి గంతేసి సరే అనరు. దీనికి ఒప్పుకుంటే తెలంగాణ ద్రోహులుగా ముద్రపడతాం అని అభ్యంతరం తెలుపుతారు. సరే అయితే వెళ్లిరండి, మళ్లీ ఆలోచిస్తాం అంటారు వాళ్లు. యుపిఏ భాగస్వాములందరూ కలిసి కూర్చుని తేల్చాలి అంటారు.

చిదంబరంగారు చూస్తే అఖిలపక్షం తేల్చాలి అంటారు. మరి అఖిలపక్షంను పిలుస్తారా అంటే ఏదీ టిడిపివాళ్లు రానంటున్నారుగా అంటారు. 'అనుమతి లేనిదే లోపలకి వెళ్లకూడదు, అనుమతి యిచ్చేవాడు లోపలే కూర్చున్నాడు' అనే పరిస్థితి యిది. చూడబోతే ఎవరికీ చిత్తశుద్ధి లేదు. ప్రణబ్, చిదంబరం, ఆజాద్, యిప్పుడు జయపాల్ వీళ్లందరి స్టేటుమెంట్లు పక్కన పెట్టి ఒకేసారి చూస్తే తోచేది ఒక్కటే – కాంగ్రెస్ హై కమాండ్‌కు ప్రత్యేక తెలంగాణా యిచ్చే వుద్దేశం లేదు. కనీసం సమీపభవిష్యత్తులో ! ఈ సందేశాన్ని కాంగ్రెస్ హై కమాండ్ జయపాల్ ద్వారా అందించింది. వ్యక్తిగతంగా కూడా 'నాపై ఆశ పెట్టుకోకండి' అని చెప్పవలసిన అవసరం ఆయనకి కూడా వుంది. అందుకే ఆయన ఆ ప్రకటన చేశారు. ఇది గమనించే కాబోలు కేకే 'తెలంగాణ విషయంలో మాకెవ్వరూ డెడ్‌లైన్లు పెట్టరాదు' అని బహుశా తెరాసను ఉద్దేశించి హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో తెరాస ఏ విధంగా ప్రతిస్పందిస్తుందో వేచి చూడాలి.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2011)**

## జూన్ 24 ఎమ్బీయస్ : ఇన్నాళ్లకు చదివారు, గోడమీద రాతని...

ఇన్నాళ్లకు టి కాంగ్రెస్‌వాళ్లకు జ్ఞానోదయం అయినట్టుంది. జులై 1 లోగా యాక్షన్ ప్రోగ్రాం అంటూ యిప్పుడే ప్రకటించారు. నిన్న ఢిల్లీలో వాళ్లను చూస్తే నిజంగా జాలి వేసింది. వాళ్లు పాపం యిన్నాళ్లూ మనల్ని ఏమార్చలేదు, వాళ్లని వాళ్లే ఏమార్చుకుంటున్నారనిపించింది. హై కమాండ్ తెలంగాణ యిచ్చేట్టు లేదు అన్న విషయం మూడు, నాలుగు నెలలుగా గోడమీద రాతలా మనందరికీ కనబడుతోంది. కెసియార్ ఢిల్లీ వెళ్లి వచ్చి మిలియన్ మార్చ్ అక్కరలేదన్నప్పుడే మనకు అర్థమై పోయింది – ఇవ్వకుండా మేనేజ్ చేయగలమన్న నమ్మకం అధిష్టానం వారికి వచ్చేసిందని. కెసియార్ కూడా ఏదో అప్పుడప్పుడు మర్యాదకు ఓ స్టేటుమెంటు పడేయడం తప్ప అంతకంటె యాక్టివిటీ పెట్టుకోవడం లేదని అందరూ గమనించారు.

ఢిల్లీ వారు అసెంబ్లీ ఎన్నికల తర్వాత అన్నారు, ఆజాద్‌ను పంపించామన్నారు, అఖిలపక్షం అన్నారు, జయపాల్ రెడ్డి చేత చెప్పించారు.. ఏవేవో చెప్పి నీరు కారుస్తూ వచ్చారు. ఇప్పట్లో వచ్చేదా, చచ్చేదా, యిస్తే గిస్తే ఎలక్షన్ల ముందు యిస్తారు అని సాధారణ తెలంగాణా పౌరుడు కూడా విసుక్కుని తన పని తను చూసుకునే స్థితికి తీసుకుని వచ్చేశారు. అయినా క్యాఫ్ట్ (టి–కాంగ్రెస్) వాళ్లు మాత్రం అప్పుడప్పుడు నాయిస్ చేస్తున్నారు. తమాషా ఏమిటంటే అది కూడా వంతులవారీగా చేస్తూ వచ్చారు. కొంతకాలం జానారెడ్డి, తర్వాత జీవనరెడ్డి, ఆ తర్వాత దామోదరరెడ్డి, గుత్తా సుఖేందరరెడ్డి, పొన్నం... యిలా ఒకరి తర్వాత ఒకరు గొంతు పెంచడం, తగ్గించడం. మొదటినుండీ దీనిమీదే హడావుడి చేస్తూ వచ్చిన మధు యాష్కీ చల్లబడ్డారు. కేకే, వి హనుమంతరావు మాట్లాడేదాన్ని సీరియస్‌గా తీసుకోనక్కరలేదు కాబట్టి వారిని ప్రస్తావించడం లేదు.

మే దాకా టైము అడిగిన అధిష్టానం ఆ తర్వాత ఏదో అట్టహాసం చేస్తోంది తప్ప నిజాయితీగా ప్రయత్నిస్తున్న దాఖలాలు ఏమీ కనబడటం లేదు. నిన్న జూన్ 15 న జరిగినది పరాకాష్ట. చిదంబరంగారు చీదరించేసుకున్నారు. ఆయన అసలే అహంభావి. ఆయన దగ్గరకు మనవాళ్లెళ్లి "తెలంగాణ యివ్వకపోతే తమిళనాడులో లాగానే యిక్కడా కాంగ్రెస్ మట్టిగొట్టుకుపోతుంది" అనడం ఏమిటి, మతి లేకపోతే. ఆయనను రెచ్చగొట్టినట్టు కాదూ ! పుండు కెలికినట్టు కాదూ ! దాంతో ఆయనకు తిక్కరేగింది. వెళ్లి సోనియా చేత చెప్పించండి అన్నారు. అయినా కాంగ్రెస్ నిర?యం తీసుకోనిదే యుపిఏ ఏం తీసుకుంటుంది? అన్నారు. మొన్నటిదాకా అభిషేక్ సింఘ్వీగారు యుపిఏ నిర?యం తీసుకోవాలి తప్ప కాంగ్రెస్ ఏం తీసుకుంటుంది? అన్నారు. జయపాల్ రెడ్డిగారు కూడా డిసెంబరు 9 ప్రకటన కేంద్రం చేసింది తప్ప కాంగ్రెస్ కాదన్నారు. సక్సెస్ హేజ్ మెనీ ఫాదర్స్, ఫెయిల్యూర్ హేజ్ నన్ అని సామెత. డిసెంబరు 9 గందరగోళ ప్రకటనను స్వంతం చేసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. 'మీ డిసెంబరు 9 నాటి ప్రకటనను మీరు నిలబెట్టుకోవాలి' అని చిదంబరంగారిని ములగచెట్టు ఎక్కించబోతే ఆయన ఎక్కలేదు. డిసెంబరు 9, 23 జనవరి 5, 6.. యివన్నీ నా

వ్యక్తిగతంవి కావు. నేను నిమిత్తమాత్రుణ్ని. దీనిలో నా ప్రెస్టేజి క్వశ్చన్ ఏదీ లేదు అని దులిపేసుకున్నారు.

మనవాళ్లు పాడిందే పాటరా దాసరీ అన్నట్టు పాడుతూంటే టాటా చెప్పి వెళ్లిపోయారు. పొన్నం అడ్డుపడబోయినా లాభం లేకపోయింది. మనవాళ్లు అవమానం దిగమింగుకోవడానికి గంటన్నర పట్టింది. ఈయన యిలా నోటితో లేదంటే సాయంత్రం ప్రణబ్‌గారు చేత్తో లేదన్నాడు. అన్నీ వీళ్లచేతే చెప్పించాడు కానీ ఆయన కమిట్ అయింది లేదు. సోనియమ్మ వూరునుంచి వచ్చాక చెప్తాట్ట. కొత్తగా చెప్పేదేముంది? ఆవిడకు తెలియని దేముంది? నాకు అన్నిటికంటె ఆశ్చర్యం ఏమిటంటే గూరా?లాండ్ ఫార్ములా ముందు పెట్టి మీ రియాక్షన్ ఏమిటని అడుగుతారనుకున్నాను. మనవాళ్లకు ఆ పాటి మర్యాద కూడా దక్కలేదు. గత ఏడాదిన్నరగా జరుగుతున్న తంతే జరిపించి పంపారు. గూరా?లాండ్ కిచ్చిన విలువైనా యివ్వలేదు.

బయటకు వచ్చిన తర్వాత వీళ్ల మొహాలు చూస్తే కత్తివాటుకి నెత్తుటి చుక్క లేదు. ఒక్కరు కూడా ఉత్సాహంగా మాట్లాడలేదు. ఎప్పటిలాగానే 'యివ్వకపోతే లాభం లేదని చెప్పాం, ఊళ్లలో తిరిగే పరిస్థితి లేదన్నాం'... యిదే గోల. ఒక నిరీ?త కాలవ్యవధి లేదు, పాజిటివ్ సిగ్నల్ లేదు (కోమటిరెడ్డి వుందని అంటూ వుంటే పక్కాయన లేదని సవరించాడు) అయినా తొంబలా 60 మంది వెళితే ఎవరితో మాట్లాడతారు? యూనియన్‌లో 2 వేల మంది సభ్యులుంటే అందరూ ఎండీ ఛాంబర్‌లోకి వెళతారా? వాళ్ల తరఫున నలుగురో ఐదుగురో వెళతారు. ఇక్కడా ఇద్దరు ముగ్గురు వెళ్లి వుంటే వాళ్ల కష్టాలు వీళ్లూ, వీళ్ల కష్టాలు వాళ్లూ వినివుండేవారు. ఇంతమందితో వెళ్లినపుడు ఏం మాట్లాడతారు? వీళ్లు ఒకరి నొకరు నమ్మరేమో ఖర్మ!

ఇవాళ కోమటిరెడ్డి యింట్లో బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటూ వుంటే అందరికీ బల్బు వెలిగి వుంటుంది. ఆ బల్బు వెలుగులో యిలా అయితే ఎన్ని జన్మలెత్తినా తెలంగాణ రాదు అని గోడమీద రాత కనబడి వుంటుంది. అందుకని సాయంత్రానికి ఓ యాక్షన్ ప్లాను తయారుచేశారు. జులై 1 నుండి నిరాహారదీక్షలు. తర్వాత పార్లమెంటు సమావేశంలో అలజడి, ఆ పై రాజీనామాలు. దీక్షలంటే రాందేవ్ బాబా గుర్తుకు వస్తారు. ఆయనలా సల్వార్ కమీజ్ వేసుకుని కూచుని 10 అడుగుల ఎత్తయిన వేదిక నుండి దుమకడం మనవాళ్ల తరం కాదు. ఎంత యోగసాధకుడైనా ఆయనా నాలుగు రోజులకే కళ్లు తేలేశాడు. మరి బిపి, షుగర్లతో అలరారే మన ఎంపీలు ఎంతకాలం ఓర్చుకోగలరో చూడాలి. ఆ మధ్య బాబ్లీ గురించి టిడిపి నాయకులు వెళ్లి మందుల్లేక అల్లాడారు. ఇవన్నీ గమనంలో పెట్టుకుని కూడా ఆమరణ నిరాహారదీక్ష ఎందుకు తలపెట్టారో మరి. కెసియార్ 19న ఆహారదీక్ష తలపెట్టారు కాబట్టి దానికి ప్రతిగా నిరాహారదీక్ష అన్నారేమో.

కెసియార్ ఆహారదీక్షే ఎలా జరుగుతుందో తెలియదు. 10 లక్షల పొయ్యిలట. అంటే 10 లక్షల కుటుంబాలు. కుటుంబానికి నలుగురనుకున్నా 40 లక్షల జనాభా యిరుకిరుకు హైదరాబాదు రోడ్లమీద పడతారా !? పేవ్‌మెంట్‌లు ఎలాగూ కబ్జా అయిపోయాయి. నడిరోడ్డుపై దుకాణం పెట్టాలి. ఎవరికైనా కేటరింగ్‌కి యిచ్చి అక్కడ వేడి చేసుకుంటే తప్ప పూర్తిగా వంట చేయాలంటే పప్పులు, ఉప్పులు, నూనె, పోపు సామాను, కూరలు, కత్తిపీట, చాకులు, మూకుడు, గరిటలు.. ఒకటా రెండా? ఎన్ని సామాన్లు పట్టుకురావాలో ! ఇంతా చేసి వర్షం కొట్టిందంటే అంతా మటాష్ ! పొయ్యి మండదు. పొయ్యిలోంచి పిల్లి లేవదు. సమయానికి విస్తరి పడకపోతే నినాదాలకు గొంతేం లేస్తుంది? అన్నట్టు కొంతమందికి అన్నంతో పాటు అనుపానాలు అలవాటుంటాయి. వాళ్లేం చేస్తారో చూడాలి!

ఉద్యమం అంటే రక్తపాతాలతో కాకుండా యిలా నెయ్యీ నూనెలతో, పాలూ పెరుగులతో నడిపిస్తున్నందుకు కెసియార్‌ను అభినందించాలి. క్యాఫ్టవాళ్లు కూడా యిలాటి కొత్త తరహా ఐడియాలతో రావాలి తప్ప నిరాహారదీక్ష వంటి గాంధీకాలం నాటి ఐడియాలు పట్టుకుని వేళ్లాడితే లాభం లేదు. పైగా రిస్కు కూడాను. గంగానది కాలుష్యం గురించి నిరాహారదీక్ష చేసినాయన్ని ఆసుపత్రిలో చేర్చి పురుగులమందు ఎక్కించేశారట. పాపం ఆయన పోయాడు. వీళ్ల విషయంలో అంత ఘోరం జరగదేమో కానీ, షుగర్ లెవెల్స్ పడిపోతే కష్టం. నిరాహారదీక్ష ఎప్పుడు భగ్నం చేస్తారా అని ఎదురుచూస్తూ కూర్చోవాలి. రాజీనామాలు యిస్తే బాగానే వుంటుంది కానీ ఎందరు కలిసి వస్తారో తెలియదు. ఉదాహరణకి ఉపముఖ్యమంత్రిగారిని చేయమంటే 'ఉండవయ్యా ఆ కుర్చీలో నెల్లాళ్లయినా కూర్చోనీ' అనవచ్చు.

పార్లమెంటులో అల్లరి చేయడం ఒక్కటే నా దృష్టిలో ఎఫెక్టివ్ మెథడ్. డిఎంకె వాళ్లతో లోపాయికారీ ఒప్పందం పెట్టుకుంటే వాళ్లెలాగూ 2 జి స్పెక్ట్రమ్ గురించి అల్లరి చేయబోతారు. వాళ్లతో బాటు డౌన్ డౌన్ అంటే చాలు. సోనియా గాంధీ భయపడిపోతారు. ఆలోచిస్తే బోల్డు ఐడియాలు తడతాయి. ఇంతకాలానికైనా గోడమీద రాత చదివి ఉద్యమిస్తున్నారు. అందుకు సంతోషిద్దాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2011)**

## జూన్ 25 ఎమ్బీయస్ : ఇసుక స్మగ్లింగూ, యితర స్పందనలూ

ఆ మధ్య తమిళనాడులో యిసుక స్మగ్లింగు గురించి రాయగానే కొందరు పాఠకులు రాశారు. ఎక్కడో తమిళనాడు గురించి రాస్తారేమిటి? మన రాష్ట్రంలోనే భారీగా జరుగుతోంది కదా అని. స్వర?ముఖి నదిలో, పెన్నా నదిలో జరుగుతోందని పేపర్లలోనే వచ్చింది. కృషా?తీరంలో అయితే మరీ అన్యాయం. 'కృషా? జిల్లాలో నదీతీరంలో 70 ఇసుక క్వారీలు వుండగా కోర్టు కేసులు, అనుమతులు లేక 58 క్వారీలలో వేలంపాటలు జరగటం లేదు. అక్కడ రాత్రీపగలూ తేడా లేకుండా నదీగర్భంలో పక్కా రహదారులు నిర్మించి యిసుక మాఫియా తవ్వకాలు జరిగి రవాణాచేస్తోందిట. వీరికి రాజకీయ పార్టీల, అధికారుల అండ వుంది. మూడు

క్వారీలకు వేలం వేస్తే ప్రభుత్వానికి 36.36 కోట్ల ఆదాయం వచ్చింది. మిగిలిన వాటికి కూడా వేలం వేస్తే కనీసం 200 కోట్లు వస్తాయి' అని నిన్న పేపర్లో వచ్చింది. ఇవాళ్టి ఈనాడులో ఫుల్ పేజీ ఆర్టికల్ వచ్చింది. చాలా జిల్లాలలో యిది నడుస్తున్నట్లుంది. కృషా? జిల్లా అక్రమరవాణాలో వంశీమోహన్‌కు వాటా వుందని, అతన్ని నియంత్రించబోయిన ఇంజనియర్ ఒకతన్ని సెక్స్ స్కాండల్‌లో యిరికించి నోరు మూయించాడనీ ఒక పాఠకుడు రాశారు. వీడియో లింకు కూడా పంపించారు. అందువలన దశావతారం సినిమాలోని యిసుక స్మగ్లింగ్ ఉదంతాన్ని చాలామంది ప్రేక్షకుల్ రిలేట్ చేసుకోగలిగారన్నమాట.

ఇక యితర స్పందనలు నేను మొదలెట్టిన 7 సీరియల్స్ గురించి ! ఇన్ని ఒకేసారా అని అందరూ బెంగపెట్టుకున్నారు. రాయగలనా లేదా అని నేను బెంగపడితే అర్థం వుంది కానీ చదవడం ఎలా అని వీళ్లింత వర్రీ అవుతున్నారేమిటాని నాకు నవ్వు వచ్చింది. 'అసలే మన యిస్టరీ అంతంతమాత్రం' అన్నట్టు, నేను 'నిజాం కథలు' మధ్యలో మానేయడంతో యివి సక్రమంగా పూర్తవుతాయన్న నమ్మకం పోయింది పాఠకులకు. ఈ ఫాస్ట్ రోజుల్లో వారం వారం సీరియల్స్ ఏమిటి, ఒకేసారి అన్నీ యిచ్చి పారేయక అని కొందరికి విసుగు. నేను ఎందుకిలా మొదలుపెట్టానో మొదట చెప్తాను.

నాకు పాఠకులనుండి ఎన్నో డిమాండ్లు వస్తూంటాయి. ఫలానా దాని గురించి రాయండి, ఫలానావారి గురించి రాయండి అని. నన్నే ఎందుకు అడుగుతారు? అని నాకు నేనే ప్రశ్న వేసుకుని జవాబు కూడా చెప్పుకున్నాను. గతంలో జాయింటు ఫ్యామిలీలు వుండేటప్పుడు ఇంట్లో ఖాళీగా వుండే తాతయ్యో, మామయ్యో, బాబయ్యో వుండేవారు. వాళ్లు పనికి వచ్చేవో, పనికి రానివో ఏవో కబుర్లు చెపుతూ వుండేవారు. తలిదండ్రులు కూడా అప్పుడప్పుడైనా పిల్లలతో కబుర్లు చెప్పేవారు. ఇలా కాసిన్ని విషయాలు తెలిసేవి. పోనుపోను న్యూక్లియార్ ఫ్యామిలీలు వచ్చాక, పోటీ చదువులు వచ్చాక యివన్నీ అటకెక్కాయి. ఎంతసేపు అకడమిక్ చదవమనే పోరు తప్ప జనరల్ పుస్తకాలు చదవమని తలిదండ్రులు చెప్పడం మానేశారు. పత్రికలు కొనడం మానేశారు. టెన్త్‌కి వచ్చిన దగ్గర్నుంచి టీవీ కేబుల్ కనక్షన్ పీకేస్తున్నారు. కాస్త ఖాళీగా కనబడితే ట్యూషన్‌కి తోలతారు. వేసంగి సెలవుల్లో అమ్మమ్మగారింటికి పంపరు. సమ్మర్ క్లాసులకు పంపుతారు. వీటివలన పిల్లలు నిటారుగా పెరిగారు కానీ గుబురుగా పెరగలేదు. వారి జ్ఞానం ఏకోన్ముఖమే, బహుముఖీనం కాదు. చదువులు పూర్తయి, ఉద్యోగాల్లో పడి, కడుపు నిండిన తర్వాత అనేక విషయాల్లో వాళ్ల జ్ఞానశూన్యత వాళ్లను వెక్కిరిస్తోంది. మనసు ఖాళీగా బావురుమంటోంది. ఎన్నో సందేహాలు, ఆలోచనా స్రవంతిలో ఎన్నో ఖాళీలు, మనసుకు ఉల్లాసం కా?వాలి, పూరించాలంటే ఎక్కడ చూడాలో, ఎవర్ని అడగాలో తెలియదు.

ఇటువంటి సందిగ్ధంలో వున్నవారికి నేను దొరికాను. నేను పండితుణ్ని కాను. స్వంతంగా ఏమీ చెప్పటం లేదు. అక్కణ్నుంచి యిక్కణ్నుంచి పుల్లలు ఏరుకుని వచ్చి పక్షి గూడు కట్టినట్టు కట్టి వాళ్లకు చూపిస్తున్నాను. అయితే బొత్తిగా కాకిగూడులా కాకుండా గిజిగాడి గూడులా కాస్త అందంగా కడుతున్నాను. చదువుతూంటే కలిగే సందేహాలను ముందే వూహించి వాటికి సమాధానాలు కూడా అక్కడే యిచ్చేస్తున్నాను. అందువలన వాళ్లు తెలుసుకోదగినవన్నిటికీ నా మీదే ఆధారపడుతున్నారు. ఆర్యుల గురించి రాస్తే ద్రావిడుల గురించి రాయమంటారు. అద్వైతం గురించి రాస్తే విశిష్టాద్వైతం గురించి రాయమంటారు. సావిత్రి గురించి రాస్తే అంజలి గురించి రాయమంటారు. ఎమర్జన్సీ గురించి, ఇందిరా గాంధీ గురించి, భారతం గురించి, భరతనాట్యం గురించి, పరిటాల రవి గురించి, వంగవీటి రంగా గురించి, సత్యజిత్ రాయ్ గురించి, రామాయణం గురించి.. వాళ్లకు తోచిన ప్రతి సబ్జక్ట్ గురించి రాయమంటారు. కొందరు ఒకే మెయిల్‌లో ఐదారు సబ్జక్ట్‌ల లిస్టు యిచ్చేస్తారు.

అందుకే యీ స్కీము మొదలుపెట్టాను. సాధ్యమైనంత ఎక్కువ మందికి నచ్చే సబ్జక్టులు ఎంచుకున్నాను. వారానికి ఒకటి చొప్పున రాస్తున్నాను. సోమవారం– క్రైమ్, ప్రస్తుతం రాజీవ్ హత్య, మంగళవారం – సినీమూలం, తెలుగుసినిమాల మూలాల గురించి, బుధవారం– తెలుగువారి చరిత్ర, ప్రస్తుతం నిజాం కథలు, గురువారం – మతం, వేదాంతం ప్రస్తుతం బైబిల్, శుక్రవారం – ఇరుగుపొరుగు రాష్ట్రాల రాజకీయ చరిత్ర ప్రస్తుతం తమిళనాడు, శనివారం – హిందీ సినిమా, ప్రస్తుతం ప్రాణ్, ఆదివారం – నచ్చిన తెలుగు కథ. ఇలా అనేక సబ్జక్టులు ఒకేసారి ప్రారంభించి ఏడురకాల అభిరుచులున్నవారిని సంతృప్తి పరచడానికి చూస్తున్నాను. ఒకే వ్యక్తి యివన్నీ చదవకపోవచ్చు. నచ్చినవి కొన్ని చదవవచ్చు.

వారపత్రికల్లో సీరియల్స్ చదువుతున్నారు, మాసపత్రికల్లో సీరియల్స్ చదువుతున్నారు. అలాగే వీటినీ చదవవచ్చు. ఇవేమీ ఫిక్షన్ కాదు. రాజీవ్ హత్య 20 ఏళ్ల నాటిది. బైబిల్ వేల ఏళ్ల నాటిది. అందువలన సస్పెన్స్‌తో పాఠకుణ్ని గిలగిలలాడించడం లేదు. అయినా కొంతమంది ఒక సబ్జక్ట్ పూర్తి చేసేసి మరోదాంట్లోకి వెళ్లండి అని సలహా యిస్తున్నారు. రాజీవ్ హత్య వుందనుకోండి 50 భాగాలు రావచ్చు. ఆ సబ్జక్ట్‌పై ఆసక్తి లేనివాడు 50 రోజులపాటు నా కాలమ్ చూడడం మానేస్తే తర్వాత చూడాలని కూడా మర్చే పోతాడు. అది చాలా రిస్కు. అందువలన కాస్తకాస్తగా వారం వారం యిస్తున్నాను. వీటన్నిటితో పాటు ప్రస్తుత రాజకీయాల గురించి వారానికి కనీసం ఐదు ఆర్టికల్స్ రాయాలన్న ప్లాను ఎలాగూ వుంది. ఇన్ని రాయగలరా అని అడుగుతున్నారు. క్రమేపీ న్యూస్ జాటింగ్స్ మానేసి ఆ సమయాన్ని వీటికి వినియోగిద్దామని నా ప్లాను. అంతేకాదు, ఈ ఏడు సీరియల్స్‌లో కొన్నిటిని పాఠకులు ఆదరించకపోతే వాటిని మధ్యలో మానేసి సమయం మిగుల్చుకుంటాను.

ప్రస్తుతానికి అన్నిటికీ ఆదరణ బాగానే వుంది. అన్నిటి కంటె ఎక్కువ మెయిల్స్ వచ్చినది – బైబిల్ గురించి. నేను క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నానని కొందరి ఆరోపణ. బైబిల్‌గురించి రాసేటప్పుడు తగినంత భక్తితో, ఏసుక్రీస్తు దైవసుతుడనే నమ్మికతో రాయడం

లేదని కొందరి ఫిర్యాదు. 'మన హిందువుల్లో..' అంటూ రాయడం వలన పక్షపాతంతో రాసినట్టు వుంటుందని కొందరి చింత. నేను మతప్రచారకుణ్ని కాను. అలా అని కంపేరిటివ్ స్టడీ చేసేటంత మొనగాణ్నీ కాను. హిందువులలో చాలామందికి హిందూ పురాణాలే సరిగ్గా తెలియవు. ఇతరుల పురాణాల గురించి అస్సలు పట్టించుకోరు. ఎవరైనా తమ పురాణాల గురించి ఎద్దేవా చేస్తే – 'మీ ఇంద్రుడికి యింత కామవాంఛ ఎందుకు?' 'వాడెవడో కుండలోంచి పుట్టాడని రాస్తారు. ఎంత అశాస్త్రీయం!' అని అంటూ వుంటే సిగ్గుతో తలవంచుకుంటారు తప్ప తక్కినవాళ్ల పురాణాలలో కూడా యిటువంటి అసంబద్ధ విషయాలున్నాయేమో తెలుసుకుని కౌంటర్ యిద్దాం అనుకోరు.

'రామాయణం రంకు, భారతం బొంకు' అనేస్తారు చులాగ్గా. నిజానికి గ్రీక్ పురాణాలు, రోమన్ పురాణాలు.. యివన్నీ చూడండి. ఎన్నెన్ని రంకులుంటాయో ! బైబిల్‌లో అబ్రహామ్ కథ చూడండి. ప్రాణభీతితో భార్యను సోదరిగా ఫారోకి పరిచయం చేస్తాడు. అతను యితనికి బహుమతులు యిచ్చేసి ఆమెను పెళ్లాడేస్తే ఊరుకుంటాడు. దేవుడే యిది భరించలేక, ఫారోని శిక్షిస్తే, అప్పుడు ఫారో యితన్ని తిట్టి భార్యను వెనక్కి అప్పగించేస్తే తీసుకుని వేరేదేశం వెళ్తాడు. ఈ అబ్రహాం తక్కువవాడేమీ కాదు. హీబ్రూలకు పితామహుడు. ఇవి చదివి మీరు యితరులను ఎద్దేవా చేయాలని కాదు నా ఉద్దేశం. ఎవరి పురాణాలైనా యింతే అని తెలుసుకుని ఊరుకుంటే చాలు. ఆత్మన్యూనతా అక్కరలేదు, పరనిందా అక్కరలేదు. మానవజాతి చరిత్రను యిలా గ్రంథస్తం చేయడంలో సకలపురాణకర్తల వుద్దేశమేమిటో నాకింకా అర్థం కాలేదు. ఇలా అన్ని మతాలవీ తెలుసుకుంటే (ఓపికుంటే అధ్యయనం చేస్తే) మీకేమైనా తెలుస్తుందేమో!

ఇక నేను మనం అని రాయడం వలన హిందువులను మాత్రమే సంబోధించి రాస్తున్న అర్థం సూరేస్తోందన్నారు. నిజమే. కానీ అలా రాస్తేనే పర్సనల్ టచ్‌తో రాసినట్టు వుంటుంది. మన తెలుగువాళ్లం, మన భారతీయులం, మనకు నచ్చిన సినిమా హీరోలు.. అంటూ నేను రాస్తూనే వుంటాను. అదే ధోరణిలో యిదీనూ. లేకపోతే పాఠ్యపుస్తకంలా అయిపోతుందని భయం. ఇప్పటిదాకా ఫలానా సీరియల్ బోరు కొడుతోందని ఎవరూ రాయలేదు. ఇప్పుడే మొదలయ్యాయి కదా. ఓపిక పడుతున్నారేమో. ఒకటి రెండు నెలలు పోయేసరికి గాడిన పడవచ్చు. ఇది ఆపేయ్ బాబూ అంటే అప్పుడే ఆపేస్తాను. అప్పటిదాకా యిదో ప్రయోగం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2011)**

**జూన్ 31** **ఎమ్బీయస్ : సెగ తగిలిందా ? – 1**

కేంద్రం నెల్లాళ్లలో తెలంగాణా గురించి నిర?యం వెలువరిస్తుందని లగడపాటి అంటున్నారు. అంటే జూన్ 19 నాటి వంటావార్పు తాలూకు సెగ ఢిల్లీకి తగిలినట్టేనా? తెలంగాణ జాక్ పథకం పారినట్టేనా? అసలు లగడపాటి మాట ఎంతవరకు నమ్మాలి అనుకుంటే … పత్రికలూ, టీవీలు గుర్తు చేస్తున్నాయి, ఆయన ప్రతీసారీ చెప్పినట్టు జరుగుతోందని ! కృష? కమిటీ గురించి, వాళ్లు యివ్వబోయే రిపోర్టు గురించి, యిలాగ అనేకసార్లు ఆయన అధిష్టానం హృదయం చదివేసినట్టు ముందుగానే చెప్పేస్తున్నారుట, సరిగ్గా అదే జరుగుతోందట.

ఏళ్ల తరబడి నిర?యాన్ని నాన్చి వుంచిన కేంద్రం యిప్పుడు హఠాత్తుగా నిర?యం తీసుకుంటోందంటే దానికి కారణం జాక్ చేపట్టిన 'హైదరాబాదు కుక్స్ ఆన్ రోడ్స్' కార్యక్రమమే అని అందరూ నమ్మగలిగితే దేశానికి ఒక కొత్త నిరసన కార్యక్రమాన్ని అందించినట్టే ! గాంధీగారు 'సత్యాగ్రహం' అనే ఒక కొత్త ఆయుధాన్ని ప్రపంచ పోరాటవీరులకు అందించారు. ఒరిజినల్ థాట్ ఆయనది కాదని, సత్యభామ అలిగి అన్నం మానేస్తే కృష?డు అడిలిపోయి పారిజాతం చెట్టు తెచ్చి యిచ్చాడని అప్పణ్నుంచే సత్యాగ్రహం అనేది పురాణాల్లో వుందని, గాంధీగారు దాన్ని కాపీ కొట్టి తన స్టాంపు కొట్టేశారని చిన్నప్పుడు ఓ కథ చదివాను.

గాంధీగారి సత్యాగ్రహాలు, నిరాహారదీక్షలు వినటానికి బాగానే వుంటాయి కానీ ఆచరించడం చాలా కష్టం. అప్పట్లో షుగర్ వ్యాధి యింతలా వుండేది కాదేమో మరి. షుగర్ ప్రబలిన తర్వాత గట్టిగా ఓ రోజు కూడా నిరాహారంగా కూర్చునే పరిస్థితి లేదు. అందుకే గతంలో నెలల తరబడి చేసే నిరాహారదీక్షలు యిప్పుడు పూటల్లోకి, గంటల్లోకి వచ్చేశాయి. కాదూ కూడదని రామ్‌దేవ్ వంటి యోగిపుంగవుడు కూర్చున్నా నాలుగు రోజుల్లో మెడ వాల్చేశారు. దీక్ష నాలుగురోజులు, ఆ తర్వాత ఆసుపత్రిలో సెలైన్ ఎక్కించుకుంటూ వారం రోజులు. నిత్యం యోగా చేసే వాళ్లే అలా వుంటే వాకింగ్ కూడా చేయటానికి టైము లేని రాజకీయనాయకులు నాలుగు రోజులు గట్టిగా చేస్తే నరకానికి వెళ్లిపోవడమే !

అందువలన దేశంలోని రాజకీయ నాయకులు, ఉద్యమకారులు ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్న సమయంలో తెలంగాణ జాక్ వారు ఒక ఆచరణయోగ్యమైన ఉద్యమమార్గాన్ని చూపించారు. ఇదీ అహింసాయుతమే. అధికారులతో పెనగులాడవలసిన అవసరం లేదు. ఎటొచ్చీ జంతువుల పట్ల హింసాయుతం అనుకోండి. గుజరాత్ వంటి రాష్ట్రాలలో అయితే అధికశాతం మంది శాకాహారులు కాబట్టి అక్కడ శాకాహారం వండినా జనాలు వచ్చి తినవచ్చు. మనలాటి చోట్ల పప్పూ, ధప్పళం వడ్డిస్తాం రా అంటే నీ నెత్తిన పోసుకుని తలంటుకో అంటారు. ఆదివారం పూటా కూడా గడ్డి నమిలే ఖర్మ మాకెందుకు? దీని బదులు చికెన్ షాపు ముందు రెండు గంటలు క్యూలో నిల్చుంటాం అంటారు.

అందువలన ఖర్చుకి వెనకాడకుండా ఉద్యమకారులు కక్కా ముక్కా పెట్టాల్సిందే. లేకపోతే ముష్టివాళ్లు కూడా గుమిగూడతారన్న

నమ్మకం లేదు. ఉద్యమకారులు సుష్టుగా భోంచేసి బ్రేవ్ మని తేన్చగానే పైనున్న అధికారపీఠం కదులుతుందన్నమాట. అధినాయకుల గుండెల్లో గుబులు పుడుతుందన్నమాట. ఈ ఆందోళనకారులు అడిగినది యిచ్చేయాల్రా అన్న నిర?యానికి వస్తారన్నమాట. స్వాతంత్ర్యోద్యమం నడిచేరోజుల్లో ఓ వక్త మనవాళ్లను ఉత్సాహ పరచడానికి ఓ ఉపమానం చెప్పారట – "ఇంగ్లీషు వాళ్లని చూసి భయపడనక్కరలేదు. ఆ ఇంగ్లండు ఎంత చిన్న దేశం అంటే మనమంతా కలిసి ఉమ్మి వేస్తే దాన్లో మునిగిపోయేటంత చిన్నది" అని. అలాగే ఈ ఆహారదీక్షాదక్షులు కూడా నినదించవచ్చు – "రండి, బాగా తినండి, మీ త్రేన్పులే ఢిల్లీవారి పాలిట పిడుగులు, వార్ని అదలగొట్టే అదిలింపులు" అని. నిరాహారదీక్షకు కాండిడేట్లకు దొరకడం కష్టం కానీ కాస్త నీట్‌గా, శుభ్రంగా వండిపెడతామన్న హామీ యిస్తే ఆహారదీక్షకు చాలామంది దొరుకుతారు.

ఉద్యమకారులందరూ నలభీములై వుండడం అవసరమా అని అడిగితే కాస్తో కూస్తో నేర్చుకోవాల్సిందే అంటాను. అందరూ కెసియార్‌లు కాలేరు కదా. అమర్చినదానిలో అత్తగారు వేలు పెట్టినట్లు అంతా వండిన తర్వాత టీవీ కెమెరాల ముందు ఓ సారి వచ్చి గరిట తిప్పి, కాస్త మసాలా పొడి చల్లుతానంటే నీకూ కెసియార్ స్థాయి వుండాలి. అత్తగారి స్థాయికి ఎగబాకేముందు కోడలి స్థాయి కూడా అనుభవించాలి. అంటే ఒళ్లు దగ్గరపెట్టుకుని వంట వండడం నేర్చుకోవాలి కూడా. సరిగ్గా వండకపోతే, ఆ విషయం బయట పొక్కిపోయిందంటే మన శిబిరంలోకి ఎవరూ రారు. పొలోమని పక్క శిబిరానికి వెళ్లి అక్కడ క్యూలో నిల్చుంటారు. అన్నం మాత్రం వండడం నేర్చుకుని తక్కినవన్నీ కర్రీ పాయింట్లలో కొనుక్కునే సజ్జంతా యికనైనా కుకరీ బుక్స్ దగ్గర పెట్టుకుని వంట నేర్చుకోకపోతే ఉద్యమంలో చేరడానికి పనికి రాకుండా పోతారు.

నిరాహారదీక్షా శిబిరాలకు టెంట్‌హౌస్ వాళ్ల సపోర్టు తప్ప మిగతా ఎవరి సపోర్టూ వుండదు. మహా అయితే శిబిరం పక్కన రగడా అమ్ముకునేవాడు, కూల్‌డ్రింక్స్ అమ్ముకునే వాళ్లు శ్రేయోభిలాషులుగా వుంటారు. వాళ్లు కూడా రగడా వాసనలు మరీ వ్యాపించకుండా చూసుకోవాలి. లేకపోతే దీక్ష చేసేవాళ్లు విసుక్కుంటారు – వాళ్లని దూరంగా పొమ్మన్రా, నోరూరిపోతోంది, యిలా అయితే దీక్ష సాగడం కష్టం అని. కానీ ఈ ఆహారదీక్షకు ఎంతోమంది సపోర్టు యిస్తారు. కూరగాయల వాళ్లు, మాంసం వ్యాపారులు, (కోడిగుడ్ల వ్యాపారులకు ఓ సౌకర్యం వుంది. గిరాకీలేక గుడ్లు పాడైపోతే టిడిపివాళ్ల మీద విసరమని తెరాసవారికి అమ్మేసుకోవచ్చు) కాటరర్లు, గ్యాస్ కంపెనీవాళ్లు, విస్తళ్ల వాళ్లు, డిస్పోజబుల్ గ్లాసులవాళ్లు, పాన్‌ల వాళ్లు, అనుపానాలు అందించేవారు, డైనింగ్ టేబుల్స్, జంపఖానాలు, పాత్రసామగ్రి, బర్నర్లు, షామియానా సప్లయి చేసేవారు.. గ్యాస్ సిలండర్లవారు, యిలా ఎంతోమంది అండగా నిలుస్తారు. వీళ్లే కాదు బాండ్ ఎయిడ్ ప్లాస్టర్ వాళ్లు (కూరలు కోస్తూ వేళ్లు కోసుకునేవారుంటారుగా) బర్నాల్ కంపెనీ వారు (అనుకోకుండా వాతలు పెట్టుకునేవారుంటారుగా) భోజనాత్పూర్వం, భోజనానంతరం వేసుకోవలసిన మందులు మరచి వచ్చేవాళ్ల కోసం వెలిసే మొబైల్ మెడికల్ షాపుల వాళ్లు వీళ్లంతా 'నేనున్నాననీ, నీకేం కాదనీ' పాట పాడుకుంటూ వచ్చేస్తారు. నెలనెలా యిలాటి కార్యక్రమం పెట్టుకుంటే హోల్‌సేల్ రేట్లో సప్లయి చేస్తామని ఆశ పెడతారు కూడా.

2

అన్నీ బాగానే వున్నాయి కానీ నిరాహారదీక్షలతో పోలిస్తే ఆహారదీక్షలు ఖర్చుతో కూడుకున్నవి. ధనసమీకరణ ఎలా అన్న ప్రశ్న వస్తుంది. నన్నడిగితే దీనికి ఎన్నారైలను ఒప్పించడం సులభం. వైదీకబ్రాహ్మడి వైద్యంలాగ యిది ఉభయతారకమైన ఉపాయం. వైదీకబ్రాహ్మడు వైద్యుడైతే రోగి బతికున్నంతకాలం వైద్యం చేసి డబ్బు సంపాదిస్తాట్ట, చచ్చిపోతే శ్రాద్ధకర్మలంటూ, దానాలంటూ డబ్బు గుంజుతాట్ట. రోగి చచ్చినా, బతికినా అతని సంపాదనకు ఢోకా లేదు. అలాగే యీ ఆహారదీక్ష వలన ఉద్యమం సఫలమైందా, భేష్ మన లక్ష్యం నెరవేరింది. కాలేదా, అన్నదాన పుణ్యం దక్కింది. ఎటు చూసినా నష్టం లేదు. నెగ్గితే రాజ్యలాభం, ఓడితే స్వర్గప్రాప్తి అని ఊరించాడు కృషు?డు అర్జునుణ్ని. అలాటి డబుల్ ఎడ్జెడ్ గేమ్ యిది. నిరాహారదీక్షలను స్పాన్సర్ చేస్తే ఏముంది? దానిలోనూ కాస్తో కూస్తో ఖర్చు తప్పదు. కానీ పుణ్యం ఎక్కడేడ్చింది? కడుపు మాడ్చినందుకు వాడి శాపనార్థాలు తగిలి మనకు ఉన్నది ఊడ్చుకుపోతుంది.

ఉద్యమరూపాలంటూ చేతులతో నడిచేవాళ్లు, మోకాళ్లమీద నడిచేవాళ్లు, వెనక్కి నడిచేవాళ్లు, పొర్లు దణా?లు పెట్టేవాళ్లు, చొక్కాలిప్పేవారు, బూట్లు తుడిచేవాళ్లు, అంట్లు తోమేవాళ్లు, గుండు కొట్టించుకునేవాళ్లు, అరగుండుతో సరిపెట్టేవాళ్లు – వీళ్లందరూ సంతోషంతో చేస్తారనుకుంటున్నారా? అబ్బే. టీవీ కెమెరాలు ఆఫ్ చేయగానే రెండో బూటు పాలిష్ చేయరు, విప్పేసిన చొక్కా మళ్లీ తొడిగేస్తారు. ఎందుకంటే అవన్నీ కష్టమైన పనులు. చేయవలసి వచ్చినందుకు బాధపడుతూ చేస్తారు. కానీ ఈ ఆహారదీక్ష? లొట్టలేసుకుంటూ చేస్తారు. 'అన్నదాతా సుఖీభవ' అని ఆశీర్వదిస్తూ చేస్తారు. ఇటువంటి ఆశీర్వాదాల కోసమేనా ఎన్నారైలు వీటిని స్పాన్సర్ చేయడానికి ముందుకు వస్తారని నాకు గట్టి నమ్మకం.

మామూలుగా రాజకీయపార్టీలకు విరాళాలంటే కొందరు తప్ప, చాలామంది ఎన్నారైలు తటపటాయిస్తారు. ఎంత యిచ్చినా ఎలక్షన్ టైముకి మనకు టిక్కెట్టు యిస్తారా లేదా, అప్పుడు కులసమీకరణల పేరు చెప్పి మొండి చెయ్యి చూపిస్తారా అని. ఇలా పుణ్యంతో ముడి పెట్టి అడిగారా, తప్పకుండా యిస్తారు. ఏం వున్నా లేకపోయినా ఎన్నారైలకు దైవభీతి ఎక్కువ. మతపరమైన, ఆధ్యాత్మిక కార్యక్రమం అంటే విరాళాలు కురుస్తాయి. ఇక్కడ సక్సెసైందంటే ఆంధ్రప్రాంతంలో కూడా యిలాటివి మొదలవుతాయి.

వాళ్లకు ఒరిజినల్ కార్యక్రమాలేవీ లేవు. ఇక్కడ చేసినది కాపీ కొట్టడమే పని. సమైక్య జాక్ వాళ్లు ఒట్టి కాపీ కాట్స్. తెలంగాణావాదులు ఆరోపించినట్లు అక్కడ ఉద్యమం ఏమీ లేదు, వట్టి ప్రతిస్పందనే. అదీ నీ–జెర్క్ రియాక్షన్స్. అప్పటికప్పుడు హంగామా చేసి చల్లారిపోవడమంతే.  కొత్త తరహా కార్యక్రమం ఎలాటిది చేయాలన్న దానిపై బుర్ర పెట్టి ఆలోచించేటంత టైము కూడా స్పేర్ చేయరు.

వంటా వార్పూ సెగ తగిలి కరడు కట్టిన అధిష్టానం వెన్నలా కరిగి తెలంగాణా నెయ్యి కారబోతోందంటే సమైక్యవాదులకూ ఆశపుడుతుంది. 2 వేల పొయ్యిలు పెడితేనే యింత కరిగితే, మొదట్లో ప్లాను చేసినట్లు పది లక్షల పొయ్యిలే పెట్టి వుంటే హిమాలయాలే కరిగి కశ్మీరు సమస్య కూడా పరిష్కారం అయ్యేదన్న ఆశ పుడుతుంది. సమైక్యవాదులు కూడా పోటాపోటీగా ఎక్కడికక్కడ గాడిపొయ్యిలు తవ్వేస్తారు. అయితే యిదంతా జరగాలంటే ఆహారదీక్ష వలననే తెలంగాణపై యిన్నాళ్లకు నిర?యం తీసుకుంటున్నారన్న నమ్మకం వాళ్లకు కుదరాలి. రాజగోపాల్ నిర?యం నిర?యం అంటున్నారు కానీ ముందు 'సానుకూల' అనే నాలుగు అక్షరాలు చేర్చడం లేదు. ఒకవేళ చేర్చినా ఒకరి 'సానుకూల' మరొకరికి 'పతికూల' కావచ్చు. మంగళవారం ఆంధ్రజ్యోతి హెడ్‌లైన్సు – 'అమ్మమ్మో తెలంగాణా నిర?య భారమంతా నాపై వేస్తే ఎలా?' అని సోనియమ్మ కూడా అర్జున విషాదయోగం అభినయిస్తున్నారని. ఇన్నాళ్లూ ఆవిడ సర్వం తెలిసిన జగద్గురువు కృష?పరమాత్మ అనుకున్నాం. ఎక్కడో ఇటలీనుండి వచ్చిన ఇండియాలోని తెలంగాణ సమస్యను ఔపోసన పట్టి గీతోపదేశం చేస్తారనుకున్నాం. ఆవిడే పాత్ర ఫిరాయించి విల్లు కింద పడేస్తే ?

అంతకుముందు తెలియకపోయినా కనీసం 2004 నుండి ఆవిడకు తెలంగాణ గురించి తెలిసేవుండాలని మనం అనుకోవచ్చు. అయినా యీ ఫీలర్ వదిలేరంటే ఏమిటి అర్థం? అసలు హై కమాండ్ వ్యవహారం చూస్తూంటే తెలంగాణ వచ్చేస్తుందని ఎవరైనా అనుకుంటూ వుంటే అతని ఆశావాదాన్ని అల్టిమేట్ ఎగ్జాంపుల్‌గా మనం పుస్తకాల్లో రాసుకోవాలి. మనవాళ్లు ఢిల్లీలో ఎక్కేగడప, దిగే గడపగా వెళ్లివచ్చినా ఎదురైన సమాధానం ఏమిటి? చిన్నప్పుడు పుస్తకంలో 'కలవారి కోడలు కలికి కామాక్షి..' అనే బొమ్మల గేయకథ వుండేది మాకు. అన్నగారు వచ్చి పుట్టింటికి తీసుకెళతానంటే యీ కామాక్షి అనే యిల్లాలు పర్మిషన్ కోసం 'మా అన్నలొచ్చారు, మమ్మంపుతారా?' అని అడుగుతూ వుంటుంది. మామగార్ని అడిగితే 'నేనెరుగ, నేనెరుగ, నీ అత్త నడుగు..' అంటాడు. అత్తగారు ఆడపడుచుని, ఆడపడుచు మరొకర్ని, యిలా చివరికి మొగుణ్ని అడగమంటారు. ఆ 'రచ్చలో కూర్చున్న రాజేంద్రభోగి'ని అడిగితే సరే వెళ్లమంటాడు. ఆ కాడికి ఆ భోగిని ముందే అడగమనుంటే యింత కథ వుండేది కాదు కదా అనుకునేవాణ్ని.

ఇప్పుడు ఆజాదూ, ప్రణబూ, ఆంటోనీ అందరూ యిదే పాట – నేనెరుగ, నేనెరుగ, సోనియాకు చెప్తాం అని. వీళ్లు చెప్పేదేమిటి నా బొంద. ఆవిడకు తెలియనిదా? మనవాళ్లు యింతకుముందు చెప్పనిదా? చెప్పి చెప్పి వీళ్లకే విసుగు వచ్చేసింది. వాళ్లిచ్చిన టైములో ఏం మాట్లాడాలో తెలియక కొత్తకొత్త వాదనలు చేస్తున్నారు. మొన్న ఆంటోని దగ్గర చెప్పారు – 'రాష్ట్రం మొత్తంలో నాలుగైదు జిల్లాలే (అవి ఏమేమిటో పేపర్లలో రకరకాలుగా వచ్చింది) సమైక్యం అంటున్నాయి. చిత్తూరు వాళ్లు, నెల్లూరు వాళ్లు మద్రాసు పోవచ్చు, అనంతపురం వాళ్లు బెంగుళూరు పోవచ్చు. కృష? గుంటూరు వాళ్లకే హైదరాబాదుగురించి గోల. వాళ్ల మొహాన్న ఓ రాజధాని కొడితే చాలు' అని చెప్పారట. స్వంతరాష్ట్రంలోనే యింత మర్యాద దక్కుతోంది, యిక పరాయిరాష్ట్రం వెళ్లాలా? పాలమూరు వాళ్లు బొంబాయి వెళితే అదో పెద్ద యిస్యూ చేసేవాళ్లు యిలా ఎలా చెప్పగలరు? ఉత్తరాంధ్రవాళ్లు ఏం చేయాలి? అఖాతంలో పడాలా? ఆంటోనీగారు యివన్నీ అడిగి వుండరు కానీ వీళ్లకే యిలా తలాతోకా లేకుండా మాట్లాడి చికాకు వేసి వుంటుంది. ఢిల్లీ వెళ్లం అని వెనక్కి వచ్చేశారు. ఉద్యమం పట్ల అత్యుత్సాహంగా వుండే మధు యాష్కీకే ప్రాణం చాలొచ్చింది. ''మాలోనే చాలామంది అక్కడో మాట, యిక్కడో మాట. కథ ఎలా సాగుతుంది?" అని బయటపెట్టేశారు.

3

ఇటీవల జరుగుతున్న పరిణామాలన్నీ రాష్ట్రవిభజనకు దారి తీస్తే అదంతా తమ కారణంగానే అని తెరాస క్లెయిమ్ చేయడంలో అర్థం వుంటుంది. కానీ ఈ బాట అక్కడికే దారి తీస్తోందా అన్నదే ప్రశ్న. కేంద్రం ప్రత్యేక తెలంగాణ యిచ్చేసేటట్టు  కనబడుతోంది అని ఎవరైనా అంటే అతని ఆశావాదానికి చెయ్యెత్తి మొక్కాలి. వాళ్లసలు తెలంగాణా ఉద్యమకారుల పట్ల ఏమైనా గౌరవం చూపిస్తున్నారా? ఇన్నాళ్లకు డిప్యూటీ సిఎం పదవి తెలంగాణ వ్యక్తికి యిచ్చారు. ఈ పదవి 2004లోనే యివ్వాల్సింది. 2004 లేదు, 2009 లేదు, రోశయ్యగార్ని సిఎం చేసినప్పుడు లేదు, కిరణ్‌ను సిఎం చేసినప్పుడు యివ్వలేదు కానీ యిస్తామని ఎనౌన్సు చేశారు. అప్పుడు చేసిన ప్రతిజ్ఞ యిప్పుడు చెల్లించారు. టూ లేట్ అండ్ టూ లిటిల్ ! సామాన్య గృహస్తు పెళ్లవగానే తిరుపతి వస్తానని మొక్కుకుని చివరకు పదేళ్లకి యిద్దరు పిల్లలతో వెళ్లి మొక్కు తీర్చుకున్నట్లుంది.

రాజనర్సింహ తెలంగాణ వ్యక్తే కానీ సమైక్యవాది అని పేపర్లు రాశాయి. మొన్న ఢిల్లీకి వెళ్లి చేసిన చర్చల్లో కూడా అలాటి ధోరణే కనబడింది. ప్రాంతీయ మండలి యిచ్చినా ఓకే అన్నట్టుగా వార్తలు వచ్చాయి (ఆయన ఖండించారనుకోండి). పార్టీ ఏం చెపితే అదే చేయాలి కానీ, కాస్త పర్సనల్ టచ్ కూడా వుంటుంది కదా. తెలంగాణ మంత్రులందరూ రిజైన్ చేసినా ముగ్గురు మాత్రం దానికి సిద్ధం కాదు అంటూ యిచ్చిన పేర్లలో దానం, ముకేష్‌తో బాటు యీయన పేరు కూడా కనబడింది.

ఇక పిసిసి చీఫ్ పదవి. కిరణ్‌ను మార్చినపుడు తెలంగాణ సిఎం వస్తాడన్నారు. రాలేదు. సిఎం ఆంధ్ర ప్రాంతీయుడు కాబట్టి యిదైనా తెలంగాణ వ్యక్తికి యిస్తారని అన్నారు. ఇచ్చారా? లేదు. డియస్‌నుండి తీసేసి దాన్ని బొత్సకు అప్పగించారు. కులసమీకరణాల ప్రకారం అది రైటే కావచ్చు కానీ ఇక్కడ చెప్పదలచినదేమిటంటే ప్రాంతీయపరమైన కోరికలను హై కమాండ్ లెక్కలోకి తీసుకోలేదని మనం గమనించాలి. స్పీకర్ విషయంలో కూడా అదే జరిగింది. కులాన్ని గణించినంతగా ప్రాంతాన్ని గణించలేదు. నిన్న జరిగిన డిజిపి ఎంపిక విషయంలో కూడా పివి గారి అల్లుడు రేస్‌లో వున్నాడని, ఆయన తెలంగాణ వ్యక్తి అనీ పత్రికలు మనకు చెప్పాయి. ఈ పోస్టయినా తెలంగాణ వ్యక్తికి యిస్తారేమోననుకుంటే నెల్లూరాయన దినేష్ రెడ్డిగారికి యిచ్చారు. కిరణ్ కులం కాబట్టి... అని కొందరు చెవులు కొరుక్కున్నారు. కావచ్చు, కాకపోవచ్చు. ఎగైన్ తెలంగాణ వ్యక్తికి యివ్వకపోతే వారి భావోద్రేకాలు దెబ్బ తింటాయి అని పై వాళ్లు ఆలోచించలేదు.

అలాగే ట్యాంక్ బండ్‌పై విగ్రహాల పునరుద్ధరణ. వాటిని విరగకొట్టడం తప్పే. జాతి సిగ్గుపడవలసిన విషయమే. అయినా అర్జంటుగా వాటిని అలాగే పెట్టేయవలసిన అవసరం ఏముంది? వాటి గురించి అర్జంటు జీవోలు ఎందుకు? పడిన విగ్రహాలు ఎలానూ పడ్డాయి. పాతికేళ్ల క్రితంనాడు అప్పటికి కీర్తిశేషులైన మహనీయుల విగ్రహాలు పెట్టారు. ఈ మధ్యకాలంలో కూడా కీర్తిశేషులైన వారిని కూడా కలుపుకుని మొత్తం అందరివీ ఒకేసారి పెట్టవచ్చు కదా. చోటు సరిపోదనుకుంటే విగ్రహాల మధ్య దూరం తగ్గిస్తే సరి. లేదా ఈ విగ్రహాలకు ఎక్స్‌టెన్షన్‌గా ఎన్టీయార్ మార్గ్‌లో కొన్ని పెడితే సరి. ఎవరి విగ్రహాలు పెట్టాలి, వాటిలో కులాల, ప్రాంతాల, రంగాల సమతూకం పాటించాలంటే పాటించండి. ఓ నిపుణుల కమిటీ వేసి అందరూ ఒప్పుకున్న తర్వాతే పెట్టండి. ఆలస్యమైతే కానీయండి. ఈ లోపున విగ్రహాలు లేనంత మాత్రాన కొంపేం మునిగిపోదు. అక్కడ విరగకొట్టిన ఆనవాళ్లు కనబడుతూ టూరిస్టులు చూసి ముక్కున వేలేసుకుని మనల్ని యీసడించుకుంటారంటారా? కోనీయండి. ఒక ముఖ్యమైన నిర?యాన్ని ఏళ్ల తరబడి వాయిదా వేస్తే ఏం జరుగుతుందో అందరికీ తెలిసి వస్తుంది. కనీసం వాళ్ల రాష్ట్రాలలో, వాళ్ల దేశాల్లో జాగ్రత్త పడతారు.

ఈ అంశంలో లగడపాటి పాత్రను కూడా పరిశీలించాలి. ఆయన సీజనల్‌గా తెరమీదకు వస్తూంటారని అందరికీ తెలుసు. తన పాత్రపోషణ అయిపోగానే మళ్లీ వింగ్స్‌లోకి వెళ్లిపోతూంటారు. తర్వాత కొన్నాళ్లకి మళ్లీ సత్యభామ రంగస్థలంమీదకు వచ్చినంత అడావుడిగా మేళతాళాలతో వస్తారు. ఈ మధ్య హఠాత్తుగా వచ్చి పొన్నంపై విరుచుకుపడ్డారు. ఎంపీల కన్వీనర్ పోస్టుకి రిజైన్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన రిజైన్ చేసిందాకా వుండి 'ఆ ఏముంది, అది వొట్టి అటెండర్ పోస్టు' అనేశారు. ఎందుకిలా? అంత అన్యాయంగా మాట్లాడాలా? నాకు ఓ ఊహ వస్తోంది. అంతకుముందు శనివారం ఆంధ్రజ్యోతి రాధాకృష?గారు జ్యోతిలో వ్యాసం రాస్తూ ఢిల్లీలో చక్కర్లు కొట్టిన తెలంగాణ ఎంపీలలో ముగ్గురు మాత్రమే రాజీనామాలపై పట్టుదలగా వున్నారని తక్కినవాళ్లంతా సిద్ధంగా లేరని రాశారు. ఒకవేళ ఆ ముగ్గురిలో పొన్నం ఒకరేమో, ఈయన దుడుకు ధోరణి రుచించని హై కమాండ్ రాజగోపాల్‌ని ఆయనపై ఉసిగొల్పిందేమో !

డిసెంబరు 9 తర్వాత రాజీనామాల పర్వానికి శ్రీకారం చుట్టడం దగ్గర్నుంచి రాజగోపాల్ వైఖరిని గమనిస్తే ఆయనకు హై కమాండ్ అండదండలున్నట్టు తోస్తుంది. హై కమాండ్ తను అనుకున్నది ఆయనచేత చెప్పిస్తూంటుందా అనిపిస్తుంది. ఆయన జాతీయస్థాయి పారిశ్రామికవేత్త. సోనియా అనుయాయగణంతో ఆయనకు వ్యాపారబంధాలు వున్నా ఆశ్చర్యపడనక్కరలేదు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు అదుపు చేయడానికి ఆయనను హై కమాండ్ ఉపయోగించుకుంటోందేమో. "నేను సర్వే చేయించాను. 80% మంది నియోజకవర్గాలలో సమైక్యవాదమే గెలుస్తుంది." అని ప్రకటించారు మొదట్లో. అధిష్టానం ఆదేశం మేరకే చేయించాను అని చెప్తున్నారిప్పుడు. ఆయన సర్వేలు యిప్పటిదాకా నిజమయ్యాయి. ఇదీ కావచ్చు, కాకపోవచ్చు. కానీ హై కమాండ్ నమ్మితే ఏమీ చేయలేం.

ఈ సర్వే తప్పు అని వాదించడానికి, నిరూపించడానికి క్యాఫ్టవాళ్ల దగ్గర అస్త్రం ఏమీ లేదు. వాళ్లకు తెరాసను ఎదుర్కొనే దమ్మూ లేదు. స్వంతంగా నాయకత్వం వహిస్తామని హామీ యిచ్చే ధైర్యమూ లేదు. "మీరు తెలంగాణ యివ్వకపోతే మా ఊళ్లల్లో మేం తిరగలేం, ప్రజలకు నచ్చచెప్పలేం" అనే దంపుళ్లపాట తప్ప వాళ్లు మరోటి ఆలపించడం లేదు. ఇలాటివారిని నాయకులని ఎవరంటారు? ప్రజలను నడిపించేవాడు నాయకుడు. వారి వెంట నడిచేవాడు నాయకుడు కాడు. అందుకే చిదంబరం తీసిపారేశారు. తొంబలా అరవైమంది వెళ్లి చెప్పిన దానికంటె ఒక్క రాజగోపాల్ సర్వే వాళ్లకు తలకెక్కి వుంటుంది. అందుకే హై కమాండ్‌కు ధైర్యం వచ్చేసిందని నా అనుమానం. అందుకే పైన చెప్పిన పనులన్నీ ధీమాగా చేసేస్తోంది. మనవాళ్ల ముందు ప్రణబ్ గూరా?ల్యాండ్ ఫార్ములా ప్రతిపాదన కూడా పెట్టలేదు.

కానీ ప్రభుత్వం యివేమీ పట్టించుకోవడం లేదు. తను అనుకున్నది తను చేసి తీరుతోంది. ఎస్సయి పరీక్షలు నిర్వహించి తీరతానంటోంది. అదనపు సైనిక బలగాలు వస్తున్నాయి. ఎక్కడకు వస్తున్నాయి? తెలంగాణాలోని జిల్లాలకు ఎక్కువగా వస్తున్నాయి. కోస్తా, సీమలలో నామమాత్రంగా – రెండు జిల్లాలకు ఒకటి చొప్పున – వస్తున్నాయి. అంటే అర్థం ఏమిటి? వాళ్ల నిర?యం అంటూ తీసుకుంటే అది తెలంగాణావాదులకు సంతృప్తికరంగా వుండబోదని, ఆందోళన జరిగితీరుతుందని, దాన్ని అణచడానికే కొత్త బలగాలు, కొత్తరకం ఆయుధాలు దిగబడుతున్నాయని ఎవరికైనా అర్థమవుతుంది. ఫైనల్‌గా రాష్ట్రం విభజిస్తే విభజించబడవచ్చు గాక. దానికి ముందు ఎంతో రాజకీయ ప్రక్రియ జరగాలి. వస్తే గిస్తే దానివలన వచ్చిందనాలి తప్ప రోడ్డు మీద పెట్టిన గాసుపొయ్యి

సెగ ఢిల్లీ దాకా తగలడం వలన వచ్చిందంటే మాత్రం నమ్మనక్కరలేదు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2011)**